www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనంపై ఆంక్షలు

ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు, జీహెచ్ఎంసీ

అక్కడే నిమజ్జనం చేస్తాం: ఎమ్మెల్యే రాజాసింగ్

2021 నాటి ఆదేశాలే కొనసాగుతాయి

పాత కేసును మళ్లీ తెరవనక్కర్లేదు

హుస్సేన్ సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు స్పష్టీకరణ 3

బుధవారం | 11-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 165

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి రా. 11.47 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ రా. 9.22 తదుపరి మూల; వర్జ్యం: తె. 5.32 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 11.47-12.35; అమృతఘడియలు: మ. 12.05-1.46; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.16

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



మంగళవారం ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘంతో జరిగిన సమావేశంలో ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి తదితరులు

రుణభారం తగ్గించండి

అప్పులను పునర్వ్యవస్థీకరించాలి

చెల్లింపు గడువు కాలాన్ని పెంచుకునేలా..

వడ్డీలు తగ్గించుకునేలా రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి

16వ ఆర్థిక సంఘానికి రాష్ట్ర ప్రభుత్వ వినతి

పన్నుల్లో రాష్ట్రాల వాటాను 50 శాతానికి పెంచండి

జీఎస్‌డీపీ ఆధారంగా వాటాను నిర్ధారించండి

తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దు

వాటా నిర్ధారణలో జీఎస్‌డీపీకి 50% వెయిటేజీ కావాలి

సీఎస్ఎస్‌ల రూపకల్పన బాధ్యతలను రాష్ట్రాలకివ్వండి

మాకు సహకరించండి.. మోదీకి సహకరిస్తాం

ఆర్థిక సంఘంతో సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రుల భేటీ

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ.. భారీ రుణభారం సవాల్‌గా మారిందని రాష్ట్ర ప్రభుత్వం 16వ కేంద్ర ఆర్థిక సంఘం దృష్టికి తీసుకెళ్లింది. గత ప్రభుత్వం పదేళ్లలో భారీగా అప్పులు చేసిందని, దీంతో రాష్ట్ర ఆదాయంలో అధిక భాగం ఆ అప్పులను తిరిగి చెల్లించడానికే వెచ్చించాల్సి వస్తోందని తెలిపింది. ఈ అప్పుల భారం రాష్ట్రంలో అభివృద్ధి పనులకు ఆటంకంగా పరిణమిస్తుందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా.. రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ అవసరాల కోసం తీసుకున్న అప్పులను పునర్వ్యవస్థీకరణ (రీస్ట్రక్చరింగ్) చేసుకునే అవకాశం కల్పించాలని ఆర్థిక సంఘాన్ని కోరింది. అప్పులకు వడ్డీలు తగ్గించుకునేందుకు వీలుగా చెల్లింపు గడువు కాలాన్ని పెంచుకునే అవకాశం ఇవ్వాలని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి

మిగతా 13వ పేజీలో...

సెస్‌లు, సర్‌చార్జీల వివాదం..

కేంద్రం-రాష్ట్రాలే పరిష్కరించుకోవాలి

పన్నుల వాటాపై అన్ని రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తున్నాం 12

తెలంగాణలో పట్టణాభివృద్ధి బాగుంది

ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా

కోఠీ మహిళా వర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు

మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనవరాలు శ్వేత 13

ఐలమ్మ 39వ వర్ధంతి సభలో సీఎం

అక్రమ హర్మ్యం

జూబ్లీహిల్స్‌లో భారీ కాంప్లెక్స్ నిర్మాణ అనుమతుల్లో నెట్ నెట్ వెంచర్స్ వంచన

నందగిరి హిల్స్‌లో 4.7 ఎకరాలను హెచ్ఎండీఏ వేలంలో దక్కించుకున్న సంస్థ

దానిని ఆనుకునే ఉన్న జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీలో రెండు ప్లాట్ల కొనుగోలు

ఇక్కడ 30 మీటర్ల నిర్మాణానికి చాన్స్..

ఇంపాక్ట్ ఫీజు కడితే మరింత వెసులుబాటు

కానీ, నందగిరి హిల్స్ హుడా లే అవుట్‌లో 15 మీటర్ల వరకే అనుమతిచ్చే చాన్స్

జూబ్లీ ప్లాట్లను అడ్డు పెట్టుకుని మొత్తం వెంచర్‌కు 45 మీటర్లకు అనుమతి పొందిన సంస్థ

అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేసిన జీహెచ్ఎంసీ.. పర్యావరణ నిబంధనలూ బేఖాతర్

విజిలెన్స్ విచారణలో నిర్ధారణ.. బిల్డర్‌పై క్రిమినల్ కేసు, అధికారులపై చర్యలకు సిఫార్సు



జూబ్లీహిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ నిర్మిస్తున్న భవనం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తొలుత 12 అంతస్తులకు అనుమతి తీసుకున్నారు! తర్వాత దానిని 20 అంతస్తులకు పెంచుకున్నారు! చివరకు, 30 అంతస్తులకు అనుమతి ఇవ్వాలంటూ దరఖాస్తు చేసుకున్నారు! అక్కడ అన్ని అంతస్తులకు అనుమతి ఇవ్వడానికి నిబంధనలు అంగీకరిస్తాయా!? అంటే.. 'లేదు' అన్నదే జవాబు! అయినా.. నిర్మాణదారుడు అడిగితే.. జీహెచ్ఎంసీ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు! హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కుకు కూతవేటు దూరంలో.. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 45లోని నిర్మాణమిది! దీనిపై సర్కారుకు పెద్దఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దాంతో, విజిలెన్స్ విచారణ జరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం ఉన్నట్లు విజిలెన్స్ నిర్ధారించింది. నిర్మాణాన్ని నిలిపి వేసి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. బిల్డర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సూచించింది. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేట్ మండల పరిధిలోని నందగిరి హిల్స్ ప్రాంతంలో హెచ్ఎండీఏ నుంచి హుడా వేలంలో జి.అమరేందర్ రెడ్డి అనే వ్యక్తికి చెందిన నెట్ నెట్ వెంచర్స్ సంస్థ 4.748 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. అక్కడ 12 అంతస్తుల (జీ+4, 7 సెల్లార్లు) నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందింది. తర్వాత 2015లో రోడ్డు నంబరు 45లోనే ఉన్న జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీలో 865.42 చదరపు గజాల భూమిని కొనుగోలు చేసింది. దాని పక్కనే ఉన్న మరో 866 గజాల భూమిని 2021లో కొంది. ఈ రెండూ

మిగతా 12వ పేజీలో...

1,280 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి

నేడు నోటిఫికేషన్

2,030 మంది స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి పది రోజుల్లో..

ఈ నెలాఖరుకల్లా ఫార్మాసిస్టుల సెలక్షన్‌కు కూడా.. మొత్తానికి ఈ నెలలోనే వైద్య ఆరోగ్యశాఖలో 4వేల పోస్టులకు నోటిఫికేషన్లు

జాబ్ క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో 1,280 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు వైద్య వర్గాలు వెల్లడించాయి. 2,030 మంది స్టాఫ్ నర్సుల భర్తీకి పదిరోజుల్లోపే నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపాయి. వీటితో పాటు మరికొన్ని ఫార్మాసిస్టు పోస్టుల భర్తీకి ఈ నెలాఖరుకల్లా మెడికల్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేయనుంది. మొత్తంగా వైద్య ఆరోగ్యశాఖలో దాదాపు 4వేల పోస్టుల భర్తీకి ఈ నెలలోనే నోటిఫికేషన్లు విడుదల చేయనున్నారు. ఈ పోస్టుల భర్తీకి ఇప్పటికే ఆర్థికశాఖ ఆమోదం లభించింది. కాగా, వైద్యశాఖలోని స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టుల పోస్టులకు సెప్టెంబరులో నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లోనే ప్రకటించింది.

మరో 4 మెడికల్ కాలేజీలకు ఓకే!

2 రోజుల్లో రానున్న ఎన్ఎంసీ అనుమతులు 14

భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీల్లో త్వరలో ప్రవేశాలు

వానాకాలం వైద్య చదువులు!

విచ్చలవిడిగా ప్రైవేటు కాలేజీలు.. ప్రమాణాలకు దెబ్బ 14




ఈ ఏడాది మొత్తంగా 8 కాలేజీలకు అనుమతులు రావడంతో 400 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3690 ఎంబీబీఎస్ సీట్లుండగా... కొత్తగా వచ్చిన వాటితో ఆ సంఖ్య 4090కు పెరిగింది. కాలేజీలకు అనుమతులిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు.

\- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

బీసీ రిజర్వేషన్ల నిర్ధారణకు

మరో 3 నెలలు!

రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనకు ఓకే చెప్పిన హైకోర్టు



సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల అమలుకు సమయం కావాలన్న సర్కారు

స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం పిటిషన్లు

విచారణ మూడు నెలలపాటు వాయిదా

కొత్త సంవత్సరంలోనే స్థానిక సంస్థల ఎన్నికలు!

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణకుగాను సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ మార్గదర్శకాల అమలుకు మరో మూడు నెలల సమయం పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. మూడు నెలల్లో ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొంది. దీంతో స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ బీసీ కమిషన్‌ను నియమించాలని దాఖలైన పిటిషన్లు మూడు నెలలకు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో బీసీల జనాభా వివరాలను సేకరించడానికి, సర్వేల నిర్వహణకు 'తెలంగాణ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్'ను అధీకృత సంస్థగా ప్రభుత్వం గుర్తించడం రాజ్యాంగ వ్యతిరేకమంటూ తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ రిజర్వేషన్లు కల్పించాలంటూ ఇతరులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. స్థానిక సంస్థల్లో రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్‌తో రిజర్వేషన్లు స్థిరీకరించేలా ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని వారు కోరారు. ఈ పిటిషన్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే,

మిగతా 12వ పేజీలో...

సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమం

సీపీఎం కేంద్ర కమిటీ ప్రకటన 2



జీపీఎస్ టోల్‌పై గెజిట్ జారీ

20 కి.మీ. వరకు రుసుము ఉండదు

ఆ తర్వాత.. ప్రయాణించిన దూరానికే..

జీపీఎస్ అనుసంధానానికి టోల్‌గేట్లలోని వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం

ఇందుకు భారీ వ్యయం..

టోల్ చార్జీలు పెరిగే అవకాశం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: టోల్ ఫీజు వసూళ్ల పద్ధతి ఆధునికీకరణ దిశగా తొలి అడుగుపడింది. ఈమేరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల ఫీజు నిబంధనలు 2008లోని 6వ క్లాజును సవరిస్తూ అధికారికంగా గెజిట్ జారీ చేసింది. ఇప్పటి వరకూ మన టోల్ ప్లాజాల్లో ఫాస్టాగ్, ఆటోమాటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) పద్ధతుల్లో

మిగతా 2వ పేజీలో...



నేరం ఒకరిది.. శిక్ష ఒకరికి!



సైబర్ మోసాలతో సంబంధం లేని చిరువ్యాపారుల ఖాతాలూ ఫ్రీజ్

నేరగాళ్లు చేసే చెల్లింపులతో వారిపైనా కొరడా 14

కేటుగాళ్ల ఖాతాలతో పాటు బాధితుల ఖాతాలు కూడా!

ఈఎంఐలు కట్టలేక, చెక్‌బౌన్స్‌లతో బాధితుల విలవిల

రికవరీ సొమ్ము ఖాతాదారుల అకౌంట్లో వెయ్యడానికి కొర్రీలు

హీరో, విలన్ కొట్టుకుని మధ్యలో కమెడియన్ మీద పడ్డారని ఒక సినిమా డైలాగ్ ఉంది! సైబర్ నేరాలతో ఏ సంబంధమూ లేకున్నా.. శిక్ష అనుభవిస్తున్న కొందరు చిరు వ్యాపారుల పరిస్థితి అదే!! సైబర్ మోసాలకు పాల్పడ్డ కేటుగాళ్లు.. ఆ డబ్బుతో చిరు వ్యాపారుల వద్ద ఏదైనా వస్తువులు కొని చెల్లింపులు చేస్తే, ఆ వ్యాపారుల ఖాతాలను కూడా బ్యాంకులు ఫ్రీజ్ చేస్తున్నాయి!! తమ బ్యాంకులో ఖాతా ఉన్నవారు సైబర్ మోసాల బారిన పడితే.. రికవరీ అయిన వారి సొమ్మును సైతం వారి ఖాతాల్లో వెయ్యడానికి ఇబ్బంది పెడుతున్నాయి.

2

వచ్చే ఐదేళ్లలో 5 వేల సైబర్ కమాండోలు: అమిత్ షా

రెవెన్యూ కోరలు!

హైడ్రాకు అధికారాల బదలాయింపునకు న్యాయశాఖ ఓకే

ఫైల్ సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు వెళ్లిన వెంటనే ఆమోదం

పోలీస్ శాఖ నుంచి 15 మంది సీఐలు, 8 మంది ఎస్సైలు

కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ.. నెలాఖరుకు ప్రత్యేక ఠాణా

త్వరలో సాగునీరు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ నుంచీ సిబ్బంది

'గొలుసుకట్టు'లో చెరువుల బాగు.. తొలుత తమ్మిడికుంటతో..

చెరువుల్లోని నిర్మాణాలకు ఆస్తి పన్ను మదింపు చేయొద్దు

పీటీఐఎన్, తాగునీటి, విద్యుత్ కనెక్షన్లను కూడా ఇవ్వొద్దు

సంబంధిత శాఖలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ వినతి



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): కీలక శాఖల నుంచి అభ్యంతరాలు తలెత్తకుండా పూర్తిస్థాయిలో రెవెన్యూ అధికారాలు దక్కేందుకు మార్గం సుగమం.! ఆక్రమణల కూల్చివేత సందర్భంలో ఇబ్బందులు రాకుండా పోలీస్ సిబ్బంది కేటాయింపు.! ఇలా.. చెరువుల పరిరక్షణ లక్ష్యంతో ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్-అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటక్షన్ ఏజెన్సీ (హైడ్రా)ని ప్రభుత్వం మరింత బలోపేతం చేస్తోంది. ఈ మేరకు ప్రభుత్వ స్థలాల సంరక్షణ, చెరువులు, నాలాలు, కుంటల ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు, అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు సంబంధించిన సర్వాధికారాలను హైడ్రాకు ఇచ్చేందుకు ఫైల్ కదిలింది. రెవెన్యూ, ఆక్రమణల నిరోధం చట్టంపై కలెక్టర్ల నుంచి కింది స్థాయి వరకు ఉన్న అధికారాలను హైడ్రాకు అప్పగించేందుకు అభ్యంతరాలు లేవని న్యాయ శాఖ స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి చర్యలు తీసుకోవాలని కోరుతూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నుంచి ఫైల్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మిగతా 12వ పేజీలో...



లోక్‌సభ ఎన్నికలు

స్వేచ్ఛగా జరగలేదు!

ఎన్నికల సంఘం ఇష్టారాజ్యంగా వ్యవహరించింది 2

కాంగ్రెస్ ఖాతాలను సీజ్ చేశారు

బడా వ్యాపార్లతో మోదీ కుమ్మక్కు

ఎన్నికలు సజావుగా జరిగితే బీజేపీకి 240కూడా వచ్చేవి కావు

భారత్‌లో సిక్కులకు తలపాగా ధరించే హక్కూ లేదు: రాహుల్

దేశ ప్రతిష్ఠ మంటగలుపుతున్నరు ప్రతిపక్ష నేతపై మండిపడ్డ బీజేపీ



3

ఉధృతంగా గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం

49.8 అడుగులకు చేరిక..

మూడో ప్రమాద హెచ్చరికు అవకాశం!

ఏపీలోని పోలవరం ముంపు మండలాలపైన తీవ్ర ప్రభావం

80 గ్రామాలను చుట్టుముట్టిన వరద.. స్తంభించిన రాకపోకలు

కాకినాడ జిల్లాలో 62 గ్రామాల దిగ్బంధం

జీపీఎస్ టోల్‌పై గెజిట్ జారీ

(మొదటి పేజీ తరువాయి)



ఫీజు వసూలు చేస్తున్నారు. వాటిల్లో ఉన్న లోపాలను అధిగమించ డానికి అత్యాధునిక గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్(జీఎన్ఎస్ఎస్), గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీఎస్)లను వాహనంలో బిగించిన పరిక రంతో అనుసంధానించడం ద్వారా టోల్ ఫీజు వసూలు పద్ధతిని ప్రవేశ పెట్టింది. దీని వల్ల వాహనదారులు టోల్ రహదారిపై వాస్తవ ప్రయాణ దూరానికి మాత్రమే ఫీజు చెల్లిస్తారు. జీఎన్ఎస్ఎస్ పరికరం లేని, విదే శాల్లో రిజిస్ట్రేషన్ అయిన వాహనాలకు నిర్దేశిత రుసుము వసూలు చేస్తారని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే జీఎన్ఎస్ఎస్ పరికరంతో తిరిగే వాహనాలకు 20 కి.మీ. వరకూ టోల్ ఫీ ఉండదు. ఆపైన తిరిగిన వాస్తవ దూరానికి మాత్రమే టోల్ వసూలు చేస్తారు. పైగా టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం కూడా ఉండదు. అయితే ఈ పద్ధతిని అమలు చేయడంలో ఇబ్బందులు కూడా ఉన్నాయి. 67.7 లక్షల కిలోమీ టర్ల రోడ్లతో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద రహదారి వ్యవస్థ మన దేశంలో ఉంది. దీనిలో 2024 నవంబరు నాటికి 45,428 కి.మీ. రహదారి టోల్ పరిధిలోకి వస్తుంది. ఫాస్టాగ్ బదులు జీపీఎస్ పద్ధతిని ప్రవేశపె ట్టాలంటే ఆయా టోల్ ప్లాజాల్లోని ప్రస్తుత సాంకేతిక వ్యవస్థను పెద్ద ఎత్తున ఆధునికీకరించాల్సి ఉంటుంది. అందుకు అయ్యే వ్యయం భారీ గానే ఉంటుంది. దీనివల్ల టోల్ చార్జీలు పెరిగే ప్రమాదం ఉంది. ప్రస్తు తానికి జాతీయ రహదారుల సంస్థ ఏడాదికి టోల్ రూపంలో రూ.40,000 కోట్లు వసూలు చేస్తోంది. జీపీఎస్ పద్ధతి పూర్తిగా అమ ల్లోకి వస్తే రాబోయే రెండు మూడేళ్లలో ఆ ఆదాయం రూ.1,40,000 కోట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.


పిల్లలు సోషల్ మీడియా వాడకుండా నిషేధం

చట్టాన్ని తీసుకురావాలని యోచిస్తున్న ఆస్ట్రేలియా



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: చిన్నపిల్లలు సోషల్ మీడియా వాడకుండా పూర్తిగా నిషేధం విధించాలని ఆస్ట్రేలియా భావి స్తోంది. ఇందుకోసం ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకురానున్నట్లు ఆ దేశ ప్రధాని ఆంథోని అల్బనీస్ స్వయంగా వెల్లడించారు. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంతో పాటు శారీరకం గానూ దెబ్బతీస్తోందని ఆయన అన్నారు. "పిల్లలు ఫోన్లను వది లేసి మైదానాల్లో, ఈత కొలనుల్లో, టెన్నిస్ కోర్టుల్లో ఆడుకోవడం చూడాలని ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. తొలుత సోషల్ మీడియా ఖాతాల్లో వయసు ధ్రువీక రణ ఆప్షన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేసి, ఆ తర్వాత ఈ ఏడాది చివరికల్లా చట్టాన్ని తీసుకువస్తా మని ఆయన చెప్పారు. అయితే, ఎంతలోపు వయస్సువారు సోషల్ మీడియా వాడకుండా నిషేధం ఉంటుందనేది ఆయన స్పష్టంగా వెల్లడించారు. 14 ఏళ్లు లేదా 16ఏళ్ల లోపు పిల్లలపై నిషేధం ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ ఆలోచనను డిజిటల్ హక్కుల కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారు. ఒక వేళ అలా చట్టం తీసుకువస్తే పిల్లలు ఫోన్లను చాటుగా ఉపయోగిస్తారని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు.

లోకం తీరు



అరుణాచల్‌లోకి చైనా సైన్యం!

» అంజా జిల్లాలో 60 కిలోమీటర్ల మేర చొరబాటు?

ఇటానగర్, సెప్టెంబరు 10: భారత్‌లోని ఈశాన్య రాష్ట్ర అరుణాచల్‌ప్రదేశ్ తమదే అంటూ తరచూ కయ్యానికి దిగే చైనా.. ఇటీవల ఏకంగా ఆ రాష్ట్రంలోకి అడుగుపెట్టినట్లుగా కూడా తెలుస్తోంది. డ్రాగన్ సైన్యం అరుణాచల్‌లోని అంజా జిల్లాలో 60 కిలోమీటర్ల మేర లోపలకు వచ్చినట్లు మీడియా కథనాలు వెలువ డ్డాయి. కపాపు ప్రాంతంలో కొద్ది రోజుల పాటు మకాం వేసినట్లుగానూ అందులో పేర్కొన్నారు. చైనా సైన్యం మంటలు వేసినట్లు, రాళ్లపై స్ప్రే చేసినట్లు, ఆహారం తిన్నట్లుగా కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. భారత రక్షణ శాఖ ఈ కథనాలను ఖండించింది. సరిహద్దుల్లో గుర్తించని ప్రాంతాల్లో భారత్-చైనా దళాలు పహరా కాస్తాయని, రాళ్లపై చైనా దళాలు వేసినది తాత్కా లిక మార్కింగేనని, ఆక్రమణకు దిగినట్లు కాదని పేర్కొన్నారు.

ఐదేళ్లలో 5 వేల మంది సైబర్ కమాండోలు: అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: సైబర్ సెక్యూరిటీ లేకుండా దేశ పురోగతి సాధ్యం కాదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, దీనికోసం వచ్చే ఐదేళ్లలో 5 వేల మంది సైబర్ కమాండోలకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. శిక్షణ పొందిన సైబర్ కమాండోలు డిజిటల్ స్పేస్‌లను కాపాడడంలో ఆయా రాష్ట్రాల అధికారులు, కేంద్ర ఏజెన్సీల సాయం తీసుకుంటారు. మంగళ వారం జరిగిన ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ తొలి వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో అమిత్ షా పాల్గొన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన 'సైబర్ ఫ్రాడ్ మిటిగేషన్ సెంటర్' (సీఎఫ్ఎంసీ)ను ప్రారంభించిన ఆయన దాన్ని జాతికి అంకితం చేశారు. 2023లో భారత్‌లో మొత్తం 11,28,256 సైబర్ నేరాలు జరిగి నట్టు గణాంకాలు చెబుతున్నాయి.

హరియాణాలో వినేశ్ వర్సెస్ యోగేశ్

జులానా, సెప్టెంబరు 10: రానున్న హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ మంగళవారం 21 మంది అభ్యర్థులతో తన రెండో జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాలో 'జులానా' నియోజకవర్గం నుంచి బీజేపీ యూత్ లీడర్ కెప్టెన్ యోగేశ్ బైరాగీ బరిలో నిలవనున్నట్లు పేర్కొంది. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్ పోటీ చేస్తుండగా.. బీజేపీ తరఫున యోగేశ్ బరిలో దిగారు. యోగేశ్ భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర అధ్యక్షు డిగా, బీజేపీ స్పోర్ట్స్ సెల్ హరియాణా విభాగానికి కో కన్వీనర్‌గా వ్యవహరిస్తు న్నారు. హరియాణాలో మొత్తం 90 నియోజకవర్గాలు ఉండగా బీజేపీ ఇప్పటికే 67 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

గోల్డ్ స్మగ్లర్ మునియద్ భారత్‌కు అప్పగింత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: అంతర్జాతీయ బంగారం స్మగ్లింగ్ ముఠాకు చెందిన కీలక నిందితుడు మునియాద్ అలీఖాన్‌ను సీబీఐ భారత్‌కు రప్పించింది. రెడ్‌కా ర్నర్ నోటీసుల ఆధారంగా అతణ్ని దుబాయ్‌లో అరెస్టు చేసిన ఇంటర్‌పోల్ మంగ ళవారం భారత్‌కు అప్పగించింది. సౌదీ అరేబియా నుంచి కోట్ల విలువైన బంగా రాన్ని భారత్‌కు అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ఎన్ఐఏ మార్చి, 2021లోనే ఖాన్ పై అభియోగాలు మోపింది. అప్పట్నుంచి అతను మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. అదే ఏడాది సెప్టెంబరులో ఇంటర్‌పోల్ అతనిపై రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో యూఏఈలో అలీఖాన్ ఆచూకీని కనిపెట్టిన ఇంట ర్‌పోల్ అతణ్ని అరెస్టు చేసి భారత్‌కు అప్పగించింది.

ప్రపంచంలో ఉత్తమ దేశం స్విట్జర్లాండ్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: ప్రపంచంలో ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక యింది. యూఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్ సంస్థ 2024 సంవత్సరానికి నిర్వ హించిన ఉత్తమ దేశాల ర్యాంకింగ్‌ల్లో ఈ స్థానం లభించింది. ఉత్తమ దేశంగా స్విట్జర్లాండ్ ఎంపిక కావడం వరుసగా ఇది మూడోసారి కావడం విశేషం. ఆ తరు వాతి స్థానాల్లో జపాన్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. భారత్‌కు 33వ స్థానం దక్కింది. గత ఏడాదితో పోల్చితే మూడు ర్యాంకులు తగ్గాయి. మొత్తం 89 దేశాల్లో సర్వే జరిపి ర్యాంకులు ఇచ్చారు. జీవన ప్రమాణాలు, సాహసాలు, వార సత్వం, వ్యాపార దక్షత, సాంస్కృతిక ప్రయోజనం తదితర పది అంశాలను పరిగ ణనలోకి తీసుకుని ప్రజాభిప్రాయం సేకరించారు. స్విట్జర్లాండ్‌లో జీవన నాణ్యత, వాణిజ్యంలో పారదర్శకత బాగున్నట్టు తేలింది. భారత్ విషయానికి వస్తే 'మూవర్స్', 'వారసత్వం' అంశాల్లో మార్కులు వచ్చాయి. ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడి పరిస్థితులకు త్వరగా అలవాటు పడేవారిని 'మూవర్స్'గా నిర్వచించారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడిలో 40 మంది మృతి

దెయిర్ అల్- బలాహ్, సెప్టెంబర్ 10: గాజాలోని మానవతా జోన్‌పై ఇజ్రా యెల్ వైమానిక దాడి చేయడంతో 40 మంది మృతి చెందగా, 60 మందికి పైగా గాయపడ్డారని గాజా సివిల్ డిఫెన్స్ పేర్కొంది. సురక్షిత జోన్‌గా పరిగణించే దక్షిణ గాజా నగరం ఖాన్ యూనిస్ శివారులోని మువాసీ ప్రాంతంపై మంగళ వారం ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపిందని గాజా సివిల్ డిఫెన్స్ అధికారి ఒకరు తెలిపారు. అయితే ఈ దాడి తాము చేయలేదని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంటోంది. కాగా, యుద్ధానికి ముందు గాజాలోని ఖాన్ యూనుస్‌లోని ఆల్ మువాసీ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ సైన్యం సురక్షిత జోన్‌గా ప్రకటించింది. దాంతో దాదాపు 10వేల మందికిపైగా పాలస్తీనియన్లు అక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

చలికాలంలో సాధారణం కన్నా 3 డిగ్రీల తక్కువ ఉష్ణోగ్రత!

విశాఖపట్నం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ శీతాకాలంలో చలి తీవ్రత పెరుగుతుందని భారత వాతావరణ శాఖ సీనియర్ అధికారి తెలిపారు. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని, ప్రధానంగా ఉత్తరాదిలోని జమ్ము, కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, దానికి ఆనుకుని ఉన్న మరికొన్ని రాష్ట్రాల్లో చలి ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తు న్నారు. మధ్య, దక్షిణ భారతంలో చలి సాధారణంగా ఉంటుందంటున్నారు.



సీతారాం ఏచూరి ఆరోగ్యం విషమం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): దాదాపు పది రోజుల క్రితం ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధప డుతూ ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చేరిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని పార్టీ కేంద్ర కమిటీ మంగళవారం తెలిపింది. డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గౌరి నేతృత్వంలో వివిధ వి భాగాలకు చెందిన వైద్యుల బృందం ఆయనకు చికిత్స అందిస్తోంది. ఇన్‌ఫెక్షన్ తొలగించేందుకు ఉపయోగించిన మందులు పనిచేయకపోవడంతో జపాన్ నుంచి ప్రత్యేక మందులు తెప్పిస్తున్నారని సమాచారం. వెంటిలేటర్‌పై ఉన్న సీతారాం ఏచూరి చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు చెప్పారు.

ఆపరేషన్ భేడియా



ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్ జిల్లాలో కొన్ని నెలలుగా ప్రజలపై దాడులు చేస్తూ పలువురి మరణానికి కారణమైన తోడేళ్ల గుంపులోని ఐదో తోడేలును అధికారులు మంగళవారం బంధించారు. మరో, ఆఖరి తోడేలు కోసం గాలిస్తున్నారు. తోడేళ్ల దాడుల్లో చనిపోయినవారిలో ఏడుగురు చిన్నారులే.

లోక్‌సభ ఎన్నికలు స్వేచ్ఛగా జరగలే!

» ఈసీ ఇష్టారాజ్యంగా వ్యవహరించింది
» భారత్‌లో హక్కుల కోసం ఘర్షణ
» సిక్కులకు తలపాగా ధరించే హక్కు లేదు
» అమెరికాలో రాహుల్ వ్యాఖ్యలు
» దేశ ప్రతిష్ఠ మంటగలుపుతున్నారు
» ప్రతిపక్ష నేతపై మండిపడ్డ బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): భారత్‌లో సార్వత్రిక ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికలు సజావుగా జరిగి ఉంటే బీజేపీ 240 సీట్లకు దరిదాపుల్లో కూడా వచ్చేది కాద న్నారు. అమెరికాలోని జార్జిటౌన్ యూనివర్సిటీలో మంగళవారం విద్యార్థులతో జరిగిన సమావేశంలో రాహుల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు 3నెలల ముందు తమ పార్టీ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారన్నారు. ఫలితంగా బీజేపీకి లబ్ధి కలి గిందని, ఎన్నికల సంఘం కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. రెండు మూడు బడా వ్యాపార సంస్థలతో మోదీ ప్రభుత్వం కుమ్మ క్కైందన్నారు. ఎన్నికలకు ముందు మోదీ భయాన్ని వ్యాపింపజేశారని.. ఎన్నికల తర్వాత ప్రజలకు భయం పోయిందని అన్నారు. 56 అంగుళాల ఛాతీ, దేవుడితో నేరుగా సంబంధాలు ఉన్నాయని చెప్పుకొన్న మోదీ.. ఎన్నికల తర్వాత నీరుగారిపోయారని ఎద్దేవా చేశారు. తాను మోదీని ద్వేషించనని, ఆయన ఆలోచనా విధా నాన్ని వ్యతిరేకిస్తానని రాహుల్ తెలిపారు. భారతదే శంలో రాజకీయాల మధ్య ఘర్షణ జరగడం లేదని, ప్రాథమిక హక్కుల గురించి జరుగుతోందని చెప్పారు. ఒక సిక్కు తన తల పాగా, కాడాను ధరిం చేందుకు అనుమతిస్తారా? అన్న దానిపై వివాదం ఉందని వ్యాఖ్యానించారు. ఇది కేవలం సిక్కులకే కాదని, అన్ని మతాలవారికీ వర్తిస్తుందని అన్నారు.

ఓబీసీ, దళితులకు భాగస్వామ్యం లేదు..

రాజ్యాంగాన్ని పరిరక్షించేవారికి, దాన్ని ధ్వంసం చేసేవారికి మధ్య జరిగిన పోరుగా పేదలు తాజా లోక్‌సభ ఎన్నికలను అర్థం చేసుకున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. కులగణన కూడా ఒక మౌలిక అంశంగా మారిందన్నారు. భారత్ ఒక మంచి దేశంగా మారినప్పుడు రిజర్వేషన్లను రద్దు చేస్తామని చెప్పారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని తెలి పారు. ఓబీసీ, దళితులకు సమాజంలో భాగ స్వామ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వంద రూపాయల్లో ఆదివాసీలకు పది, దళితులు, ఓబీసీలకు 5 రూపాయలు మాత్రమే దక్కుతున్నా యన్నారు. అదానీ, అంబానీలకు లభించిన ప్రయోజ నాలే అందరికీ దక్కినప్పుడే జనరల్ కేటగిరీలో ఉన్న వారికి లబ్ధి చేకూరుతుందని.. అయితే అందుకు అవ సరమైన మార్గాలను మూసేశారని అన్నారు.

యూనియన్ అంటే బీజేపీ ఒప్పుకోదు

రాజ్యాంగంలో భారతదేశం ఒక యూనియన్ అని ఉందని.. బీజేపీ మాత్రం అందుకు ఒప్పుకోదని రాహుల్ చెప్పారు. దేశంలో కొన్ని రాష్ట్రాల కంటే కొన్ని రాష్ట్రాలు తక్కువ అని, కొన్ని భాషల కంటే ఇంకొన్ని భాషలు తక్కువ అని.. కొన్ని మతాల కంటే



మరికొన్ని మతాలు గొప్పవని ఆరెస్సెస్ చెబుతోందని ఆరోపించారు. తమిళం, మరాఠీ, బెంగాలీ, మణిపురి.. ఇవన్నీ తక్కువ ప్రమాణాలు కలిగిన భాషలని అంటోందని.. ఆ సంస్థకు భారతదేశం అర్థం కాదని, ఇక్కడే తగువు మొదలవుతుందని రాహుల్ చెప్పారు. దేశంలో ఆర్థిక, సంస్థాగత సర్వేతో పాటు సమగ్ర కులజనగణన జరగాల్సిందేనని పేర్కొన్నారు.

రాహుల్‌వి దేశద్రోహ వ్యాఖ్యలు..

రాహుల్ వ్యాఖ్యలపై కేంద్ర మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విదేశాల్లో భారతదేశ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని ధ్వజమెత్తారు. సిక్కులను ఇక్కడ తలపాగాలు ధరించేందుకు అనుమతించ రన్న రాహుల్ వ్యాఖ్యల్లో నిజం లేదని కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురి అన్నారు. తాను ఆరు దశాబ్దా లుగా తలపాగాను ధరిస్తున్నానని చెప్పారు. 1947 తర్వాత తొలిసారి మోదీ హయాంలోనే సిక్కులు సురక్షితంగా ఉన్నారన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడే సిక్కులు అభద్ర తతో బతికారని గుర్తుచేశారు. 1984లో సిక్కులను ఊచకోత కోశారని, 3 వేలమంది ప్రాణాలు బలిగొ న్నారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన సిక్కుల ఊచకోతను రాహుల్ ఎలా మరిచిపోయా రని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ఆర్పీ సింగ్ ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే సిక్కుల తల పాగాలను తీసి తనిఖీ చేశారని, ఎందరో సిక్కుల గడ్డాలను కత్తిరించారని చెప్పారు. విదేశాల్లో భారత దేశ ప్రతిష్ఠను దిగజార్చడం దేశద్రోహమేనని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు.

వరంగల్ నుంచి మణిపూర్‌కు.. సీఆర్పీఎఫ్ అదనపు బలగాలు

» 2 వేల బలగాలను తరలిస్తున్న కేంద్రం
» ఇంఫాల్‌లో మళ్లీ చెలరేగిన హింస

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: మణిపూర్‌కు కేంద్ర ప్రభుత్వం మంగళవారం అదనంగా 2 వేల సీఆర్పీ ఎఫ్ బలగాలను తరలించింది. ప్రస్తుతం తెలంగాణ లోని వరంగల్‌లో ఉన్న 58వ బెటాలియన్, ఝార్ఖం డ్‌లోని 112 బెటాలియన్ నుంచి వీరిని తరలిస్తు న్నట్లు సీఆర్పీఎఫ్ అధికారులు వెల్లడించారు. కొత్తగా పంపే బలగాలు ఇంఫాల్ పరిసరాల్లో మోహరిస్తా యని వివరించారు. మణిపూర్ నుంచి అస్సాం రైఫి ల్స్‌ను ఉపసంహరించుకుని, జమ్మూకశ్మీర్‌కు తరలిం చాలని నిర్ణయించామని, ఈ నేపథ్యంలోనే 2వేల మంది సీఆర్పీఎఫ్ జవాన్లను మణిపూర్‌కు తరలిస్తు న్నామని తెలిపారు. ఇప్పటికే 16 బెటాలియన్ల బల గాలు మణిపూర్‌లో ఉన్నట్లు గుర్తుచేశారు. మణిపూ ర్‌లో ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలి హింసాత్మక ఘటనలకు నిరసనగా మంగళవారం వి ద్యార్థులు రాజ్‌భవన్‌కు ర్యాలీ తీయడంతో భద్రతాబ లగాలు అడ్డుకున్నాయి. ఈ ఘర్షణలో 40 మంది వి ద్యార్థులు గాయపడ్డారు. ఈ విషయం తెలియగానే.. విద్యార్థులు ఒక్కసారిగా రోడ్లపైకి వచ్చారు. ముఖ్య మంత్రి, గవర్నర్ నివాసాలను ముట్టడించేందుకు యత్నించారు. ఇంఫాల్‌లోని పలు ప్రాంతాల్లో ఘర్ష ణలు చెలరేగడంతో పోలీసులు బాష్పవాయు గోళా లను ప్రయోగించారు. తాజా ఘర్షణల నేపథ్యంలో ప్రభుత్వం మణిపూర్ వ్యాప్తంగా ఐదు రోజులపాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది.



మంగళవారం ఇంఫాల్‌లో రోడ్లపై విద్యార్థులు

చిక్కుల్లో ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం!

» సర్కారు రద్దుకు బీజేపీ విజ్ఞప్తి
» కేంద్ర హోం శాఖకు సిఫారసు చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: కేజ్రీవాల్ నాయకత్వం లోని ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వం చిక్కుల్లో పడింది. ఆప్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ బీజేపీ నేతలు ఇచ్చిన మెమొరాండంను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. కేంద్ర హోం శాఖకు సిఫారసు చేశారు. ఢిల్లీ శాసనసభ ప్రతిపక్ష నేత విజేందర్ గుప్తా నేతృత్వం లోని బీజేపీ ఎమ్మెల్యేల బృందం ఆగస్టు 30న రాష్ట్రపతి ద్రౌపది ముర్మును స్వయంగా కలిసింది. మద్యం కుంభ కోణం కేసులో జైలులో ఉన్నప్పటికీ కేజ్రీవాల్ తన సీఎం పదవికి రాజీనామా చేయకపోవడంతో పాలన గాడితప్పి రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొందని రాష్ట్రపతికి తెలియజేసింది. ప్రభుత్వం ఆరో ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేయలేకపోవడం, కాగ్ నివేదికపై స్పందించకపోవడాన్ని ఇందుకు ఉదాహరణలుగా పేర్కొంటూ ఓ మెమొరాండంను అందజేసింది. తమ విజ్ఞప్తిపై స్పందించిన రాష్ట్రపతి.. విషయాన్ని కేంద్ర హోం శాఖకు సిఫారసు చేసి తగిన చర్యలు తీసుకోవా లని ఆదేశించారని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా సోమవారం ప్రకటించారు. ఈ వ్యవహారంలో బీజేపీ తీరుపై ఆప్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. బీజేపీ దొడ్డిదారిలో ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర చేస్తోందని ఆప్ నేత, రాష్ట్ర మంత్రి అతిషి మంగ ళవారం ధ్వజమెత్తారు.

ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి

వాయుసేనలో తన సీనియర్‌పై ఓ మహిళ ఫిర్యాదు.. ఉన్నతాధికారులకు చెబితే తననే వేధించారని వెల్లడి

» శ్రీనగర్‌లో ఘటన.. పోలీసులకు ఫిర్యాదు.. ఎఫ్ఐఆర్ నమోదు
» నిందితుడు వింగ్ కమాండర్.. బాధితురాలు ఫ్లైయింగ్ ఆఫీసర్

శ్రీనగర్, సెప్టెంబరు 10: తన పై అధికారి తన మీద లైంగిక దాడికి పాల్పడ్డాడని వాయుసేనకు చెందిన ఒక మహిళాధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జమ్ము కశ్మీర్‌లోని బుద్గాం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు సహకరిస్తున్నామని వాయు సేన అధికార వర్గాలు మంగళవారం వెల్లడించాయి. నిందితుడు వాయుసేనలో వింగ్ కమాండర్ కాగా, బాధితురాలు ఫ్లైయింగ్ ఆఫీసర్.. ఇద్దరూ కశ్మీర్‌లోనే పని చేస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీన శ్రీనగర్‌లోని ఆఫీసర్స్ మెస్‌లో కొత్త సంవత్సరం వేడు కల సందర్భంగా.. తన సీనియర్ అయిన వింగ్ కమాండర్.. న్యూ ఇయర్ బహుమతులు తమ ఇంట్లో ఉన్నాయని చెప్పి అక్కడికి తనను తీసుకెళ్లాడని బాధి తురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్కడ తాను అడ్డుకుంటున్నా వినిపించుకోకుండా తనపై లైంగికదా డికి పాల్పడ్డాడని, ముఖరతి జరిపాడని తెలిపారు. కొన్ని రోజులపాటు తీవ్రమైన మానసిక వేదనకు గురైన అనంతరం ఇద్దరు మహిళా అధికారుల సహకా రంతో తమ విభాగంలో ఫిర్యాదు చేశానని, ఒక కర్నల్ స్థాయి అధికారి దీనిపై దర్యాప్తునకు నియమితుల య్యారని పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో నిందితు డిని తన పక్కన కూర్చోబెట్టి తనను ప్రశ్నించేవారని, ఈ విధంగా జరిగిన దర్యాప్తు ఏమీ తేల్చకుండానే ముగిసిందన్నారు. దీంతో తాను అంతర్గత కమిటీకి ఫిర్యాదు చేశానని, ఆ కమిటీ కూడా నిందితుడికి సహ కరిస్తున్నట్లుగానే వ్యవహరించింది తప్ప బాధితురాలి నైన తనకు అండగా నిలవలేదని వాపోయారు. పలు మార్లు తాను ఒత్తిడి చేస్తేగానీ తనకు వైద్యపరీక్షలు నిర్వహించలేదన్నారు. 'ఈ దారుణ పరిస్థితుల ఉపశ మనం కోసం సెలవు అడి గితే ఇచ్చేవారు కాదు. కనీసం వేరే విభాగానికి గానీ, వేరే ప్రాంతానికి గానీ బదిలీ చేయమన్న విజ్ఞప్తిని కూడా పట్టించు కోలేదు. దీంతో, నాపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తితో కలిసి, అతడికి సహకరిస్తున్న అధికారులతో కలిసి రోజూ పని చేయాల్సి వచ్చింది' అని సదరు మహిళా అధికారి తన ఫిర్యాదులో వివరించారు. తనను సామాజికంగా వెలి వేసినట్లుగా వ్యవహరించారని, తనతో ఎవరైనా మాట్లాడితే వారిని ఉన్నతాధికారులు వేధించేవారని, దీంతో తనను ఆత్మహత్య ఆలోచనలు చుట్టుముట్టా యని, దైనందిన కార్యకలాపాలన కూడా చేయలేని పరిస్థితికి చేరుకున్నానని బాధితురాలు వెల్లడించారు.



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ల ర్యాలీ

మా డిమాండ్లు నెరవేరేదాకా విధుల్లో చేరం

» సుప్రీంకోర్టు ఆదేశాలను పట్టించుకోని పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్లు

కోల్‌కతా, సెప్టెంబరు 10: కోల్‌కతాలో హత్యాచార ఘటనకు వ్యతిరే కంగా నిరసన ప్రదర్శ నల్లో పాల్గొంటున్న వైద్యులందరూ మంగ ళవారం సాయంత్రం 5గంటల్లోగా విధుల్లో చేరాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలను జూని యర్ డాక్టర్లు పక్కన పెట్టారు. తమ డిమాండ్లు నెరవేరే వరకు, బాధితురాలికి న్యాయం జరిగే వరకు ఆందోళనలను కొనసాగిస్తా మని స్పష్టం చేశారు. "కోల్‌కతా పోలీస్ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి, ఆరోగ్య సేవల విభాగం డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌లను తొలగిం చాలి" అని వారు డిమాండ్ చేశారు. కాగా, ఆర్జీ కర్ కాలేజీ ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకల కేసులో మాజీ ప్రిన్సిపాల్ ఘోష్‌కు సీబీఐ ప్రత్యేక కోర్టు ఈ నెల 23వరకు జ్యుడీషియల్ కస్టడీని విధించింది.

నితీశ్ చూపులెటు?

తేజస్వితో తాజాగా భేటీ.. అధికారిక సమావేశమేనన్న సీఎంవో

రాజకీయంగా తీవ్ర చర్చ



పట్నా, సెప్టెంబరు 10: బిహార్‌లో రాజకీ యాలు మరోమారు చర్చనీయాంశమయ్యాయి. జనతాదళ్(యూ) చీఫ్, సీఎం నితీశ్ కుమార్.. బిహార్ అసెంబ్లీలో విపక్ష నాయకుడు, ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్‌తో భేటీ కావడమే ఇందుకు కారణం..! వచ్చే ఏడాది జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు నితీశ్ ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని, అందుకే తేజ స్వీతో భేటీ అయ్యారనే ప్రచారం జరుగుతోంది. అయితే.. కేవలం సమాచార కమిషనర్ నియా మకానికి సంబంధించి వీరిద్దరూ భేటీ అయ్యా రని సీఎం కార్యాలయం స్పష్టం చేసింది. సమా చార కమిషనర్ నియామక కమిటీలో విపక్ష నేత కూడా సభ్యుడేనని గుర్తుచేసింది. ఈ భేటీ తర్వాత తేజస్వీయాదవ్ చేసిన వ్యాఖ్యలు.. తాజా చర్చకు దారి తీశాయి. నితీశ్‌తో సమా వేశం తర్వాత తేజస్వీ మీడియాతో మాట్లా డుతూ.. "65% రిజర్వేషన్ల అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ అంశం కోర్టు పరి ధిలో ఉందని నితీశ్ గుర్తుచేయగా.. న్యాయస మీక్షకు అతీతమైన రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్‌లో 65% రిజర్వేషన్ల అంశాన్ని చేర్చేలా కృషిచేయాలని నేను కోరాను" అని ఆయన వివరించారు. మంగళవారం సాయంత్రానికి ఈ భేటీ దేశవ్యాప్తంగా ఓ సంచలనం కావడంతో.. తేజస్వీ యాదవ్ మరోమారు మీడియాతో మాట్లాడారు. "నితీశ్‌ను నమ్మేది లేదు. ఆయన వాగ్దానాలపైనా నమ్మకం లేదు. బీజేపీతో చేరినం దుకు క్షమాపణలు కోరుతున్నా నని పేర్కొంటూ.. మా ఎమ్మె ల్యేల ముందు చేతులు జోడిం చారు. రెండు సార్లు అధికారమిస్తే.. మోసం చేశారు. మరోమారు నితీశ్‌తో పొత్తు పెట్టుకు నేది లేదు" అని తేల్చిచెప్పారు. అయితే, అదే సమయంలో నితీశ్ తిరిగి వస్తాడని, అతను తమవాడేనని ఆర్జేడీ నేత వీరేంద్ర విలేకరులతో చెప్పడం సంచలనంగా మారింది. "బీజేపీతో నితీశ్ అసంతృప్తిగా ఉన్నారు. సామ్యవాద భావాలున్న నితీశ్ బీజేపీతో ఉండలేరు" అని వ్యాఖ్యానించారు. దీన్ని జేడీయూ కొట్టిపారే సింది. జేడీయూ ప్రధాన అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ఈ అంశంపై మాట్లాడుతూ.. బీజేపీతో తమ పార్టీకి కెమిస్ట్రీ మెరుగుపడుతోం దని వ్యాఖ్యానించారు. తేజస్వీతో నితీశ్ భేటిని ఎక్కువగా ఊహించుకోవద్దన్నారు.

రిజర్వేషన్లపై ఇద్దరిదీ ఒకేమాట?

రిజర్వేషన్ల పెంపుపై జేడీయూ, ఆర్జేడీలది ముందు నుంచి ఒకే మాటగా ఉంది. ఇరు పార్టీల పొత్తుతో ప్రభుత్వం ఉన్నప్పుడే కులగణన ఆలోచనకు బీజం పడింది. కులగణన తర్వాత నితీశ్ ప్రభుత్వం బిహార్‌లో రిజర్వేషన్లను 65శాతానికి పెంచింది. దీన్ని పట్నా హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు నిర్ణయాన్ని తేజస్వీ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. శుక్రవారమే ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చింది. మరోవైపు, ప్రస్తుతం నితీశ్ జట్టుకట్టిన బీజేపీ కులగణనకు వ్యతిరేకంగా ఉంది. వచ్చే ఏడాది బిహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

రైలు ప్రమాదాలకు ఉగ్ర కుట్ర?

» అజ్మీర్‌లో రైలు పట్టాలపై సిమెంటు బ్లాక్‌లు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 10: రాజస్థాన్,ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో రైళ్లను పట్టాలు తప్పించడమే లక్ష్యంగా చోటుచేసుకున్న ఘట నలు కలకలం సృష్టించాయి. ఇది ఉగ్రవాదుల కుట్రేనని అనుమానిస్తున్నారు. మంగళ వారం రాజస్థాన్‌లోని అజ్మీర్ జిల్లాలోని పశ్చిమ రవాణా కారిడార్‌లో లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలును పట్టాలు తప్పించే యత్నం జరిగింది. ఈ కారిడార్‌లోని సరధ్న- బంగద్ మార్గంలో కొందరు దుండగులు రైలు పట్టాలపై రెండు సిమెంటు బ్లాక్‌లు పెట్టారు. ఆదివారం రాత్రి గూడ్స్ రైలు ఆ సిమెంటు బ్లాకులను ఢీకొట్టినప్పటికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని రైల్వే అధికారులు మంగళవారం తెలిపారు. ఇక సోమవారం భివానీ-ప్రయాగరాజ్ కళింది ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణించే మార్గంలో కూడా రైల్వే ట్రాక్‌పై ఎల్పీజీ సిలిండర్, ఓ సీసాలో పెట్రోల్, అగ్గిపె ట్టెలు పెట్టినట్లు చెప్పారు. ఇక కళింది ఎక్స్‌ప్రెస్ రైలును పట్టాలు తప్పించేం దుకు చేసిన యత్నంలో ఉగ్రవాదుల కుట్ర కోణం ఉన్నట్లు ప్రాథమిక విచార ణలో గుర్తించారు. ఈ ఘటనకు ఐఎస్ఐఎస్ ఖొరాసన్ మాడ్యూల్‌తో సంబం ధాలు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. రామేశ్వరం కేఫ్‌లో పేలుళ్ల ఘటన సూత్ర ధారిగా పేర్కొంటున్న పాక్ ఉగ్రవాది ఫర్హతుల్లా ఘోరీ భారత్‌లో రైలు ప్రమా దాలకు ప్రణాళిక రూపొందించాలంటూ ఆడియో క్లిప్‌లో పిలుపునిచ్చిన వారం రోజులకే ఈ ఘటనలు చోటుచేసుకోవడం గమనార్హం. అలాగే ఇటీవల జరిగిన రైలు ప్రమాదాలపైనా ఉగ్ర కుట్ర కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఢిల్లీ పోలీ సులు ఇప్పటికే 14 మంది ఐఎస్ఐఎస్ ఉగ్రవాదులను అరెస్టు చేశారు.

‘సోలార్ గ్రామం’గా కొండారెడ్డిపల్లి!

- సీఎం సొంతూరులో ప్రతి ఆవాసానికీ సౌర విద్యుత్ ప్లాంట్ పెట్టాలని నిర్ణయం
- రూ.15 కోట్లు అవుతాయని అంచనా
- గ్రామంలో మొదలైన ఇంటింటి సర్వే

హైదరాబాద్/వంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పూర్తిగా సోలార్ ఆధారిత విద్యుత్ వినియోగ గ్రామంగా సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరు కొండారెడ్డిపల్లిని తీర్చిదిద్దనున్నారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజనలో భాగంగా దేశవ్యాప్తంగా జిల్లాకో గ్రామాన్ని సోలారైజ్డ్‌గా మార్చేందుకు కేంద్రం ఒక్కో పల్లెకు రూ.కోటి చొప్పున ఇస్తోంది. ఈ పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర సర్కారు కొండారెడ్డిపల్లితో పాటు మధిర నియోజకవర్గంలోని ఓ గ్రామాన్ని ఎంపిక చేసింది. వీటిలో తొలుత కొండారెడ్డిపల్లిని సోలారైజ్డ్‌గా మార్చనున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో గృహ విద్యుత్ వినియోగదారులు 499 దాకా ఉండగా.. వీరికి డిమాండ్ ఆధారంగా 1 కిలోవాట్ నుంచి 3 కిలోవాట్ల దాకా రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు పెట్టనున్నారు. 66 వాణిజ్య కనెక్షన్లకు కూడా డిమాండ్ ఆధారంగా రూఫ్‌టాప్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. 867 వ్యవసాయ కనెక్షన్లకు 7.5 కిలోవాట్ల చొప్పున ప్లాంట్లు పెట్టనున్నారు. పీఎం కుసుమ్ కింద వ్యవసాయ సోలార్ మోటార్ కనెక్షన్లు ఇవ్వనున్నారు.


కొండారెడ్డిపల్లి వాసులతో మాట్లాడుతున్న అధికారులు

కొండారెడ్డిపల్లిలో అన్ని కేటగిరీలు కలుపుకొని 1,451 కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద 3 కిలోవాట్ల దాకా ఇళ్లపై సౌర ఫలకాలు పెట్టుకోవడానికి దరఖాస్తు పెట్టుకున్న వారికి సబ్సిడీ అందనుంది. 2 కిలోవాట్ల దాకా మొత్తం వ్యయంలో 60 శాతం(గరిష్ఠంగా రూ.60 వేలు).. 3 కిలోవాట్ల కేటగిరీలో 2 కిలోవాట్ల దాకా రూ.60 వేలు, అదనంగా ఒక కిలోవాట్‌కు రూ.18 వేలు కలిపి రూ.78 వేలు సబ్సిడీ రూపంలో అందనుంది. సీఎం ఆదేశాలతో మంగళవారం నుంచి గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టారు. దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్ అలీ, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, రెడ్‌కో సీఎండీ అనిల గ్రామంలో పర్యటించి సోలార్ ప్రాజెక్టు ప్రయోజనాలను వివరించారు. ఇక కొండారెడ్డిపల్లిలో మొత్తం కనెక్షన్లకు కలిపి 5 మెగావాట్ల డిమాండ్ ఉంటుందని, ఒక మెగావాట్‌కు రూ.3 కోట్ల చొప్పున రూ.15 కోట్లు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. వారం రోజుల్లో డీపీఆర్‌ను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నారు. దాంతో కేంద్రం సహాయం కింద అందే రూ.కోటితో పాటు రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ అన్నీ కలిపి రూ.5 కోట్ల దాకా సహాయం అందే అవకాశాలు ఉండగా, మరో రూ.10 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించనుంది.

జైళ్లలో డ్రగ్స్ నిరోధానికి స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు

- జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా

సైదాబాద్,సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో ఖైదీల డ్రగ్స్ వినియోగాన్ని నిరోధించేందుకు స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నామని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా తెలిపారు. చంచల్‌గూడలోని జైళ్ల శాఖ సీకా కార్యాలయంలో మంగళవారం ‘డ్రగ్స్, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, నిరోధంపై అవగాహన’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా జైళ్లను డ్రగ్స్ రహితంగా చేసేందుకు కార్యక్రమాలు చేపట్టామని, ఇప్పటికే డాగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసలై జైల్లోకి వచ్చిన ఖైదీలకు ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ.. జైళ్లలో డ్రగ్స్ నిరోధానికి అధికారులు, సిబ్బంది, పోలీసుశాఖ సమష్టిగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్యసాయంతో పాటు, మానసిక పరివర్తనలో మార్పులు తెచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జైలు సిబ్బంది, కౌన్సెలర్లు, ఖైదీల ఎస్కార్ట్ సిబ్బందికి, జైలు సంక్షేమ అధికారులకు అవగాహన కల్పించారు.

జైలు సిబ్బందికి కొత్త చట్టాలపై శిక్షణ

జైలు అధికారులు, సిబ్బందికి కొత్త క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించేందుకు మంగళవారం సీకా కార్యాలయంలో శిక్షణ తరగతులను జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీ డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

కరీంనగర్-హసన్‌పర్తి రైల్వేలైన్‌కు అనుమతివ్వండి

- రైల్వే మంత్రికి బండి సంజయ్ వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్-హసన్‌పర్తి కొత్త రైల్వేలైన్ ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైందని, నిర్మాణ పనులకు అనుమతి ఇవ్వాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కోరారు. మంగళవారం ఢిల్లీలో అశ్వినీ వైష్ణవ్‌ను బండి సంజయ్ కలిసి వినతిపత్రం అంజేశారు. కరీంనగర్ నుంచి హసన్‌పర్తి వరకు 61.8 కి.మీ. మేర నిర్మించనున్న కొత్త రైల్వేలైన్‌కు రూ.1415 కోట్లు వ్యయమవుతుందని, ఈ మేరకు డీపీఆర్ సిద్ధమైందని తెలిపారు. రైల్వే బోర్డులో ఈ అంశం పెండింగ్‌లో ఉందని, తక్షణమే ఆమోదం తెలపాలని కోరారు. దీంతోపాటు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్ రైల్వేస్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయాలని, జమ్మికుంట స్టేషన్ వద్ద దక్షిణ ఎక్స్‌ప్రెస్ రైలు ఆగేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఉప్పల్ స్టేషన్ అప్‌గ్రేడ్‌లో భాగంగా ప్లాట్ ఫాం, రైల్వేస్టేషన్ భవనాన్ని ఆధునీకరించాలని, కొత్త రైల్వే సేవలను ప్రవేశపెట్టాలన్నారు. సోలార్ ప్యానెళ్లను అమర్చాలని, టికెట్ కౌంటర్, లగేజీ నిర్వహణ వ్యవస్థను మెరుగుపర్చాలని, అలాగే, ఉప్పల్ రైల్వేస్టేషన్ ఆధునీకరణకు నిధులివ్వాలని కోరారు.

వివాహితపై డెలివరీ బాయ్ అత్యాచారయత్నం

- పోలీసులకు అప్పగించిన స్థానికులు

నిర్మల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామగ్రిని ఇచ్చేందుకు వచ్చి.. ఓ వివాహితపై ఈ కామర్స్ డెలివరీ బాయ్ అత్యాచార యత్నానికి పాల్పడ్డ ఘటన మంగళవారం నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. నిర్మల్‌కు చెందిన వివాహిత ఓ ఈ కామర్స్ సంస్థలో తన ఇంటికి కావాల్సిన సామగ్రిని ఇటీవల ఆర్డర్ చేసింది. దాని డెలివరీ బాయ్ విఘ్నేశ్వర్ వాటిని డెలివరీ చేసేందుకు మంగళవారం సాయంత్రం సదరు వివాహిత ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడాన్ని చూసిన విఘ్నేశ్వర్.. అత్యాచారానికి యత్నించగా ఆమె గట్టిగా కేకలు వేయడంతో.. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకొని విఘ్నేశ్వర్‌ను పట్టుకున్నారు. అతడిని పోలీసులకు అప్పజెప్పడంతో.. నిర్మల్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో వరద నష్టం 730 కోట్లు!

ఆరుగురి మృతి.. కేంద్ర బృందానికి నివేదిక ఇస్తాం

- దెబ్బతిన్న ఇళ్లు 15,096.. రూ.16,500 చొప్పున ఖాతాల్లో జమ
- 80వేల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు.. రూ.10వేల చొప్పున సాయం
- జాతీయ విపత్తుగా కేంద్రం సాయం అందించాలి: తుమ్మల


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల మూలంగా రూ.730 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాలో బుధవారం కేంద్ర బృందం పర్యటించనున్న నేపథ్యంలో మంగళారం రాత్రి ఖమ్మం కార్పొరేషన్‌లో మంత్రి తుమ్మల జిల్లాలోని పలుశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖలవారీగా వరద నష్టంపై నివేదికలను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో వరదల కారణంగా ఆరుగురు మృతిచెందారని తెలిపారు. ఆకస్మిక వరదలు కారణంగా జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమించి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సహాయ కార్యక్రమాలు నిర్వహించిందని కొనియాడారు. ప్రజల ప్రాణాలు కాపాడటంతో పాటు పునరావాస కేంద్రాల్లో భోజనం తదితర వసతులు సమకూర్చారంటూ జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. వరద తగ్గిన 24గంటల్లోనే బాధితులకు నిత్యావసరాలు, భోజనాలు, దుస్తులు అందించారని, ఫలితంగా ఖమ్మం వెంటనే కోలుకోగలిగిందని పేర్కొన్నారు. ఇతర జిల్లాల నుంచి పారిశుధ్య కార్మికులను కూడా రప్పించామని పేర్కొన్నారు. మున్నేరు, పాలేరు వరదలతో 15,096 ఇళ్లు దెబ్బతిన్నాయని, 150ఇళ్లు పడిపోయామని వివరించారు. బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున నేరుగా వారి అకౌంట్లకే జమచేస్తున్నామని తెలిపారు. జిల్లాలో పంటల నష్టం కూడా ఎక్కువగా జరిగిందని, సుమారు 80వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. నష్టం జరిగిన ప్రతి పంటకు ఎకరానికి రూ.10వేల చొప్పున ఆయా రైతుల బ్యాంకు అకౌంట్లకు జమ చేస్తామని, ఇందుకు రూ.63కోట్లు కావాలని వ్యవసాయశాఖ ప్రతిపాదనలు పంపిందన్నారు. మిర్చి, పండ్లతోటలకు మరో రూ.68 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారని, రైతులదరికీ పరిహారం అందిస్తామన్నారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీకి రూ.151కోట్ల మేర నష్టం జరిగిందని, తక్షణ మరమ్మతులకు రూ.6కోట్లు నిధులు అవసరం ఉందన్నారు. పంచాయతీరాజ్ రోడ్లకు రూ.34కోట్ల మేర నష్టం జరిగిందని, రూ.2కోట్లు తక్షణ మరమ్మతులకు అవసరం ఉందని తెలిపారు. ఇరిగేషన్ శాఖకు భారీగా నష్టం జరిగిందని, ఎన్ఎస్పీ కాలువలకు పలుచోట్ల గండ్లుపడడం, తెగిపోవడం సుమారు రూ.434కోట్లు ఇరిగేషన్‌కు నష్టం జరిగిందన్నారు. కేంద్ర బృందం జిల్లాలో పర్యటన సందర్భంగా జరిగిన నష్టాన్ని పూర్తిగా వివరిస్తామని తెలిపారు. కేంద్ర బృందానికి అన్ని నివేదికలను అందిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ వరద నష్టాన్ని జాతీయ విపత్తుగా గుర్తించి రైతులకు తగిన సహాయం అందించాల్సిన అవసరం ఉందని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి 16వ ఆర్థికసంఘం కమిటీ సమావేశంలోనూ నివేదిక ఇచ్చారని తెలిపారు. కేంద్ర బృందానికి కూడా నివేదిక ఇచ్చి రాష్ట్రానికి జరిగిన నష్టంపై ఎక్కువ పరిహారం అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా యంత్రాగానికి, సాధారణ ప్రజలకు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు, అన్నిపార్టీల నాయకులు, మీడియాకు మంత్రి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య తదితరులు పాల్గొన్నారు. కాగా ఖమ్మం జిల్లాలో కేంద్ర బృందం రాక నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తాజా అంచనాలను సిద్ధం చేసింది. శాఖల వారీగా మొత్తం 729.68కోట్లు నష్టం జరిగినట్లు నివేదికలు సిద్ధం చేశారు. దెబ్బతిన్న ఇళ్లకు రూ.25.33 కోట్లు, పశుసంవర్ధకశాఖకు రూ.1.48 కోట్లు, ఆర్‌అండ్‌బీకి రూ.151.69 కోట్లు, పీఆర్‌కు రూ.34.77 కోట్లు, నీటిపారుదల శాఖకు రూ.434.7కోట్లు, విద్యాశాఖ భవనాలకు రూ.1.20 కోట్లు, ఆరోగ్యశాఖ ఆస్పత్రులకు రూ.30లక్షలు, విద్యుత్తు శాఖకు రూ.7.73 కోట్లు, వ్యవసాయాశాఖకు రూ.68.34 కోట్లు, మత్స్యశాఖకు రూ.4.44 కోట్ల నష్టం జరిగిందని అంచనాలు సిద్ధం చేశారు.

యథేచ్ఛగా పశువుల స్మగ్లింగ్

- ఆసిఫాబాద్ టూ హైదరాబాద్
- కబేళాకు తరలుతున్న మూగజీవాలు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 10: కుమరం భీం జిల్లా నుంచి యేటా పెద్ద సంఖ్యలో పాడి పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి పశువుల వ్యాపారులు జిల్లాకు చెందిన దళారులతో కలిసి వాహనాల్లో రాత్రి వేళ పశువులను యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. కౌటాల, జైనూరు, వాంకిడి మండలం గణేశ్‌పూర్, రెబ్బెన ప్రాంతాల్లో ప్రతి వారం పశువుల సంతలు జరుగుతుంటాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున ఆవులు, దూడలు, వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులను హైదరాబాద్ నగరానికి తరలిస్తున్నట్లు చెబుతున్నారు. సంతల్లో రైతులకు ఒక్కోపశువుకు రూ.3వేల నుంచి రూ.10 వేల వరకు ముట్టజెప్పి కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇందులో ఆవులు, లేగ దూడల కొనుగోళ్లు అధికంగా జరుగుతున్నాయి. వ్యవసాయానికి పనికొచ్చే ఎద్దులను కూడా దళారులు రూ.5 వేల నుంచి రూ.15 వేల మధ్య చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. పశువుల సంతల్లో స్మగ్లర్లు నేరుగా కొనుగోలు చేయకుండా బ్రోకర్ల ద్వారా సేకరిస్తున్నారు. వ్యవసాయం, పాడిఅవసరాల కోసం కొనుగోలు చేస్తున్నట్లు రైతులను నమ్మించి కొనుగోలు జరుపుతున్నట్లు పలు సందర్భాల్లో అధికారులు జరిపిన విచారణలో తేలింది. అధికారులు నిఘా తీవ్రతరం చేసిన సందర్భాల్లో స్మగ్లర్లు కొంత కాలం వ్యాపారం నిలిపివేస్తున్నారు. అనంతరం యథా ప్రకారం కబేళాలకు తరలిస్తున్నారు. ఆవు జాతి పశువులన్నింటి వధపై కఠినమైన ఆంక్షలున్నా స్మగ్లింగ్ దందా కొనసాగడానికి స్థానికంగా ఉండే రవాణా శాఖాధికారులు, పోలీసుల పాత్రే అధికమని తెలుస్తోంది. అంతర్రాష్ట్ర సరిహద్దు మండలాలైన వాంకిడి, సిర్పూర్(టి), చింతలమానేపల్లి మండలాల నుంచి నిత్యం ఈ అక్రమ రవాణా జరుగుతోంది. స్మగ్లర్లు పశువుల రవాణాకు ఆటంకం ఏర్పడకుండా ఎస్కార్ట్‌గా కొంతమందిని ఏర్పాటు చేసుకుని ఆసిఫాబాద్ నుంచి హైదరాబాద్ వరకు దారి పొడవున పశువుల రవాణాను అడ్డుకునే అధికారులు, పోలీసులకు మామూళ్లు ముట్టజెప్పి కబేళాలకు చేరవేస్తున్నారు. 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా గోవధ నిషేధ చట్టాన్ని తెచ్చారు. ఆచరణలో ఈ చట్టాన్ని కొన్ని రాష్ట్రాలు కఠినంగా అమలు చేస్తుండగా తెలంగాణలో సరిగ్గా అమలు చేయక పోవడం వల్లే పశువుల అక్రమ రవాణా పెరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, దూడలు, ఎద్దులను స్మగ్లర్లు వ్యాన్‌లు, లారీలలో పరిమితికి మించి కుక్కి తీసుకెళ్తుండడంతో ఊపిరాడక చాలా పశువులు మార్గ మధ్యంలోనే మృతి చెందుతున్నాయి.

పాక్ జెండాను పోలిన పతాకావిష్కరణ

- వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో కలకలం

శంభునిపేట, సెప్టెంబరు 10: పాకిస్తాన్ జెండాను పోలిన పతాకాన్ని ఆవిష్కరించడం వరంగల్‌లో కలకలం రేపింది. గ్రేటర్ వరంగల్ 41వ డివిజన్ శంభునిపేట జంక్షన్‌లో ఓ వర్గం యువకులు డివైడర్ మధ్యలో ఇనుప పైపును ఏర్పాటు చేశారు. శుక్రవారం దానిపై పాక్ జెండాను పోలిన పతాకాన్ని ఎగురవేశారు. దీనిని గుర్తించిన కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో అది వైరల్‌గా మారింది. ఈ జెండా పాకిస్తాన్ జాతీయ జెండాను పోలి ఉందంటూ స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయం రెండు రోజులుగా చర్చనీయాంశం కాగా మంగళవారం మునిసిపల్ సిబ్బంది, పోలీసులు జెండాను తొలగించారు. ఆ సమయంలో కొందరు యువకులు అడ్డుచెప్పగా.. చట్టానికి లోబడి నడుచుకోవాలని అధికారులు హెచ్చరించారు. జంక్షన్‌లో ఉన్న అన్ని జెండాలను తొలగించారు.



విగ్రహాలు నిమజ్జనం చేయవద్దంటూ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

సాగర్‌లో వినాయక నిమజ్జనాలపై ఆంక్షలు

- ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు, జీహెచ్ఎంసీ
- అక్కడే నిమజ్జనం చేస్తాం: ఎమ్మెల్యే రాజాసింగ్

కవాడిగూడ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈసారి వినాయక నిమజ్జనోత్సవం ట్యాంక్‌బండ్‌పై నుంచి ఉండదా? అక్కడ ప్రత్యేకంగా క్రేన్లను ఏర్పాటు చేయడం లేదా? ట్యాంక్‌బండ్‌పై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేసిన ఫెక్సీలు ఇదే స్పష్టం చేస్తున్నాయి. ‘హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం ట్యాంక్‌బండ్ మీద విగ్రహాల నిమజ్జనం ఉండదు’ అని రాసివున్న ఫ్లెక్సీలు ప్రతి 100 మీటర్లకు ఒకటి చొప్పున వెలిశాయి. పైగా విగ్రహాల నిమజ్జనాన్ని నిరోధించేందుకు ఆ దారి పొడవున ఉన్న ఐరన్ గ్రిల్స్‌కు భారీ ఇనుప కంచెను ఏర్పాటు చేశారు. ఫలితంగా మంగళవారం నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌పైకి వచ్చిన భక్తులు.. వెనుదిరిగి ఎన్టీఆర్ మార్గ్, పీవీ మార్గ్ వైపు నుంచి విగ్రహాలను గంగమ్మ ఒడికి చేర్చారు. ఆ ప్రాంతాల్లో నిమజ్జనం కోసం ప్రత్యేకంగా క్రేన్లు ఏర్పాటు చేశారు. కాగా ట్యాంక్‌బండ్‌పై నుంచి విగ్రహాల నిమజ్జనంపై ఆంక్షలు విధిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా స్పందించారు. తాము వినాయకసాగర్ (హుస్సేన్‌సాగర్)లో ట్యాంక్‌బండ్ నుంచే నిమజ్జనాలు చేస్తామని స్పష్టం చేశారు. హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయకపోతే ఎక్కడ చేయాలో చెప్పాలని ప్రశ్నించారు. హిందువులను ఇబ్బందులు పెట్టేందుకే ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని మండిపడ్డారు. “హుస్సేన్ సాగర్‌లో పీవోపీ విగ్రహాలు వేస్తే అందులో ఉన్న నీరు కలుషితం అవుతుందని అంటున్నారు. మరి.. ఇప్పుడు ఆ నీళ్లు ఏమైనా కలుషితం కాకుండా శుభ్రంగా ఉన్నాయా? కలుషిత నీటిలో విగ్రహాలు వేస్తే వచ్చే నష్టం ఏమిటి?” అని ప్రశ్నించారు.

కుక్కల దాడిలో 10 నెలల బాబు దుర్మరణం

- బోధన్ బస్సు డిపో వద్ద ఘటన.. ప్రజల్లో భయాందోళనలు
- పిచ్చికుక్క దాడిలో కామారెడ్డి జిల్లాలో 10మందికి గాయాలు

బోధన్ రూరల్, మాచారెడ్డి, సెప్టెంబరు 10: నిజామాబాద్ జిల్లా బోధన్‌లో ఘోరం జరిగింది. నిద్రిస్తున్న పది నెలల బాబును పిచ్చి కుక్కలు ఎత్తుకెళ్లి కొరికి చంపాయి. సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. బోధన్ మండలం చిన్న మావందికి చెందిన గంగామణి బిక్షమెత్తుకుంటూ తన 10 నెలల కుమారుడితో బోధన్‌లో ఉంటోంది. సోమవారం రాత్రి మద్యం తాగిన ఆమె, ఆ మత్తులో బాబును డిపో ప్రాంతంలో వదిలేసి వెళ్లిపోయింది. అక్కడే సంచరిస్తున్న వీధి కుక్కలు బాలుడిని ఎత్తుకెళ్లి చంపేశాయి. పోలీసులు బాలుడి ఆచూకీ కోసం వెతగ్గా.. బస్‌డిపో వెనుక బాలుడికి సంబంధించిన శరీర భాగాలు లభ్యమయ్యాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం)లో మంగళవారం ఓ పిచ్చి కుక్క దాడిలో గ్రామానికి చెందిన 10మందికి గాయాలయ్యాయి.

పీఏసీఎస్ చైర్మన్, సీఈవో, డైరెక్టర్ల నిర్బంధం

భువనగిరి రూరల్, సెప్టెంబరు 10 : రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ రైతులు, బీజేపీ నాయకులు వారిని రైతు వేదికలో నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్లలో మంగళవారం ఈ ఘటన జరిగింది. సొసైటీ పరిధిలో మొదటి విడతగా 949 మంది రైతులకు రూ.7.03 కోట్ల నిధులు ప్రభుత్వం మంజూరు చేసి ఎస్‌బీఐలో జమ చేసింది. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో స్థానిక బ్యాంకుకు నగదు విడుదల కాలేదు. దీంతో సోమవారం బీజేపీ నాయకులు పీఏసీఎస్‌ను ముట్టడించారు. రైతులు, బీజేపీ నాయకులు పీఏసీఎస్ చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి, సీఈవో దంతూరి నర్సింహ, డైరెక్టర్లను రైతు వేదిక ప్రధాన తలుపులకు గడియపెట్టి నిర్బంధించారు. వారం రోజుల్లోగా రైతులకు రుణమాఫీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అంజిరెడ్డి, పోలీసులు హామీ ఇవ్వడంతో రైతులు నిరసనను విరమించారు.

2021 నాటి ఆదేశాలే కొనసాగుతాయి

పాత కేసు రీ-ఓపెన్ చేయక్కర్లేదు.. హుస్సేన్ సాగర్‌లో పీవోపీ విగ్రహాల నిమజ్జనంపై హైకోర్టు

- హైడ్రాను పార్టీగా చేర్చిన పిటిషనర్‌పై ఆగ్రహం
- మధ్యంతర అప్లికేషన్లు కొట్టివేత

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హుస్సేన్ సాగర్‌లో ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాల నిమజ్జనం కొనసాగిస్తున్న నేపథ్యంలో మూడేళ్ల క్రితం నాటి కోర్టు ధిక్కరణ కేసును తిరిగి తెరవాలంటూ దాఖలైన మధ్యంతర పిటిషన్లను హైకోర్టు తోసిపుచ్చింది. పీవోపీ విగ్రహాలు నిమజ్జనం చేయరాదన్న గత ఆదేశాలు అలాగే కొనసాగుతాయని స్పష్టం చేసింది. మూడేళ్ల కిందటి కోర్టు ధిక్కరణ కేసులో అప్పుడే సంతృప్తి వ్యక్తం చేసిన కోర్టు దానిని మూసేసిందని.. తిరిగి పునరుద్ధరించడం కుదరదని తేల్చిచెప్పింది. పిటిషనర్ కావాలంటే తాజా పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయరాదంటూ 2021లో ఇచ్చిన ఆదేశాల ఉల్లంఘన జరుగుతోందని, కాలుష్యం విపరీతంగా పెరిగిపోతోందంటూ న్యాయవాది మామిడి వేణుమాధవ్ మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. అందులో హైడ్రాను సైతం పార్టీగా చేర్చారు. ఈ పిటిషన్లపై జస్టిస్ టీ వినోద్‌కుమార్, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ వాదనలు వినిపిస్తూ యథేచ్ఛగా కోర్టు ధిక్కరణ జరుగుతోందని, జలవనరులను రక్షించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి తరఫున సీనియర్ న్యాయవాది ఎల్ రవిచందర్ వాదిస్తూ ఈ విషయంపై సుప్రీం కోర్టు సైతం విచారణ చేపట్టిందని, పీవోపీ విగ్రహాలను నిమజ్జనం చేయబోమని అప్పటి సొలిసిటర్ జనరల్ సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారన్నారు. కాబట్టి ధిక్కరణ పిటిషన్ సుప్రీం కోర్టులో వేయాల్సి ఉంటుందన్నారు. మూడేళ్ల క్రితం నాటి కోర్టు ధిక్కరణ కేసు తిరిగి తెరవడానికి లిమిటేషన్ నిబంధనలు అంగీకరించవన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతిసారి పిటిషనర్ చివరి నిమిషంలో కోర్టుకు వస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 2021లో ఇచ్చిన ఆదేశాలకు, ఇటీవల ఏర్పాటైన హైడ్రాకు ఏం సంబంధమని ప్రశ్నించింది. మూడేళ్ల నుంచి ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నారంటూ చివరి నిమిషంలో హడావిడి చేయడాన్ని తప్పుబట్టింది. హుస్సేన్ సాగర్‌లో కాలుష్యానికి సంబంధించి మీ వద్ద ఏం లెక్కలు ఉన్నాయో చెప్పాలని ప్రశ్నించింది. ఎలాంటి ఆధారాలు లేకుండా వాదించడం చెల్లదని పేర్కొంది.

మళ్లీ ఉధృతంగా గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవాహం.. 49.8 అడుగులకు చేరిక

- ఏపీలోని పోలవరం ముంపు మండలాలపైన తీవ్ర ప్రభావం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి మరోసారి ఉగ్రరూపం దాల్చుతోంది. అటు శబరి, సీలేరు ఉప నదుల నుంచీ భారీ వరద చేరుతుండడంతో రెండో ప్రమాద హెచ్చరిక (48 అడుగులు) దాటి ప్రవహిస్తోంది. మూడో ప్రమాద హెచ్చరిక (53 అడుగులు)కు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి 34.1 అడుగులున్న నీటి మట్టం మంగళవారం ఉదయానికి 43 అడుగులకు చేరుకోవడంతో మొదటి, సాయంత్రానికి 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక చేశారు. మంగళవారం అర్ధరాత్రికి 49.8 అడుగులకు చేరింది.కాగా, పోలవరం ముంపు మండలాలైన.. ఏపీలోని అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధి కూనవరం మండలంలో గోదావరి పలు గ్రామాలను జల దిగ్బంధం చేసింది. భద్రాచలం-కూనవరం మధ్య సంబంధాలు తెగిపోగా రాకపోకలు నిలిచిపోయాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో భారీ వర్షాలు కురవడంతో శబరి వేగంగా గ్రామాలను చుట్టుముట్టింది. వీఆర్ పురం మండలంలో 30, చింతూరు మండలంలో మండలంలో 22 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. కుక్కునూరు, వేలేరుపాడుల్లో 34 గ్రామాల పరిసరాల్లోకి వరద చేరింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ నడుమ 326, 30వ నంబరు జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి.

● ములుగు జిల్లాలోని తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీకి 10.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. వాజేడు మండ లం టేకులగూడెం వద్ద రేగుమాకు వాగు 163 జాతీయ రహదారిపైకి చేరడంతో ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లే దారిని మూసివేశారు. మేడిగడ్డ బ్యారేజీకి 4.06 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది.

● కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టికి 72వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా ఉండగా, అవుట్ ఫ్లో 60 వేల క్యూసెక్కులుగా నమోదైంది. నారాయణపూర్‌కు ఇన్‌ఫ్లో 65 వేల క్యూసెక్కులు కాగా మొత్తం వదిలేస్తున్నారు. జూరాలకు 1.35 లక్షల క్యూసెక్కులు వస్తుండగా 1.10 లక్షల క్యూసెక్కులను శ్రీశైలం జలాశయానికి వదులుతున్నారు. తుంగభద్రకు 34,972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, గేట్ల ద్వారా 19,461 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తితో 4,700 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. సుంకేసులకు 40,557 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉండగా 38,112 క్యూసెక్కులను, శ్రీశైలం ప్రాజెక్టుకు 2.45 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.64 లక్షలు, జల విద్యుత్ ఉత్పత్తితో 68 వేల క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ 26 గేట్లనూ ఎత్తారు. శ్రీశైలం నుంచి 2,60,611 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 2,51,238 క్యూసెక్కులను కిందకు పంపుతున్నారు.

ఏలేరు విలయం.. కాకినాడ జిల్లాలో 62 గ్రామాలు జలదిగ్బంధం

ఏలేరు రిజర్వాయరుకు పోటెత్తిన వరదతో ఏపీలోని కాకినాడ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లోని 62 గ్రామాలు జల దిగ్బంధమయ్యాయి. ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఏడు మండలాలు నీట మునిగాయి. కిర్లంపూడి మండలం రాజుపాలెం సమీపంలో గండి పడడంతో గ్రామం మొత్తం మునిగిపోయింది. ఇళ్లల్లో వస్తువులన్నీ వరదకు కొట్టుకుపోయాయి. మంగళవారం నాటికి వరద మరింత మహోగ్రరూపం దాల్చింది. కాలువల సామర్థ్యం 10 వేల క్యూసెక్కులు కాగా, 32 వేల క్యూసెక్కులకు మించి వరద పారుతుండడంతో ఏడు మండలాల్లో 26 చోట్ల గండ్లు పడ్డాయి. 45 వేల ఎకరాలకు పైగా మునిగాయి.

పురపాలక సంఘం కార్యాలయం :: అమరచింత పురపాలక సంఘం
వనపర్తి జిల్లా (తెలంగాణ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ సంక్షిప్త టెండరు ప్రకటన
3 పనుల కోసం "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌పై 1వ పిలుపు టెండర్లు కోరబడుచున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 11.09.2024 ఉ.10.00 గం. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ముగింపు తేది: 20.09.2024 సా.5:00 గం. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడవచ్చును. బిడ్లు కోరుచున్న కార్యాలయం: కమిషనర్, అమరచింత పురపాలక సంఘం, తెలంగాణ రాష్ట్రం, ఫోన్: 9989491009, 9000341571
సం/- కమిషనర్, అమరచింత పురపాలక సంఘం
DIPR RO No.3985-PP/CL/ADVT/1/2024-25 తేది: 10.09.2024

జిల్లా మార్కెటింగ్ అధికారి కార్యాలయం :: మహబూబ్‌నగర్
లేఖ నం.DMO/MBNR/128/A/2020 తేది:10-09-2024
దుకాణముల వేలం ప్రకటన
ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా మోడల్ రైతు బజార్, మహబూబ్‌నగర్‌లో (03) షాపులను ఒక సంవత్సరం పాటు ఆన్‌లైన్ (Online) వేలము ద్వారా కేటాయించుటకు దరఖాస్తులు కోరబడుచున్నవి. ... నం.9491387728. 1. దరఖాస్తు ధర : 2000/-, 2. E.M.D.:1,00,000/-, దరఖాస్తు అమ్మకం : 12.09.2024 ఉ.10.30 నిమిషాల నుండి 19.09.2024 సాయంకాలము 5.00 వరకు. 4. షాపుల వేలము : 20.09.2024 ఉ.11.30 నిమిషాలకు. షాపుల వివరములు:మొత్తం(03) షాపులు:జనరల్-01, S.C.-01, B.C.-01.
సం/- ప్రత్యేకశ్రేణి కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ కమిటీ, మహబూబ్‌నగర్ సం/-జిల్లా మార్కెటింగ్ అధికారి, మహబూబ్‌నగర్ జిల్లా
DIPR RO No.4006-PP/CL/ADVT/1/2024-25, తేది:10.09.2024

రామగుండం నగరపాలక సంస్థ
జిల్లా-పెద్దపల్లి
గుడ్ విల్ వేలము ప్రకటన
ఫైలు.నెం.ఎ1/97/2024 తేది: 10.09.2024, రామగుండం నగరపాలక సంస్థ పరిధిలోని ... 4 షాపులకు తేది.20.09.2024 రోజున సాయంత్రం 03.00 గంటలకు మున్సిపల్ కార్యాలయం భవనములో ... మొత్తం 5 షాపులలో ఒక షాపు ... 4 షాపులలో షెడ్యూల్ కులాల వారికి 1 షాపు, మిగితా 3 షాపులను జనరల్ కేటగిరి ద్వారా కేటాయించుదురు. ... తేది. 18.09.2024 రోజున సాయంత్రం 03.00 గంటలలోపు జనరల్ కేటగిరి వారు రూ.50,000/- సొమ్ము చెల్లించవలెను. మరియు రూ.1,00,000/- బ్యాంక్ గ్యారెంటీ, ఫోటోతో పాటు దరఖాస్తు సమర్పించవలెను. ... సంప్రదించి పొందగలరు.
సం/- కమిషనర్, రామగుండం నగరపాలక సంస్థ
DIPR RO.No.3970-PP/CL/ADVT/1/2024-25, Dt: 10.09.2024

ANDHRA PRADESH STATE CIVIL SUPPLIES CORPORATION LIMITED
Head Office: 10-152/1, Ashoknagar, Bandar Road, Vijayawada-520 007
Lr.No.Mktg.M6/RG Dall/Tenders/2024 Date:10.09.2024
TENDER NOTICE (2nd Call)
BIDS ARE INVITED FROM THE ELIGIBLE BIDDERS FOR SUPPLY OF 22,500 MTs (± 25%) OF RG DALL IN 1 KG PACKET FORM WITH SECONDARY PACKING IN 50 KG PP BAGS TO ALL THE 251 MLS POINTS OF APSCSCL IN TWENTY SIX(26) DISTRICTS ACROSS THE ANDHRA PRADESH STATE FOR DISTRIBUTION UNDER PDS /ICDS/ THR SCHEMES THROUGH THE AP E-PROCUREMENT PORTAL.
Andhra Pradesh State Civil Supplies Corporation Limited invites bids from eligible bidders for supply of 22,500MTs (± 25%)RG Dall in 1KG packet form with secondary packaging in 50 Kg PP bags under PDS/ICDS/THR schemes to 251 MLS points in twenty six (26) Districts in Andhra Pradesh State.
All the interested RG Dall suppliers in All Over India may visit www.apscscl.in & www.apeprocurement.gov.in to view and download tender documents free of cost.
The interested tenderers to submit bids should be registered in website www.apeprocurement.gov.in and should also obtain Digital Signature Certificates from any Certifying Authority in India. The details and procedure for obtaining Digital Signature Certificates are mentioned in the website www.apeprocurement.gov.in or contact the helpdesk of e-procurement portal Phone: 9154383633 / 9154383634 / 7337318402.
Last date for registration and completion of formalities for the e-auction shall be up to **17.09.2024 at 5.00P.M** and the tentative date of online e-reverse auction through ap e-procurement platform would be **20.09.2024 at 02.00 P.M** onwards.
Sd/- G.Veerapandian
VC & Managing Director

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుదరని పొత్తు

హర్యానాలో కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ మధ్య ఎన్నికల పొత్తు ఫలించకపోవడంతో రెండు పార్టీలు వేరువేరుగా తమ అభ్యర్థుల జాబితాలు విడుదల చేస్తున్నాయి. అక్టోబర్ 5న రాష్ట్రంలో జరగబోయే ఎన్నికలకు గురువారంలోగా నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. ఆఖరునిముషం వరకూ పొత్తుకోసం ప్రయత్నించామనీ, ఫలించకపోవడంతో ఒంటిరిగా పోతున్నామని ఆప్ నాయకులు తేల్చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో జంటగాసాగి, 'ఇండియా' కూటమి ఐక్యతా సందేశాన్ని ఇటీవలే ఇచ్చామనీ, ఇప్పుడు వేరుపడితే బాగుండదని రాహుల్ భావించి, తదనుగుణంగా పొత్తుకోసం ఆయన రాష్ట్ర నాయకులమీద గట్టి ఒత్తిడి తెచ్చారు. ఇప్పుడు కనుక హర్యానాలో చేయి కలిపితే, ఫిబ్రవరిలో ఢిల్లీలో జరగబోయే ఎన్నికల్లో ప్రతిఫలంగా ఆప్ నుంచి ఎంతో సాధించవచ్చునని కాంగ్రెస్ ఆలోచన. కానీ, రాష్ట్ర పెద్దలకు, మరీ ముఖ్యంగా భూపీందర్ సింగ్ హూడాకు ఈ పొత్తువాసన గిట్టకపోవడంతో చివరకు వెన్నుపోటు పొడిచారని ఆప్ నాయకులు అంటున్నారు.

తొంభై అసెంబ్లీ స్థానాల్లో ఆదిలో పదిహేను, ఆ తరువాత పదిస్థానాలను డిమాండ్ చేసిన ఆప్‌కు హర్యానాలో అంతబలం లేదని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుల వాదన. మరీముఖ్యంగా ఆ పార్టీ అడుగుతున్న వాటిలో కొన్ని బలమైన కాంగ్రెస్ అభ్యర్థులున్న, వారు సులువుగా గెలవగలిగే స్థానాలున్నాయి. అసలు ఆప్‌తో పొత్తే వద్దనీ, ఓ నాలుగైదు ఇచ్చినా కూడా అక్కడ ఆప్ గెలవకపోగా, కాంగ్రెస్ ఆ మేరకు నష్టపోతుందని స్థానికనాయకుల వాదన. లోక్‌సభ ఎన్నికల్లో పొత్తులో భాగంగా ఆప్ పోటీచేసిన కురుక్షేత్రలో బీజేపీ గెలిచిందనీ, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయాల ఆధారంగా చూసినప్పుడు ఒంటరి పోరే ఉత్తమం, జంటగా పోతే నష్టమేనని వారి నమ్మకం. ఐదేళ్ళక్రితం సగానికిపైగా స్థానాల్లో పోటీచేసిన ఆప్ ఒక్కటీ గెలవనిమాట నిజం. గెలుపోటముల లెక్కలను అటుంచినా, పొత్తుతో ఆప్‌ను హర్యానాలో బలోపేతం చేయడం కాంగ్రెస్‌కు భవిష్యత్తులో ఎనలేని నష్టం చేస్తుందని, అరవింద్ కేజ్రీవాల్‌ది భస్మాసుర హస్తమని కాంగ్రెస్ నాయకుల నమ్మకం. ఈ కారణంగానే, ఒక దశలో ఆప్ ఐదుస్థానాలకు సరిపెట్టుకుంటానని చెప్పినా కూడా అది ప్రతిపాదించిన సీట్లలో తాము కచ్చితంగా గెలుస్తామన్న నమ్మకంతో రాష్ట్ర నాయకులు పడనివ్వలేదు. అటు దేశరాజధాని ఢిల్లీలోనూ, ఇటు పంజాబ్‌లోనూ తాము అధికారంలో ఉన్నందున, ఈ రెండింటి మధ్యనా ఉన్న అరవింద్ కేజ్రీవాల్ స్వరాష్ట్రంలో పార్టీ ఎదుగుదల దృష్ట్యా కొన్ని స్థానాలు కీలకమైనవని, వాటినే తాము కోరుకున్నామని ఆప్ అంటోంది. ఇప్పుడు హర్యానాలో పొత్తుపొడవకపోవడంతో రేపు ఈ రెండు పార్టీల మధ్య ఢిల్లీలో పొత్తుఉండబోదని విశ్లేషణలు జోరుగా సాగుతున్నాయి. ఆఖరు నిముషంలో ఏమైనా కొత్త మలుపులుంటాయోమో తెలియదు కానీ, ఈ రెండు పార్టీలూ విడివడటంతో అసలే కష్టాల్లో ఉన్న బీజేపీకి ఇప్పుడు కాస్తంత ధైర్యం వచ్చిందని అంటారు.

మంగళవారం బీజేపీ విడుదల చేసిన 21మంది అభ్యర్థుల జాబితాలో ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు దక్కలేదు. వీరిలో ఇద్దరు మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు సైతం ఉన్నారు. ఈ లిస్టుతో పార్టీలో అసంతృప్తిరేగి, తిరుగుబాట్లు, రాజీనామాలు సాగుతున్నాయి. గతవారం 67మందితో కూడిన తొలిజాబితా విడుదలైనప్పుడు కూడా పార్టీ ఇదేవిధమైన ప్రతికూలత ఎదుర్కొంది. నలభై సిట్టింగ్‌లను మార్చడం, ఇద్దరుమంత్రులతో సహా ఏడుగురు ఎమ్మెల్యేలకు టికెట్ ఇవ్వకపోవడం, కొద్దిగంటల్లోనే దానిని ఉపసంహరించుకొని కొన్ని సవరణలు చేయడం తెలిసినవే. ఈ రెండుజాబితాలతో రాష్ట్ర బీజేపీ కనివినీ ఎరుగనంత వ్యతిరేకతను ఎదుర్కొంటున్నప్పటికీ, ఈ స్థాయిలో ప్రక్షాళనచేయనిదే మూడోమారు అధికారంలోకి రావడం అసాధ్యమని పార్టీ పెద్దల నమ్మకం. ఇటీవలివరకూ బీజేపీతో పొత్తులో ఉన్న దుష్యంత్ చౌతాలా పార్టీనుంచి తిరుగుబాటుచేసిన వారికి పెద్ద ఎత్తున టిక్కెట్లు ఇవ్వడంతో ఈ చిచ్చురేగింది. ముఖ్యంగా అత్యంత కీలకమైన జాట్ ఓటుబ్యాంకు తనకు దూరమైందన్న భయం బీజేపీని పీడిస్తున్నది. రైతు ఉద్యమాలు, ఆ తరువాత మహిళా రెజ్లర్ల ఆందోళనలు, బ్రిజ్‌భూషణ్ శరణ్ పక్షాన బీజేపీ పెద్దల అనుచిత ప్రవర్తన ఇత్యాదివి జాట్లను పార్టీకి దూరం చేశాయి. ఖాప్ పంచాయితీలు సైతం పలు తీర్మానాలతో తమ అసంతృప్తిని బాహాటంగా ప్రకటించాయి. అంతర్గత కుమ్ములాటలు కాంగ్రెస్‌లోనూ ఉన్నాయి కానీ, వినేశ్ ఫోగాట్, బజ్రంగ్ పునియా ఇత్యాది యువ, జాట్ రెజ్లర్ల ప్రవేశంతో ఈ మారు జాట్ల మద్దతు కచ్చితంగా తనకు దక్కుతుందన్న సమధికోత్సాహంలో ఆ పార్టీ ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ, అధికారం కోసం కాంగ్రెస్ సాగిస్తున్న ఈ హోరాహోరీ పోరులో ప్రజలు ఏ పక్షాన ఉంటారో చూడాలి.

ఎన్నేళ్లో వేచిన ఉదయం!

సుమారు 18 ఏళ్ల నుంచి 1100 మంది జర్నలిస్టులు.. వారి కుటుంబాలు ఎదురుచూస్తున్న ఒక ఘట్టం ఈ 8వ తేదీ ఆదివారంనాడు ఆవిష్కృతమయింది. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి చెందిన భాగస్వాములకు హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్‌లో 38 ఎకరాల స్థలాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అప్పగించారు. ఈ 18 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో నేను ఒక భాగస్వామిని. ప్రయాణంలోని ఒడిదుడుకులు.. అవాంతరాలు.. హఠాత్తుగా ముంచుకొచ్చిన విపత్తులను గమనించినవాడిని కాబట్టి– ఈ భూమిని స్వాధీనపరచటం ఉపశమనాన్ని ఇచ్చింది. ఈ సమావేశానికి అనేకమంది తమ భార్య, పిల్లలతో వచ్చారు. చాలా మంది ముఖాలలో తాము సాధించామనే సంతృప్తి కనిపించింది. వారిలో ఎక్కువమంది మధ్యతరగతి, దిగువ మధ్యతరగతికి చెందినవారే. వారందరికి ఈ భూమి ఒక ఆత్మవిశ్వాసాన్ని, సాధికారతను ఇచ్చిందనటంలో సందేహం లేదు. తమ కుటుంబ సభ్యుల ముందు– 'మేము చేస్తున్న ఉద్యోగానికి విలువ ఉంది.. ప్రభుత్వం మమ్మల్ని గుర్తించింది..' అని చెప్పుకోగలిగిన ఆత్మవిశ్వాసం అది. కార్యక్రమం జరిగిన రవీంద్రభారతి ప్రాంగణంలో సభ్యుల ఉత్సుకత చూస్తే– 18 ఏళ్ల క్రితం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో అప్లికేషన్లు ఇవ్వటానికి వచ్చిన వందలాదిమంది గుర్తుకొచ్చారు. అయితే ఈ రోజుకు కూడా సభ్యుల ఆర్థిక, సామాజిక పరిస్థితుల్లో పెద్ద మార్పు రాలేదనేది మాత్రం విస్మరించలేని సత్యం. సొసైటీ సభ్యులు తమ విపరీతమైన ఆనందాన్ని బహిరంగంగా ప్రకటించటానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక విధాలుగా కృతజ్ఞతలు చెప్పటానికి ఉన్న ఒక కారణం– గత మూడు సంవత్సరాలుగా నెలకొని ఉన్న అనిశ్చితి. ఈ విషయంలో ఎన్నికల ముందు తాను ఇచ్చిన వాగ్దానాన్ని రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవటాన్ని అందరూ స్వాగతించారు.

ఈ మొత్తం ప్రయాణం అంత సాఫీగా సాగలేదు. ఈ ప్రయాణంలో జర్నలిస్టులకు తోడుగా నిలిచిన వారిని తప్పనిసరిగా స్మరించుకోవాలి, కృతజ్ఞతలు చెప్పుకోవాలి. ఇక్కడ ఇంకో విషయాన్ని కూడా చెప్పాలి. ఇప్పటిదాకా కాంగ్రెస్ ప్రభుత్వాలు మాత్రమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చాయి. ఎందుకో తెలియదు కానీ మిగిలిన ప్రభుత్వాలు జర్నలిస్టుల విషయంలో ఉదారతను ప్రదర్శించలేదు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి కూడా స్థలాలను అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి కేటాయించారు. సొసైటీ సభ్యులు ఆయనను అడగటం.. చురుకుగా, చొరవగా– స్థలాలు ఇవ్వటానికి ఆయన అంగీకరించటం.. వెంటనే జీవోలు జారీ చేయటంతో ప్రయాణం మొదలయింది. ఆ తర్వాత కోర్టు కేసులు.. వాటికి పరిష్కారాలు.. ఇలా కాలం గడిచిపోతున్న సమయంలో– స్థలాన్ని అప్పగించటం కోసం అఫిడవిట్ వేయటానికి అంగీకరించిన కేసీఆర్‌ను కూడా గుర్తుచేసుకోవాలి. కానీ అది తాత్కాలికమైన అనురాగమేనని ఆ తర్వాతి పరిణామాలు తేల్చి చెప్పాయి. సుప్రీంకోర్టు అప్పటి చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ కనుక చొరవ చూపకపోతే ఈ రోజు భూమి సొసైటీ చేతికి వచ్చేది కాదు. జర్నలిస్టుల పట్ల సానుభూతితో పదవి విరమణకు ముందు ఆయన ఇచ్చిన ఉత్తర్వులు చాలా కీలకమైనవి. అయితే కేసీఆర్ సర్కారు ఈ ఉత్తర్వులను పట్టించుకోలేదు. కేసీఆర్ సర్కారు ప్రతికూలంగా వ్యవహరిస్తోందని తెలియటానికి ఎక్కువ కాలం పట్టలేదు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో– స్థలాలు వెంటనే వచ్చేస్తాయని ఆశపడ్డ సొసైటీ సభ్యులకు నిరాశ ఎదురయింది. స్థలాన్ని అప్పగించటానికి కేసీఆర్ సర్కారు సుముఖత చూపించలేదు. ఒక దశలో – భూమి ఎలాట్‌మెంట్‌ను కూడా రద్దు చేసే ఉద్దేశంలో ఉన్నారని.. ఆ భూమిని వేరే విధంగా వాడుకోవాలని యువరాజు కేటీఆర్ భావిస్తున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. దీనితో స్థలాలు చేజారి పోయాయనే అనుమానాలు జర్నలిస్టుల్లో బలపడ్డాయి. రాచరికపు పోకడలతో పాలన సాగిస్తున్న కేసీఆర్ సర్కారుతో తలపడలేని పరిస్థితి ఒక వైపు.. ఏం చేయాలో తెలియని అశక్తత మరో వైపు సొసైటీని వెంటాడింది. ఈ దశలో అప్పటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్, భట్టి విక్రమార్క, మల్లురవి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మొదలైన కాంగ్రెస్ నేతలు అండగా నిలిచారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో స్థలాన్ని అప్పగిస్తామని ప్రకటించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు చాలా వేగంగా స్పందించారు. వెంటనే స్థలాన్ని అప్పగించాలని అధికారులను ఆదేశించారు. వీరిద్దరి నుంచి సానుకూల స్పందన లేకపోతే భూమి అప్పగించే విషయం కొనసాగుతూనే ఉండేది. అనేక సందర్భాలలో తనను కలిసిన సొసైటీ సభ్యులకు రేవంత్– తన వైపు నుంచి ఎటువంటి అభ్యంతరాలు లేవని చెబుతూనే వచ్చారు. ముఖ్యమంత్రి అభీష్టానికి తగిన రీతిలో పొంగులేటి వేగంగా స్పందించారు. వీరితో పాటుగా గత 18 ఏళ్లుగా ఈ సొసైటీ కోసం తమ సమయాన్ని వెచ్చించిన అనేక మంది సభ్యులకు, డైరెక్టర్లకు, ప్రెషర్ గ్రూప్ సభ్యులకు సెల్యూట్ చేయాలి. ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటూ అన్ని వైపుల నుంచి వచ్చే అవాంతరాలను ఎప్పటికప్పుడు కనిపెట్టుకొని ఉండటం అంత సులభమైన పని కాదు. మంచికి పోతే చెడు కూడా ఎదురయిన సందర్భాలు కూడా ఎన్నో! అలాంటి సమయంలో కూడా తమలో తామే ఆత్మవిశ్వాసాన్ని నింపుకుంటూ ముందుకు వెళ్లటం వారి కార్యదీక్షకు నిదర్శనం.



రవీంద్రభారతి ప్రాంగణంలో సభ్యుల ఉత్సుకత చూస్తే– 18 ఏళ్ల క్రితం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో అప్లికేషన్లు ఇవ్వటానికి వచ్చిన వందలాదిమంది గుర్తుకొచ్చారు. జస్టిస్ ఎన్.వి. రమణ కనుక చొరవచూపకపోతే ఈ రోజు సొసైటీ చేతికి భూమి వచ్చేది కాదు. సొసైటీ సభ్యులు తమ అవధుల్లేని ఆనందాన్ని బహిరంగంగా ప్రకటించటానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అనేక విధాలుగా కృతజ్ఞతలు చెప్పటానికి గల కారణం– గత మూడు సంవత్సరాలుగా నెలకొని ఉన్న అనిశ్చితి.

ఇక ఈ మొత్తం ప్రయాణంలో నేర్చుకున్న పాఠాలు, గుణపాఠాల గురించి తప్పకుండా మాట్లాడుకోవాలి. ఎందుకంటే– జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే డిమాండ్ ఆగిపోయేది కాదు. సీఎం రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ సిటీలో ఇస్తానన్న భూముల కోసం త్వరలోనే మరో సొసైటీ ఏర్పడుతుంది. అలాంటి సమయంలో మన ప్రయాణంలోని పాఠాలు వారికి ఉపకరిస్తాయనటంలో ఏ మాత్రం సందేహం లేదు. రాజశేఖరరెడ్డి స్థలాలు ఇస్తామని ప్రకటించినప్పుడు ఇన్ని రకాల చిక్కులు.. కోర్టు కేసులు.. వెన్నుపోట్లు ఉంటాయని ఎవరు ఊహించలేదు. అర్హులైన వారికి మార్కెట్ రేటుకు భూమిని ఇచ్చే హక్కు ప్రభుత్వానికి ఉంది కదా అనుకున్నారు. కానీ రూపొందించిన విధివిధానాల వల్ల స్థలాలు రాని వారి ప్రోద్బలంతో కోర్టు కేసులు దాఖలయ్యాయి. 18 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో అర్హులైన జర్నలిస్టుల సంఖ్య తక్కువే ఉండేది. ప్రస్తుతం ఆ సంఖ్య మూడు నాలుగు రెట్లు పెరిగింది. వీరందరికీ స్థలాలు ఇవ్వటానికి విధివిధానాలు రూపొందించటం కత్తి మీద సామే!

జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీకి భూముల అప్పగింతతో ప్రయాణం ముగిసిపోలేదు. వాస్తవానికి ఇప్పుడే మొదలైంది. సొసైటీకి కేటాయించిన భూముల్లో అక్రమంగా వెలిసిన కట్టడాల తొలగింపు, భూమిని చదును చేసి లేఅవుట్ వేయటం ఒక సవాలే! అయితే ఒక సానుకూల వాతావరణం ఏర్పడిందనే ఆలోచన అందరిలోను కొత్త ఉత్సాహాన్ని రేకెత్తిస్తోంది. ఇది మరింత కాలం కొనసాగాలని.. సహచర జర్నలిస్టులకు అతి త్వరలోనే స్థలాల కేటాయింపులు జరగాలని కోరుకుందాం.


• సీవీఎల్ఎన్ ప్రసాద్
సీనియర్ జర్నలిస్ట్

వణుకుతున్న నగరాలకు ఊరట ఎప్పుడు?

ఇప్పుడు దేశంలో వర్షం హోరు తప్ప మరేదీ వినపడడం లేదు. ఉదయం, రాత్రీ అన్న తేడా లేకుండా వర్షం కురుస్తున్న చప్పుడు వినపడుతోంది. ఆకాశంలో దట్టంగా అలముకున్న మేఘాలను చూస్తే భయం వేస్తోంది. దేశమంతా చిరపుంజీగా మారిందా అన్న అనుమానం వేస్తోంది. దేశ రాజధాని ఢిల్లీతో సహా ఇవాళ అనేక నగరాలలో వర్షాల వల్ల నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. రోడ్లను దాటి, సందుగొందులను చుట్టి ఇళ్లలోకి వస్తోంది. భవనాల నేలమాళిగలలోకి కూడా నీరు ప్రవహిస్తోంది. చెట్లు నేల కూలి నిస్సహాయంగా చూస్తున్నాయి. యమునా పరివాహక ప్రాంతాల్లో ఉన్న దిక్కుమొక్కులేని జనం ఫుట్‌పాత్‌లపైకి వచ్చి టెంట్లలో తలదాచుకుంటున్నారు. గత నెల ఢిల్లీలోని రాజేంద్రనగర్‌లో ఒక ఐఏఎస్ కోచింగ్ సంస్థ అండర్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన లైబ్రరీలోకి నీరు ప్రవహించి ముగ్గురు విద్యార్థులు; ఒక పార్క్‌లో వాననీటిలో మునిగి ఒక ఏడేళ్ల బాలుడు మరణించారు. కేరళలోని వయనాడుతో ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, ఒడిషా, గుజరాత్, హర్యానా, బిహార్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవాలోని అనేక ప్రాంతాల్లో ఎందరో కుండపోత వర్షాలు, పెను వరదలకు గురై మరణించారు. అనేక చోట్ల వాహనాలు కొట్టుకుపోయాయి. ఫలితంగా ఎన్నో కుటుంబాలవారు తమ ఆప్తులను కోల్పోవడం జరిగింది. విజయవాడలో గత రెండు దశాబ్దాల్లో ఏనాడూ లేనంతగా సంభవించిన వర్షాలు, వరదలు అల్లకల్లోలం సృష్టించాయి.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే దేశంలో రాజస్థాన్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో మహిళలు తాగు నీటికోసం మైళ్ళకొద్దీ నడవాల్సిన పరిస్థితి ఇప్పటికీ ఉన్నది! దేశవ్యాప్తంగా 60 కోట్లమంది తీవ్ర నీటి ఎద్దడికి గురవుతున్నారని, స్వచ్ఛమైన నీరు లభించనందువల్ల ఏటా 2 లక్షలమంది మరణిస్తున్నారని, దేశంలో 70 శాతం నీరు కలుషితమైందని సౌత్ ఆసియా ఫోరమ్ వెల్లడించింది. యేల్ యూనివర్సిటీ 2022లో చేసిన అధ్యయనంలో కలుషితమైన తాగునీటిపై నిర్ణయించిన సూచికలో 200 దేశాల్లో భారత్ 141వ స్థానంలో ఉన్నది. 'Water, Water every where but not a drop to drink' (ఎక్కడ చూసినా నీరే కాని చుక్క నీరు త్రాగలేము) అని ఒకప్పుడు సముద్రం గురించి మాట్లాడుకునేవారం. ఇప్పుడు ఆ సముద్రం మన వీధుల్లోకే వచ్చింది. జగత్తు అంతా జల ప్రళయం ఏర్పడితే దేవుడు ఒక పడవను పంపించి అందర్నీ కాపాడాడని బైబిల్‌లో ఒక కథనం ఉంది. ఇప్పుడు మనం రోజూ తిరిగే రోడ్లే నదులుగా మారినప్పుడు, నీటిలో ఇరుక్కుని కొట్టుకుపోతునప్పుడు ఎందరో మానవ దేవుళ్లు కాపాడాల్సి వస్తోంది.

మరో వారం రోజులు దేశమంతా ఇలాగే వర్షాలు కురుస్తాయని, ఒక చోట తగ్గినా మరో చోట వానలు ఆగవని ఢిల్లీలోని ఐఎండి అధికారులు చెబుతున్నారు. ప్రధానమంత్రి స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లో కనీసం 15 జిల్లాల్లో పరిస్థితి ఘోరంగా ఉన్నది జామ్‌నగర్ నగరంలో వర్షాలు కురిసిన తర్వాత వీధులన్నీ భారీ చెత్తతో నిండిపోయాయి. వాటిని తొలగించేందుకు అధికారులు రాత్రింబవళ్లు పనిచేయాల్సి వచ్చింది. కచ్ ప్రాంతంలో పరిస్థితి పునరుద్ధరించడం ప్రభుత్వానికి తలకు మించిన పని అయింది. ముఖ్యంగా వడోదరా నగరంలో ఆగస్టు 26 నుంచి 12 రోజుల పాటు వర్షాలు కురిశాయి, వరదలు ముంచెత్తాయి. అజ్వా రిజర్వాయర్ నుంచి విశ్వామిత్రి నదికి నీరు వదలడంతో అనేక లోతట్టు ప్రాంతాలలో ఉన్న ఇళ్లు మునిగిపోయాయి. అపార్ట్‌మెంట్లలోకి కూడా నీరు ప్రవహిస్తోంది. వరద నీళ్లలో మొసళ్లు కూడా దర్శనమిస్తున్నాయి! వేలాది ప్రజలు నిరాశ్రయులయ్యారు. ఎన్ని ఆహారపొట్లాలు సరఫరా చేసినా సరిపోవడం లేదు. మృత్యుభయంతో వణికిపోతున్న ప్రజలు బీజేపీ నేతలు కనపడితే మండిపడుతున్నారు. విజయవాడలో చంద్రబాబునాయుడు, ఇతర నేతలు ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్లి వారికి భరోసా ఇవ్వడంతో పాటు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటుంటే గుజరాత్‌లో నేతలు కనీసం ప్రజల వద్దకు వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారు.



విజయవాడ, జైపూర్, చండీగఢ్, గురుగ్రామ్, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను వర్షాలు ముంచెత్తిన తీరు మన ప్రభుత్వాల సమర్థ సమాయత్తతను ప్రశ్నార్థకం చేస్తోంది. బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని చెప్పడం, జనాన్ని మరో చోటకు తరలించడం, ఆహార పొట్లాలు సరఫరా చేయడం పాలకులకు అలవాటైంది. మరి వరదలు తగ్గిన తర్వాతనైనా భావి అవసరాల దృష్టిలో మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరచడంపై శ్రద్ధ చూపుతారా?



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

నిజానికి నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అయిన తొలి రోజుల్లో ఎండిపోయిన సబర్మతీ నదీతలంపై పిల్లలు క్రికెట్ ఆడుతుంటే చూశారు. ఎక్కడికక్కడ ఆక్రమణలు జరగడం, పారిశ్రామిక కాలుష్య పదార్థాలు వదలడంతో అసలు ఆ నది అనేదే ఒకటున్నదన్న విషయం జనం మరిచిపోయారు. సర్దార్ సరోవర్ ఆనకట్ట ఎత్తు పెంచడం ద్వారా నీటి నిల్వను పెంచి కాలువల ద్వారా సబర్మతీ నదిలోకి నీరు మళ్లించారు. భారీ వర్షాలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలకు ప్రవహించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సబర్మతీ నది కోసమే ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఒకవైపు పాదచారులు, సైక్లిస్టులు వెళ్లేందుకు రహదారులు ఏర్పరిచారు. మరో వైపు విద్యాసంస్థలు, విహార స్థలాలు, వాణిజ్య సముదాయాలను నిర్మించారు. మరి ఇవే నిర్మాణ కార్యక్రమాలను వడోదరాలో ఎందుకు ఆయన చేపట్టలేకపోయారు?

తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులు, విశృంఖలమైన పట్టణ అభివృద్ధి, అస్తవ్యస్తమైన డ్రైనేజి వ్యవస్థ కారణంగానే ఈ వరదలు సంభవించాయని గాంధీనగర్‌లోని ఐఐటీ పరిశోధకులు తేల్చారు. మరి స్మార్ట్ సిటీల గురించి ప్రచారం చేసిన మోదీ తాను ముఖ్యమంత్రిగా ఉన్న 13 ఏళ్లలో స్వంత రాష్ట్రంలో నగరాలను ప్రజావసరాలకు తగ్గట్లుగా ఎందుకు తీర్చిదిద్దలేకపోయారు? మోదీ ప్రధాని అయ్యాక గంగానది ప్రక్షాళనకోసం నమామి గంగే ప్రాజెక్టును ప్రారంభించారు. కాని హరిద్వార్‌తో సహా చాలా చోట్ల ఇంకా ఘాట్‌ల వద్ద చెత్తాచెదారం పేరుకుని ఉన్నది. కాన్పూర్‌లో గంగానదిలో దురాక్రమణలు జరగడం, ప్రక్షాళన సరిగా లేకపోవడంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేసింది.

అసలు స్మార్ట్ సిటీ అంటే ఏమిటి? రహదారులు, భవనాలు, కమ్యూనికేషన్ సౌకర్యాలు, మెట్రో రైలు మార్గాలు నిర్మించడమా? హైదరాబాద్‌లో జరిగినట్లు రియల్ ఎస్టేట్, కాంట్రాక్టర్ల స్వార్థాలకు అప్పజెప్పడమా? నదులను, చెరువులను నాశనం చేయడమా? పర్యావరణాన్ని కాలరాయడమా? మన సహజవనరులు, మన మానవవనరులు, మన చారిత్రక వారసత్వ సంపదను దృష్టిలో ఉంచుకోకుండా పైకి కళ్లకు జిగేలుమనిపించే ఎన్ని అందమైన నగరాలను నిర్మించినా అవి ఆధునిక సమాధులుగా మారతాయే కాని జీవన సౌందర్యాన్ని ప్రతిబింబించలేవు. మరే దేశంలోనైనా కొల్లేరు వంటి సరస్సు ఉంటే గొప్ప పక్షుల అధ్యయన కేంద్రంగా, పర్యాటన స్థలంగా అభివృద్ధి చేసి ఉపాధి కల్పించేవారని ప్రముఖ పర్యావరణవేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత తల్లావఝ్ఝల పతంజలి శాస్త్రి రాశారు. ఆ కొల్లేరు దురాక్రమణల దుష్ఫలితాలు కూడా ఈ వరదల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్నారు.

మోదీ ప్రధాని అయ్యాక కొత్త విద్యుత్ చట్టాలను ప్రవేశపెట్టారు. అయితే అన్ని రాష్ట్రాల్లో నదులు, చెరువుల భూములను దురాక్రమించే వారి ఆటకట్టించేందుకు కేంద్ర స్థాయిలో ఒక చట్టాన్ని ఎందుకు తీసుకురాలేకపోయారు? అటువంటి చట్టాన్ని ఒకదాన్ని ప్రవేశపెట్టి ఉన్నట్టయితే ఇవాళ తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైడ్రా అన్న సంస్థను రంగంలోకి దించాల్సిన అవసరం ఉండేది కాదు. నాడు ముఖ్యమంత్రి పీవీ నరసింహారావు కాంగ్రెస్ విధానాలు నిర్దేశించిన ప్రకారమే భూసంస్కరణలను అమలు చేశారు. దీని ఫలితంగా పీవీకి పదవీ ముప్పు ఏర్పడింది. అయితే అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఆయనను పదవి కోల్పోకుండా కాపాడలేకపోయారు. ఇవాళ కొందరు కాంగ్రెస్ నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ వద్దకు వెళ్లి హైడ్రాపై మొరపెట్టుకున్నా వారు పట్టించుకోకుండా రేవంత్‌నే బలపరచడం, ఆయన వివరణతో ఏకీభవించడం ఒక కీలక పరిణామం.

'మూసీ నది ఒడ్డున నిలబడి చూస్తుంటే కోటలు, గోడలు, బురుజులు, ఒక పక్క బేగం బజారు, చక్కటి చెట్లు, ఎంతో మనోజ్ఞమైన దృశ్యాలు. నదిలో పలువురు స్నానం చేస్తున్నారు. చెలమలు త్రవ్వి నీరు తీసుకుని వెళుతున్నారు. మీర్ ఆలం చెరువు ఎంతో విశాలంగా ఆకట్టుకుంటోంది..' అని 1860లో నైజాం రాజ్యంలో పని చేసిన మెడోస్ టైలర్ తన ఆత్మకథలో రాశారు. (ప్రముఖ జర్నలిస్టు జి. కృష్ణ ఈ ఆత్మకథను తెలుగులో అనువదించారు). 1908లో మూసీకి పెద్ద ఎత్తున వరదలు వచ్చి నగరం బాగా దెబ్బతిన్నది. అఫ్జల్‌గంజ్‌లోనే 11 అడుగుల ఎత్తుకు నీరు చేరుకుంది. దీనితో నిజాం ఒక ట్రస్టు నేర్పాటు చేసి, ప్రముఖ ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను ఉపయోగించుకున్నారు. ఆ తర్వాతే ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌లను నిర్మించారు. వీటి వల్ల నగరానికి తాగునీరు పుష్కలంగా లభించేది. హైదరాబాద్‌ను ప్రతి ముఖ్యమంత్రీ ఏదో రకంగా తన ముద్ర పడేలా అభివృద్ధి పరిచారు. మరి మీ బ్రాండ్ ఏమి చూపించబోతున్నారు..?' అని ఇటీవల ఢిల్లీకి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అడిగాను. మూసీ రివర్ ఫ్రంట్‌ను అభివృద్ధిపరుస్తానని ఆయన చెప్పారు. అది నిజంగా జరిగినప్పుడే మెడోస్ టైలర్ తన ఆత్మకథలో వర్ణించినట్లు మూసీనదికి పూర్వవైభవం లభిస్తుంది.

ఏమైనా అసాధారణ వర్షం కురిసినప్పుడు, వాతావరణ శాఖ ఎంత హెచ్చరించినా మన ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోలేని స్థితి కనపడుతోంది. విజయవాడ, జైపూర్, చండీగఢ్, గురుగ్రామ్, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాలను వర్షాల ముంచెత్తిన తీరు మన ప్రభుత్వాల సమర్థ సమాయత్తతను ప్రశ్నార్థకం చేస్తోంది. బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని చెప్పడం, జనాన్ని మరో చోటకు తరలించడం, ఆహార పొట్లాల సరఫరా చేయడం ప్రభుత్వానికి అలవాటైంది. కాని వరదలు తగ్గిన తర్వాతనైనా భావి అవసరాల దృష్టిలో మౌలిక సదుపాయాలను కల్పించడం, నగరాలను విస్తరించడం అవసరం. విశ్వనగరాలు, వికసిత్ భారత్‌లు ఏర్పరుస్తామన్న మన నేతలకు ఈ వర్షాలు, వరదలు ఎన్నో గుణపాఠాలు నేర్పాయనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్విని లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

పారా ఒలంపిక్స్ విజేతలకు సెల్యూట్

పారిస్ వేదికగా జరిగిన విశ్వ క్రీడల సమరం ముగిసింది. ఒలంపిక్స్‌లో గతంలో కన్నా ఎక్కువగా మన క్రీడాకారులు రాణించకపోయిన పారా ఒలంపిక్స్‌లో మాత్రం మన క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. ఆశించిన స్థాయి కంటే ఎక్కువగానే రాణించి ఎక్కువ పతకాలు సాధించారు. గతంలో టోక్యో వేదికగా జరిగిన ఈ క్రీడల్లో 19 పతకాలకే పరిమితమైన మన క్రీడాకారులు ఈసారి పతకాల సంఖ్యను పెంచుకొని ఏడు స్వర్ణాలు, 9 రజతాలు, 13 కాంస్యాలు... మొత్తం 29 పతకాలు సాధించి పతకాల పట్టికలో 16వ స్థానంలో మన దేశాన్ని నిలిపారు. అంచనాలకు మించి అద్వితీయమైన ప్రదర్శన చేసి మన దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ క్రీడలో పాల్గొన్న క్రీడాకారులది ఒక్కొక్కరిదీ ఒక్కొక్క విజయగాథ. ప్రస్తుత యువత వీరి విజయాలను గమనించాల్సిన అవసరం ఉంది. నేటి యువత టెక్నాలజీ ఉచ్చులో చిక్కుకొని తమ సమయాన్ని మొత్తం సోషల్ మీడియాకు అంకితం చేసి సమయాన్ని వృథా చేస్తున్నారు. అనేక మంది రీల్స్ పిచ్చిలో చిక్కుకొని విచిత్ర పోకడలకు పోయి మృతి ఒడిలోకి పోతున్నారు. కొందరు యువత మత్తు మందులకు బానిసలుగా మారి జీవితాలను చిత్తు చేసుకుంటున్నారు. అలాంటి యువతకు ఈ క్రీడాకారులందరూ ఒక స్ఫూర్తిదాయకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీరి విజయగాథలను పాఠ్యపుస్తకాల ద్వారా నేటి విద్యార్థి లోకానికి అందించాల్సిన అవసరం ఉంది.

– చింత ఎల్లస్వామి


కేంద్రానికి వక్ఫ్‌పై కన్నెందుకు పడింది?

నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో 1995 – కేంద్ర వక్ఫ్ చట్టానికి సవరణలు చేస్తూ 'వక్ఫ్ సవరణ బిల్లు – 2024' తీసుకొచ్చింది. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులో ఉన్న అవినీతిని, భూ మాఫియాను అరికట్టి పారదర్శకతను తీసుకురావడానికి ఈ సవరణలు తీసుకొస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వాదిస్తున్నది. ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలతో పాటు మిగతా పార్టీల నేతలు కూడా ఈ సవరణ బిల్లు మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ ఆస్తుల రక్షణకు భంగం కలిగిస్తుందని, వక్ఫ్ బోర్డు స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేస్తుందని తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షాల విమర్శలకు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లును జాయింట్ పార్లమెంటు కమిటీకి పంపింది. మొత్తం 31మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ సెప్టెంబరు 17 వరకు తన అభిప్రాయాలను కేంద్రం ముందు పెట్టబోతుంది.

1954లో తొలిసారిగా వక్ఫ్ చట్టం రూపుదిద్దుకుంది. 1995, 2013లో కొన్ని సవరణలు జరిగాయి. ప్రస్తుత మోదీ ప్రభుత్వం మొత్తం 44 సవరణలు ప్రతిపాదిస్తూ ఈ బిల్లును తీసుకువచ్చింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డులలో పారదర్శకత కోసమే ఈ బిల్లు తీసుకొస్తున్నామని అన్నారు. తన ప్రసంగంలో సచార్ కమిటీ నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ గురించి పేర్కొన్న కొన్ని విషయాలను ప్రస్తావించారు. జస్టిస్ రాజేందర్ సచార్ తన నివేదికలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ సరిగా లేదని, దీంతో రావాల్సినంత ఆదాయం రావట్లేదని అన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణను పటిష్ఠం చేసి, తద్వారా మార్కెట్ రేటుకు అనుగుణంగా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని సూచించారు. బిల్లుపై చర్చ సందర్భంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ విషయాలనే పదే పదే వల్లెవేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వచ్చిన సచార్ కమిటీలో ఉన్న విషయాలనే ప్రస్తావిస్తున్నానని నొక్కి చెప్పారు. గత పదేళ్ల మోదీ పాలనలో ఒక్కసారైనా ఈ సచార్ కమిటీ నివేదికను పరిశీలించారా? వక్ఫ్ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని పెంచడం కోసం ఏమన్నా చర్యలు తీసుకున్నారా? సచార్ కమిటీ సూచించిన 'ఆల్ ఇండియా వక్ఫ్ సర్వీసెస్' ఏర్పాటు చేశారా? ఇవేవీ మచ్చుకైనా లేవు. కానీ మూడవసారి అధికారంలోకి వచ్చాక వక్ఫ్ చట్టానికి ఏకంగా 44 సవరణలు ప్రతిపాదించడం దేన్ని సూచిస్తుంది? ఇది రాజకీయ ఎజెండాలో భాగం కాదా? ముస్లింలకు తాము వ్యతిరేకంగానే ఉన్నామనే రాజకీయ ఉద్దేశాన్ని ప్రదర్శించడం కాదా? తద్వారా త్వరలో జరిగే వివిధ రాష్ట్రాలలో మెజారిటీ వర్గం ఓట్లను రాబట్టుకోవడమనే వ్యూహం ఇందులో లేదా?

ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం దేశవ్యాప్తంగా మొత్తం వక్ఫ్ ఆస్తుల విలువ రూ. 1 లక్షా 20 వేల కోట్లు. వక్ఫ్ ఆస్తులను సక్రమంగా నిర్వహిస్తే సంవత్సరానికి వేల కోట్ల ఆదాయం వచ్చే మాట నిజమే. ఇలా వచ్చిన ఆదాయం పేద ముస్లింల విద్య, వైద్యం, సంక్షేమం కోసం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వాలకు కూడా కొంత భారం తగ్గుతుంది. కానీ వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. వక్ఫ్ గెజిట్‌లో ఉన్న ఆస్తులు పూర్తిగా వక్ఫ్ బోర్డుల ఆధీనంలో లేవు. దేశవ్యాప్తంగా అనేక చోట్ల ప్రభుత్వాల ఆధీనంలోను, ప్రయివేటు వ్యకుల చేతిలోను ఉన్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 70శాతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని నివేదిక ఉంది. వాస్తవ విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా దేశంలోనే రైల్వే, ఆర్మీ తర్వాత అత్యధిక ఆస్తులు కలిగిన సంస్థగా వక్ఫ్ బోర్డు ఉందని కేంద్రం ప్రచారం చేస్తుంది. ఇక మోదీ భక్తులయితే వెంటనే వక్ఫ్ ఆస్తులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద హిందువులకు పంచాలని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. దేవాదాయ శాఖ కింద ఉన్న భూములతో పంపకాలు మొదలుపెడితే బాగుంటుదని అడిగితే ఏమని సమాధానం చెపుతారు?

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు తెస్తున్నది వక్ఫ్ ఆస్తులను రక్షించడం కోసం కాదు, ఈ ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని. వక్ఫ్ బోర్డుల పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కేంద్రం కన్ను పడింది. కేంద్రం తన అనుకూల పారిశ్రామికవేత్తలకు ఈ భూములను కట్టబెట్టాలని చూస్తున్నది. అందుకే ఆప్ నేత సంజయ్ సింగ్ ఇది వక్ఫ్ బిల్లు కాదు, అదానీ బిల్లు అని విమర్శించారు.



వక్ఫ్ ఆస్తులను కబ్జాలు చేసుకుంటుంది కేవలం ప్రయివేటు వ్యక్తులే కాదు, ప్రభుత్వాలు కూడా వేలాది ఏకరాలను తమ ఆధీనంలోకి తీసుకుంటున్నాయి. అనేక రాష్ట్రాలలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు వక్ఫ్ భూములలోనే నిర్మాణమయ్యాయి. చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంషాబాద్‌లో ఉన్న ఇప్పటి ఏయిర్ పోర్ట్ నిర్మాణానికి 1100 ఎకరాల వక్ఫ్ భూమిని కేటాయించారు. 2004లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హాజరత్ హుస్సేన్ షా వలి దర్గాకు చెందిన 1600 ఎకరాల వక్ఫ్ భూమిని బహుళ జాతి కంపెనీలకు కట్టబెట్టారు. ఈ భూమి విలువ అప్పటి మార్కెట్ ధర ప్రకారమే రూ.32 వేల కోట్లు అని అంచనా. ఈ కేటాయింపుపై వక్ఫ్ బోర్డు నాడు వక్ఫ్ ట్రిబ్యునల్‌లో కేసు వేసింది. ట్రిబ్యునల్ భూమి కేటాయింపును రద్దు చేస్తూ, ఆ భూమి వక్ఫ్ బోర్డుదేనని అంతిమ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కంపెనీలు ప్రభుత్వ సహకారంతో హైకోర్టును ఆశ్రయించాయి. హైకోర్టు కూడా ట్రిబ్యునల్ తీర్పును సమర్థిస్తూ కేసును కొట్టి వేసింది. కంపెనీలు చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ సహకారం సరిగా లేక వక్ఫ్ బోర్డు సుప్రీంకోర్టులో కేసు ఓడిపోయింది. ప్రస్తుతం ఉన్న చట్టంలోని కొన్ని లొసుగులతో వక్ఫ్ ఆస్తులు సంరక్షించబడడం లేదు. ప్రస్తుతం వక్ఫ్ బోర్డులకు జ్యుడీషియల్ అధికారాలు లేవు. ఇక ఈ చట్టానికి ఏకంగా 44 సవరణలు చేసిన తర్వాత వక్ఫ్ చట్టం ఎంత బలహీనంగా మారుతుందో ఒకసారి ఊహించండి.

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి సవరణలు తెస్తున్నది వక్ఫ్ ఆస్తులను రక్షించడం కోసం కాదు. ఈ ఆస్తులను తన ఆధీనంలోకి తెచ్చుకోవానికి. వక్ఫ్ బోర్డుల పరిధిలో ఉన్న లక్షల ఎకరాలపై కేంద్రం కన్ను పడింది. కేంద్రం తన అనుకూల పారిశ్రామికవేత్తలకు ఈ భూములను కట్టబెట్టాలని చూస్తుంది. అందుకే ఆప్ నేత సంజయ్ సింగ్ ఇది వక్ఫ్ బిల్లు కాదు, అదానీ బిల్లు అని విమర్శించారు. బోర్డులో పారదర్శకత సాకుతో బోర్డుకు ఉన్న స్వయంప్రతిపత్తిని గుంజుకోవాలని ఆలోచిస్తుంది. పాత చట్టం ప్రకారం వక్ఫ్ ట్రిబ్యునల్ ఒక ఆస్తిని వక్ఫ్ బోర్డుదని నిర్ణయిస్తే, ఇక ట్రిబ్యునల్ తీర్పే అంతిమం. ఈ తీర్పు మీద సివిల్ కోర్టులలో ఛాలెంజ్ చేసే అధికారం లేదు. కేవలం హైకోర్టు, సుప్రీం కోర్టులలో మాత్రమే ఛాలెంజ్ చేసే అవకాశం ఉంది. నూతన సవరణ ప్రకారం ట్రిబ్యునల్ నిర్ణయమే అంతిమం కాదు. జిల్లా కలెక్టర్ నిర్ణయమే అంతిమం. ఫలానా భూమిని సర్వే చేసి అది వక్ఫ్ బోర్డుదా లేక ప్రయివేటుదా అని నిర్ణయించే అధికారం జిల్లా కలెక్టర్‌దే. అంటే ట్రిబ్యునల్ నామమాత్రమే. చాలా కేసులలో రెవెన్యూ శాఖకు, వక్ఫ్ బోర్డుల మధ్య వివాదాలు నడుస్తున్నాయి. ఇలాంటి సందర్భాలలో జిల్లా కలెక్టర్ ఎటువైపు ఉంటాడు? ప్రభుత్వ పెద్దల మాటలను కలెక్టర్లు పూర్తిగా పెడచెవిన పెట్టే పరిస్థితి ప్రస్తుతం ఉందా?

మరో సవరణ ప్రకారం వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులను నామినేట్ చేస్తారు. ముస్లిం ధార్మిక సంస్థలో ఇతరులకు ప్రవేశం ఏందుకు? ఈ జోక్యం దేనిని సూచిస్తుంది? ఏండోమెంట్ కమిటీలలో ఇతర మత మైనారిటీలకు ప్రవేశం కల్పిస్తారా? ఒక్క వక్ఫ్ బోర్డులోనే ముస్లిమేతరులు ఎందుకు? – ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. ముస్లిం మహిళలకు బోర్డులో సభ్యులుగా అవకాశం కల్పించడం కోసం మరో సవరణ చేశారు. దీంతో ముస్లిం మహిళలకు కూడా న్యాయం జరుగుతుందని కేంద్రం అంటుంది. మరి బిల్కిస్ బానోను రేప్ చేసిన నిందితులను క్షమాభిక్ష కింద విడుదల చేసింది ఎవరు? గత పదేళ్ల మోదీ పాలనలో ఎంతమంది ముస్లిం మహిళలకు న్యాయం చేశారు? పాత చట్టం ప్రకారం యజమాని తన ఆస్తిని ఇష్టపూర్వకంగా డాక్యుమెంట్ చేసి వక్ఫ్ బోర్డుకి దానం చేయవచ్చు. కానీ నూతన సవరణ ప్రకారం యజమాని తన కుటుంబ సభ్యుల సమక్షంలో మాత్రమే వక్ఫ్ చేయాలి. ఇలా మొత్తం 44 సవరణలు తెచ్చింది. ఈ బిల్లును బలోపేతం చేయడం కోసం కాదు, నిర్వీర్యం చేయడం కోసమే. దీంతో కబ్జాదారులకు మరింత బలం చేకూరుతుంది. వక్ఫ్ పరిపాలనలో ప్రభుత్వాల జోక్యం మరింత పెరుగుతుంది.

ప్రస్తుతం వక్ఫ్ బోర్డులలో పారదర్శకత లోపించడం, రాజకీయ జోక్యం ఉండడం, అవినీతి పేరుకుపోవడం నిజమే. అస్తులు ఉన్నా సరియైన ఆదాయం మాత్రం వక్ఫ్ బోర్డుకు రావడం లేదు. వందల ఏళ్లుగా ఒకే అగ్రిమెంట్ ప్రకారం లీజులు నడుస్తున్నాయి. కమర్షియల్ ఆస్తుల ద్వారా వచ్చే మొత్తం ఆదాయంలో కేవలం 7శాతం ఆదాయం మాత్రమే వక్ఫ్ బోర్డుకి వస్తుంది. మిగతాది లీజు మేనేజ్‌మెంట్ వారికి పోతుంది. మార్కెట్ రేటుకు అనుగుణంగా లీజు ధరలు పెంచలేదు. చాలా చోట్ల వక్ఫ్ ఆస్తులకు పర్యవేక్షులుగా ఉన్న ముతవల్లీలు, ముజావర్లు ఈ ఆస్తులు తమ తాతముత్తాల పేటెంట్‌గా భావిస్తూ పెత్తనం చలాయిస్తున్నారు. వక్ఫ్ బోర్డులో నిర్వహణ లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉంది. వీటిని సాకుగా చూపి వక్ఫ్ ఆస్తులను పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని కేంద్రం ప్రయత్నించడం సిగ్గుచేటు.

■ సలీమ్ పాషా
(తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ)

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

వరంగల్ జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం అవార్డ్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపాసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

11, 12, 13 తేదీల్లో వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండ నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ.100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును. ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485** ను సంప్రదించగలరు. ఒక వేళ ఈ క్యాంపుకు రాలేక పోయినవారు హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గల మా క్లినిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం లటేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 27 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

అన్నం పెట్టిన ఇంటికే కన్నం

- కేర్ టేకర్ అరెస్టు.. సొత్తు స్వాధీనం..

బాలసముద్రం, సెప్టెంబరు 10: వృద్ధుల బాగోగులు చూసుకునేందుకు పనిలో చేరిన ఓ వ్యక్తి ఆ ఇంటికే కన్నం వేశాడు. రాత్రి వేళ ఆ ఇంట్లో బంగారం, ఇతర సామగ్రి చోరీ చేశాడు. ఈ మేరకు సదరు వ్యక్తిని సుబేదారి పోలీసులు అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపించేశారు. ఆ వివరాలను సీఐ పి.సత్యనారాయణరెడ్డి మంగళవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లా అనకాపల్లి మండలం విజయరామారావుపేట గ్రామానికి చెందిన ఎల్లపు సాయికుమార్.. హనుమకొండ బాలసముద్రంలోని ఓ ఇంట్లో వృద్ధులకు కేర్‌టేకర్‌గా పని చేస్తున్నాడు. ఈనెల 7న రాత్రి ఇంట్లో వృద్ధులు నిద్రిస్తున్న సమయంలో బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, ఒక స్మార్ట్ ఫోన్, బ్యాంకు ఏటీఎం కార్డులను

మిగతా 8వ పేజీలో..



వివరాలు తెలుపుతున్న సీఐ సత్యనారాయణరెడ్డి

ఆపద వస్తే.. అంతేనా?

- ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఉమ్మడిజిల్లా అతలాకుతలం
- గోదావరి వరదలతో ఏజెన్సీలో భయం భయం
- సకాలంలో సాయం అందక గాలిలో కలుస్తున్న ప్రాణాలు, నీటి పాలవుతున్న ఆస్తులు
- వరంగల్ కేంద్రంగా ఎన్డీఆర్ఎఫ్ ఏర్పాటుకు డిమాండ్



గతేడాది భారీ వర్షాలకు జలమయమైన నగరం

వరదల్లో మునిగిన ప్రాంతాల నుంచి బాధితులను తీసుకువస్తున్న రెస్క్యూ సిబ్బంది (ఫైల్)

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఏటా ప్రకృతి వైపరీత్యాలతో ఓరుగల్లు అల్లాడుతోంది. సకాలంలో సహాయక చర్యలు అందకపోతుండటంతో అనేక ప్రాణాలు గాలిలో కలిసి పోతుండగా.. రూ.కోట్ల విలువైన ఆస్తులు నీటిపాలవుతున్నాయి. విపత్తు కాలంలో అండగా నిలిచే నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) సేవలకు వరంగల్ దూరమవడమే ఇందుకు కారణమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఉండగా, ప్రాంతీయ కేంద్రాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. అయితే ఆపద వచ్చిన సమయంలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గోదావరి పరివాహక ప్రాంతాలకు, వరంగల్ మహానగరానికి సకాలంలో చేరుకోలేకపోతున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే హైదరాబాద్ కేంద్రంగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) సేవలు అందిస్తుండగా, వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్‌ను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఎన్‌డీఆర్ఎఫ్ సేవలు ఎక్కడ?

ఏటా విపత్తులతో భారీగా ప్రాణనష్టం జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్ఎఫ్) ఏర్పాటుకు చొరవ చూపటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఎన్‌డీఆర్ఎఫ్ 16 బెటాలియన్లను ఏర్పాటు చేసింది. వీటిలో నాలుగింటిని 2018లో ఏర్పాటు చేయగా ఉమ్మడి రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ ఏర్పాటు చేశారు. ఈ బెటాలియన్‌లో అత్యవసర పరిస్థితుల్లో పని చేయటానికి 18బృందాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఏపీలోని కృష్ణా జిల్లాలో 12, విశాఖపట్నంలో రెండు, బెంగళూరులో రెండు, హైదరాబాద్‌లో ఒక బృందాన్ని ప్రాంతీయ ప్రతిస్పందన కేంద్రానికి (ఆర్ఆర్‌సీ)లో నియమించారు. తెలంగాణలో కేవలం ఒకే బృందం ఉండటంతో ఆపద సమయంలో ఢిల్లీ, విజయవాడల నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాకు, గోదావరితీర ప్రాంతానికి రప్పించుకోవాల్సి వస్తుంది. వీటి అనుమతులకు గంటల సమయం పడుతుండటంతో ఆపదలో పూర్తిగా సాయం అందటం లేదు. ప్రతిఏటా ఎక్కడో ఒకచోట విపత్తులు ఎదురవుతున్నాయి. ఏజెన్సీలో అమాయక రైతులు వాగులు, వరదల్లో చిక్కుకపోయి అవస్థలు పడుతుండగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. భూపాలపల్లి సింగరేణి రెస్క్యూ టీమ్‌ను ఆపద సమయంలో అత్యవసరంగా వాడుకునే వారు. అయితే సింగరేణి కాకుండా ఇతర చోట్ల జరిగే ప్రమాదాల్లోకి రెస్క్యూ టీమ్ వెళ్లకుండా కొంతవరకు ఆంక్షలు అమలు చేస్తున్నారు. దీంతో సింగరేణి రెస్క్యూ టీమ్ సేవలు అరుదుగా మారాయి. ఇక వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్ పరిధిలో డీఆర్ఎఫ్ టీమ్‌ను స్థానికంగా ఏర్పాటు చేసి, వరదల సమయంలో నగర వాసులకు సాధ్యమైనంత వరకు సేవలు అందిస్తున్నా.. ఎన్‌డీఆర్ఎఫ్‌కు ఉన్న సామర్థ్యం ఆ బృందాలకు ఉండే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. దీంతో ఉమ్మడి వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్ ఏర్పాటు చేస్తేనే ప్రజల ప్రాణాలకు రక్షణ లభిస్తుందనే చర్చ జరుగుతోంది.


ప్రతీ ఏడాది విపత్తులతో విలవిల..

గోదావరితీరంలో ప్రతీ ఏటా వచ్చే విపత్తులతో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు అతాలకుతలం అవుతున్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా క్లౌడ్ బరస్ట్‌లు, టోర్న డోలు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే ఏర్పడుతున్నాయి. వాతావరణ మార్పులతో ప్రకృతి కన్నెర్ర చేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. 2020 ఆగస్టు 15న భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి సమీపంలోని చలివాగులో 12మంది రైతులు చిక్కుకు పోయారు. వాగులో చిక్కుకున్న రైతులను 8గంటల అనంతరం ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆ రైతులను బయటకు తీసుకొచ్చారు. 2023 జూలై 27వ తేదీన భారీ వర్షాలకు భూపాలపల్లి, ములుగు జిల్లాలో 20మందికి పైగా వరదలో గల్లంతయి మృత్యువాత పడ్డారు. ముఖ్యంగా మోరంచవాగు ఉధృతంగా ప్రవహించడంతో భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని నైన్‌పాక శివారు మోరంచపై బ్రిడ్జి పనులు చేస్తున్న అస్సాం, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు కూలీలు వరదలో చిక్కుకున్నారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం

మిగతా 7వ పేజీలో..



ఈనెల 1న మహబూబాబాద్ శివారు రాళ్లవాగులో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న హైదరాబాద్ రెస్క్యూ బృందం



భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం నైన్‌పాక శివారు మోరంచ బ్రిడ్జి పనులు చేస్తూ వరదలో చిక్కుకుపోయిన ఆరుగురు కూలీలను కాపాడడానికి వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ హెలికాప్టర్లు (ఫైల్)

'సీజనల్' పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత

ధర్మసాగర్, సెప్టెంబరు 9: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పరిషత్ సీఈవో విద్యాలత సూచించారు. మంగళవారం ధర్మసాగర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధర్మసాగర్ మోడల్ కాలనీలో డాక్టర్ గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య క్యాంపును ఆమె సందర్శించారు. క్యాంపులో రోగులకు పంపిణీ చేస్తున్న మందులను ఆమె తనిఖీ చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలనీవాసులకు సూచించారు. ఎలాంటి జ్వరం వచ్చినా వెంటనే ఆరోగ్య కేంద్రంలోని వైద్యుడిని సంప్రదించాలన్నారు. అలాగే మండలంలోని శాయిపేట్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పాఠశాలలో పిల్లలకు తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు మరింత నాణ్యతమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు చెప్పారు. ఆనంతరం పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగపద్మజ, ఎంపీడీవో అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మసాగర్‌లో వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న సీఈవో విద్యాలత



చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్
- నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

న్యూశాయంపేట, సెప్టెంబరు 10 : చాకలి ఐలమ్మను ప్రతీ ఒక్క మహిళ స్ఫూర్తిగా తీసుకోవాలని శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ పిలుపునిచ్చారు. తెలంగాణ వీరనారి, సాయుధపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి హనుమకొండ న్యూశాయంపేట జంక్షన్‌లో ఉన్న ఐలమ్మ విగ్రహం వద్ద మంగళవారం అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ ఎంపీ కడియం కావ్య, వర్ధన్నపేట, పరకాల ఎమ్మెల్యేలు కేఆర్‌నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, సత్యశారదా దేవి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

అనంతరం బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో ప్రజాస్వామిక పోరాటానికి స్ఫూర్తినిచ్చిన ఐలమ్మ సేవలు, ధైర్యసాహసాలు ఎంతో గొప్పవన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మహిళా చైతన్యానికి, సాధికారతకు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక చాకలి ఐలమ్మ అన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తి మనందరికీ ఆదర్శమన్నారు.

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, మాజీ 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, స్థానిక కార్పొరేటర్ మామిండ్ల రాజుతోపాటు బీసీ సంక్షేమ శాఖ అధికారులు, రజక సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు ఐలమ్మకు నివాళులు అర్పించారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతున్న బండా ప్రకాశ్

పీవీ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాట్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రావీణ్య

భీమదేవరపల్లి, సెప్టెంబరు 10: మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు పేరుతో ఏర్పాటు చేసిన విజ్ఞాన కేంద్రంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. మంగళవారం వంగరలో మాజీ ప్రధాని పీవీ విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలోని ఆడిటోరియం, థియేటర్, సైన్స్ మ్యూజియం, గ్యాలరీ, మెడిటేషన్ సెంటర్, క్రీడాస్థలం, పీవీ విగ్రహ ఏర్పాట్లను నాణ్యతగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను కోరారు. విజ్ఞాన కేంద్రంలోని నిర్మాణ పనుల వివరాలను టూరిజం ఏఈ జీవన్‌రెడ్డి, కాంట్రాక్టర్ సాంబశివరావులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు, సలహాలు చేశారు. పీవీ విజ్ఞాన కేంద్రానికి ఇప్పటి వరకు సుమారు రూ. 7కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. అందులో రూ.6.30కోట్ల నిధులు కాంట్రాక్టర్‌కు అందజే శామన్నారు. ఇందులో రూ.70 లక్షల నిధులు మిగిలి ఉన్నా యన్నారు. పీవీ విజ్ఞాన కేంద్రంలోని అభివృద్ధి పనులకు మరో రూ.3కోట్లు అవసరమవుతాయని వీటిని సంబంధిత మంత్రులతో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు.

అనంతరం వంగరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే యంత్రం పనిచేయకపోవడంతో చాలా ఏళ్లుగా నిరుపయోగంగా ఉంటోందని గ్రామస్థులు కలెక్టర్‌తో మొర పెట్టుకున్నారు. ఎక్స్‌రే ప్లాంట్‌కు మరమ్మతు చేసేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేసి పంపించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం భీమదేవరపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ సందర్శించి తరగతి గదులు, కిచెన్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా మంజూరైన నిధులతో చేపట్టిన గదుల మరమ్మతు, టాయిలెట్ల నిర్మాణం, విద్యుత్ పనులను కలెక్టర్‌ను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన భోజన సౌకర్యం కల్పించాలని సూచించారు. పాఠశాలలో ఏమైనా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందిస్తే సంబంధిత పనులను పూర్తి చేసేందుకు నిధులను విడుదల చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. తాము నిద్ర పోవడానికి సరైన బెడ్లు లేవని, వాటిని అందించాలని కలెక్టర్‌ను విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో డీఈవో వాసంతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి, ఆర్డీవో వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు కొల్లూరి రాజు, గజ్జెల సురేష్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ ప్రవీణ్, ఎంపీవో నాగరాజు, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రుబీనా, డాక్టర్ రహ్మాన్, నోడల్ అధికారి సునీత, కస్తూర్బా స్పెషల్ ఆఫీసర్ పిట్టల జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు గుడికందుల మధు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



వంగరలో పీవీ విజ్ఞాన కేంద్రంలో మ్యాప్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్



పీవీ విజ్ఞాన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రావీణ్య

బహిరంగ ప్రకటన

ఇట్లు బండి అనిల్‌కుమార్, న్యాయవాది, ఇ.నెం. 10-2-208, గోవిందరాజుల గుట్ట గిర్మాజీపేట్, వరంగల్ జిల్లా.



కెనరా బ్యాంక్ | **పస్రానగరం (6774) శాఖ** ఇ.నం.5-92, పంచాయతి కాంప్లెక్స్ ఎదురుగా, మెయిన్ రోడ్, ములుగు జిల్లా-506347

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది మరియు సమయం: 25.09.2024న ఉ.11.30 గం. నుండి మ.12.30 గం. మధ్య (అమ్మకం ముగిసే వరకు ఒక్కోదానికి 5 నిమిషాల అపరిమిత విస్తరణతో) బయానా జమకు చివరి తేది 24.09.2024 న సా.5.00 గం.లకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ అధీకృత అధికారి ద్వారా నిర్మాణాత్మక / వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్ చేయబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీతల నుండి కెనరా బ్యాంక్‌కు చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయిలు ప్లస్ దానిపై అనువర్తిత వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకోవడానికి ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా మరియు అక్కడ ఏముంటే అదే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజలకు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

రుణగ్రహీత పేరు: శ్రీమతి మొండేలా అరుణ (రుణగ్రహీత), భర్త మొండేలా మధుకర్, ఇ.నం..2-10-309/1/2/ఎ., డాక్టర్ కాలనీ ఫేజ్ 3, వడ్డెపల్లి, వరంగల్-506001. శ్రీ మొండేలా మధుకర్ (ఉమ్మడి రుణగ్రహీత) తండ్రి ఇలయ్య, ఇ.నం..2-10-309/1/2/ఎ., డాక్టర్ కాలనీ ఫేజ్ 3, వడ్డెపల్లి, వరంగల్-506001. శ్రీమతి మొండేలా అరుణ (రుణగ్రహీత), భర్త మొండేలా మధుకర్, ఇ.నం.7-104, జంగుపల్లి గ్రామం, ములుగు ఘన్‌పూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి-506168.

మొత్తం బకాయిలు: రూ.31,54,243.48 (రూపాయలు ముప్పై ఒక్క లక్షల యాభై నాలుగు వేల రెండు వందల నలభై మూడు మరియు పైసలు నలభై ఎనిమిది మాత్రమే)తో పాటు అనువర్తిత వడ్డీ మరియు బ్యాంక్ ఛార్జీలు, ఖర్చులు, వ్యయాలు.

స్థిరాస్తి వివరణ: వరంగల్ అర్బన్, హన్మకొండ, వడ్డెపల్లి గ్రామం, ఫేజ్-3, డాక్టర్స్ కాలనీ వద్ద గల ఎస్ఆర్ఓ వరంగల్ వద్ద నమోదైన డాక్యుమెంట్ డీడ్ నం.19296/2019, తేది.31.07.2019 తో అమలుపరిచిన 100 చ.గల విస్తీర్ణంకు ఇ.నం.2-10-309/1/2/ఎ ఇల్లు యావత్తు. పరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.36, పశ్చిమం: ప్లాట్ నం.34, ఉత్తరం: ప్లాట్ నం.40, దక్షిణం: 33 అడుగుల వెడల్పు రోడ్డు.

రిజర్వు ధర రూ. 34,01,100/- **బయానా రూ. 3,40,000/-**

ఆస్తిని 24.09.2024లోగా మ.3.00 గం. వరకు తనిఖీ చేసుకోవచ్చును.

బ్యాంకుకు తెలిసిన మేరకు ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు లేవు. రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని e-bkray పోర్టల్ మెసర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఇ-వ్యాలెట్‌లో (నేరుగా లేదా చలాన్ జనరేట్ చేయడం ద్వారా డిపాజిట్ చేయవచ్చును. NEFT/RTGS ద్వారా బయానా డిపాజిట్ చేయడానికి సదరు చలాన్‌లో పేర్కొన్న విధంగా ఖాతా వివరాలను పేర్కొనవలెను. వేలం ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in ద్వారా నిర్వహించబడుతుంది. బిడ్డింగ్ ప్రాసెస్ మాన్యువల్, బిడ్డర్ రిజిస్ట్రేషన్ మరియు బయానా చెల్లింపు కోసం దర్శించండి: ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in. సంప్రదించండి: 8291220220, ఇ-మెయిల్: support.ebkray@psballiance.com అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన ఇ-వేలం లింకును రిఫర్ చేయండి లేదా బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్, పస్రానగరం శాఖ (6774), ఫోన్ నం: 9481413242 వారిని ఏదేని పనిరోజున కార్యాలయ వేళలలో సంప్రదించగలరు.

తేది: 31.08.2024, ప్రదేశం: వరంగల్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ | **వరంగల్ ప్రధాన శాఖ (0621)** ఇ.నం.8-4-4, శ్రీ కృష్ణ కాలనీ, స్టేషన్ రోడ్, వరంగల్-506002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేది మరియు సమయం: 25.09.2024న ఉ.11.30 గం. నుండి మ.12.30 గం. మధ్య (అమ్మకం ముగిసే వరకు ఒక్కోదానికి 5 నిమిషాల అపరిమిత విస్తరణతో) బయానా జమకు చివరి తేది 23.09.2024 న సా.5.00 గం.లకు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన. కెనరా బ్యాంక్ అధీకృత అధికారి ద్వారా నిర్మాణాత్మక / వాస్తవిక స్వాధీనం చేసుకొనబడినట్టి, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన/ చార్జ్ చేయబడినట్టి దిగువ వివరించిన స్థిరాస్తి, దిగువ తెలిపిన రుణగ్రహీతల నుండి కెనరా బ్యాంక్‌కు చెల్లించవలసిన దిగువ తెలిపిన బకాయిలు ప్లస్ దానిపై అనువర్తిత వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలను రాబట్టుకోవడానికి ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా మరియు అక్కడ ఏముంటే అదే ప్రాతిపదికన విక్రయించబడునని సాధారణ ప్రజలకు ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

రుణగ్రహీత పేరు: 01. తోట నవీన్ కుమార్, తండ్రి హరినాథ్ బాబు, ఇ.నం 1/7/883/7 రెవెన్యూ కాలనీ హంటర్ రోడ్, హన్మకొండ, వరంగల్-506001. ఉమ్మడి రుణగ్రహీత: 02. బేతి వికాస్, తండ్రి బి వీరాస్వామి, ఇ.నం. 16 4 199, రుద్రమాంబ నగర్, వరంగల్-506002.

మొత్తం బకాయిలు: రూ.60,49,418.52 (రూపాయలు అరవై లక్షల నలభై తొమ్మిది వేల నాలుగు వందల పద్దెనిమిది మరియు పైసలు యాభై రెండు మాత్రమే)తో పాటు అనువర్తిత వడ్డీ మరియు బ్యాంక్ చార్జీలు, ఖర్చులు, వ్యయాలు.

స్థిరాస్తి వివరణ: వరంగల్, బొమ్మలగుడి సమీపాన ప్రధాన రహదారి, కరీమాబాద్ వద్ద గల 120.00 చ.గల లేదా 130.32 చ.మీ విస్తీర్ణ ముందు ఐడి నం.17/441, పాత నం. 17-4-133 కు సంబంధించిన ఇంటి నం.17-4-155 యావత్తు. పరిహద్దులు: తూర్పు: రహదారి, పశ్చిమం: పొరుగువారి ఇల్లు, ఉత్తరం: పొరుగువారి ఇల్లు, దక్షిణం: ఇ.నం17-4-155/1.

రిజర్వు ధర రూ. 40,00,000/- **బయానా రూ. 4,00,000/-**

ఆస్తిని 24.09.2024లోగా మ.3.00 గం. వరకు తనిఖీ చేసుకోవచ్చును.

బ్యాంకుకు తెలిసిన మేరకు ఆస్తిపై ఏవేని తాకట్టు రుణభారాలు లేవు. రిజర్వు ధరలో 10% బయానా మొత్తాన్ని e-bkray పోర్టల్ మెసర్స్ పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క ఇ-వ్యాలెట్‌లో (నేరుగా లేదా చలాన్ జనరేట్ చేయడం ద్వారా డిపాజిట్ చేయవచ్చును. NEFT/RTGS ద్వారా బయానా డిపాజిట్ చేయడానికి సదరు చలాన్‌లో పేర్కొన్న విధంగా ఖాతా వివరాలను పేర్కొనవలెను. వేలం ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in ద్వారా నిర్వహించబడుతుంది. బిడ్డింగ్ ప్రాసెస్ మాన్యువల్, బిడ్డర్ రిజిస్ట్రేషన్ మరియు బయానా చెల్లింపు కోసం దర్శించండి: ఆన్‌లైన్ పోర్టల్ https://ebkray.in సంప్రదించండి: 8291220220, ఇ-మెయిల్: support.ebkray@psballiance.com అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ (www.canarabank.com) లో ఏర్పాటు చేసిన లింకును రిఫర్ చేయండి లేదా బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంక్, వరంగల్ ప్రధాన శాఖ (0621), ఫోన్ నం: 9836357532 వారిని ఏదేని పనిరోజున కార్యాలయ వేళలలో సంప్రదించగలరు.

తేది: 31.08.2024, ప్రదేశం: వరంగల్ — అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఆత్మహత్య

మడికొండ, సెప్టెంబరు 10 : కుటుంబ కలహాలతో గడ్డి మందు తాగి రిటైర్డ్ రైల్వే ఉద్యోగి మృతి చెందాడు. మడికొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చెరువు కట్ట కాలనీకి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి రాయికంటి మొగిలి(64) కుంటుబ అవసరాల కోసం లోన్ ద్వారా అప్పు తీసుకున్నాడు. డబ్బులను కొంత మందికి అప్పుగా ఇస్తూ ఖర్చు చేస్తుండగా పిల్లల చదువుల కోసం తీసుకున్న డబ్బులు ఇతరులకు ఇస్తూ ఇలా ఖర్చు చేస్తే ఎలా అని భార్యా భర్తలమధ్య గొడవ జరిగింది. దీంతో క్షణికావేశానికి లోనైన మొగిలి.. మంగళవారం ఉదయం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుమారులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య శ్రీలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ ఐటీఐ ప్రిన్సిపాల్ మృతి

కాజీపేట, సెప్టెంబరు 10: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన వరంగల్ ఐటీఐ రిటైర్డ్ ప్రిన్సిపాల్, ముదిరాజ్ సంఘం నేత దండబోయిన సారయ్య(67) ముదిరాజ్ అనారోగ్యంతో మంగళవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మంచిర్యాల, సుల్తానాబాద్, వరంగల్, ప్రభుత్వ ఐటీఐలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. భౌతికకాయాన్ని ప్రశాంత్‌నగర్‌లోని వారి నివాసంలో మంగళవారం ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్, జిల్లా నాయకులు పెండ్యాల సారంగపాణి, డి. లక్ష్మీనారాయణ తదితరులు దర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించి సంఘం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు. సారయ్య అంత్యక్రియలు బుధవారం హనుమకొండ పద్మాక్షిశ్మశాన వాటికలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తుల వద్ద రూ.15వేల విలువ కలిగిన గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. స్టేషన్ పరిధిలోని జయ బాలాజీ కిరాణం షాపు యజమాని హరితేజ వద్ద రూ.10,250, సిగరెట్ సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్న కృష్ణ వద్ద రూ.5వేల విలువకలిగిన గుట్కాను పట్టుకున్నారు. ఇద్దరిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రవికుమార్ ధ్రువీకరించారు.

చెన్నై సదస్సులో ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: సెప్టెంబరు 2 నుంచి 7 వరకు చెన్నైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ప్రతిష్టాత్మక 18వ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ థర్మల్ ఎనిలిసిస్ అండ్ కాలోరిమెట్రీ 2024 సదస్సుకు కేయూ కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.సవితాజ్యోత్స్న హాజరయ్యారు. థర్మోడినమిక్ అండ్ డీఎఫ్‌టీ స్టడీస్ బిట్‌విన్ 1, 2 ఇథియలిడిమిక్ అండ్ 1,5 పెంటనిడిల్ ఎట్ టీ293.15 టూ 313.15కే అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయి సైంటిస్టులు పాల్గొన్న ఈ సదస్సులో సవితాజ్యోత్స్న టెక్నికల్ సెషన్‌కు అధ్యక్షులుగానూ వ్యవరించారు.

















రేపు గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

మడికొండ, సెప్టెంబరు 10: వరంగల్ రీజియన్ హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు విగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 12న మడికొండ బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు డీసీవో దాసరి ఉమామహేశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల తల్లిదండ్రులు తమ పిల్లల కులము, ఆదాయం, నివాసం, ఆధార్, స్టడీ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు నేరుగా మడికొండ గురుకుల పాఠశాలకు రావాలని తెలిపారు. ఎంట్రెన్స్ రాసిన హాల్‌టికెట్ వెంట తీసుకురావాలని తెలిపారు. వివరాలకు 99498 92426, 76809 06134 నంబర్లలో సంప్రదించాలని డీసీవో కోరారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: ఇంటర్‌లో ఫస్టియర్‌లో ప్రవేశాల గడువును పొడిగించినట్లు వరంగల్, హనుమకొండ డీఐఈవోలు ఎ.గోపాల్, డాక్టర్ జి.సుమన్ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోర్డు నిర్దేశించిన ప్రవేశాల గడువు ఈ నెల 7తో ముగియగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఈ నెల 15 వరకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు బోర్డు అధికార వర్గాలు ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికీ ఇంకా ప్రవేశాలు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్సు దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోపాల్‌పూర్‌లోని శివసాయి కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళను, ఓ విటుడిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వేలేరు మండలానికి చెందిన ఓ మహిళ శివసాయి కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఇతర రాష్ట్రాలనుంచి మహిళలను తీసుకువచ్చి ఏడాదిగా వ్యభిచార దందా నిర్వహిస్తోంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు.. కేయూ పోలీసులతో కలిసి మంగళవారం ఆ గృహంపై దాడి చేసి మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకురాలిని అరెస్టు చేసి విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

కేయూ భూములపై అధికారుల విచారణ

● జాయింట్ ఇన్‌స్పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు ● నివేదిక అందజేయనున్న అధికారులు



వర్సిటీలో విచారణ చేస్తున్న విజిలెన్స్, ఇన్స్‌పోర్స్‌మెంట్ అధికారులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ భూకబ్జాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు రెవెన్యూ, సర్వే, మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీ భూములను అందినకాడికి అందినట్లు ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టిన బడావ్యక్తుల కబ్జాల బాగోతాలను ఆధారాలతో సహా బయటపెట్టేందుకు సమగ్ర సర్వే చేపట్టారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీలోని కబ్జాలకు గురైన భూములను అధికారులు జాయింట్ ఇన్స్‌పెక్షన్ కమిటీగా ఏర్పడి సమగ్ర సర్వేలు చేపట్టారు. రెండు రోజుల విచారణలో భాగంగా తొలిరోజు మంగళవారం వర్సిటీ న్యూ పీజీ హాస్టల్ పక్కన బీసీ కాలనీలోని 229 సర్వే నెంబర్‌లో సర్వే చేపట్టారు. మునిసిపల్ అధికారులు బీసీ కాలనీల్లోని పలువురికి భూ అక్రమణలపై నోటీసులు జారీ చేయడంతో వారు అధికారుల ఎదుట హాజరై తమ వాదనలు వినిపించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ రాకేశ్ నేతృత్వంలో వర్సిటీ భూముల పాత సర్వే రిపోర్టులు, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారుల వద్ద ఉన్న దస్తావేజులను పరిశీలించారు. వర్సిటీది మొత్తం ఎంత భూమి వుంది..? ఏ సర్వే నెంబర్‌లో ఉండేదని గుర్తించారు. అక్రమణలు ఎక్కడెక్కడ జరిగాయనే విషయంలో అధికారులు సమగ్రంగా పరిశీలన చేపట్టారు. వర్సిటీల్లో భూముల్లో నిర్మించిన అక్రమ భవనాలు, ఇతర కట్టడాలను గుర్తించారు. వర్సిటీలోని ఇంచు భూమి కూడా అక్రమణకు గురికావొద్దని విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీలోకి వచ్చిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను కలిసి వినతి పత్రాలను అందచేశారు.

నేడు అధికారుల నివేదికలు

కాకతీయ యూనివర్సిటీలోని భూ కబ్జాల పర్వాలపై మంగళవారం మొదటి రోజు విచారణ చేపట్టిన అధికారులు.. రెవెన్యూ, సర్వే అధికారులతో కలిసి నివేదిక రూపొందించనుంది. బుధవారం రెండో రోజు కూడా వర్సిటీలో భూ కబ్జాలపై విచారణ చేస్తారు. అనంతరం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, రెవెన్యూ, సర్వే అధికారులు కబ్జాలపై సమగ్ర నివేదికను రూపొందించి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, వర్సిటీ డెవలప్‌మెంట్ అధికారి ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డిలకు అందచేస్తారు. విచారణ అధికారుల నివేదిక ఆధారంగా వర్సిటీలో ప్రహారీ నిర్మాణం తొందరగా చేపట్టే అవకాశం ఉంది.

వర్సిటీ భూములను మింగేసే కుట్ర

కాకతీయ యూనివర్సిటీ భూములను మింగేసే కుట్రలో భాగంగానే వర్సిటీలో కబ్జాలపై ఉన్న భూముల రిపోర్టులను పక్కన పెట్టి మళ్లీ సర్వేల పేరుతో కుట్రలు పన్నారనే ఆరోపణలు వర్సిటీలో వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ భూముల కబ్జాల బాగోతాలపై గతంలో కలెక్టరేట్ ఉన్నతాధికారులు అధికారులు, వర్సిటీ పాలక మండలి సభ్యుల సమగ్రంగా వర్సిటీ భూముల దస్తావేజులను రెవెన్యూ సర్వేలు, రిపోర్టులను చూసి కబ్జాల పర్వాలపై సమగ్రమైన నివేదికలను అందచేశాయి. వర్సిటీ భూములు కబ్జాలకు గురయ్యాయనే విషయం అప్పట్లోనే ఆయా అధికారుల నివేదికలతో స్పష్టమైంది. అయితే అప్పటి వర్సిటీ మాజీ వీసీతోపాటు వర్సిటీలో పలుకుబడి కలిగిన అధికారులు ఆయా రిపోర్టులను కనీసం బయటికి తీయలేదు. కబ్జాలపై ఉన్నటువంటి సమగ్ర రిపోర్టులను అమలు చేయకుండా మళ్లిప్పుడు తాజాగా రెవెన్యూ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, మునిసిపల్ అధికారులందరితో సర్వేలు చేపట్టారు. ఈ సర్వేలపై పేరుతో వర్సిటీ భూములపై అటలాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ చుట్టూ ప్రహారీ నిర్మాణానికి గతంలోనే వర్సిటీ అధికారులు రూ.10కోట్లు కేటాయించారు. పనులను మధ్యలో అపేసి భూముల విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారని వర్సిటీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. భూములపై డబుల్ సర్వేలు చేపట్టి ఎవరిని కాపాడుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు అధికారులు ప్రశ్నిస్తున్నారు.

అన్నం వండలేదని తమ్ముడిపై దాడి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 10 : అన్నం ఎందుకు వండలేదంటూ తోడబుట్టిన తమ్ముడిపై అన్న కత్తితో దాడికి పాల్పడిన ఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలోని రాంనగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన దుర్గం ధర్మి-శోభ దంపతులకు ఇద్దరు కుమారులు అమర్, దేవేందర్ ఉన్నారు. ధర్మి, శోభలు దంపతులు గతంలోనే మృతిచెందారు. అన్నదమ్ములు అవివాహితులు కాగా, ఓ అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. అమర్ మటన్ షాపులో గుమస్తాగా పనిచేస్తుండగా, దేవేందర్ భవన నిర్మాణ కార్మికుడిగా అప్పుడప్పుడు వెళ్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం అమర్ పనిచేసే షాపు వద్దకు మద్యం మత్తులో ఉన్న దేవేందర్ వెళ్లి ఇంట్లో అన్నం ఎందుకు వండలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో మాటామాటా పెరిగింది. అదే సమయంలో దేవేందర్ పక్కనే ఉన్న కత్తిని తీసుకొని దాడి చేయగా అమర్‌కు కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య చికిత్సల కోసం ఎంజీఎంకు వైద్యులు రెఫర్ చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.



అమర్‌కు నర్సంపేట ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేస్తున్న వైద్యులు

కళలను మరింత ఆదరించాలి

మయూరి నాట్య కళా వేడుకల్లో వేదాంతం రాధేశ్యామ్

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 10: విశ్వ జనీనమైన కళలను ఆదరిస్తూ కళాకారులను మరింతగా ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ప్రఖ్యాత నాట్యాచార్యుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, కూచిపూడి అగ్రహారానికి చెందిన డాక్టర్ వేదాంతం రాధేశ్యామ్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో నేత్రపర్వంగా జరిగిన మయూరి నాట్యకళా కేంద్ర 17వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రముఖ నటుడు, కళాకారుడు, రిటైర్డ్ విద్యాశాఖాధికారి బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాధేశ్యామ్ మాట్లాడుతూ.. కూచిపూడి నృత్యం విశ్వవ్యాపితమైందన్నారు. కళలకు భాషా, ప్రాంతీయ భేదాలుండవని చెబుతూ అన్ని మెళకువలను నేర్చుకొని నృత్య రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. కళలకు కాణాచి అయిన ఓరుగల్లులో దశాబ్దంన్నర కాలంగా వందలాది చిన్నారును నాట్యరంగంలో తీర్చిదిద్దుతున్న కుండె అరుణరాజ్‌కుమార్‌ను ఆయన ప్రశంసించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు చదువుతో పాటు ఇతర కళారంగంలోనూ ప్రొత్సహించాలన్నారు. బూర విద్యాసాగర్‌గౌడ్ అధ్యక్షోపన్యాసం చేస్తూ కళాకారులుగా రాణిస్తూ భవిష్యత్ కళాకారులను తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు. వందలాది మంది నాట్య కళాకారులను తయారు చేస్తున్న అరుణ అభినందనీయురాలన్నారు.



మాట్లాడుతున్న కూచిపూడి నాట్యాచార్యులు రాధేశ్యామ్

ఈ వేడుకల్లో దేవాదాయ శాఖ సహాయ సంచాలకురాలు రాయల సునిత, చక్రవర్తి హాస్పిటల్స్ డాక్టర్ తరుణ్, సంగీత కళాకారుల సంఘం అధ్యక్షుడు సీతాల రఘువేందర్, కిట్స్ సూపరింటెండెంట్ పొట్లపల్లి ప్రసాదరావు, మేకల రమేష్, రోజా క్రియేషన్స్ ఆలేటి శ్యాంసుందర్, పెండెం వేణుమాధవరావు, టి. నరేందర్, పెరుమాండ్ల వెంకట్, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. మయూరి నాట్య కళాక్షేత్రం నిర్వాహకులు కుండె అరుణరాజ్‌కుమార్ స్వాగతం పలికారు. తొలుత ఈ వేడుకలను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నా తల్లే నా దైవం శీర్షికన ప్రారంభమైన వేడుకల పరంపరంలో కుండె కొమురమ్మను ఎమ్మెల్యే రేవూరి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం విద్యార్థినులు శ్రీకృష్ణ రమణీయం, శివతాండవం లాస్యం లాంటి అనేక నృత్య రూపకాలు, నృత్యాలు ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

ఉపాధి కార్యాలయంలో రేపు జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 10: వరంగల్ జిల్లా ఉపాధి కల్పన, శిక్షణశాఖ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో వర్చువల్ కేర్ విభాగంలో 50 ఖాళీలకు, ఎస్ బ్యాంక్‌లోని సీనియర్ ఆఫీసర్లు 20 ఖాళీలకు, ముత్తూట్ ఫైనాన్స్ హైదరాబాద్, వరంగల్‌లోని బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 20ఖాళీలకు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటీవ్స్ 30 ఖాళీలకు, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్స్ 20ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ పాసైన 22 నుంచి 35 ఏళ్లలోపుగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని ఆమె కోరారు.

13న మినీ జాబ్ మేళా

హనుమకొండ జిల్లా ఎంప్లాయింట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎం.మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వే టూ న్యూస్ వరంగల్, హనుమకొండలో సేల్స్ ట్రెయినీలు 15 ఖాళీలు, భారత్ ఫైనాన్సియల్ ఇన్క్లూషన్‌లో లోన్ ఆఫీసర్లు 40 ఖాళీలు, ఆదర్శ మారుతీ సుజుకీ ములుగురోడ్‌లోని షోరూమ్‌లో టెలీకాలర్లు, డ్రైవర్లు 5 ఖాళీలకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు డిగ్రీ, ఎంబీఏ, ఇంటర్, ఐటీఐలో ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల వయస్సుగల వారు జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు శుక్రవారం ములుగురోడ్‌లోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో నిర్వహించే జాబ్ మేళాలలో వారి సర్టిఫికెట్లతో ఉదయం 11గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు.

కేయూ దూరవిద్య పరీక్షల రీ షెడ్యూల్ వెల్లడి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న బీఎల్‌ఐఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూతో పాటు ఇతర పరీక్షల రీ షెడ్యూల్‌ను మంగళవారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ మంగళవారం తెలిపారు. మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్స్(ఎంఎస్‌డబ్ల్యూ), ఫైనల్ ఇయర్‌వైజ్, నాలుగో సెమిస్టర్ పరీక్షలు సెప్టెంబరు 90న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, అలాగే బీఎల్‌ఐఎస్సీ ఎక్స్ అభ్యర్థులకు 18 సెప్టెంబరు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, బీఎల్‌ఐఎస్సీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. సోషల్ వర్క్స్ అభ్యర్థులకు కేయూక్యాంపస్‌లోని ఎడ్యుకేషన్ కళాశాల, బీఎల్‌ఐఎస్సీ అభ్యర్థులకు కేయూ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇతర వివరాలకు దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే అర్హత బీఆర్‌ఎస్‌కు లేదు

హైకోర్టు తీర్పుపై న్యాయనిపుణులతో చర్చిస్తాం..

అవసరమైతే సుప్రీం కోర్టుకు వెళ్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 10: పార్టీ ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కు, ఆ పార్టీ నేతలకు లేదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రతిపక్షపార్టీల శాసనసభాపక్షాలను విలీనం చేసుకున్న నీచచరిత్ర బీఆర్‌ఎస్‌ది అని మండిపడ్డారు. 2014 నుంచి 2023 వరకు వివిధ రాజకీయ పార్టీల నుంచి 32 మంది ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్‌లో చేర్చుకున్నారని ఏ ఒక్కరు వారిలో డిస్ క్వాలిఫై కాలేదన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు సైతం ఇచ్చారని, రాజీనామాలు చేయకుండానే తలసాని శ్రీనివాస్ యాదవ్, సబిత ఇంద్రారెడ్డి మంత్రులయ్యారని గుర్తు చేశారు. పెద్ద ఎత్తున పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన బీఆర్‌ఎస్ పార్టీ సిగ్గులేకుండా మాట్లాడుతుందన్నారు. హైకోర్టు తీర్పుతో లొట్టపెట్ట పెదవులకు నక్క ఆశపడ్డట్లుగా కొందరు ఉప ఎన్నికలు వస్తాయని మాట్లాడుతున్నారని వారి అజ్ఞానానికి జాలిపడుతున్నానని తెలిపారు. ఎవరు ఎన్ని ఆశలు పెట్టుకున్నా ఉప ఎన్నికలు రావని తేల్చి చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు ఇచ్చిందని అయితే తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ తమకు అందలేదని కేవలం పత్రికల్లో చూశామని తెలిపారు. తీర్పుకు సంబంధించిన ఒరిజినల్ కాపీ అందిన తరువాత విషయమై పార్టీ పెద్దలతో, న్యాయ నిపుణులతో చర్చించిన తరువాత భవిష్యత్ కార్యాచరణ ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో, ప్రస్తుతం హైకోర్టు, సుప్రీంకోర్టులు రెండు భిన్నమైన తీర్పులు ఇస్తున్నాయన్నారు. కోర్టులను గౌరవించే బాధ్యత తమకుందన్నారు. డివిజన్ బెంచ్‌ను ఆశ్రయిస్తామని, అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామన్నారు. ఏమో అయినట్లు ఎన్నికలు వచ్చినట్లు కొందరు బీఆర్‌ఎస్ నాయకులు ఆశపడతున్నారని ఎద్దేవా చేశారు. కొందరు పగటి కలలు కనడం వారి అజ్ఞానికి, దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు విమర్శకుల నోళ్లు మూయించేలా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ రాష్ట్ర నాయకులు నరేందర్ రెడ్డి, మంతెన ఇంద్రసేనా రెడ్డి, నాయకులు అంబటి కిషన్‌రాజు, జీడి రమేష్, బూర్ల శంకర్, కోతి రాములు, రజాక్‌యాదవ్, కొంతం శ్రీనివాస్, జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ కమిటీల్లో మానుకోటకు ప్రాధాన్యం

ఎస్టిమేట్స్, పబ్లిక్ అకౌంట్స్ సభ్యులుగా ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు అవకాశం



ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్



ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మహబూబాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అంచనాల కమిటీ, తెలంగాణ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ (పీఏసీ)ల్లో మహబూబాబాద్ జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఆయా కమిటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇద్దరు ఎమ్మెల్యేలకు ప్రాతినిధ్యం దక్కింది. ఆయా కమిటీల్లో సభ్యులుగా జిల్లాకు చెందిన శాసనమండలి సభ్యులు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యేలు మామిడాల యశస్వినిరెడ్డి, కోరం కనకయ్యకు చోటు లభించింది. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులతో పబ్లిక్ అకౌంట్స్, ఎస్టిమేట్స్, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీలను ఏర్పాటు చేస్తూ శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కో కమిటీలో చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు ఉంటారు. ఇందులో తెలంగాణ ఎస్టిమేట్స్ (అంచనాల) కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావుతో పాటు జిల్లాలోని తొర్రూరు పెద్దవంగర ప్రాతినిధ్య మండలాల పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, బయ్యారం, గార్ల మండలాల ప్రాతినిధ్య ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌కు అవకాశం దక్కింది. మహబూబాబాద్ జిల్లా నుంచి అత్యధికంగా నలుగురు ప్రజాప్రతినిధులకు అవకాశం లభించడం విశేషం.

ఎంజీఎం ఉద్యోగిపై దాడి ఘటనలో మహిళ అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, సెప్టెంబరు 10: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సుమలతపై ఇనుప గొలుసుతో దాడి చేసి గాయపరిచి డబ్బులను బలవంతంగా లాక్కున్న రాజమ్మను మంగళవారం అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఏసీపీ నందిరాం నాయక్ కథనం ప్రకారం.. బిల్ల సుమలత 15 ఏళ్ల నుంచి ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తోంది. రెండేళ్ల నుంచి పేషెంట్ కేర్ విభాగంలో పని చేస్తోంది. ఈనెల 9న విధుల్లో భాగంగా ఎంజీఎం బయోమెట్రిక్ విషన్ వద్ద సుమలత వేలిముద్ర వేస్తుండ గా ఆలకుంట రాజమ్మ అడ్డుకొని రూ.2 లక్ష లు ఇవ్వాలని, లేదంటే చంపేస్తానని బెదిరించింది. ఆపై ఇనుప గొలుసుతో సుమలతపై దాడి చేసి గాయపరిచింది. తర్వాత ఆమె చేతిలో ఉన్న సెల్‌ఫోన్ తీసుకొని పగలగొట్టి, ఆమె వద్ద ఉన్న రూ.10వేలు లాక్కొని అక్కడి నుంచి వెళ్లిపోయింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మంగళవారం రాజమ్మను అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి రూ.వేయి నగదు, ఇనుప గొలుసును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మెల్యే

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 10: ఎంజీఎం ఆస్పత్రిలో సుమలత అనే ఉద్యోగిపై జరిగిన ఘటనకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి స్పందించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుమలతపై దాడిచేసిన రాజమ్మ అనే మహిళ.. గతంలో ఎంజీఎంలో విధులు నిర్వహించినప్పటికీ తనపై ఉన్న అభియోగాలవల్ల విధుల నుంచి తొలగించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించేది లేదని, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్‌లో మళ్లీ వైద్యుల పట్ల కానీ, వైద్య సిబ్బంది పట్ల కానీ ఇలాంటి ఘటనలకు పాల్పడితే రౌడీషీట్ నమోదు చేయాలని సంబంధిత అధికారును ఆదేశించారు.

చెరువులలో గుర్రపుడెక్కను తొలగించాలి



అదనపు కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 10: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 9 చెరువులలో గుర్రపుడెక్కల ఆకులు నిండి ఉన్నాయని, గణపతి నిమజ్జనానికి గుర్రపుడెక్కల ఆకులతో అసౌకర్యంగా ఉంటుందని చిన్నవడ్డెపల్లి చెరువు ఆక్రమణ ఏరియా పరిరక్షణ సొసైటీ సభ్యులు తెలిపారు. మంగళవారం బల్దియా అదనపు కమిషనర్ చింతకుంట్ల రాజేందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. గణేశ్ నిమజ్జనం చేసే చెరువులలో గుర్రపుడెక్క ఏపుగా పెరిగి మురిగిపోవడంవల్ల దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ప్రధానంగా దేశాయిపేట చిన్నవడ్డెపల్లి చెరువు, మట్టెవాడ కోట చెరువు, ఉర్సు రంగసముద్రం, భద్రకాళి చెరువు, బెస్తం చెరువు, రంగశాయిపేట దామెర చెరువు, గొర్రెకుంట కట్టమల్లన్న చెరువు, ఖిలావరంగల్ మాల అగర్తల చెరువు, కాజీపేట బంధం చెరువులలో చెరువులు కలిపించకుండా గుర్రపు డెక్కల చెట్లు మొలిచాయన్నారు. గుర్రపు డెక్కల వల్ల వాతావరణంతో కలుషితం ఏర్పడుతోందని, వెంటనే చెరువుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అదనపు కమిషనర్‌ను కలిసిన వారిలో పెరుమాళ్ల లక్ష్మణ్, పోతన వెంకటేశ్వర్లు, బత్తుల మల్లిఖార్జున్ ఉన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2910	2805
పల్లికాయ (సూక)	6420	4500
పల్లికాయ (పచ్చిది)	4450	3400
కందులు	8852	6750
పెసళ్లు	8000	4552
పత్తి	7700	5500
పసుపు (కాడి)	13489	10000
పసుపు (గోల)	12424	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	16000	13000
యూఎస్341 ఏసీ	14800	11000
దేశీ ఏసీ	....	....
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

(5వ పేజీ తరువాయి)

ఆపద వస్తే అంతేనా?

3గంటల వరకు ఎక్స్‌కవేటర్ యంత్రంపైనే బిక్కుబిక్కుమంటూ నిరీక్షించారు. ఎన్డీఆర్ఎఫ్‌కు చెందిన రెండు హెలికాప్టర్ల సాయంతో ఆరు గురు కూలీలను సురక్షితంగా హనుమకొండ తరలించా రు. ఇక ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ శనివారం రాత్రి వరంగల్ జిల్లా నెక్కొండ మండలం వెంకటాపూర్ చెరువు అలుగులో చిక్కుని 40మందికి పైగా ఆర్టీసీ బస్సు ప్రయాణికులు 12గంటలకు పైగా ప్రాణాలను రాత్రంతా భయంభయంగా గడిపారు. మహబూబాబాద్ జిల్లాలో మానేరు వాగులో పడి యువ వ్యవసాయ శాస్త్రవేత్త అశ్వినితో పాటు ఆమె తండ్రి మోతిలాల్ మృతి చెందారు. ఇక రాళ్లవాగులో ఐదుగురు చిక్కుకపోగా రాత్రి 11.30గంటల ప్రాంతంలో నలుగురిని సురక్షి తంగా కాపాడినప్పటికి మరొకరి ఆచూకీ లేకుండా పోయింది. 2023 జూలై 27వ తేదీ వరదలకు వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలు నీట మునిగాయి. 200కి పైగా కాలనీలల్లో ప్రజలు పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చింది. ఏటా వరంగల్ నగరంలో వస్తున్న వరదలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగుతూనే ఉంది. విపత్తుల నుంచి ప్రజలకు సకాలంలో సహాయం అందటం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్ వచ్చేనా?

ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్‌ను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎస్‌డీఆర్‌ఎఫ్)ను ఏర్పాటు చేసింది. అగ్నిమాపక దళంలోని చురుకైన 100మంది ఉద్యోగులను ఎంపిక చేసి శిక్షణ కూడా ఇస్తుంది. ఈ ఎస్‌డీఆర్‌ఎఫ్ హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తుండటంతో వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఏటా వరంగల్‌నగరంతో పాటు గోదావరితీరంలోని ములుగు, భూపాలపల్లి జిల్లాలు, ఏజెన్సీ ప్రాంతమైన మహబూబాబాద్ జిల్లాలో ఏదో ఒక విపత్తు ఎదురవుతూ ఉంటుంది. భారీగా ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లుతుంది. దీనికి తోడు ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాలకు కూడా వరంగల్ కేంద్రంగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉండనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎక్కువగా ఈ జిల్లాల్లోనే విపత్తులు సంభవిస్తుండటంతో ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్‌ను మామునూరు 4వ బెటాలియన్‌కు అనుబంధంగా ఏర్పాటు చేసే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఎన్‌డీఆర్‌ఎఫ్ బెటాలియన్లు పని చేస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ వరంగల్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏర్పాటుకు చొరవ చూపాలని ఓరుగల్లువాసులు కోరుతున్నారు.

ఉద్యోగులకు వేతనం ఇవ్వడానికి జేఏసీ నాయకులు ఎవరు?

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా మూలవేతనం కట్ చేసి సీఎం సహాయ నిధికి ఇస్తామనడానికి జేఏసీ నాయకులు ఎవరని రెవెన్యూ ఉద్యోగుల నాన్ గెజిటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండమల్ల రవి ప్రశ్నించారు. ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ గురించి ఏనాడు ప్రస్తావించని ఈ జాక్‌లు.. రూ.100కోట్లు ఇస్తామని ఒకరు, రూ.130 కోట్లు ఇస్తామని ఇంకొకరు ఎవరికి వారే ప్రకటించడం కిందిస్థాయి ఉద్యోగులను కించపరచడమే అన్నారు. జాక్‌లతో తమకు ఎలాంటి సంబంధం లేదని, సీఎం సహాయనిధికి తమకు చేతనంత సహాయం తమ సంఘం తరుపున చేస్తామన్నారు. అదే విధంగా భూ సమస్యలను పరిష్కరించే దిశగా గ్రామస్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయాలన్నారు. ప్రకృతి వైపరిత్యాలు సంభవించినప్పుడు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండి అన్నివిధాలుగా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చేలా కృషిచేస్తామన్నారు.



నిధులివ్వాలని మంత్రికి నాయిని వినతి

హనుమకొండ సిటీ, సెప్టెంబరు 10: పశ్చిమ నియోజకవర్గంలోని రహదారులు, వంతెనల నిర్మాణం, అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ఈ మేరకు మంత్రిని కలిసి అభివృద్ధి పనుల వివరాలను తెలియచేశారు. నిధులు మంజూరు చేయాలని కోరారు.



మంత్రి కోమటిరెడ్డికి విన్నవిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కేయూ భూ కబ్జాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీలో భూకబ్జాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు ఇతర రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వర్సిటీ భూములను రక్షించాలని కేయూ భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్వీ) వర్సిటీ అధ్యక్షుడు భైరపాక ప్రశాంత్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ మాచర్ల శరత్‌చంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు భూకబ్జాలపై విచారణ చేపట్టారు. సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ నేతృత్వంలో విద్యార్థి సంఘాల నేతలు కలిసి కబ్జాల వివరాలను అధికారులకు విన్నవించి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రాకేశ్ యాదవ్, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు గొల్లపల్లి వీరస్వామి, కందికొండ తిరుపతి, రత్నం అశోక్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ అందజేత

ఐనవోలు, సెప్టెంబరు 10: ఒంటిమామిడిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ దంపతులు ఆడెపు స్రవంతిదయాకర్ గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ (శవాన్ని భద్రపరిచే)ను అందజేశారు. తన తండ్రి ఆడెపు సుధాకర్ జ్ఞాపకార్థం సుమారు రూ.80వేల విలువచేసే ఫ్రీజర్‌ను తయారుచేయించి మంగళవారం గ్రామ ప్రత్యేక అధికారి ఎంపీవో రఘుపతిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బుర్ర వేణులకు అప్పజెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని కాకాజీకాలనీ, హనుమకొండ చౌరస్తా, బస్టాండ్ రోడ్డు, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు.

సిద్ధేశ్వర గుండాన్ని పరిశీలించిన పోలీసులు

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: వినాయక నిమజ్జనం నేపథ్యంలో హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్ధేశ్వర గుండాన్ని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ వై.సతీష్ మంగళవారం పరిశీలించారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అపశృతులు చోటు చేసుకోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై ఇతరశాఖ అధికారులతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాపెల్లి బాలరాజు, విద్యుత్‌శాఖ ఏడీఈ మల్లికార్జున్, వైద్యురాలు మౌనిక, ఇరిగేషన్ ఏఈ రాజు, మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ పోరాట అస్థిత్వం చాకలి ఐలమ్మ

శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

బీఆర్ఎస్ కార్యాలయంలో ఐలమ్మ వర్ధంతి



ఐనవోలులో నివాళులు అర్పిస్తున్న జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లెంగుల యాదగిరి



అంబేద్కర్ విగ్రహం వద్ద చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

రాంనగర్, సెప్టెంబర్ 10: భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మ తెలంగాణ పోరాట అస్థిత్వమని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ కొనియాడారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. బండా ప్రకాశ్‌తో పాటు పలువురు నేతలు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు పీడిత ప్రజల ప్రతీక చాకలి ఐలమ్మ అన్నారు. మన అస్థిత్వానికి మనం ఇచ్చే సముచిత గౌరవం ఐలమ్మ విగ్రహాలను ప్రతిష్టించడమేనన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మహనీయులను గుర్తించి జయంతులను, వర్ధంతులను అధికారికంగా నిర్వహించారని బండా ప్రకాశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు పులి రజనీకాంత్, బొంగు అశోక్, చెన్నం మధు, సోదా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

- కేయూ క్యాంపస్ : చాకలి ఐలమ్మ స్ఫూర్తితోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామని తెలంగాణ రజక విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తెరపల్లి దామోదర్ అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట తెలంగాణ వీరనారి చాకలి అయిలమ్మ 39వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కత్తెరపల్లి దామోదర్, హసన్‌పర్తి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేయూ రజక విద్యార్థి సంఘం ఇన్‌చార్జి కొరపల్లి రాజేశ్, సీనియర్ బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ పాలమాకుల కొమురయ్య, డాక్టర్ అరూరి రంజిత్‌కుమార్, కందికొండ తిరుపతి, ప్రశాంత్, పోచంపల్లి రఘుపతి, ఐలోని అభిషేక్, బీసీ సంఘ కేయూ ఇన్‌చార్జి అరెగంటి నాగరాజు, అనిల్, శ్రావణ్, పాల్గొన్నారు.
- కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ ఎదుట ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నేతలు రమేశ్, సురేఖ, రామ్, తిలక్, రాజు, సురేశ్, సతీశ్, చైతన్య, చరణ్, తదితర వర్సిటీ విద్యార్థులు పాల్గొన్నారు.
- వరంగల్ ఎడ్యుకేషన్: వరంగల్‌లో చాకలి ఐలమ్మ మ్యూజియంను ఏర్పాటు చేయాలని డీఎంఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్ డిమాండ్ చేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో డీఎంఎస్‌ఏ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. టీజేఏఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునిల్, డీఎంఎస్‌ఏ నాయకులు తాగూర్, కలాం, జీవన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.
- వడ్డేపల్లి : నిజాం నిరంకుశత్వాన్ని, భూస్వాముల పెత్తందారీ వ్యవస్థను ఎదురొడ్డి గడగడలాడించిన వీరనారి చాకలి (చిట్యాల) ఐలమ్మను మహిళలు స్ఫూర్తిగా తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల సంపత్‌కుమార్, బీసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు మాడిశెట్టి అరుంధతి, బీసీ నేతలు పద్మజాదేవి, వనజ, అరేగంటి నాగరాజు, హరిప్రసాద్, డాక్టర్ ఒడితల రాము, దాడి రమేష్ యాదవ్, పెరుమాండ్ల అనిల్ పాల్గొన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్యాల బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు సింగారపు ఐలయ్య, మంత్రి చాణక్య, మేకల ప్రవీణ్, ప్రతాప్, డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.
- హసన్‌పర్తి: దేవన్నపేటలో శ్రీమడలేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని అధ్యక్షుడు పోలెపెల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ గుగులోతు దివ్యరాణిరాజునాయక్, మాజీ ఎంపీటీసీ పంజాల భూపాల్ గౌడ్, మాజీ సర్పంచ్ రవి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్, రజక సంఘం కుల పెద్దలు చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె జ్ఞాపకార్థం గ్రామంలో పండ్లు పంపిణీ చేశారు.
- ఐనవోలు: రజకుల హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని అఖిల భారతీయ ధోబీ మహాసమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉల్లేంగుల యాదగిరి పిలుపునిచ్చారు. రజక సంఘం మండల అధ్యక్షుడు చాగంటి హనుమయ్య అధ్యక్షతన మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఐనవోలులో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు భిక్షపతి, యాదగిరి, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది సారంగపాణి, రజక సంఘం జిల్లా మండల నాయకులు గువ్వల శేఖర్, లొంక రామస్వామి, బొంగ సుధాకర్, కొల్లు రమేష్, చాగంటి యాదగిరి పాల్గొన్నారు.
- హనుమకొండ చౌరస్తా: తెలంగాణ రజక నవ నిర్మాణ సంఘం హనుమకొండ ఆధ్వర్యంలో హనుమకొండ వేయిస్తంభాల ఆలయం ఎదురుగా ఉన్న చిట్యాల ఐలమ్మ పార్కులో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి హాజరై చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. రాయపుర చమన్ (పార్క్)కు చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా పాఠ్యాంశాల్లో చాకలి ఐలమ్మ జీవిత చరిత్రను భవిష్యత్‌తరాలకు తెలియజేసేలా విద్యాశాఖ చొరవ తీసుకోవాలని కోరారు. బస్వరాజు కుమార్ మాట్లాడుతూ.. విస్నూర్ దొరకు ఎదురొడ్డి పోరాడి తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకభూమిక పోషించిన గొప్ప మహిళ ఐలమ్మ అని కొనియాడారు. తెలంగాణ రజక నవ నిర్మాణ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ.. గ్రామ గ్రామాన చాకలి ఐలమ్మ విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరామోజు నాగసోమేశ్వర్‌రావు, చీకటి వీరస్వామి, కన్నతల్లి ఫౌండేషన్ ప్రతినిధులు రాజన్‌బాబు, సురేందర్, సాంబయ్య, సామ్రాజ్, దశరథం, రాచర్ల కనుకయ్య, సారంగం, శేఖర్, కాకతీయ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- కాజీపేట: కాజీపేట సిద్ధార్థనగర్‌లో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ నార్లగిరి రామలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు నార్లగిరి రమేశ్, ఎం. రమేశ్, గజ్జెల శ్రీనివాస్, అఫ్జల్, మాచర్ల ప్రభాకర్, బీజేపీ నాయకులు బాబురావు, చాంద్‌పాషా, భగవాన్ ఉపాధ్యాయతోపాటు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.
- మడికొండ : భూమి కోసం, భుక్తి కోసం రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం మడికొండలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

రూ.1.10కోట్ల చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాగరాజు



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే నాగరాజు, పక్కన టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావులు

ఐనవోలు, సెప్టెంబరు 10: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు అన్నారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 91 మంది లబ్ధిదారులకు రూ.91 లక్షల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులతోపాటు సీఎం సహాయ నిధి నుంచి 70 మంది బాధిత కుటుంబాలకు రూ.18లక్షలు మొత్తం రూ.1.10 కోట్ల విలువచేసే చెక్కులను మంగళవారం ఐనవోలులో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన ఐనవోలు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నామని తెలిపారు. టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతోందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విక్రమ్‌కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ స్థాయి నాయకులు పాల్గొన్నారు. అధికారిక చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందని కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలే నొచ్చుకున్నారు. వేదికపై గ్రామానికి ఒక నాయకుడు చొప్పున సుమారు 20 మంది నాయకులు కూర్చోవడం అధికారులను ఇబ్బందికి గురిచేసింది. వేదికపై కూర్చున నాయకులను కిందికి పొమ్మనలేక తహసీల్దార్ కార్యక్రమాన్ని అలాగే కొనసాగించారు.

ఎస్సై శ్రీనివాస్‌కు అభినందనలు

ఐనవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే నాగరాజు, టెస్కాబ్ చైర్మన్‌లు అభినందించారు. పంథిని, పెరుమాండ్లగూడెం తదితర గ్రామాల్లో సొంత ఖర్చుతో కాలువల్లో చెట్లను తొలగింపచేసి మొరాన్ని గుంతల్లో పోసి ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎస్సై సామాజిక బాధ్యతగా చేస్తున్న సేవలను గుర్తించి ఆయనకు శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు

హసన్‌పర్తి: కాంగ్రెస్ పాలనలోనే అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాసురోడ్డు వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో మంగళవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 152 మంది లబ్దిదారులకు రూ.1.52కోట్ల విలువ గల కల్యాణలక్ష్మీ, అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 110 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.32.28 లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రహీమ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఫాజిల్, రాజేంద్రప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ కేతపాక సునితరాజు, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సందడిగా జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 10: వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. వరంగల్ జిల్లా స్థాయి అండర్-8, 10, 12, 14, 16, 18, 20 బాలబాలికల విభాగంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలను మంగళవారం వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మూగల కుమార్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలలో పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అసోసియేషన్ కార్యదర్శి యుగేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపికపోటీలలో 700మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. 60, 100, 150, 200, 400, 800, 1000, 1500, 3000 మీటర్ల పరుగు పందెం, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, హ్యామర్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, బ్రాడ్‌జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పోటీలను నిర్వహించామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లను ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న 10వ తెలంగాణ రాష్ట్రస్థాయి సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా కార్యదర్శి సారంగపాణి, పీఈటీలు వాసు, మనోజ్‌కుమార్, రజినీకాంత్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ అధ్యాపకులకు న్యాయం చేయాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీలో రెగ్యులర్, ఎస్ఎఫ్‌సీ కోర్సుల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులకు జీవో నెంబరు 11, 141లను వెంటనే రద్దు చేసి కాంట్రాక్టు అధ్యాపకులుగా అప్‌గ్రేడ్ చేసి న్యాయం చేయాలని పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌కుమార్, డాక్టర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.నాగేశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కేయూ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రాన్ని అందచేశారు. పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం నేతలు, నాయకులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 10: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం హంటర్‌రోడ్డులోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరిగే పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి శంభునాథ్ తుండియా హాజరవుతున్నారన్నారు.

అన్నం పెట్టిన ఇంటికే కన్నం

(5వ పేజీ తరవాయి)

అపహరించాడు. దీంతో బాధితులు సుబేదారి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సుబేదారి ఎస్సై శ్రీకాంత్ పోలీస్ సిబ్బందితో మంగళవారం అదాలత్ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న ఎల్లపు సాయికుమార్ పారిపోతుండగా పట్టుకుని విచారణ చేశారు. నేరం చేసినట్టు ఒప్పుకోవడంతోపాటు అతడిపై కేసు నమోదు చేసి నాలుగు జతల బంగారు చెవి కమ్మలు, ఒక బంగారు చైన్, ఒక స్మార్టుఫోన్, బ్యాంకు డెబిట్‌కార్డులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, విశాఖపట్నంలో సాయికుమార్‌పై గతంలో మూడు కేసులు ఉన్నట్లు తెలిపారు. కాగా, నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ పాపయ్య, కానిస్టేబుల్ లియాఖత్ ఆలీని సీఐ సత్యనారాయణరెడ్డి అభినందించారు.

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 10: కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ కేయూ నేత ఆకుతోట రాంచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాగుల రమేశ్ హాజరై మాట్లాడారు. వర్సిటీ ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు కావడం లేదన్నారు. వెంటనే అందరికీ ఈఎస్ఐ, పీఎఫ్ వచ్చేలా వర్సిటీ ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. వర్సిటీలోని 81 మంది బోధనేతర సిబ్బందికి పీఆర్‌సీని వెంటనే క్లియర్ చేసి చెల్లింపులు జరపాలని కోరారు. జీవో నెంబర్ 16 మేరకు వర్సిటీల్లోని కాంట్రాక్టు, డెయిలీవైజ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని చెప్పారు. పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. వర్సిటీలో ఉద్యోగుల సమస్యలపై మూడు రోజుల పాటు సీఐటీయూ నేతృత్వం లో అన్ని విభాగాలను తిరిగి అధ్యయనం చేపడుతామని చెప్పారు. సర్వేలో వచ్చిన అంశాల ఆధారంగా వర్సిటీలో ఉద్యోగుల తరుపున ఉద్యమాలు చేపడుతామని వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మెట్టు రవి, యూనియన్ ప్రధాన కార్యదర్శి దేశిని రవికుమార్, కచ్చకాయల చిరంజీవి, వల్లం రాజు, సంగాల రాజు, సందీప్, శోభ, రాజేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు నవరాత్రి వేడుకలు



కుంకుమపూజలో పాల్గొన్న మహిళలు

▸▸ వేయిస్తంభాల ఆలయంలో దూండి గణపతిగా దర్శనం

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 10: వేయిస్తంభాల ఆలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి వేడుకలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. మూలగణపతికి సుప్రభాత సేవ, నిత్య పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో డుండి గణపతిగా ప్రత్యేకంగా అలంకరింపజేసి పూజాదికాలు నిర్వహింపజేశారు. గణపతి సూక్త మంత్ర పఠనంతో పాయసన్నంతో నైవేద్యం చేశారు. యాగశాలలో లోకకల్యాణార్థం గణపతి నవగ్రహ హోమం నిర్వహించారు. నందివాహనంపై వాహన సేవ నిర్వహించారు. నిత్య అన్నదానం కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కాంట్రాక్టర్ వేముల సత్యమూర్తి సతీమణి ఉమాదేవి స్వయంగా పాల్గొని భక్తులకు వడ్డించారు. ఈ పూజా కార్యక్రమంలో వడ్డె ప్రకాశ్ పద్మావతి దంపతులు, ఉషా రాజన్న దంపతులు పూజా కార్యక్రమాలకు ఉభయ దాతలుగా వ్యవహరించారు. గోపీనాథ్, చంద్రశేఖర్, గంధ్రాతి రాజు తదితర సేవా సమితి సభ్యులు సేవలందించారు.



అన్నదానం చేస్తున్న వేముల ఉమాదేవి

- హనుమకొండ టౌన్: గోపాలపురం క్రాస్‌రోడ్డులోని ఆదర్శకాలనీలో గణపతి నవరాత్రులను పురస్కరించుకొని మంళవారం కాలనీ మహిళలు కుంకుమపూజ చేశారు. ఆదర్శ గజానన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుంకుమపూజలో పురోహితుడు నిమ్మటూరి వేణుగోపాల్ శర్మ మంత్రోచ్ఛరణాల మధ్య మహిళలు గణపతికి నిష్టగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గజానన మండలి కన్వీనర్ తూడి విద్యాసాగర్‌రెడ్డి, కో- కన్వీనర్ కూసగాని కుమారస్వామి, సభ్యుడు దొండపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఏనుగుల రాంరెడ్డి, కర్రె తిరుపతిరెడ్డి, పున్నం శ్రీను, అలుక జైపాల్‌రెడ్డి, పొలాల వెంకట్, శ్యాంసుందర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, ఆదర్శ మహిళా మండలి సభ్యులు స్వప్న, మంజుల, రజని, రజిత, సుమలత, పావని, ఆదర్శ కాలనీవాసులు పాల్గొన్నారు.
- హసన్‌పర్తి: హసన్‌పర్తి గాంధీనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం దాత గోపరాజు యాదగిరి లక్ష్మీ దంపతులు మహాన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.
- న్యూశాయంపేట: 31వ డివిజన్ న్యూశాయంపేటలోని లక్ష్మీ గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద స్థానిక మహిళలు మంగళవారం కుంకుమ పూజ చేశారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కుంకుమ పూజ చేయడం ఆనందంగా ఉందని మహిళలు తెలిపారు.
- కాజీపేట: కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో మంగళవారం గణపతికి లక్షగరికలతో ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్యక్రమం నిర్వాహకులు ఐనవోలు రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తులతో గరిక పూజలు చేయించారు. భక్తులు గణపతి నామాలు చదువుతూ భజనలతో పూజలు చేశారు. గణపతిని గరికలతో పూజిస్తే కోపతాపాలు నశిస్తాయని, కోరికలు నెరవేరుతాయని, మానసిక ప్రశాంతత కలుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పూజల్లో పూజారులు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి Classifieds
Wanted · Real Estate · Health · Beautician · Jobs · For Sale

WANTED HOSPITAL STAFF
★ LAB TECHNICIANS-BOYS ★ PHARMACY BOYS (మందుల షాపు) ★ OT BOYS కావలెను. సంప్రదించండి: GUARDIAN HOSPITAL, MULUGU 'X' ROAD, WARANGAL. 12 TO 2 PM.
AJW-0426

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పేషెంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం 25K. క్వాలిఫికేషన్ : ఏదైనా డిగ్రీ. ఫోన్ : 8977547749
AJH-002651

WANTED
★ వరంగల్, పరకాల, భూపాలపల్లి, కాటారం, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, జనగాం.TGYT న్యూ బ్రాంచ్ నందు ASM,SSM,SM,PA,IC. పోస్టులకై 10 to డిగ్రీ చదివిన స్త్రీలు మరియు పురుషులు కావలెను. సంప్రదించండి: 9492505566
AJW-5728

PLOT FOR SALE
★ HNK Kits, కాలేజ్ అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గరలో 466 చ॥గ ప్లాటు(40x105) అమ్మబడును. సంప్రదించండి: 9553255936.
AJW-199018

WANTED
★ హన్మకొండ, వరంగల్, లోకల్‌లో పని చేయుటకు సూపర్‌వైజర్స్, సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12,000-14,000. 8గం॥, 12గం॥ కలవు. సంప్రదించండి: 6300959432
AJW-199098

KUDA PLOTS FOR SALE
★ Cityకి అతి దగ్గరలో GWMC పరిధిలో వెంటనే ఇళ్ళు నిర్మించుకునే KUDA PLOTS అమ్మబడును. N, E, W, Facingలో కలవు. సంప్రదించండి: 9666864866
AJW-199095

WANTED
★ హన్మకొండ, కొత్తూరుజెండాలో 60 సం॥ల కల్గిన మంచంపై నున్న వ్యక్తికి అన్ని పనులు చేయుటకు పురుషులు/భార్యాభర్తలు ఇంటి, వంట పని చేస్తూ ఓపిక ఉన్న వారు కావలెను. సంప్రదించండి: 9908351387
AJW-199173

TO-LET
★ 250 sft గల 2 షట్టర్స్ రోడ్డు ఇండస్ట్రియల్ ఎస్టేట్ నందు షాపులకు, గోదాములకు, వర్క్ షాపులకు గాని కిరాయికి ఇవ్వబడును సెల్: 984823809
AJW-199019

WANTED
★ మా హోటల్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. భార్యాభర్తలకు అవకాశం కలదు. జీతం: 14000 ఇవ్వబడును (Food & Accommodation) సంప్రదించండి: 9703455400
AJW-199187

CHANGE OF NAME
★ I, ANUSHA RANI.K (Old Name) H.No:55-1-571, Bheemaram(vil), Hasanparthy (md), Hanamkonda. Dist pin 506015. T.S., Here by Declare That. I, Have Changed my name ANUSHA RANI KIRAN (New Name) for all Purpose.
AJW-199099

కంగన్ హాల్ అమ్మబడును
★ హన్మకొండ అదాలత్‌లో గల కంగన్ హాల్ ఫర్నీచర్‌తో సహా అమ్మబడును. సంప్రదించండి: 8328017313
AJW-199100

CHANGE OF NAME
★ I KUNDURU UPENDRA REDDY S/o. KUNDURU RAMANA REDDY R/o. 2-8-701, Excise Colony, Bhavani Nagar, Hanamkonda, Telangana-506001. Declare That I, Changed My Name From KUNDURU UPENDRA REDDY to KUNDUR UPENDRA REDDY and My Spouse Name KUNDURU PREMALATHA to KUNDUR PREMA LATHA.
AJW-5735

WANTED
★ గత 10 సం॥లుగా నగరంలో ఉన్న సాఫ్ట్‌వేర్ కంపెనీలో వాచ్‌మెన్-క్లీనర్‌గా పనిచేయుటకు భార్యాభర్తలు కావలెను. (నివాస వసతి కలదు) మగవారికి బైక్ డ్రైవింగ్ వచ్చి, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండవలెను. అడ్రస్ : VJL IT AUGMENTS PVT.,LTD. సంతోషిమాత గుడి వెనుక, హంటర్ రోడ్, వరంగల్. సెల్ : 9849404363
AJW-199185

CHANGE OF NAME
★ I, DONTHI KISTAIAH S/o. MALLAIAH (Old Name) H.No: 31-3-671/1. Sapthagiri Colony Road No. 07,Near Victory School, Gopalpur. Hanamkonda Dist: Hanamkonda, Telangang pin: 506009. I Have Changed my name DONTHI KISTAIAH S/o. MALLAIAH to DONTHI KRISHNA REDDY S/o DONTHI MALLA REDDY (New Name) for all Future purposes
AJW-188291

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ : నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్.రావు. Cont : 9849145043, 9866584455.
AJW-199061

సిద్ధివినాయక వాటర్ ప్రూఫింగ్
★ మీ ఇల్లు కారుతుందా! స్లాబ్ లీకేజ్, గోడ చెమ్మలు, గోడ క్రాకులు, స్లాబ్ పెచ్చులు ఊడిపోతున్న బాత్ రూమ్ లీకేజిలు బ్రాండెడ్ కెమికల్స్‌తో టెక్నికల్‌గా 10 సం.ల గ్యారంటీతో వాటర్ ప్రూఫింగ్ చేయబడును. సంప్ర: 7989775119
AJH-002600

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ 9985400013, 8978510273
వరంగల్ 9985406150, 9985408173
జనగామ 9866431354
మహబూబాబాద్ 9985418040
తొర్రూర్ 9985418040
నర్సంపేట 9985418040
భూపాలపల్లి 9985401232
పరకాల 9985401232

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఓటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే. అదనపు లైనుకు రూ. 45/-

3+2 స్కీం కలదు

గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.



విన్నర్

విజయం ఎప్పుడూ మధురమే. కానీ దానికి పునాది ఓటమి. ఈ చేదు నిజం... బెలారస్ టెన్నిస్ తార అరినా సబలెంక అనుభవ పాఠం. అందుకే ఓడిన ప్రతిసారీ కెరటంలా ఉవ్వెత్తున ఎగసింది. పట్టు వదలని ప్రయత్నంతో... మూడేళ్లుగా ఊరిస్తున్న యూఎస్ ఓపెన్ టైటిల్‌ను ముద్దాడింది. ఆమె ప్రయాణంలో గెలుపు మజిలీలే కాదు... నోరు జారి కొని తెచ్చుకున్న వివాదాలు... మోడల్‌ను తలపించే ఫ్యాషన్ పరేడ్‌లూ... ఇంకా ఎన్నో ఉన్నాయి.



రాకెట్‌లా దూసుకెళుతూ...

ఈ ఏడాది మార్చిలో సబలెంక మాజీ ప్రియుడు, ఐస్ హాకీ క్రీడాకారుడైన 42 ఏళ్ల కాన్‌స్టాన్టిన్ ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే ఇద్దరూ విడిపోయినా... ఆ ఘటన ఆమెను తీవ్ర మనోవేదనకు గురి చేసింది. తన బాధను బహిరంగంగానే వ్యక్తం చేసింది. కానీ అంతటి విషాదంలోనూ... రాకెట్ పట్టి... ఆట కొనసాగించింది. అన్నిటికీ మించి మూడేళ్లుగా అందని ద్రాక్షలా ఉన్న యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకుంది. 2021లో ఈ టోర్నీ సెమీస్ వరకు వచ్చి నిరాశపర్చిన సబలెంక... మరుసటి ఏడాది కూడా అదే స్థానంతో సరిపెట్టుకుంది. అయితే గత ఏడాది మరో మెట్టు ఎక్కింది. తుది పోరుకు చేరి... రన్నరప్‌గా నిలిచింది. టైటిల్ సాధించాలన్న ఆమె కల మరోసారి నెరవేరలేదు. అలాగని అంతటితో ఆట అయిపోలేదు. మరింత ఫామ్‌ను సంతరించుకున్న సబలెంక... ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి... టైటిల్‌ను నిలబెట్టుకుంది. ఎలాగైనా ఈసారి యూఎస్ ఓపెన్ కప్‌ను ముద్దాడాలన్న సకల్పంతో కఠోరంగా శ్రమించింది. దాని కోసం ఒలింపిక్స్‌ను సైతం త్యాగం చేసింది.



కల నెరవేరిన వేళ...

మాజీ ప్రియుడు చనిపోయిన తరువాత సబలెంక ఆడిన తొలి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్. ఒక్క మ్యాచ్ మినహా ఫైనల్‌తో సహా ఆమె వరుస సెట్లలో ప్రత్యర్థులను మట్టి కరిపించింది. జెస్సికా పెగులాతో జరిగిన అంతిమ పోరు తొలి సెట్‌లో సర్వీస్ కోల్పోయి తడబడింది. ఇక సెట్ గెలవడం కష్టం అనుకున్న దశలో చెలరేగింది. వరుసగా ఐదు పాయింట్లు గెలిచి, సెట్‌నూ సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో కూడా పెగులా నుంచి గట్టి పోటీ ఎదురైనా, అనుభవంతో దాన్ని అధిగమించి తన ఖాతాలో తొలి యూఎస్ ఓపెన్ టైటిల్‌ను వేసుకుంది. కలల ట్రోఫీతో పాటు 3.6 మిలియన్ డాలర్ల ప్రైజ్‌మనీని ఇంటికి తీసుకువెళ్లింది. అంతేకాదు, ఒకే ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్, యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన ఐదో మహిళగా ఆమె రికార్డులకు ఎక్కింది.

'నన్ను చూసి నేనే గర్వపడుతున్నా'...

మ్యాచ్ అనంతరం ఎంతో భావోద్వేగానికి లోనైన సబలెంక... 'నన్ను చూసి నేనే గర్వపడుతున్నా. ఇలా నేను ఎప్పుడూ మాట్లాడలేదు. కానీ ఈ విజయం నాకు అంతటి సంతృప్తిని, సంతోషాన్ని, నాపై నాకు ఎనలేని నమ్మకాన్ని ఇచ్చింది. నా కల నెరవేర్చుకొనే దిశలో నా నమ్మకాన్ని నేను ఎప్పుడూ కోల్పోలేదు' అంటూ తన ఉద్వేగంగా చెప్పిన సబలెంక... ఈ గెలుపును తన కుటుంబానికి అంకితమిచ్చింది. 'నా ఉన్నతి కోసం ఎంతో శ్రమించిన మా నాన్న చనిపోయినప్పటి నుంచి నా లక్ష్యం ఒక్కటే... టెన్నిస్ చరిత్రలో మా కుటుంబం పేరు చిరస్థాయిగా నిలవాలని. ట్రోఫీ మీద నా పేరు చూసిన ప్రతిసారీ నా కుటుంబాన్ని చూసి గర్వపడతా. నా కలలను వారివిగా చేసుకుని, అన్నింటా మద్దతుగా నిలిచి, ఎంతో ప్రోత్సహించారు' అంటూ ఉద్వేగానికి గురైంది 26 ఏళ్ల సబలెంక. ఐదేళ్ల కిందట అనారోగ్యంతో ఆమె తండ్రి సెర్గే మరణించారు. ఆయన ఐస్ హాకీ ఆటగాడు.

వివాదాలకు కేంద్రం...

2023లో 'ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్' (ఐటీఎఫ్) నుంచి ప్రతిష్ఠాత్మక 'ప్రపంచ చాంపియన్ అవార్డు'ను అందుకున్న సబలెంక... బలమైన సర్వ్, గ్రౌండ్ స్ట్రోక్స్‌కు పెట్టింది పేరు. దూకుడుగా ఆడడం ఆమె శైలి. కోర్టులో ఉన్నంతసేపూ ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసే సబలెంక పేరు... నిత్యం ఏదో ఒక వివాదంలో వినిపిస్తుంటుంది. అందుకు ప్రధాన కారణం ఆమె నోటి దురుసు అనేది పలువురు సీనియర్ల మాట. ఒక మాజీ టెన్నిస్ ఆటగాడితో ముఖాముఖీలో కూడా అభ్యంతరకర పదం ఉపయోగించి మరోసారి అందరి నోట్లో నానింది. ఎందుకలా అని అడిగితే... 'బహుశా అది నా రక్తంలోనే ఉందేమో' అంటూ నవ్వేస్తుంది ఈ బెలారస్ భామ.

అనుకోకుండా అలా...

బెలారస్ రాజధాని మిన్‌స్క్ నగరంలో పుట్టిన సబలెంక అనూహ్యంగా టెన్నిస్ రాకెట్ పట్టింది. 'ఒక రోజు నాన్నతో కలిసి కారులో వెళుతుంటే... దారిలో టెన్నిస్ కోర్టులు కనిపించాయి. వెంటనే నన్ను అక్కడికి తీసుకువెళ్లారు. కోర్టుతో పాటు ఆట కూడా నాకు బాగా నచ్చింది. ఆ రోజంతా అక్కడ ఉత్సాహంగా గడిచిపోయింది. బాగా ఆస్వాదించాను. అలా టెన్నిస్ రాకెట్ పట్టాను. నాలోని ప్రతిభ చూసి 2014లో నాన్న నన్ను తీసుకువెళ్లి స్థానిక 'జాతీయ టెన్నిస్ అకాడమీ'లో చేర్చారు. మరుసటి ఏడాది చిన్న చిన్న టోర్నమెంట్లలో పాల్గొన్నాను. ఐటీఎఫ్ దిగువ స్థాయి పోటీల్లో డబుల్స్, సింగిల్స్ ఆడుతూ వచ్చాను' అంటూ చెప్పుకొచ్చిన సబలెంక... అంతకు రెండేళ్ల ముందే జూనియర్స్‌కు అర్హతా ఉన్నా... ఐటీఎఫ్ ఉమెన్స్ సర్క్యూట్‌లో పోటీపడింది.

డబుల్స్‌తో మొదలుపెట్టి...

సబలెంక పేరు దేశ వ్యాప్తంగా పరిచయం అయింది 2017లో. ఆమె సారథ్యంలోని బెలారస్ 'ఫెడ్ కప్' టీమ్ రన్నరప్‌గా నిలిచింది. టాప్ 75 ర్యాంకుల్లో లేని జట్టు గెలుపు... అప్పట్లో సంచలనంగా మారింది. తరువాత అద్భుత విజయాలు నమోదు చేసుకున్న సబలెంక... 2018, 19 ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో పదకొండో స్థానానికి ఎగబాకింది. రెండేళ్లకు రెండో ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. 2023లో ఆమె కెరీర్‌లోనే పెద్ద మలుపు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి, తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను తన పేరిట లిఖించుకుంది. ఈ ఏడాది ఆ టైటిల్‌ను నిలబెట్టుకోవడమే కాకుండా... ఎప్పటి నుంచో ఊరిస్తున్న యూఎస్ ఓపెన్ కూడా నెగ్గడం... సబలెంకలోని దీక్షాదక్షతకు నిదర్శనం. వీటికి ముందు ఆమె... ఎలైజ్ మెర్టెన్స్‌తో జతకట్టి యూఎస్ ఓపెన్ (2019), ఆస్ట్రేలియన్ ఓపెన్ (2021) డబుల్స్ గ్రాండ్‌స్లామ్ నెగ్గింది. సబలెంక కెరీర్‌లో ఇప్పటికి మొత్తం 22 టైటిల్స్ ఉన్నాయి. అందులో 16 సింగిల్స్, 6 డబుల్స్ టైటిల్స్. గత ఏడాది ప్రపంచ నెంబర్ వన్ ర్యాంక్‌కు దూసుకుపోయిన ఆమె... ప్రస్తుతం రెండో ర్యాంక్‌లో కొనసాగుతోంది.

'ది వారియర్ ప్రిన్సెస్'...

ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ క్రీడాకారులకు స్పాన్సర్లు దొరక్క ఇబ్బంది పడుతున్న తరుణంలోనూ... సబలెంక బడా బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా వ్యవహరిస్తోంది. ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్స్‌లో పెట్టుబడులు కూడా పెట్టింది. టెన్నిస్ కోర్టులో శక్తిమంతమైన షాట్లతో ప్రత్యర్థులతో ఎంతలా ఆడేసుకొంటుందో... కోర్టు బయట విభిన్న ఆహార్యంతో అంతగా మతి పోగొడుతుంది. మోడల్స్‌కు మించిన ట్రెండీ టచ్‌తో నిత్యం తన అభిమానులకు పండగ చేస్తుంది. ఇన్‌స్టాలో ఆమెకు దాదాపు పాతిక లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఎప్పటికప్పుడు తన అనుభవాలను ఇన్‌స్టాలో పంచుకొంటూ... ఔత్సాహికుల్లో ఉత్సాహాన్ని, స్ఫూర్తిని నింపుతుంది. టెన్నిస్ సర్కిల్‌లో 'ది వారియర్ ప్రిన్సెస్'గా పేరు గడించిన ఈ తార... ప్రస్తుతం బ్రెజిల్‌కు చెందిన 'ఓక్‌బెర్రీ' బ్రాండ్ అధిపతి జార్జియస్ ఫ్రాంగులిస్ ప్రేమలో మునిగి తేలుతోంది.

తెలుగు నేలమీద విరాజిల్లిన తొలి తరం సామ్యవాద, సంఘసంస్కరణ ఉద్యమాలకు ప్రత్యక్ష సాక్షి... పరిటాల సరళా కుమారి. సామాజిక, ఆర్థిక రంగ విశ్లేషకుడిగా తెలుగు పాఠకులకు గణాంకాల విలువలను తెలిపిన ప్రముఖ జర్నలిస్టు వి.హనుమంతరావు సతీమణి. ఆయన శతజయంతి సంవత్సరం సందర్భంగా తమ జీవిత విశేషాలను సరళా కుమారి 'నవ్య'తో పంచుకున్నారు.

ఆ పేరు పెట్టడమే ఆయన గొప్పతనం

"ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా 30 ఏళ్లకు పైగా పని చేశాను. పిల్లల కోసం ఎన్నో గేయాలు రాశాను. నా విద్యార్థులు ఎంతోమంది డాక్టర్లుగా, లాయర్లుగా, ఇంజనీర్లుగా... ఇలా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. అయినా, ఒక టీచర్‌గా కన్నా ఒక నికార్సయిన జర్నలిస్టు భార్యగా మరింత గర్వపడతాను. నా భర్త వి.హనుమంతరావు మంచి పాత్రికేయుడు మాత్రమే కాదు, అంతకు మించి గొప్ప మానవతావాది. ఆయన ఔన్నత్యం గురించి చెప్పడానికి ముందుగా మా కుటుంబ నేపథ్యాన్ని ప్రస్తావించాలి. మా సొంతూరు కృష్ణా జిల్లా వెల్దిపాడు. నా చిన్నతనంలోనే మా నాన్న అనారోగ్యంతో మాకు దూరమయ్యాడు. పులి మీద పుట్రలా నాకన్నా పదేళ్ళు పెద్దయిన మా కృష్ణవేణి అక్క భర్తను పోగొట్టుకొని పుట్టింటికి చేరింది. దాంతో మా అమ్మ పరిటాల అనంతమ్మ మమ్మల్ని వెంటపెట్టుకొని నూజివీడు దగ్గర గొల్లపల్లిలోని తన తోబుట్టువు ఇంటికి చేరింది. అప్పటికే మా పెద్దమ్మ కొడుకు పొట్లూరి రాఘవయ్య భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త కావడంతో... మాకూ సామ్యవాదం పరిచయం అయింది. కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధాజ్ఞలు కొనసాగుతున్న సమయంలో బాల కొరియర్‌గా అజ్ఞాతంలో ఉన్న కొండపల్లి సీతారామయ్య, చండ్ర రాజేశ్వరరావు తదితర నాయకులకు సమాచారాన్ని బట్వాడా చేయడం, కరపత్రాలు పంచడం లాంటి పనుల్లో చురుగ్గా పాల్గొన్నాను.

సాహిత్య పరిచయం...

ఆనాటి కమ్యూనిస్టులు దోపిడీ వ్యతిరేక పోరాటానికే పరిమితం కాకుండా, సంఘ సంస్కరణ బాధ్యతనూ నెత్తికెత్తుకున్నారు. కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు లాంటి సంఘ సంస్కర్తల వారసత్వాన్ని కొనసాగించారు. ఇది 1945 నాటి సంగతి. వితంతువైన మా అక్కకు మళ్లీ పెళ్లి చెయ్యాలని అన్నయ్య పట్టుబట్టి, ఇంట్లో వాళ్ళను ఒప్పించి... తన ఉద్యమ సహచరుడు తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తితో అక్క కృష్ణవేణి పెళ్లి జరిపించాడు. కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి మా బావ ఊరూరా తిరుగుతుండటంతో అక్కకు తోడుగా వారి వెంట మేమూ నడిచాం. అప్పుడు మా అవస్థలు ఎన్నో. గ్రామాల్లో కమ్యూనిస్టులకు అంత త్వరగా ఇల్లు అద్దెకు ఇచ్చేవారు కాదు. మాతో మాట్లాడటానికి కూడా చాలామంది భయపడేవారు. నాకు చదువుకోవాలని కోరిక. కానీ నెలకొక ఊరు మారుతున్న పరిస్థితుల్లో, నన్ను కొండిపర్రు ఆశ్రమ పాఠశాలలో చేర్పించారు. ఆంక్షల కాలంలో ఎంతోమంది కమ్యూనిస్టులకు ఆశ్రయం కల్పించింది ఆ పాఠశాల. అక్కడే నేను హిందీ-విశారద కోర్సు పూర్తి చేశాను. సాహిత్య పఠనాన్ని పరిచయం చేశారు. అవన్నీ నన్ను తర్వాత కాలంలో హిందీ పండితురాలిగా, తెలుగు గేయ రచయిత్రిగా మలిచాయి.

సుందరయ్యతో అనుబంధం

హనుమంతరావుకు టైపింగ్, షార్ట్‌హాండ్ మీద పట్టుంది. రెండో ప్రపంచ యుద్ధసమయంలో మిలటరీ నేవీలో స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన సొంతూరు తూర్పుగోదావరి జిల్లా మండపేట. సమాజం పట్ల ఆనాటి కమ్యూనిస్టులకున్న ఆర్తిని చూసి హనుమంతరావు ప్రభావితమయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్యగారికి టైపింగ్, షార్ట్ హాండ్ వచ్చిన వారి అవసరం ఉందని తెలిసి, నెలకు రూ.100 జీతం వచ్చే ప్రభుత్వ కొలువును వదిలేసి, 'విశాలాంధ్ర' విలేకరిగా కలం పట్టారు. సుందరయ్యగారు రాసిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' పుస్తక రచన పది రోజుల్లో పూర్తికావడానికి ఎంతో తోడ్పడ్డారు.

పెళ్లయిన 20 రోజులకే...

కమ్యూనిస్టు పార్టీ సభ్యుడు అట్లూరి చలపతిరావుతో నాకు మొదట వివాహం అయింది. అది సాఫీగా సాగుతోన్న నా జీవితంలో పెద్ద కుదుపు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న ఆయనను ఒక రోజు పోలీసులు అరెస్టు చేశారు. మిగతా దళసభ్యుల జాడ చెప్పమని చిత్రహింసలు పెట్టారు. అయినా, ఆయన నోరు విప్పలేదు. దాంతో విసిగిపోయిన పోలీసులు చలపతిరావును తుపాకీతో కాల్చి చంపారు. అదే అతను కనుక ఆ రోజు నోరు విప్పితే... నలభైమందికి పైగా ఉద్యమకారుల ప్రాణాలు గాల్లో కలిసేవి. అదీ ఆనాటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యుల నిబద్ధత, త్యాగం. అప్పటికి మాకు పెళ్లయ్యి 20 రోజులే. చలపతి రావు చనిపోయాక నేను మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకోలేదు. మా బావ మీద ఆంధ్రాలో పోలీసుల నిఘా పెరగడంతో కుటుంబమంతా మద్రాసు చేరాం. తిరిగి చదువు కొనసాగించాను. హిందీలో ప్రవీణ కోర్సుతో పాటు బీఈడీ పూర్తిచేశాను. నాలుగేళ్ళ తర్వాత మళ్లీ పెళ్లి చేసుకోవాలని ఇంట్లో వారంతా నాకు నచ్చజెప్పారు. అప్పుడు మద్రాసులో 'విశాలాంధ్ర' విలేకరిగా ఉన్న పరుచూరి హనుమంతరావు (ప్రగతి ప్రింటర్స్ అధినేత) గారు "ఢిల్లీలో రిపోర్టరుగా పనిచేస్తున్న వి. హనుమంతరావు అయితే సరళకు తగిన వ్యక్తి" అని మా బావకు చెప్పారు. అలా 1954లో అత్యంత నిరాడంబరంగా హేతువాది తాపీ ధర్మారావుగారి చేతుల మీదుగా దండల మార్పిడి పద్ధతిలో మా వివాహం జరిగింది. పైగా మాది కులాంతర, సంస్కరణవాద వివాహం. ఆయన పూర్తి సంప్రదాయ కుటుంబంలో పుట్టినా... చాదస్తాలకు అతీతంగా జీవించారు. సమాజం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన అమరవీరులంటే ఎంతో ఆరాధనా భావం. ఆ గౌరవంతోనే నా మొదటి భర్త చలపతిరావు పేరును మా పెద్దబ్బాయికి పెట్టారు. ఇదొక్కటి చాలదా.. హనుమంతరావు గారి ఔన్నత్యం అర్థం కావడానికి.

స్థలం కూడా తీసుకోలేదు

మా అమ్మ ఊర్లో తనకున్న కొద్దిపాటి భూమి అమ్మేసి, ఆ డబ్బుతో అమీర్‌పేట నాగార్జుననగర్‌లో మాకు స్థలం కొని ఇచ్చింది. నా ఉద్యోగం మీద రుణంతో ఇల్లు కట్టుకున్నాం. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటి స్థలం కేటాయిస్తూ, హనుమంతరావుకు కూడా జర్నలిస్టు కాలనీలో స్థలం మంజూరు చేసింది. "నాకు సొంతిల్లు ఉంది. కనుక స్థలం అవసరం లేదు" అని అది తీసుకోలేదు. ఇదీ హనుమంతరావు నిజాయితీ. ఆయన ప్రేరణతో నా ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన సొమ్ములో నుంచి రూ.50 వేలు 'మహిళా జర్నలిస్టుల ఫౌండేషన్'కు విరాళంగా ఇచ్చాం.





పార్లమెంట్‌లో తొలి తెలుగు విలేకరి

మొట్టమొదటి పార్లమెంటు సమావేశాలను రిపోర్టు చేసిన తొలి తెలుగు వ్యక్తి హనుమంతరావు గారే.! తద్వారా నెహ్రూ, శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, ఆచార్య కృపలానీ, రాంమనోహర్‌లోహియా, ఏకే గోపాలన్, భూపేష్ గుప్తా లాంటి తొలితరం నేతల ప్రసంగాలను తెలుగువారికి అందించారు. తర్వాత విమాన వాహక నౌక 'విక్రాంత్'లో ప్రయాణించి... బంగ్లాదేశ్ యుద్ధ వార్తలు రిపోర్టు చేశారు. 'డేటా న్యూస్ ఫీచర్స్' సంస్థ నెలకొల్పి, సామాజిక, ఆర్థిక రంగాలకు సంబంధించిన అంశాలపై కొన్ని వందల వ్యాసాలు రాశారు. కొన్ని సంవత్సరాలకు సంబంధించిన కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ కేటాయింపులు, గణాంకాలు ఆయన నోటిలో ఎల్లప్పుడూ ఆడుతుండేవి. ఒక్కోసారి వారి జ్ఞాపకశక్తి చూసి నాకే ఆశ్చర్యం వేసేది. 'చివరి వరకు రాస్తూ ఉండాలి' అనుకొన్నారు. అలానే 2016, డిసెంబరు 13న చనిపోవడానికి ముందు రోజు కూడా ఒక వ్యాసం రాశారు. విలువైన సమాచారంతో 'డేటా ఆంధ్రప్రదేశ్', 'ఏపీ ఎట్ 50' లాంటి పుస్తకాలు తీసుకొచ్చారు. 'వీక్షణం' వ్యవస్థాపక సంపాదకుడిగా, 'ఎకనమిక్ టైమ్స్'లో వ్యాసకర్తగా... ఒకటా, రెండా... ఆయన నిర్వర్తించిన బాధ్యతలెన్నో. హనుమంతరావు గారి విద్వత్తును చూసి చాలామంది ఆయన్ను 'ప్రొఫెసర్' అని సంబోధించిన సందర్భాలున్నాయి. కానీ ఆయన చదువుకున్నది ఎస్సెస్సెల్సీ మాత్రమే. నిరంతర అధ్యయనమే హనుమంతరావును ఉత్తమ జర్నలిస్టుల్లో ఒకరిగా నిలిపింది అనడంలో సందేహం లేదు.

అదే నా కోరిక...

ఇప్పుడు నా వయసు 89 ఏళ్ళు ప్రస్తుతం మా రెండవ అబ్బాయి సతీష్‌బాబు దగ్గర ఉంటున్నాను. బీపీ, షుగర్ లాంటి ఆరోగ్య సమస్యలంటూ ఏమీ లేవు. నా పనులు నేను చేసుకోగలుగుతున్నాను. ఉద్యోగ విరమణ పొందికూడా 30 ఏళ్ళు దాటింది. పిల్లల కోసం మన స్వాతంత్ర్య సమరయోధుల జీవిత గాథలు, పర్యాటక ప్రదేశాలు ఇతివృత్తంగా తెలుగులో గేయాలు రాశాను. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రాసిన 'ఆంధ్రుల చరిత్ర' గేయ కథనం, ప్రకృతి పరిరక్షణలో భాగంగా 'ప్రాణిప్రపంచం' తదితర రచనలు పుస్తకాలుగా వచ్చాయి. నా భర్త వి. హనుమంతరావుకు దామోదరం సంజీవయ్య, వైఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రులతో పరిచయాలున్నా... వ్యక్తిగత అవసరానికి వాటిని ఎన్నడూ ఉపయోగించలేదు. ఇది ఆయన శతజయంతి సంవత్సరం. ఈ సందర్భంగా నిరంతరం అణగారిన వర్గాల సంక్షేమం కోసం పరితపించిన హనుమంతరావు పాత్రికేయ వృత్తి, వ్యక్తిగత జీవితం మీద సమాజంలో చర్చ జరగాలన్నది నా అభిలాష.

● సాంత్వన్/ ఫొటో: రాజ్‌కుమార్



కండెన్స్డ్ మిల్క్ చవకగా...

చాలా మంది పాయసంలోను.. ఇతర తీపి పదార్థాలలోను కండెన్స్ మిల్క్‌ను వాడతారు. బయట మార్కెట్లో దీని ఖరీదు చాలా ఎక్కువగా ఉంటుంది. దీనిని చవకగా ఇంట్లోనే ఎలా చేసుకోవాలో చూద్దాం.

కావాల్సిన పదార్థాలు: మిల్క్ పౌడర్ (100 గ్రాములు), వెన్న (100 గ్రాములు), చక్కెర (250 గ్రాములు), పాలు (500 మిల్లీలీటర్లు)



తయారుచేసే పద్ధతి: పాలను గోరువెచ్చగా వేడి చేయాలి. వేడి చేసిన పాలలో మిల్క్ పౌడర్, వెన్న, చక్కెర వేసి మిక్సీలో బాగా తిప్పాలి. ఈ కండెన్స్ మిల్క్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకుంటే మూడు నెలల దాకా నిల్వ ఉంటుంది.

ఫ్యాషన్

ఈ అతిశయం పువ్వులదే!

పూలు, లతలు ఎక్కడున్నా అందరి కళ్లూ అటు వైపే మళ్లిపోతాయి. కాబట్టే పూలు, లతల ఫ్యాషన్ ట్రెండ్ 'ఫోలియేజ్' యువతులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ కోవకు చెందిన ఫోలియేజ్ డ్రెసెస్ మీద ఓ లుక్కేద్దామా..

పువ్వులు, లతలు, కొమ్మలు... ఫోలియేజ్ డ్రస్సులో తప్పనిసరిగా కనిపించే అంశాలివి. ప్రకృతిని మరిపించే ఈ అంశాల్లో ప్రత్యేతల ఆధారంగా వినూత్నమైన మోడర్న్ డ్రస్‌లు తయారవుతూ ఉంటాయి. గాల్లో తేలుతున్నట్టుండే మెటీరియల్స్‌తో, సౌకర్యం, ఆధునికతలే తొలి ప్రాధాన్యంగా తయారయ్యే ఈ దుస్తులు వేర్వేరు సందర్భాలకు అనువుగా ఉంటాయి. ఫోలియేజ్ దుస్తులు, వైవిధ్యాన్ని కనబరచడం కోసం భిన్నమైన డిజైన్లలో కూడా తయారవుతూ ఉంటాయి.



కాటౌ ఫోలియేజ్ డ్రస్

ఆర్గానిక్ కాటన్ జెర్సీతో రూపొందే ఈ డ్రస్సులో చెట్ల పందిరి వైపు చూస్తున్నట్టుండే డిజైన్లు కనిపిస్తాయి. చిక్కని ఆకులు, లతలు, కొమ్మలు ఈ డిజైన్‌లో స్పష్టంగా కనిపిస్తాయి. అయితే ప్రకృతిని మరిపించే ఈ డిజైన్ మొత్తంగా ఆకుపచ్చ రంగులోనే ఉంటుందనుకుంటే పొరపాటు. డిజైన్లు ప్రకృతిని మరిపించినా రంగుల్లో వైవిధ్యం కనబడుతుంది.





ఆటమ్ ఫోలియేజ్

ఈ డ్రస్ సుతిమెత్తని ఫ్లోయీ మెటీరియల్‌తో తయారవుతుంది. కదిలేటప్పుడు, చెట్ల ఆకులు రాలి నేల మీద పడుతున్న శబ్దం వెలువడుతుంది. ఈవినింగ్ పార్టీలు, వేడుకల్లో సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా కనిపించడం కోసం ఈ డ్రస్‌ను ఎంచుకోవచ్చు. హుందాగా, ఫ్యాషన్‌గా కనిపించేలా చేసే ఆటమ్ ఫోలియేజ్ ఫాల్ డ్రస్‌ను తేలికపాటి ప్లాటినం లేదా యాంటిక్ జ్యువెలరీ, హైహీల్స్‌తో మ్యాచ్ చేయాలి.

ఫోలియేజ్ లినెన్

బోహో స్టైల్‌లో అదరగొట్టాలంటే లినెన్ మెటీరియల్ ఫోలియేజ్ డ్రస్ ఎంచుకోవాలి. కాలర్ జోడిస్తే, ఈ డ్రస్‌కు మోడర్న్ లుక్ సమకూరుతుంది. అలాగే బెల్ట్ కూడా! పెద్ద బకిల్ ఉండే బెల్టులు ఈ దుస్తుల అందాన్ని రెట్టింపు చేస్తాయి. యాంకిల్ బూట్స్ అదనపు ఆకర్షణను తెచ్చి పెడతాయి.





కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యత పరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు

1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అమలులోకి వస్తుంది.

• ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.

• బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.

• అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.

• అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.
2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.
3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిక్సూచి

Santoor Scholarship

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have: • passed Class 10 from a local government school. • passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And • enrolled in a full-time graduate programme starting in 2024-25.

• Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply. • Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum

Last Date to Apply: 23-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SWS7

SCHOLARSHIP ALERT

Aspire

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.

• Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.

Last Date to Apply: 20-09-2024

Url: www.b4s.in/aj/ASPI2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి



హై వోల్టేజ్ యాక్షన్‌తో వస్తున్నాం

ఎన్టీఆర్

'ఆర్‌ఆర్‌ఆర్' చిత్రం తర్వాత నా సోలో మూవీగా 'దేవర' మీ ముందుకొస్తోంది. కొంచెం ఒత్తిడిగా ఉంది. రిలీజ్ కోసం మీతో పాటు నేను కూడా ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. హై వోల్టేజ్ యాక్షన్‌తో ఈ చిత్రం రాబోతోంది' అని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'దేవర'. జాన్వీకపూర్ కథానాయిక. సైఫ్ అలీఖాన్ విలన్ పాత్ర పోషించారు. మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ కె. నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 27న విడుదలవుతోంది. మంగళవారం ముంబైలో నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. కరడుగట్టిన సముద్ర దొంగల నుంచి గ్రామాన్ని రక్షించేందుకు కథానాయకుడు చేసిన పోరాటం నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం అలరించింది. తండ్రీ కొడుకులుగా రెండు విభిన్న పాత్రల్లో ఎన్టీఆర్ పలికించిన భావోద్వేగాలు అలరించాయి. పల్లెటూరి యువతిగా జాన్వీ కనిపించారు.

ఈ సందర్భంగా ఎన్టీఆర్ మాట్లాడుతూ 'దేవర విజువల్స్ అద్భుతంగా ఉంటాయి. పతాక సన్నివేశాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి. సముద్ర జలాలఅడుగున చిత్రీకరణ చేశాం. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. శివ కొరటాల మాట్లాడుతూ 'సెట్స్‌లో ఒక్కసారి కెమెరా ఆన్ అయిందంటే ఎన్టీఆర్ సర్వం మర్చిపోయి పాత్రలో లీనమై నటిస్తాడు. అప్పట్లో సీనియర్ ఎన్టీఆర్-శ్రీదేవిలా ఇప్పుడు జూనియర్ ఎన్టీఆర్-జాన్వీకపూర్ జోడీ బాగుందని ప్రేక్షకులకు మెచ్చుకుంటున్నారు' అని చెప్పారు. జాన్వీకపూర్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో కలసి నటించాలనే నా కోరిక 'దేవర'తో తీరింది. ఆయనకు నేను పెద్ద అభిమానిని. ఎన్టీఆర్ నుంచి నటనకు సంబంధించి చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాను' అని తెలిపారు.



కాలేజ్ రోజులు గుర్తొచ్చాయి

దిలీప్‌ప్రకాశ్, రెజీనా కసాండ్ర జంటగా నటించిన 'ఉత్సవం' చిత్రం ఈ నెల 13న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెజీనా మంగళవారం మీడియాతో మాట్లాడుతూ చిత్రవిశేషాలు వెల్లడించారు.

● ఈ చిత్రకథను దర్శకుడు అర్జున్ సాయి చెప్పినప్పుడు అద్భుతంగా అనిపించింది. కథలో సోల్ ఉంది. నాటకరంగం గురించి ఆయన చాలా రిసెర్చ్ చేసి కథ తయారు చేశారు. స్కూల్‌లో, కాలేజీలో చదువుకొనే రోజుల్లో నాటకాలు వెయ్యడం, టికెట్లు అమ్మడం.. ఇవన్నీ నాకు వెంటనే గుర్తొచ్చాయి. సినిమాలో రంగస్థల నటుల గురించి చాలా అద్భుతమైన సన్నివేశాలు ఉన్నాయి. 'ఉత్సవం' సందేశాత్మక చిత్రం కాదు. కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్న సినిమా. నాకు బాగా నచ్చి వెంటనే ఒప్పుకొన్నా.

● చిత్రంలో నేను కార్పొరేట్ ఎంప్లాయిగా నటించాను. ప్రేమ మీద నా పాత్రకు పెద్దగా ఆసక్తి ఉండదు. కథలో ఎంతో కీలకమైన పాత్ర. ఇటువంటి పాత్ర చేసే అవకాశం రావడం ఆనందంగా అనిపించింది.

● నా కో స్టార్ దిలీప్ మంచి నటుడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాడు. తనతో వర్క్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. నటుడిగా మంచి పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నాను.

కొన్నేళ్లుగా బాలీవుడ్ బాక్సాఫీసు.. థియేటర్లు సరైన హిట్లు లేక వెలవెలబోతున్న సంగతి తెలిసిందే. అలాంటి సమయంలో నేనున్నానంటూ బాలీవుడ్‌ను ఆదుకున్నాయి కొన్ని సినిమాలు. విచిత్రమేమిటంటే అందులో అధిక శాతం 'హారర్' జానర్‌కు చెందిన చిత్రాలే. అలా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు కళ తెచ్చిన తెచ్చిన హారర్ చిత్రాలేంటో.. అలాగే త్వరలో ప్రేక్షకులను పలకరించే చిత్రాలేంటో చూద్దాం.

బాక్సాఫీస్‌కు హారర్ జోరు





ఏ అంచనాలు లేకుండా చిన్న సినిమాగా రిలీజై సంచలన విజయం సాధించిన చిత్రం 'ముంజ్యా'. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో అభయ్ వర్మ, శర్వారీ, మోనా సింగ్ కీలక పాత్రలు పోషించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో జూన్ 7న విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా కలెక్షన్లను రాబట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇందులో తన ప్రేయసిని ముంజ్యా (బ్రహ్మ రాక్షసుడు) నుంచి కాపాడుకునేందుకు హీరో పడే పాట్లు.. చేసే ఫీట్లు అందర్నీ తెగ నవ్వించాయి.






పిల్లలను నిద్రపుచ్చడానికి పెద్దలు చెప్పే జానపద కథలా.. కామెడీ హారర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే ఓటీటీలై విడుదలై అందరినీ అలరిస్తోంది.

వసూళ్ల వర్షం

శ్రద్ధాకపూర్ ప్రధాన పాత్రలో నటించిన సూపర్ నేచురల్ హారర్ కామెడీ 'స్త్రీ 2'. ఇది 2018లో తెరకెక్కి సూపర్ హిట్ సాధించిన 'స్త్రీ' సినిమాకు సీక్వెల్. రాజ్‌కుమార్ రావు కథానాయకుడు. ఆగస్టు 15న విడుదలైన ఈ సినిమా ఘనవిజయం సాధించి.. బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దాదాపు రూ.530 కోట్లు వసూలు చేసింది. బాలీవుడ్‌లో 'ఫైటర్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలు సాధించిన కలెక్షన్లను అధిగమించింది. అంతేకాకుండా షారుక్ ఖాన్ నటించిన 'పఠాన్' చిత్రం ఇండియాలో సాధించిన లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసి.. ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లు సాధించిన రెండో హిందీ మూవీగా 'స్త్రీ 2' నిలిచింది. ఈ కలెక్షన్ల పరంపర ఇలాగే కొనసాగితే త్వరలోనే ఇది ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక కలెక్షన్లతో టాప్ ప్లేస్‌లో ఉన్న షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాను దాటేస్తుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. ఇక, ఈ సినిమా కథాంశానికి వస్తే.. చందేరి అనే ఓ ఊరిలో హఠాత్తుగా మహిళలు కనిపించకుండా పోవడం, వారిని కాపాడడం కోసం రాజ్‌కుమార్ రావు, తన స్నేహితులతో చేసే పనులు ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతూ.. ప్రేక్షకులకు సూపర్ థ్రిల్‌ను పంచాయి. అలాగే, ఈ సినిమాకు తమన్నా చేసిన ప్రత్యేక గీతం కూడా కలిసొచ్చింది. ఇప్పటివరకూ దేశంలో తెరకెక్కిన లేడీ ఓరియెంటెడ్ చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమా కూడా ఇదే. ఈ సినిమాకు మూడో భాగం ఉన్నట్లు చిత్రబృందం తెలిపింది.

మూడు రెట్ల లాభాలు

అజయ్ దేవ్‌గణ్, ఆర్.మాధవన్, జ్యోతిక నటించిన హారర్ థ్రిల్లర్ 'షైతాన్'. వికాశ్ భల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చి 8న విడుదలై మంచి హిట్‌గా నిలిచింది. రూ.65 కోట్లతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. ఇందులో మాధవన్ వశీకరణం మాయలో పడిన తన కూతురిని రక్షించుకోవడం కోసం అజయ్‌దేవ్‌గణ్ చేసే పోరాటం సినిమాకే హైలెట్‌గా నిలిచింది. త్వరలోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'షైతాన్ 2'ని తెరకెక్కించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు.



త్వరలో మరిన్ని..

'స్త్రీ 2' చిత్రం ఊహకు మించిన సక్సెస్ సాధించడంతో బాలీవుడ్ చూపు ఒక్కసారిగా హారర్ ఫ్రాంచైజీలపై పడింది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న హారర్ చిత్రాల్లో 'భూత్ బంగ్లా', 'భేడియా 2', 'భూల్ భులయ్యా 3'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. 'భూత్ బంగ్లా' చిత్రం అక్షయ్‌కుమార్ కథానాయకుడిగా, ప్రియదర్శన్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. ఈ హారర్ కామెడీని అక్షయ్‌కుమార్ బర్త్‌డే సందర్భంగా ప్రకటించారు. 'భేడియా 2' విషయానికి వస్తే.. ఇది 2022లో వరుణ్ ధావన్ ప్రధాన పాత్రలో నటించిన 'భేడియా' చిత్రానికి సీక్వెల్. కృతి సనన్ కథానాయికగా నటించిన ఈ చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకుడు. ప్రస్తుతం రెండో భాగం ప్రీ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మరోవైపు, 'భూల్ భులయ్యా 3' చిత్రంలో కార్తీక్ ఆర్యన్, విద్యాబాలన్, త్రిప్తి డిమ్రి నటిస్తున్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి ఫలితాన్ని రాబట్టాయి. మూడో భాగం దీపావళి సందర్భంగా నవంబర్ 1న విడుదలవుతోంది. వీటిలో ఏ చిత్రాలు 'స్త్రీ 2' లాగా సంచలన విజయాలు సాధిస్తాయో అని అందరూ వేచి చూస్తున్నారు.



ప్రభాస్‌కు కమల్ గిఫ్ట్..



కమల్ హాసన్ 'కేహెచ్' హౌస్ ఆఫ్ ఖద్దర్ అనే బ్రాండ్‌తో ఖాదీ దుస్తుల వ్యాపారంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇటీవలే, న్యూయార్క్‌లో జరిగిన ఫ్యాషన్ వీక్‌లో ఈ దుస్తులకు చెందిన సరికొత్త కలెక్షన్ 'సుటూర'ను ప్రదర్శించారు. ఈ సరికొత్త కలెక్షన్‌ను కమల్ హాసన్ తన 'కల్కి 2898 ఏ.డీ' కో స్టార్ ప్రభాస్‌కు కానుకగా పంపారు. ఈ కానుకను అందుకున్న ప్రభాస్.. తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. "ప్రేమతో ఈ గిఫ్ట్ పంపించినందుకు కృతజ్ఞతలు కమల్ సర్. మీ కొత్త కలెక్షన్‌కు ఆల్ ద బెస్ట్" అని పేర్కొన్నారు. కాగా, ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' సినిమాలో.. భైరవ పాత్రలో ప్రభాస్.. 'సుప్రీమ్ యాస్కిన్' పాత్రలో కమల్ హాసన్ అదరగొట్టిన సంగతి తెలిసిందే.

విజయంపై నమ్మకంతో ఉన్నాం



మలయాళ హీరో టోవినో థామస్ కథానాయకుడిగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'ఏఆర్ఎం' (అజయంతే రందం మోషణం). జితిన్ లాల్ దర్శకుడు. కృతిశెట్టి, ఐశ్వర్యారాజేశ్, సురభి లక్ష్మి కథానాయికలు. ఈ నెల 12న పలు భారతీయ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా టోవినో థామస్ మాట్లాడుతూ 'మైత్రీ మూవీ మేకర్స్ అంటే తెలుగు పరిశ్రమలో ఒక బ్రాండ్. వారు మా సినిమాను తెలుగులో విడుదల చేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఇందులో మూడు పాత్రలు చేశాను. కృతి శెట్టి పాత్ర సినిమాలో కీలకంగా ఉంటుంది. సినిమా విజయంపై నమ్మకంతో ఉన్నాం. తెలుగు ప్రేక్షకులు మా సినిమాను ఆదరించాలి' అని కోరారు. కృతిశెట్టి మాట్లాడుతూ 'హీరోయిన్‌గా నాకు ఇది తొలి మలయాళ చిత్రం. దర్శకుడు అద్భుతమైన కథతో ఎనిమిదేళ్ల పాటు కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు' అని చెప్పారు.




వరదబాధితులను ఆదుకునేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి నిర్మాత దిల్‌రాజు, శిరీష్ విరాళం ప్రకటించిన విషయం తెలిసిందే. వారు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి రూ. 25 లక్షల చెక్కును అందజేశారు.

రాముడిగా...పరశురాముడిగా?



రణ్‌బీర్‌కపూర్ శ్రీరాముడి పాత్రధారిగా 'రామాయణ్' పేరుతో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. నితేశ్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రాతో కలసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సీతమ్మవారి పాత్రను సాయిపల్లవి పోషిస్తున్నారు. యష్ రావణుడిగా కనిపించనున్నారు. రెండు భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సన్నీడియోల్, లారాదత్తా, రకుల్ ప్రీత్‌సింగ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. 2026లో తొలి భాగం విడుదల చేయనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి బాలీవుడ్‌లో వినిపిస్తోంది. రణ్‌బీర్‌కపూర్ ఇందులో డబుల్ రోల్‌లో కనిపించనున్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. రాముడి పాత్రతో పాటు పరశురాముడి పాత్రలోనూ రణ్‌బీర్ కనిపించనున్నారట. ఆయన లుక్ కూడా సరికొత్తగా ఉండబోతోందని చెబుతున్నారు. రామాయణంలో సీతా స్వయంవరంలో శ్రీరాముడు శివ ధనుర్భంగం నేపథ్యంలో పరశురాముడి పాత్ర కనిపిస్తుంది. 'రామాయణ్'లో అమితాబ్ బచ్చన్ కూడా భాగమవబోతున్నారట. అయితే ఆయన ఈ చిత్రంలో నటించడం లేదు. జటాయు పక్షి పాత్రకు అమితాబ్‌బచ్చన్ డబ్బింగ్ చెప్పేందుకు అంగీకరించాని సమాచారం. ఇక ఈ చిత్రంలో రావణుడి పాత్రలో నటిస్తున్న యశ్ డిసెంబర్‌లో చిత్రీకరణలో పాల్గొంటారని చెబుతున్నారు.

శింబు సాయం



ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడానికి భాషా పరిమితులు, ప్రాంతీయ భేదాలు ఉండవని తమిళ హీరో శింబు నిరూపించారు. తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల సంభవించిన వరదల కారణంగా ఇబ్బందులకు గురైన వారిని ఆదుకోవడానికి ఆయన ముందుకు వచ్చారు. ఇతర తమిళ హీరోలందరికన్నా ముందుగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి తన వంతు సాయంగా రూ. ఆరు లక్షల విరాళం ప్రకటించి తన మంచితనాన్ని చాటుకున్నారు. అందరూ ఈ విపత్తు నుంచి త్వరలో బయటపడాలని ఆయన కోరుకున్నారు.

తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడిగా ప్రతాని



తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్‌కు జరిగిన తాజా ఎన్నికల్లో అధ్యక్షపదవికి ప్రతాని రామకృష్ణగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పదహారు వేల మంది సభ్యులున్న అసోసియేషన్‌కు ఇలా అధ్యక్షపదవికి ఆయన ఎన్నిక కావడం ఇది ఆరోసారి. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'నా మీద నమ్మకంతో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులందరికీ ధన్యవాదాలు. ఈ రెండేళ్ల పదవీకాలంలో ఎన్నో మంచి పనులు చేయాలని ప్లాన్ చేస్తున్నాం. ఔట్‌డోర్ షూటింగ్స్ సమయంలో యూనిట్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలు, చిన్న సినిమాలకు రాయితీలు వంటివి ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం' అని చెప్పారు.

లైఫ్ స్టోరీ

కొత్తగా..



ఒక్కోసారి సాధారణ సంఘటనలే జీవితాలపై తీవ్ర ప్రభావం చూపిస్తుంటాయి. అలా జీవితంలోని రోజువారీ క్షణాలను మనసుకు హత్తుకొనే విధంగా తీసిన సంకలన చిత్రం 'లైఫ్ స్టోరీస్'. ఈ నెల 14న విడుదలవుతున్న ఈ సినిమాలో సత్య కేతినీడి, షాలిని కొండేపూడి, దేవియాని శర్మ, ఎం. వివాన్ షైన్ తదితరులు నటించారు.అన్ని వయసుల వారిని ఆకట్టుకునేలా స్వీయ దర్శకత్వంలో ఉజ్వల్ కశ్యప్ ఈ సినిమాను నిర్మించారు.

నొయిడాకు ఇదే చివరిమ్యాచ్ కానుందా?

అఫ్ఘాన్-కివీస్ జట్ల మధ్య ఏకైక టెస్టు నిర్వహణపై సర్వత్రా చర్చ జరుగుతోంది. మ్యాచ్ సమయాల్లో వర్షం కురవకపోయినా ఆట జరపలేని ఇక్కడి పరిస్థితులపై మ్యాచ్ రెఫరీ జవగళ్ శ్రీనాథ్ ఐసీసీకి నివేదిక అందజేయనున్నాడు. దీంతో గ్రేటర్ నొయిడా కాంప్లెక్స్ స్టేడియంలో ఇదే చివరి అంతర్జాతీయ మ్యాచ్ కానుందన్న ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి 2016 నుంచి అఫ్ఘాన్ జట్టుకు ఇది హోంగ్రౌండ్‌గా ఉంటోంది. ఇక్కడ ఇప్పటికే ఆ జట్టు 11 వన్డేలు ఆడింది. అందుకే ఈసారి టెస్టుకు కూడా దీన్నే ఎంచుకుంది. అసలు 2019 నుంచి బీసీసీఐ ఇక్కడ కనీసం దేశవాళీ మ్యాచ్‌లను కూడా నిర్వహించడం లేదు.


గ్రేటర్ నొయిడా మైదానం

ఇదేమి 'టెస్టు'?

రెండో రోజూ అదే సీన్

ఇంకా మొదలవని కివీస్-అఫ్ఘాన్ మ్యాచ్



నొయిడా: అఫ్గానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఏకైక టెస్టులో ఇంకా ఒక్క బంతి కూడా పడలేదు. రెండో రోజు మంగళవారం కూడా ఇక్కడి పరిస్థితి ఆటకు అనుకూలంగా లేకపోవడంతో రద్దు చేశారు. ఆదివారం కురిసిన వర్షానికి సోమవారం తొలి రోజు టాస్ పడకుండానే ఆట రద్దయింది. మైదానంలోని నీటిని బయటికి తోడేందుకు ఆధునిక సౌకర్యాలు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. అయితే అదే రోజు సాయంత్రం కురిసిన వర్షానికి గ్రౌండ్ మరింత దారుణంగా తయారైంది. దీంతో మంగళవారం ఆటకు కూడా ఆటంకం ఏర్పడింది. కవర్ పాయింట్, మిడ్ వికెట్ ఏరియాల్లో గుంతలు ఏర్పడ్డాయి. అక్కడ కొత్తగా గడ్డిని ఏర్పాటు చేశారు. తడిగా ఉన్న ఏరియాను ఫ్యాన్లతో ఆరబెట్టేందుకు ప్రయత్నించారు. అయినా మ్యాచ్‌కు అనుకూలంగా కనిపించకపోవడంతో.. మధ్యాహ్నం 3 గంటలకు అంపైర్లు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మరోవైపు ఇరు జట్ల ఆటగాళ్లు ఈ పరిణామాలతో అసంతృప్తిగా ఉన్నారు. అలాగే గ్రౌండ్‌లో ఇతరత్రా సౌకర్యాలు కూడా దారుణంగా ఉన్నాయని అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) ఆరోపించింది. అయితే ఈ మ్యాచ్‌కు నొయిడాతో పాటు కాన్పూర్, బెంగళూరు వేదికలను కూడా బీసీసీఐ సూచించిందని సమాచారం. కానీ కాబూల్ నుంచి ఢిల్లీ ద్వారా ఇక్కడి త్వరగా చేరుకోవచ్చునన్న కారణంతో గ్రేటర్ నొయిడాను ఎంపిక చేసుకున్నామని ఏసీబీ అధికారి మెహ్ఫూజుద్దీన్ రాజ్ తెలిపాడు.

ఫేవరెట్ భారత్

బరిలో తెలుగు జీఎంలు హారిక, హరికృష్ణ, అర్జున్

చెస్ ఒలింపియాడ్ నేటినుంచి



బుడాపెస్ట్: ప్రపంచ చెస్ పండుగ ఒలింపియాడ్‌కు రంగం సిద్ధమైంది. బుధవారం ప్రారంభమవనున్న ఈ మెగా చెస్ టోర్నీ ఓపెన్ కేటగిరీలో 191 జట్లు, మహిళల విభాగంలో 180 జట్లు తలపడనున్నాయి. ఓపెన్ విభాగంలో గత చెస్ ఒలింపియాడ్‌లో కాంస్యం నెగ్గిన భారత పురుషుల జట్టు ఈసారి రెండో సీడింగ్‌తో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతుండగా మహిళల జట్టుకు టాప్ సీడింగ్ లభించింది. దిగ్గజ ఆనంద్, హంపి ఈ పోటీలకు దూరం కావడంతో పురుషుల బృందాన్ని గుకేష్, మహిళల జట్టును తెలుగమ్మాయి హారిక నడిపించనున్నారు. ఫిడే ర్యాంకింగ్స్‌లో దూసుకెళ్తున్న వైశాలి జట్టుకు వెన్నుదన్ను కానుంది. వీరితో పాటు దివ్యా దేశ్‌ముఖ్, వంతిక అగర్వాల్ పావులు కదపనున్నారు. తానియా సచ్‌దేవ్ రిజర్వ్ ప్లేయర్‌గా ఉంది. పురుషుల విభాగంలో తెలుగు ఆటగాళ్లు హరికృష్ణ, ఇరిగేసి అర్జున్, గుకేష్, విదిత్ గుజరాతి, ప్రజ్ఞానంద సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. టాప్‌సీడ్ అమెరికా నుంచి ఫాబియానో కరువానా, వెస్లీ సో, లెవోన్ అరోనియన్‌తో పాటు మూడో సీడ్ చైనా నుంచి ప్రస్తుత వరల్డ్ చాంపియన్ డింగ్ లిరెన్‌కు భారత జీఎంల మధ్య రసవత్తర పోరు జరగనుంది.

స్వర్ణానికి రూ. 75 లక్షలు



రజత, కాంస్యాలకు రూ. 50, 30 లక్షలు ● పారాలింపిక్స్ పతక విజేతలకు చెక్‌లు ప్రదానం

న్యూఢిల్లీ: పారాలింపిక్స్‌లో పతకాలు సాధించిన అథ్లెట్లకు కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుఖ్ మాండవీయ నగదు బహుమతులను అందజేశారు. మంగళవారం జరిగిన సన్మాన కార్యక్రమంలో ట్రాక్ అండ్ ఫీల్డ్ పారా అథ్లెట్లే ఎక్కువ మంది ఉండగా.. స్వర్ణం గెలిచిన వారికి రూ. 75 లక్షలు, రజతం సాధించిన ప్లేయర్‌కు రూ. 50 లక్షలు, కాంస్యం దక్కించుకొన్న అథ్లెట్‌కు రూ. 30 లక్షల చెక్‌లను మంత్రి బహూకరించారు. మిక్స్‌డ్ ఈవెంట్లలో పతకాలు సాధించిన ఆర్చర్ శీతల్ దేవి లాంటి వారికి రూ. 22.5 లక్షలు లభించాయి. బంగారు పతకాలు సాధించిన జావెలిన్ త్రోయర్లు సుమీత్ అంటిల్, నవ్‌దీప్, క్లబ్ త్రోయర్ ధరమ్‌బీర్, ఆర్చర్ హర్విందర్ సింగ్ నజరానాలు అందుకొన్న వారిలో ఉన్నారు. 2028 లాస్ ఏంజిల్స్‌లో జరిగే పారాలింపిక్స్‌కు కూడా తమవంతుగా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి చెప్పారు. 'పారాలింపిక్స్‌లో భారత్ మెరుగైన ప్రదర్శన చేస్తోంది. 2016లో 4 పతకాలు సాధించగా.. టోక్యో క్రీడల్లో ఆ సంఖ్య 19కి పెరిగింది. పారిస్‌లో 29 మెడల్స్‌తో 18వ స్థానానికి చేరుకొన్నాం. 2028లో ఇంతకు మించి పతకాలు సాధిస్తామ'ని మాండవీయ ఆశాభావం వ్యక్తం చేశారు. లాస్ ఏంజిల్స్ 2032 క్రీడల కోసం సన్నాహకాలను ఆరంభించాలని అథ్లెట్లకు ఆయన పిలుపునిచ్చారు. ఇటీవలే పారిస్‌లో ముగిసిన పారాలింపిక్స్‌లో భారత్ 7 పసిడి, 9 రజత, 13 కాంస్యాలతో మొత్తం 29 పతకాలు సాధించింది. గతవారమే స్వదేశానికి తిరిగి వచ్చిన షూటర్ అవనీ లేఖారా, పారా షట్లర్ నితేష్ కుమార్ తదితరులను ప్రభుత్వం ముందే సన్మానించింది. దీంతో వారు హాజరుకాలేదు.



పారా అథ్లెట్లకు అపూర్వ స్వాగతం

స్వదేశానికి చేరుకొన్న పారా అథ్లెట్లకు ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. మంగళవారం ఉదయం ఇందిరా గాంధీ విమానాశ్రయంలో వీరికి ఆహ్వానం పలకడానికి భారీఎత్తున అభిమానులు హాజరయ్యారు. పతకాలు సాధించిన అథ్లెట్లకు పూలదండలు వేసి మిఠాయిలు తినిపించారు. స్వర్ణం సాధించిన జావెలిన్ త్రోయర్ నవ్‌దీప్‌ను ఫ్యాన్స్ పైకెత్తి సందడి చేశారు. ఆటపాటలు, డప్పులతో ఉత్సాహవంతమైన వాతావరణాన్ని సృష్టించారు.

కాళ్లు, చేతులు లేకున్నా.. బాణాలు సంధిస్తూ..


శీతల్ స్ఫూర్తితో ప్రాక్టీస్ చేస్తున్న ఆర్చర్

న్యూఢిల్లీ: శీతల్ దేవి.. చేతులు లేకున్నా, సడలని ఆత్మవిశ్వాసంతో రెండు కాళ్లతోనే బాణాలు సంధిస్తూ అద్భుతాలు సృష్టిస్తోన్న ఆర్చర్. ఇప్పటికే అంతర్జాతీయస్థాయిలో పతకాలు కొల్లగొట్టిన జమ్మూకశ్మీర్‌కు చెందిన ఈ 17 ఏళ్ల టీనేజర్.. తాజాగా ముగిసిన పారిస్ పారాలింపిక్స్‌లోనూ పతకం సాధించి అబ్బురపరిచింది. ఇప్పుడు శీతల్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఆమె గ్రామానికే చెందిన మరో దివ్యాంగ బాలిక ఆర్చరీలో సత్తా చాటేందుకు సిద్ధమవుతోంది. కిష్త్వార్ ప్రాంతంలోని లోయిదార్‌కు చెందిన 13 ఏళ్ల బాలికకు పుట్టుకతోనే కాళ్లు, చేతులు లేవు. కానీ, శీతల్ స్ఫూర్తితో ఆ బాలిక, విలువిద్యపై ఆసక్తి పెంచుకొంది. ఆర్చరీ కోచ్ కుల్దీప్ శిక్షణలో ప్రాక్టీస్ చేస్తోంది. ప్రత్యేకంగా తయారుచేసిన కృత్రిమ విల్లు సాయంతో కృత్రిమ కాళ్లతోనే, కోచ్ శిక్షణలో ప్రాక్టీస్ చేస్తున్న ఆ బాలిక వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

యూఎస్ ఓపెన్ అరుదైన రికార్డు

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. గతవారం ముగిసిన ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీని పది లక్షల మందికిపైగా అభిమానులు నేరుగా స్టేడియానికి వచ్చి తిలకించడం విశేషం. అర్హత పోటీలతో కలుపుకొని మూడు వారాల పాటు జరిగిన ఈ టోర్నీని ప్రత్యక్షంగా వీక్షించిన అభిమానుల సంఖ్య గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎనిమిది శాతం పెరిగింది. అర్హత పోటీలను లక్షా 48 వేల 669 మంది, మెయిన్ డ్రా పోటీలను 8 లక్షల 32 వేల 640 మంది నేరుగా వీక్షించారు.

స్విమ్మర్ వ్రితికి రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ అమ్మాయి వ్రితి అగర్వాల్ రజతంతో మెరిసింది. మంగళవారం మంగళూరులో ముగిసిన ఈ పోటీల్లోని 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి 4 నిమిషాల 25.09 సెకన్లలో రేసును ముగించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కర్ణాటక స్విమ్మర్ హర్షిత (4 ని. 24.70) స్వర్ణం దక్కించుకోగా, ఢిల్లీ స్విమ్మర్ భవ్య కాంస్యం అందుకుంది.

రింకూకు పిలుపు

దులీప్ ట్రోఫీని వీడిన 'టెస్టు' ప్లేయర్లు


కొనసాగనున్న యష్ దయాళ్, సర్ఫరాజ్

అనంతపురం: బంగ్లాదేశ్‌తో జరిగే టెస్టు సిరీస్‌కు ఎంపికైన ఆటగాళ్లు దులీప్ ట్రోఫీని వీడనున్నారు. ఈనెల 19 నుంచి చెన్నైలో తొలి టెస్టు జరగనుండడంతో.. ప్రస్తుతం దులీప్ ట్రోఫీ ఆడుతున్న కేఎల్ రాహుల్, రిషభ్ పంత్, గిల్, కుల్దీప్, అక్షర్ పటేల్, జైస్వాల్, జురెల్, ఆకాశ్ దీప్ తమ జట్లకు దూరం కానున్నారు. అయితే లెఫ్టామ్ పేసర్ యష్ దయాళ్, సర్ఫరాజ్ ఖాన్ కూడా టెస్టుకు ఎంపికైనా దులీప్ ట్రోఫీలో కొనసాగనున్నారు. దీంతో టీమిండియా తుది జట్టులో వీరికి చోటు దక్కడం లేదని తేలింది. ఈనెల 12 నుంచి రెండో రౌండ్ మ్యాచ్‌లు మొదలవనున్నాయి. దీంట్లో భాగంగా రింకూ సింగ్ ఇండియా 'బి' టీమ్‌లో చేరనున్నాడు. అలాగే జురెల్ స్థానంలో ఆంధ్ర బ్యాటర్ షేక్ రషీద్ ఇండియా 'ఎ' జట్టుకు ఎంపికయ్యాడు. ఇక గిల్ స్థానంలో ఇండియా'ఎ' కెప్టెన్సీ బాధ్యతలను మయాంక్ తీసుకోనున్నాడు.

2030 నాటికి ఏటా కోటి ఈవీ విక్రయాలు

5 కోట్ల ఉద్యోగాల కల్పన ... సియామ్ సదస్సులో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) అమ్మకాలు 2030 నాటికి ఏడాదికి కోటి స్థాయికి చేరతాయని, అప్పటికి ఈ విభాగం 5 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తుందని అంచనాగా కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. భవిష్యత్తులో భారత్ ప్రపంచంలో నంబర్ వన్ ఆటోమోటివ్ తయారీ కేంద్రంగా మారుతుందన్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. మంగళవారం నాడిక్కడ భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) 64వ వార్షిక సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 2030 నాటికి పరిమాణపరంగా రూ.20 లక్షల కోట్లకు చేరగల సామర్థ్యం భారత ఈవీ మార్కెట్‌కున్నదని, అలాగే ఈవీ ఫైనాన్స్ మార్కెట్ కూడా రూ.4 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. లిథియం అయాన్ బ్యాటరీల ధర కూడా తగ్గి ఈవీ కొనుగోళ్లకు మద్దతు ఇస్తాయని ఆయన అన్నారు. ప్రస్తుతం మొత్తం ఈవీ అమ్మకాల్లో టూ వీలర్ల వాటా 56 శాతం ఉన్నట్టు ఆయన తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం నాటికి ఈవీ అమ్మకాల్లో 45 శాతం వృద్ధి నమోదైందని, 400 స్టార్టప్‌లు విద్యుత్ టూవీలర్ల తయారీని ప్రారంభించాయని ఆయన వెల్లడించారు. చాలా కంపెనీలు సెల్ తయారీలో కూడా ప్రవేశించినందు వల్ల రాబోయే కాలంలో ప్రపంచ దేశాలకు లిథియం అయాన్ బ్యాటరీలు ఎగుమతి చేయగల స్థాయిలో దేశం ఉంటుందన్నారు.



రూ.75,000 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

ఆటోమొబైల్ పీఎల్ఐ పథకం కింద ప్రభుత్వానికి రూ.74,840 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో రూ.17,896 కోట్లు ఇప్పటికే పెట్టుబడి పెట్టారని, 30 వేల ఉద్యోగాల కల్పన జరిగిందని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి తెలిపారు. ఈ రంగం వృద్ధికి చేయూత ఇవ్వడం కోసం ప్రస్తుతం చార్జింగ్ మౌలిక వసతుల అభివృద్ధిపై తమ శాఖ దృష్టి పెట్టిందన్నారు.

ఎగుమతుల వృద్ధిపై మారుతి ఫోకస్

2030 నాటికి ఎగుమతులు గణనీయంగా పెంచుకోవాలని మారుతి సుజుకీ సీఈఓ హిసాషి టకుచీ చెప్పారు. అందుకే తాము వృద్ధి శాతం గురించి మాట్లాడడంలేదని, అందుకు భిన్నంగా వృద్ధి ఎన్ని రెట్లు ఉండవచ్చని మాట్లాడుతున్నామని ఆయన అన్నారు. నాలుగేళ్ల క్రితంతో పోల్చితే తమ ఎగుమతులు మూడు రెట్లు పెరిగాయని, రాబోయే ఆరేళ్లలో నేటి స్థాయి నుంచి మరో మూడు రెట్లు పెరుగుతాయని ఆయన అన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో తమ తొలి విద్యుత్ మోడల్ ఆవిష్కరించనున్న సందర్భంగా ఈవీలకు అనుకూల వాతావరణం నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (మార్కెటింగ్ అండ్ సేల్స్) పార్థో బెనర్జీ చెప్పారు.

ఈవీ విభాగంలోకి హెచ్ఎంఎస్ఐ

విద్యుత్ వాహనాల తయారీలోకి అడుగు పెట్టాలని హోండా మోటార్ సైకిల్ అండ్ స్కూటర్స్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) భావిస్తోంది. 2030 నాటికి మూడింట ఒక వంతు అమ్మకాలు ఈ విభాగం నుంచే నమోదయ్యేలా తాము కృషి చేస్తున్నామని కంపెనీ డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) యోగేశ్ మాథుర్ చెప్పారు. మొత్తం టూ వీలర్ల అమ్మకాల్లో విద్యుత్ టూ వీలర్ల వాటా నిరంతరం పెరుగుతున్నదన్నారు. హెచ్ఎంఎస్ఐ, హోండా టీమ్‌లు తొలి ఈవీ మోడల్‌ను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

టాటా మోటార్స్ ఈవీ ధరలు తగ్గింపు

విద్యుత్ కార్ల ధరలను టాటా మోటార్స్ రూ.3 లక్షల వరకు తగ్గించింది. నెక్సన్ ఈవీ ధర గరిష్ఠంగా రూ.3 లక్షలు తగ్గితే పంచ్ ఈవీ ధర రూ.1.2 లక్షలు, టియాగో ఈవీ ధర రూ.40,000 తగ్గించినట్టు ప్రకటించింది.

సియామ్ ప్రెసిడెంట్‌గా శైలేశ్ చంద్ర

టాటా మోటార్స్ ప్రయాణికుల వాహన విభాగం మేనేజింగ్ డైరెక్టర్ శైలేశ్ చంద్ర 2024-25 సంవత్సరానికి సియామ్ నూతన అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. ఇప్పటివరకు వైస్ చైర్మన్‌గా ఆయన పని చేశారు. ఆయన స్థానంలో కొత్త వీసీగా అశోక్ లేలాండ్ ఎండీ, సీఈఓ షేను అగర్వాల్ ఎన్నికయ్యారు. డైమ్లర్ ఇండియా కమర్షియల్ వెహికల్స్ సీఈఓ, ఎండీ సత్యకామ్ ఆర్య కోశాధికారిగా ఎన్నికయ్యారు.

బిజినెస్

రూ.932కే విమాన టికెట్

ఫ్లాష్ సేల్ ప్రకటించిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్: ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఫ్లాష్ సేల్‌ను ప్రకటించింది. ఈ సేల్‌లో విక్రయించే ఎక్స్‌ప్రెస్ లైట్ సర్వీసుల టికెట్ల ప్రారంభ ధర రూ.932గా ఉంది. ఈ నెల 16 వరకు సేల్ అందుబాటులో ఉంటుందని, 2025 మార్చి 31 వరకు ప్రయాణించేందుకు ఈ సేల్ ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చని ఎయిర్‌లైన్స్ స్పష్టం చేసింది. ఎక్స్‌ప్రెస్ వేల్యూ సర్వీసుల బుకింగ్స్‌కూ వర్తిస్తుందని, టికెట్ ధర రూ.1,088 నుంచి ప్రారంభమవుతుందని వెల్లడించింది.

వచ్చే ఏడాది నుంచి బిజినెస్ క్లాస్‌కు గుడ్‌బై : టాటా గ్రూప్ చేతుల్లోకి వెళ్లిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వచ్చే సంవత్సరం నుంచి తమ విమానాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి విమానాల సంఖ్యను 100కు పెంచుకోనుంది.

క్రెడిట్‌సేఫ్ కార్యకలాపాల విస్తరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): నార్వే కేంద్రంగా ఉన్న బిజినెస్ క్రెడిట్ ఇంటలిజెన్స్ ప్రొవైడర్ క్రెడిట్‌సేఫ్ గ్రూప్ అనుబంధ సంస్థ క్రెడిట్‌సేఫ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌లో వ్యూహాత్మకంగా తన కార్యకలాపాలు విస్తరించింది. గ్లోబల్ కస్టమర్ల డిమాండ్‌కు అనుగుణంగా సేవలందించటంతో పాటు సాంకేతికపరమైన సామర్థ్యాలను మెరుగుపరుచుకునే ఉద్దేశంతో హైదరాబాద్ కేంద్రాన్ని విస్తరించినట్లు సంస్థ ఎండీ కిశోర్ రెడ్డి కంచర్ల వెల్లడించారు. అలాగే వచ్చే మూడేళ్లలో ఉద్యోగుల సంఖ్యను రెండింతలు పెంచుకోవాలని నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంస్థకు 1600 మంది ఉద్యోగులుండగా హైదరాబాద్‌లో 240 మంది పనిచేస్తున్నారని తెలిపారు.

మహారాష్ట్రలోని వసాయ్ విరార్ నగరపాలక సంస్థ (వీవీసీఎంసీ)కు 40 ఎలక్ట్రిక్ బస్సులను సరఫరా చేసినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడించింది. ఈ ఏడాది జనవరిలో బస్సుల సరఫరాకు సంబంధించి ఒలెక్ట్రాతో వీవీసీఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. జూలై నెలాఖరులో బస్సుల డిజైన్‌ను ఖరారు చేయగా కేవలం 30 రోజుల్లోనే ఈ బస్సులను డెలివరీ చేసి రికార్డు సృష్టించినట్లు ఒలెక్ట్రా పేర్కొంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,840 ▲	66,770 ▲	91,000 ▲
ముంబై	71,590 ▲	65,576 ▲	82,207 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	525
వరంగల్	492	గోదావరి	520
చిత్తూరు	553	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	113
వరంగల్	97	గుంటూరు	115
కరీంనగర్	97	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	114
కర్నూలు	97	నెల్లూరు	114
విశాఖపట్నం	99	అనంతపురం	114
గోదావరి	113		

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజు లాభపడ్డాయి. మంగళవారం సెన్సెక్స్ ఒక దశలో 637 పాయింట్ల వరకు ఎగిసి 82,000 ఎగువకు చేరినప్పటికీ.. చివరికి సూచీ 361.75 పాయింట్ల వృద్ధితో 81,921.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 104.70 పాయింట్ల లాభంతో 25,041.10 వద్ద క్లోజైంది. అమెరికా మార్కెట్ల సానుకూల సంకేతాల నేపథ్యంలో దేశీయంగా ఇన్వెస్టర్లు ఐటీ, టెలికాంతో పాటు కొన్ని బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు పెంచడం ఇందుకు దోహదపడింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచాయి.

నేటికీ థర్మల్ పవర్‌దే అగ్రస్థానం

ఎన్‌టీపీసీ ఈడీ ఎస్‌కే ఘోష్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రత్యామ్నాయ ఇంధన వనరుల గురించి ఎంతగా మాట్లాడుతున్నా, మన విద్యుత్ సరఫరాలో ఇప్పటికీ థర్మల్ విద్యుత్‌దే అగ్రస్థానమని ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎస్‌కే ఘోష్ అన్నారు. ప్రస్తుతం దేశంలో 2.34 లక్షల మెగావాట్ల స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం ఉంటే అందులో 56 శాతం వాటా థర్మల్ విద్యుత్‌దన్నారు. హైదరాబాద్‌లో సీఐఐ నిర్వహిస్తున్న 'పవర్ ప్లాంట్ సదస్సు'లో ఘోష్ ఈ విషయాలు చెప్పారు. థర్మల్ పవర్ ప్లాంట్ల విషయంలోనూ మారుతున్న అవసరాలకు అనుగుణంగా కొత్త వ్యూహాలను రూపొందించేందుకు ఈ సదస్సు చక్కటి వేదిక అన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఇంధన సామర్థ్యం పెంచడం, కాలుష్య నియంత్రణ విధానాలు, ఆటోమేషన్, కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాలపై చర్చిస్తారు.

బయోగ్యాస్ పెద్ద అవకాశం: దేశీయ చక్కెర మిల్లులకు బయోగ్యాస్ చక్కటి వ్యాపార అవకాశమని దామ్‌పూర్ షుగర్ మిల్స్ ఎండీ గౌరవ్ గోయల్ అన్నారు. 'గ్రీన్ షుగర్ సదస్సు 2024'లో ఆయన ఈ విషయం తెలిపారు. భవిష్యత్‌లో బయోగ్యాస్, ఇంధన రంగం స్వరూప, స్వభావాలను పెద్ద ఎత్తున మార్చివేయనుందన్నారు.

హైదరాబాద్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్

- రీ సస్టెయినబిలిటీ, షార్ప్ వెంచర్స్ భాగస్వామ్యంలో ఏర్పాటు
- రూ.50 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ప్లాస్టిక్ రీసైక్లింగ్ ప్లాంట్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సస్టెయినబిలిటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ రీ సస్టెయినబిలిటీ, మారికో లిమిటెడ్ చైర్మన్ హర్ష్ మారివాలా కుటుంబానికి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ షార్ప్ వెంచర్స్ ప్రకటించాయి. ఈ మేరకు మంగళవారం నాడిక్కడ మారికో లిమిటెడ్ చైర్మన్ హర్ష్ మారివాలా, రీ సస్టెయినబిలిటీ ఎండీ, సీఈఓ మసూద్ మాలిక్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఎఫ్ఎంసీజీ పరిశ్రమకు నాణ్యమైన రీసైకిల్డ్ పాలీలిఫైన్స్‌ను సరఫరా చేయటంతో పాటు పర్యావరణం, సమాజానికి మేలు చేకూర్చే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు మారికో చైర్మన్ హర్ష్ మారివాలా తెలిపారు. ఈ రెండు ప్లాంట్లు ఏటా 32,000 టన్నుల ప్లాస్టిక్ వేస్ట్‌ను ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగి ఉంటాయని రీ సస్టెయినబిలిటీ ఎండీ మసూద్ మాలిక్ వెల్లడించారు. ఈ ప్రక్రియ ద్వారా ఏటా 9,000 టన్నుల నాణ్యమైన రీసైకిల్డ్ పాలిమర్స్ ఉత్పత్తి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ప్లాంట్ల ఏర్పాటు కోసం తొలి దశలో రూ.50 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు మాలిక్ చెప్పారు. ఈ పెట్టుబడుల్లో 15 శాతం షార్ప్ వెంచర్స్‌దని ఆయన తెలిపారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఇరు సంస్థలు దేశవ్యాప్తంగా రీసైకిల్డ్ ప్లాంట్స్‌ను విస్తరించనున్నాయని, ఇందుకోసం పెద్ద ఎత్తున పెట్టుబడులు కూడా పెట్టనున్నట్లు మాలిక్ పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ఆరంభంలో ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు. కాగా హైదరాబాద్ ప్లాంట్ వార్షి ప్రాసెస్ సామర్థ్యం 24 వేల టన్నులుగా ఉండగా రాయ్‌పూర్ ప్లాంట్ సామర్థ్యం 8,000 టన్నులని తెలిపారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 370 మందికి ఉపాధి లభించనుండగా పరోక్షంగా 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు.

లాఖీడ్ మార్టిన్‌తో టీఏఎస్ఎల్ ఒప్పందం

భారత్‌లో సీ-130జే హెర్క్యులస్ విమానాల తయారీ !

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికా వైమానిక దిగ్గజం లాఖీడ్ మార్టిన్ - టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) మధ్య మరో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ద్వారా భారత వైమానిక దళాని (ఐఏఎఫ్)కి అవసరమైన మధ్య రకం సైనిక రవాణా విమానాల (ఎంటీఏ) సరఫరా కాంట్రాక్టు కోసం పోటీపడాలని లాఖీడ్ మార్టిన్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఏఎన్-32 విమానాల స్థానంలో 80 సరికొత్త ఎంటీఏ విమానాలు సమకూర్చుకోవాలని భారత వైమానిక దళం భావిస్తోంది. ఇందుకు తన సీ-130జే సూపర్ హెర్క్యులస్ విమానాలు సరఫరా చేసేందుకు లాఖీడ్ బిడ్ సమర్పించింది. ఈ కాంట్రాక్టు దక్కితే ఈ విమానాలను భారత్‌లోనే తయారు చేసేందుకు టీఏఎస్ఎల్‌తో ఒప్పందం ఉపకరిస్తుందని భావిస్తోంది. లాఖీడ్ మార్టిన్‌తో పాటు ఎయిర్‌బస్, ఎంబ్రాయర్ కంపెనీలు కూడా ఈ కాంట్రాక్టు కోసం పోటీపడుతున్నాయి. ఈ కాంట్రాక్టు దక్కితే సీ-130జే సూపర్ హెర్క్యులస్ విమానాల నిర్వహణ, మరమ్మతుల కోసం ఎంఆర్ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కూడా అమెరికా వైమానిక దిగ్గజం ఆసక్తితో ఉంది.

ఐదేళ్లలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు : ప్లాన్‌ఫుల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్లాన్‌ఫుల్.. భారత్‌లో తన కార్యకలాపాలు విస్తరించింది ఇందులో భాగంగా హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. కొత్త కార్యాలయం ఏర్పాటుతో భారత్‌లో ఆర్ అండ్ డీ హబ్ కార్యకలాపాలు మరింతగా విస్తరించే అవకాశం లభించిందని ప్లాన్‌ఫుల్ సీఈఓ గ్రాంట్ హల్లోరాన్ తెలిపారు. భారత్‌లో ప్లాన్‌ఫుల్ ఇప్పటి వరకు 5 కోట్ల డాలర్ల (సుమారు రూ.400 కోట్లు) పెట్టుబడులు పెట్టిందని ఆయన పేర్కొన్నారు. కాగా వచ్చే ఐదేళ్లలో మరో 12 కోట్ల డాలర్లు (సుమారు రూ.1,000 కోట్లు) పెట్టేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉద్యోగుల సంఖ్యను రెట్టింపు చేయనున్నట్లు గ్రాంట్ వెల్లడించారు.

కాంగ్రెస్ అధిష్ఠానానికి రేవంత్ భయం!

» పార్టీలో చిచ్చు పెడతాడని ఆందోళన: ఏలేటి



హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆర్‌ఆర్ కాంగ్రెస్ పాలన నడుస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. ఏఐసీసీ మేనిఫెస్టోకు విరుద్ధంగా పాలన సాగుతోందన్నారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని ఏఐసీసీ మేనిఫెస్టోలో ప్రకటిస్తే, అందుకు భిన్నంగా ఇక్కడ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని దుయ్యబట్టారు. పార్టీ ఫిరాయింపులను కాంగ్రెస్ సీనియర్ నేతలు సైతం అంగీకరించడం లేదన్నారు. అందుకే పొంగులేటి మినహా, భట్టి, ఉత్తమ్ వంటివారు ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకునే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో రేవంత్ ఎప్పుడైనా చిచ్చు పెడతారని అధిష్ఠానం భయపడుతోందని.. అందుకే పలు జాగ్రత్తలు తీసుకుంటోందని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలును, వరద బాధితులకు సాయాన్ని వదిలేసిన మంత్రులు వసూళ్లే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఆర్‌ఆర్ ట్యాక్సు, బీ ట్యాక్స్ యూ ట్యాక్స్ సీ ట్యాక్స్‌లతో రాష్ట్రం అల్లాడిపోతోందని ధ్వజమెత్తారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని, ఇది కాంగ్రెస్‌కు చెంపపెట్టులాంటిదని మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫిరాయింపులపై తాము కూడా రిట్ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు.

సెప్టెంబరు 17ను అధికారికంగా నిర్వహించాలి

» సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ విలీన దినోత్సవాన్ని (సెప్టెంబరు 17), తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ సర్కారు మజ్లిస్ పార్టీకి భయపడి విలీన దినోత్సవం జరపలేదన్నారు. సాయుధ పోరాటాన్ని ముస్లింలకు వ్యతిరేకంగా జరిగినట్టుగా చరిత్రను వక్రీకరిస్తూ విమోచన దినోత్సవం పేరుతో బీజేపీ మత రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు విడుదల చేయాలన్నారు.

హరీశ్ అంటే రేవంత్‌కు భయం:ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్ని సందర్భాల్లో అధికార పక్షాన్ని నిలదీస్తూ వస్తున్న తమ పార్టీ నేత హరీశ్ రావు అంటే.. సీఎం రేవంత్‌రెడ్డికి భయం.. అందుకే ఆయనకు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వలేదని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. స్పీకర్ భుజంపై తుపాకిపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌ను కాల్చాలని చూస్తున్నారని, అందుకే పార్టీ మారిన అరికెపూడి గాంధీని అడ్డం పెట్టుకొని శిఖండి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్షానికే ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ పదవి ఇవ్వడం దేశంలో ఆనవాయితీగా వస్తోందని, అలాంటిది పార్లమెంటరీ స్ఫూర్తికి విరుద్ధంగా.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేకు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం దుర్మార్గమన్నారు. రేవంత్‌రెడ్డి పెద్ద నియంతగా మారారని.. అందుకే ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నారని.. ఆయన తీరును ప్రతిఘటించి తీరతామని ప్రశాంత్‌రెడ్డి హెచ్చరించారు.

టీవీవీపీ సిబ్బందికి జీతాలు చెల్లించాలి:హరీశ్

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి ఆరునెలలుగా ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడం అమానుషమని మాజీమంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఒకటో తేదీనే జీతాలు చెల్లిస్తున్నట్లు చెప్పుకొనే ముఖ్యమంత్రికి వీరి వెతలు కనిపించకపోవడం శోచనీయమని మంగళవారం 'ఎక్స్' వేదికగా ఆయన పేర్కొన్నారు. తమ జీతాలు చెల్లించాలని సిబ్బంది ఎన్నిసార్లు నిరసనలు తెలిపినా ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని, వారి గోడును పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం ఆసుపత్రి సిబ్బందికి శాపంగా మారిందన్నారు. టీవీవీపీ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందికి తక్షణమే జీతాలు చెల్లించాలని, పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.

కంపెనీలకు చెరువుల ధారాదత్తంపై సమీక్షించాలి

» బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో చెరువుల సుందరీకరణ పేరిట బడా కంపెనీలకు జరిగిన కేటాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం సమీక్ష నిర్వహించాలని బీజేఎల్పీ ఉప నేత పాయల శంకర్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద చెరువుల సుందరీకరణ అంటూ 2022లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లోని 25 చెరువులను పలు సంస్థలకు అప్పజెప్పిందని శంకర్ తెలిపారు. సదరు కంపెనీలు ఆయా చెరువులను ఆక్రమించి ఎఫ్‌టీఎల్ పరిధిలోకి చొచ్చుకొచ్చాయని, కొన్ని సంస్థలు బఫర్‌జోన్ వదలకుండా రూ.వందల కోట్ల విలువైన ప్రాజెక్టులు చేపట్టాయని ఆరోపించారు. సల్కం చెరువులో ఎంఐఎంకి సంబంధించిన ఫాతిమా కాలేజీ నిర్మాణం అక్రమంగా చేపడితే ఎందుకు కూల్చడం లేదని హైడ్రా పేరుతో హడావుడి చేస్తోన్న రాష్ట్ర ప్రభుత్వం కేవలం పేదలు, మధ్యతరగతి కుటుంబాలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

నేర విశ్లేషణ మాడ్యూల్ అభివృద్ధిలో తెలంగాణ ముద్ర

» కేంద్ర హోం మంత్రి నుంచి అవార్డు స్వీకరణ



ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న శిఖాగోయెల్

న్యూఢిల్లీ, హైదరాబాద్ సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల కట్టడే లక్ష్యంగా రూపొందించిన నేర విశ్లేషణ మాడ్యూల్ 'సమన్వయ' అభివృద్ధిలో తెలంగాణ పోలీసుశాఖ చూపిన ప్రతిభకు కేంద్ర హోంశాఖ అవార్డును ప్రదానం చేసింది న్యూ ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో భారత సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) మొదటి వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ మంగళవారం ఈ అవార్డు అందుకున్నారు. నేర గణాంకాల విశ్లేషణ, నేరాల మధ్య ఉన్న పోలికల ఆధారంగా వాటిని అనుసంధానించడం, నేరగాళ్ల నెట్‌వర్క్‌ను గుర్తించడం, దేశవ్యాప్తంగా ఉన్న చట్ట సంబంధ విభాగాలను సమన్వయం చేసుకోవడంలో రాష్ట్ర పోలీసులు పోషిస్తున్న పాత్రను గుర్తించిన కేంద్రం ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ప్రతిష్ఠాత్మకమైన అవార్డు సొంతం చేసుకున్నందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు డీజీపీ జితేందర్ అభినందనలు తెలిపారు.

వాన్‌పిక్ కేసులో 4 వారాల్లో కౌంటర్ వేయండి

» సీబీఐకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారానికి సంబంధించిన వాన్‌పిక్ భూముల కేసులో నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐని ఆదేశించింది. ఈ కేసులో తనను నిందితుడిగా చేర్చడంపై వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి గతంలో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. హైకోర్టు తీర్పును సుబ్బారెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. తొలుత సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు ప్రారంభిస్తుండగా.. వాన్‌పిక్ కేసు విచారణ తర్వాత చేపడతామని ధర్మాసనం తెలిపింది. ఆ కేసుకు సుబ్బారెడ్డి పిటిషన్ జత చేసి ఉందని ఆయన ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. గత విచారణలో మరో ధర్మాసనం ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి ఆదేశాలిచ్చిందని, అయితే ఇందుకు తమకు మరింత సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. అంగీకరించిన ధర్మాసనం 4 వారాల్లో కౌంటర్ వేయాలని నిర్దేశించింది.

ప్రఖ్యాత సంస్కృతాంధ్ర పండితుడు

అయాచితం నటేశ్వర శర్మ ఇకలేరు

» కేన్సర్‌తో బాధపడుతూ కన్నుమూత
» 125కుపైగా అష్టావధానాలు, శతావధానాలు
» 60కి పైగా పుస్తకాల సంకలనం
» నేడు బోయిన్‌పల్లిలో అంత్యక్రియలు



హైదరాబాద్ సిటీ, కామారెడ్డి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడు, రచయిత, కవి, అవధాన ఘనాపాఠి, విశ్రాంత ఆచార్యుడు అయాచితం నటేశ్వరశర్మ (68) ఇకలేరు. కొంత కాలంగా కాలేయ కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం బోయిన్‌పల్లిలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన సతీమణి తిగుళ్ల అరుణ కుమారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఈ దంపతులకు కౌముది, జాహ్నవి యామిని కుమార్తెలు. నటేశ్వర శర్మ స్వస్థలం కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామం. ఆయన తండ్రి అనంతరాజ శర్మ. కుమారుడిని సంస్కృత విద్వాంసుడిగా చూడాలన్న ఆశయంతో ఆరో తరగతి పూర్తయ్యాక నటేశ్వర శర్మను తిరుమలలోని సంస్కృత పాఠశాలలో చేర్పించారు. అక్కడ అధ్యయనం సాగిస్తున్న సమయంలోనే అనుష్టుప్ ఛందస్సులో శ్లోకాలు రాసేవారు. తిరుపతి శ్రీవెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించి 'వ్యాకరణ శిరోమణి' పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సంస్కృతంలో బీవోఎల్. తెలుగు, సంస్కృతంలో ఎంఏ పూర్తి చేశారు. 'ఆముక్త మాల్యద కావ్యం'పై ఎం.ఫిల్, 'శంకర భాగవత్పాద కృత సౌందర్యలహరి'పై పీహెచ్‌డీ పరిశోధన చేసి బంగారు పతకం అందుకున్నారు. కామారెడ్డిలోని ప్రాకృత విద్యాపరిషత్ ప్రాచ్య కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా 1977లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన నటేశ్వర శర్మ 2014లో అదే కళాశాల ప్రధానాచార్యుడిగా పదవీ విరమణ పొందారు. తెలుగు, సంస్కృతాల్లో 125కుపైగా అష్టావధానాలు,శతావధానాలు చేశారు. సంస్కృతాంధ్ర భాషల్లో 60కుపైగా పుస్తకాలు రాశారు. వాటిల్లో 'బాల రామాయణం', 'సమయవిలాసిని', 'శకుంతల', 'ఋతుగీత', 'నవ్యగీతి', 'భారతీప్రశస్తి', 'ఆముక్తమాల్యద పరిశీలనము', 'వసంతకుమారి', 'శ్రీషోడశీ', 'చుక్కలు', తదితర రచనలున్నాయి. ఆయన సాహిత్య సేవను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2023లో దాశరథి పురస్కారంతో సత్కరించింది. 'శకుంతల' పద్య కావ్యానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ కావ్య పురస్కారం, 'భారతీ ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం లభించాయి. సినారె రచించిన 'రామప్ప' సంగీత, నృత్యరూపకాన్ని నటేశ్వర శర్మ సంస్కృతంలోకి అనువదించారు. కాగా బుధవారం మధ్యాహ్నం బోయిన్‌పల్లి, టీచర్స్ కాలనీలోని స్వర్గవాటికలో అంత్యక్రియలు జరగనున్నట్లు శర్మ పెద్ద కుమార్తె కౌముది తెలిపారు. నటేశ్వర శర్మ మృతికి నందినిసిధారెడ్డి, రమణాచారి, మోత్కూరి నరహరి, గఫూర్ శిక్షక్, ఆచార్య జయధీర్ తిరుమలరావు సంతాపం వ్యక్తం చేశారు.

అక్రమ హర్మ్యం

(మొదటిపేజీ తరువాయి)



జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 45కు ఆనుకునే ఉంటాయి. వీటి వెనక నెట్ నెట్ వెంచర్స్ స్థలం ఉంటుంది. నిజానికి, రోడ్డు నంబరు 45కు ఇరువైపులా ఉన్న స్థలాల్లో నిర్మాణాలకు కొంత వెసులుబాటు కలిగిస్తూ 2017లో ప్రభుత్వం జీవో 305 విడుదల చేసింది. దాని ప్రకారం.. రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లో 30 మీటర్ల వరకు నిర్మాణాలు చేసుకోవచ్చు. ఈ నిబంధన జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ లే అవుట్‌కు మాత్రమే వర్తిస్తుంది. కానీ, దాని వెనక ఉన్న హుడా లే అవుట్ (హెచ్‌ఎండీఏ నుంచి కొనుగోలు చేసిన స్థలం)కు వర్తించదు. అయినా.. ఆ నిబంధనను అడ్డం పెట్టుకొని తమకు 30 మీటర్లలో నిర్మాణానికి అనుమతి ఇవ్వాలంటూ నెట్ నెట్ వెంచర్స్ దరఖాస్తు పెట్టుకుంది. అధికారుల అండతో 30 మీటర్లకు అనుమతి సంపాదించింది. అక్కడితో ఆగలేదు. దశలవారీగా జీ+4 నుంచి జీ+5, ఆ తర్వాత జీ+12, చివరకు జీ+13 (20 అంతస్థులు.. వీటిలో జీ+13, ఒక సెల్లార్, 5 స్టిల్ట్‌లు ఉంటాయి)కు అనుమతి సంపాదించింది. మొత్తం 2,09,620 చదరపు అడుగుల్లో నిర్మాణం చేసుకునేలా అనుమతి పొందింది. పదేళ్ల కాలంలో జీ+4 నుంచి ఏకంగా జీ+13 అంతస్తుల వరకు నిర్మాణానికి అనుమతులు సంపాదించింది. ఇక్కడ సెవెన్ స్టార్ హోటల్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మిస్తామని పేర్కొంది. ఇది హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ, పర్యావరణ నిబంధనలకు విరుద్ధం. అక్కడ అలాంటి భారీ ప్రాజెక్టును నిర్మించేందుకు ఎలాంటి ఆస్కారం లేదు. ఇక జూబ్లీహిల్స్ సొసైటీ నుంచి కొనుగోలు చేసిన రెండు ప్లాట్లను కాంప్లెక్సుకు వెళ్లే దారిగా చూపించారు. సొసైటీ బైలాస్ ప్రకారం.. ఆయా ప్లాట్లలో నిర్మాణాలు చేయాలి. కానీ, ఇతరత్రా అవసరాలకు మార్చే వీలులేదు. ఒకవేళ ఏవైనా మార్పులు చేయాలనుకుంటే సొసైటీ అనుమతి పొందాలి. కానీ సదరు సంస్థ అలాంటి అనుమతి ఏదీ పొందలేదు. ఈ వెంచర్‌లో మూడు టవర్లు నిర్మిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. ఇక్కడ రెసిడెన్షియల్ కాంప్లెక్స్, హోటల్స్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మించడానికి అనుమతి తీసుకున్నట్లు తమ నివేదికలో పేర్కొన్నారు. ఈ కాంప్లెక్సులో ఏకంగా 6,000 కార్లు, 2,000 ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ సదుపాయం ఉన్నట్లు గుర్తించారు. కేబీఆర్ పార్క్‌కి అత్యంత సమీపంలో వచ్చే ఈ భారీ నిర్మాణంతో పర్యావరణానికి తీవ్ర ఇబ్బంది కలగనుందని, వాహనాల శబ్దాలు, హారన్లు, కాలుష్యం చుట్టుపక్కల ప్రజలతోపాటు పార్క్‌లో వన్య ప్రాణులకు ప్రమాదకరంగా మారతాయని పేర్కొన్నారు. 115 మీటర్ల ఎత్తులో వచ్చే ఈ నిర్మాణంతో చుట్టుపక్కల గాలి, వెలుతురు, శబ్దం, ట్రాఫిక్ తీరుతెన్నులు పూర్తిగా మారిపోతాయని పేర్కొంది. నిర్మాణం కోసం 100 అడుగుల లోతు వరకు రాళ్లను బ్లాస్టింగ్ చేస్తున్నారని, అందుకు అనుమతులు లేవని పేర్కొంది.

విజిలెన్స్ నివేదికలో ఇంకా ఏముందంటే..

- రోడ్డు నంబరు 45 కమర్షియల్ రోడ్డు. ఇక్కడ 30 మీటర్ల వరకూ భవన నిర్మాణాలకు అనుమతిస్తారు. ఇంపాక్ట్ ఫీజు కడితే మరిన్ని అంతస్తులకు కొంతమేర అనుమతిస్తారు. కానీ, హుడా లే అవుట్లో మాత్రం 15 అంతస్తులకే అనుమతి ఉంది. ఇక్కడే జీహెచ్‌ఎంసీ అధికారులు తప్పుగా అన్వయించారు. జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీకి చెందిన ప్లాట్లలో 30 మీటర్ల వరకు నిర్మించుకునే మినహాయింపుతోపాటు ఇంపాక్ట్ ఫీజు సహాయంతో మరికొంత ఎత్తు పెంచుకునే వెసులుబాటును హుడా లే అవుట్‌కు వర్తింపజేశారు. ఏకంగా 45 మీటర్ల నిర్మాణానికి అనుమతి ఇచ్చేశారు. నిబంధనలకు ఇది పూర్తి విరుద్ధం.
- ఆర్‌సీసీ శ్లాబులు 4.5 మీటర్ల ఎత్తులోనే ఉండాల్సి ఉండగా, 5 మీటర్ల వరకు ఉండొచ్చంటూ టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతి ఇవ్వడం కూడా నిబంధనల ఉల్లంఘనే.
- జీహెచ్‌ఎంసీ అధికారులు బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ప్రత్యేక నిబంధనలను ఉల్లంఘించారు. జీవో 168 ప్రకారం భవనం ఎత్తును రోడ్డు నుంచి కొలవాలి. పిట్టగోడ, వాటర్ ట్యాంకు వంటి వాటిని ఎత్తు నుంచి మినహాయించాలి. కానీ, జీహెచ్‌ఎంసీ అధికారులు భవనం ఎత్తును తప్పుగా కొలిచారు.
- వెంచర్‌లో 5 సెల్లార్లు నిర్మించారు. 2021లో జీహెచ్‌ఎంసీ సిబ్బంది సెల్లార్లను 5 స్టిల్టులుగా చూపించేశారు. ఇది పూర్తి అక్రమం. స్టిల్టులకు కనీసం 10 మీటర్ల మేర సెట్‌బ్యాక్‌లు ఉండాలి. కానీ, ఇక్కడి సెల్లార్లను సెట్‌బ్యాక్ లేకుండా కట్టేశారు.
- కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం, నిర్మిత ప్రాంతం 1.50 లక్షల చదరపు అడుగులలోపు ఉండే భవనాలకు పబ్లిక్ హియరింగ్ నుంచి మినహాయింపు ఉంటుంది. కానీ, ఈ భవనం 2,09,620 చదరపు అడుగులు. అందువల్ల పబ్లిక్ హియరింగ్ లేకుండా ఈసీ ఇవ్వడం పూర్తిగా చట్టాలను ఉల్లంఘించడమే.

అక్రమంగా అనుమతులు ఇలా..!

నెట్ నెట్ వెంచర్స్ సంస్థ అక్రమం ఎలా చేసింది.. దానికి అడ్డగోలుగా అధికారులు అనుమతి ఎలా ఇచ్చారనే విషయాన్ని వివరిస్తూ విజిలెన్స్ అధికారులు తమ నివేదికలో ఓ ఉపగ్రహ చిత్రాన్ని పేర్కొన్నారు. దాని ప్రకారం.. ఎరుపు రంగు సరిహద్దు ఉన్న ప్రాంతం హెచ్‌ఎండీఏ నుంచి కొనుగోలు చేసిన స్థలం. ఇది నందగిరి రెసిడెన్షియల్ లే అవుట్లో ఉంది. దానిని ఆనుకుని ఉన్న పసుపు రంగు సరిహద్దు ప్రాంతం జూబ్లీహిల్స్ హౌజింగ్ సొసైటీ నుంచి కొన్న రెండు ప్లాట్లు! రోడ్డు నంబరు 45కు ఆనుకునే ఇవి ఉన్నాయి. వాటిలో మాత్రమే 30 అంతస్తులు నిర్మించుకోవచ్చు. కానీ, వాటిని అడ్డు పెట్టుకుని హుడా లే అవుట్‌లోని మొత్తం వెంచర్‌కు అనుమతులు పొందిందని నివేదికలో పేర్కొంది.

బీసీ రిజర్వేషన్ల నిర్ధారణకు

మరో 3 నెలలు!

(మొదటిపేజీ తరువాయి)

జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం విచారణ చేపడుతోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలంటే 'వికాస్ కిషన్‌రావు గవాలీ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర' కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్ టెస్ట్ అమలు తప్పనిసరి అని హైకోర్టు పేర్కొంది. "ట్రిపుల్ టెస్ట్‌లో మొదటిది.. స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేయడానికి పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్ ఉండాలి. రెండోది.. రాజ్యాంగబద్ధంగా ఏర్పాటైన డెడికేటెడ్ బీసీ కమిషన్ జనాభా నిష్పత్తికి అనుగుణంగా, వెనకబాటుతనం ఆధారంగా బీసీ రిజర్వేషన్లను నిర్ధారించాలి. మూడోది.. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లన్నీ కలిపినా 50 శాతానికి మించకూడదు. రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్ బీసీ రిజర్వేషన్లను నిర్ధారించకపోతే స్థానిక సంస్థల్లో కేవలం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు మాత్రమే కొనసాగుతాయి" అని సుప్రీంకోర్టు నిర్దేశించిందని, దీనిని ఎప్పుడు అమలు చేస్తారని ఆగస్టు 27న హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు ఆదేశాల మేరకు అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వాన్ని సంప్రదించారు. తాజాగా మంగళవారం వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు నిర్దేశించిన ప్రక్రియను పూర్తిచేసి బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయడానికి మరో మూడు నెలల సమయం పడుతుందని తెలిపారు. అయితే ఈ పిటిషన్లు 2020లో దాఖలయ్యాయని, అప్పటినుంచి ఏం చేస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాదులు ప్రశ్నించారు. ఇంకా ఆలస్యం చేయడం సరికాదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి సమయం ఇస్తూ పిటిషన్లను మూడు నెలలపాటు వాయిదా వేసింది. దీంతో మూడు నెలల్లో ట్రిపుల్ టెస్ట్ పూర్తయితే.. ఆ తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. అంటే కొత్త సంవత్సరం (2025)లోనే ఎన్నికలు జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి: వీహెచ్

బీసీ కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. బీసీ కమిషన్ నియామకం కూడా జరిగినందున.. వెంటనే రూ.150 కోట్ల నిధులు విడుదల చేసి కులగణన చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

సెస్‌లు, సర్‌చార్జీల వివాదాన్ని.. కేంద్ర, రాష్ట్రాలే పరిష్కరించుకోవాలి

» పన్నుల వాటా నిర్ధారణపై అన్ని.. రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తున్నాం
» తెలంగాణలో పట్టణాభివృద్ధి బాగుంది
» 16వ ఆర్థిక సంఘం చైర్మన్ పనగారియా



హైదరాబాద్/భువనగిరి రూరల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న సెస్‌లు, సర్‌చార్జీల వివాదాన్ని ఆయా సర్కారులే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని, అది తమ పరిధిలో లేదని 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అర్వింద్ పనగారియా స్పష్టం చేశారు. దీని పరిష్కారానికి రాజ్యాంగాన్ని సవరించాల్సి ఉంటుందని చెప్పారు. ఆర్థిక సంఘం సభ్యులు మనోజ్ పాండా, అజయ్ నారాయణ్ ఝా, అన్నీ జార్జ్ మాథ్యూ, సౌమ్యకంటి ఘోష్‌లతో కలిసి మంగళవారం పనగారియా ప్రజాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. పన్నుల వాటాలో 41 శాతాన్ని రాష్ట్రాలకు పంచాల్సిన కేంద్రం.. సెస్, సర్‌చార్జీలు అంటూ పేర్లు మార్చి వసూలు చేసిన మొత్తాన్ని తన ఖాతాలో వేసుకుంటోందని.. దీని వల్ల రాష్ట్రాలకు పన్నుల వాటా 41శాతం కంటే చాలా తక్కువ వస్తోందని.. దీని పరిష్కారానికి ఆర్థిక సంఘం ఏమైనా సిఫారసు చేస్తుందా..? అని ప్రశ్నించగా.. అర్వింద్ పైవిధంగా స్పందించారు. తమ ఆర్థిక సంఘం ప్రధానంగా మూడు అంశాలపై రాష్ట్రాల అభిప్రాయాలను సేకరిస్తోందని తెలిపారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా నిర్ధారణ, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపు, ప్రకృతి విపత్తుల నిర్వహణకు నిధుల వాటాలను తాము సిఫారసు చేయాల్సి ఉంటుందని, అందుకే రాష్ట్రాల అభిప్రాయాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. ఇప్పటికే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, కర్ణాటక, తెలంగాణలో పర్యటించామని.. మిగతా రాష్ట్రాల్లోనూ పర్యటిస్తామని వివరించారు. అన్ని రాష్ట్రాల వినతులను స్వీకరిస్తున్నామని తెలిపారు. పలు రాష్ట్రాలు పన్నుల వాటా నిధులు తగ్గుతున్నాయని చెబుతున్నాయని.. తెలంగాణ, కర్ణాటక ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయని పేర్కొన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని.. జీఎస్‌డీపీ ఆధారంగా పన్నుల వాటాను నిర్ధారించాలని తెలంగాణ కోరిందని వెల్లడించారు. తెలంగాణలో పట్టణాభివృద్ధితో పాటు వివిధ రకాల అభివృద్ధి పనులు బాగున్నాయని ప్రశంసించారు. తాము చేసే సిఫారసుల ఆధారంగా నిర్ధారణ అయ్యే పన్నుల వాటా 2026 నుంచి ఐదేళ్ల అమలవుతుందని అర్వింద్ వివరించారు.

ఎస్‌హెచ్‌జీల పనితీరు భేష్..

రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల పనితీరు బాగుందని 16వ ఆర్థిక సంఘం సభ్యుడు అజయ్ నారాయణ ఝా అన్నారు. ఆర్థిక సంఘం సభ్యులతో కలిసి మంగళవారం ఆయన భువనగిరి మండలంలోని అనంతారం గ్రామాన్ని సందర్శించారు. పల్లె దవాఖానాను పరిశీలించి, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళా గ్రూపు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్ నారాయణ ఝా మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేయడానికి వచ్చినట్లు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులు వేగంగా జరిగాయని, 16వ ఆర్థిక సంఘం నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

రెవెన్యూ కోరలు!

(మొదటిపేజీ తరువాయి)



హైడ్రా కమిషనర్ రంగనాథ్

వద్దకు వెళ్లింది. ఒకటి, రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డికి చేరనుంది. ఆ వెంటనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. దీంతో రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, నీటి పారుదల, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు తదితర ముఖ్య శాఖల అధికారాలు హైడ్రాకు దక్కనున్నాయి. మరోవైపు మిగిలిన శాఖలకు సంబంధించిన ఫైళ్లు కూడా చకచకా కదులుతున్నాయి. సీఎం రేవంత్ ఓకే చెప్పాక, అసెంబ్లీ సమావేశాల్లో.. ఆయా శాఖల అధికారాలను హైడ్రాకు కట్టబెడుతూ చట్టం తెస్తారా లేక ఆర్డినెన్స్ ద్వారా చట్టబద్ధత కల్పిస్తారా? అనే అంశంపై చర్చ జరుగుతోంది. రెవెన్యూ, ఆక్రమణల నిరోధం, వాటర్, ల్యాండ్ అండ్ ట్రీస్ (వాల్టా), నీటి పారుదల శాఖ, జీహెచ్‌ఎంసీ, పంచాయతీ రాజ్ పరిధి అధికారాలను.. ప్రభుత్వం అంగీకారం తర్వాత హైడ్రా అమలు చేయనుంది. భూ ఆక్రమణలకు సంబంధించి ఇప్పటివరకు నోటీసులు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు ఆధ్వర్యంలో ఇస్తున్నారు. మున్సిపల్ పరిధిలోనైతే ఇది ఆయా సంస్థలకు ఉంటుంది. అధికారాల బదలాయింపు తరువాత సంబంధిత చట్టాలపై హైడ్రాదే అజమాయిషీ అవుతుంది.

పోలీస్ బలగం..

ప్రభుత్వ ఆదేశాలతో హైడ్రాకు డిప్యూటేషన్‌పై 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 8 మంది ఎస్‌ఐలను పోలీస్ శాఖ కేటాయించింది. వీరి జాబితాను అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) మహేశ్ భగవత్ యూనిట్ ఆఫీసర్లకు పంపారు. అవసరాన్ని బట్టి కానిస్టేబుళ్లనూ డిప్యూటేషన్‌పై పంపించనున్నారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులూ త్వరలో హైడ్రాకు వచ్చే అవకాశముంది. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆయా శాఖలకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. మరోవైపు ఆక్రమణదారులపై హైడ్రా విజ్ఞప్తి మేరకు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదవుతున్నాయి. సాధారణ కేసుల తరహాలో కాకుండా.. ప్రత్యేక స్టేషన్ ద్వారా అయితే విచారణ వేగిరమై.. బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. నెలాఖరుకు పోలీస్ స్టేషన్ ఏర్పాటుపై ప్రభుత్వం నుంచి ప్రకటన వస్తుందని హైడ్రా వర్గాలు భావిస్తున్నాయి.

ఆ నిర్మాణాలకు

చెరువుల పరిరక్షణకు బహుముఖ వ్యూహంలో భాగంగా హైడ్రా ఇంకో కీలక నిర్ణయమూ తీసుకుంది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలకు ఆస్తి పన్ను మదింపు చేయవద్దని పురపాలక శాఖను కోరింది. హైదరాబాద్ మీర్‌పేటలోని చెరువుల్లో నిర్మాణాలకు ప్రాపర్టీ ట్యాక్స్ ఐడెంటిఫికేషన్ నంబర్ (పీటీఐఎన్) ఉన్నట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గుర్తించారు. దీనినే యజమాన్య హక్కుగా కొందరు చెబుతున్న దృష్ట్యా.. ఇలాంటి నిర్మాణాలకు పన్ను మదింపు చేయకుండా చూడాలని పురపాలక శాఖ కీలక అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై త్వరలో అధికారిక నిర్ణయం వెలువడనున్నట్టు సమాచారం. నాలాలు, చెరువులను చదును చేస్తున్న అక్రమార్కులు.. చిన్న గదులు, ఇతర నిర్మాణాలు చేపట్టి నంబర్లు తీసుకుంటున్నారు. కోర్టు కేసులు, ఇతర సందర్భాలలో దానిని యజమాన్య హక్కుగా చూపే ప్రయత్నం చేస్తున్నారు. వివాదాస్పద స్థలాల్లో యజమాని పేరిట కాకుండా ఆవరణకు యజమాని (ఓనర్ ఆఫ్ ది ప్రెమిసెస్) అంటూ పీటీఐఎన్ కేటాయిస్తున్నారు.

ఈ నేపథ్యంలోనే భవిష్యత్‌లో ఇబ్బందులు లేకుండా.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోని నిర్మాణాలను మదింపు చేయవద్దని హైడ్రా కోరినట్టు తెలిసింది. ఇక ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నివాసేతర నిర్మాణాలకు విద్యుత్తు, తాగునీటి సరఫరా నిలిపివేసేలా టీజీఎస్‌పీడీసీఎల్, వాటర్ బోర్డుల ద్వారా కసరత్తు చేస్తున్నారు. ఆ నిర్మాణాల కనెక్షన్లను హోల్డ్‌లో పెట్టేలా ఉన్నత స్థాయి ఆదేశాలు జారీ అయ్యే అవకాశముంది. నల్లాలపై పురపాలక శాఖ, విద్యుత్ కనెక్షన్లపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో ప్రభుత్వ స్థాయిలో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం స్థలానికి సంబంధించిన రిజిస్టర్డ్ డాక్యుమెంట్, గుర్తింపు కార్డు, యజమాని ఫొటోలుంటే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారు. నోటరీ అయితే దరఖాస్తుదారు ఇండెమ్నిటీ బాండ్ సమర్పించాలి. భవనం అనుమతి, నిర్మాణ విస్తీర్ణాన్ని బట్టి నివాసయోగ్య పత్రం తదితర వివరాలను సమర్పిస్తే నల్లా కనెక్షన్ ఇవ్వాల్సి ఉన్నా.. వాటర్ బోర్డు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న నివాసేతర భవనాల కనెక్షన్లను హోల్డ్‌లో పెట్టడంతో పాటు.. కొత్త నిర్మాణాలకు విద్యుత్, తాగునీరు సరఫరా చేయొద్దని హైడ్రా కోరింది.

గొలుసుకట్టు పద్ధతిలో.. తొలుత తమ్మిడికుంటతో..

చెరువుల్లో ఆక్రమణల తొలగింపే కాదు.. వాటిని పూర్వ స్థితికి తేవడంపైనా హైడ్రా దృష్టిసారించింది. పూడిక తొలగించి నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు.. చెరువుల మధ్య అనుసంధానంగా ఉన్న నాలాలను పునరుద్ధరించనుంది. తమ్మిడికుంట చెరువును నమూనాగా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. దీనికి ఎగువన, దిగువన ఉన్న చెరువుల మధ్య నాలాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోనున్నట్టు హైడ్రా వర్గాలు తెలిపాయి. తమ్మిడికుంట శిఖంలో ఉన్న ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌ను కూల్చివేసిన విషయం విదితమే.

యూట్యూబ్ చానళ్లు లేకుంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేదా?

» ముఖ్యమంత్రిది ఒంటెత్తు పోకడ
» సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
» పెంట్లవెల్లిలో ఒక్క రైతుకి రుణమాఫీ జరగలేదు : కేటీఆర్



విలేకరులతో మాట్లాడుతున్న హరీశ్ రావు

షాద్‌నగర్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : యూట్యూబ్ జర్నలిస్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తప్పుబట్టారు. యూట్యూబ్ చానళ్లు లేకపోతే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేదా ? అని ప్రశ్నించారు. జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సతీమణి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు మంగళవారం బయలుదేరిన హరీశ్ రావు మార్గమధ్యలో షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిది ఒంటెత్తు పోకడ అని, యూట్యూబర్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. యూట్యూబర్లపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసిన చందంగా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో విఫలమవుతున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కాగా, రుణమాఫీ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలు బూటకమని, నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవల్లి గ్రామంలోని 499 మంది రైతుల్లో ఒక్కరికీ రుణ మాఫీ జరగలేదని మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్‌లో మంగళవారం ఓ పోస్ట్ చేశారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే పెంట్లపల్లి రైతుల గోడు తీర్చాలని డిమాండ్ చేశారు.

తెలంగాణకు కొత్త ఎయిర్‌పోర్టు మంజూరు చేయండి

- కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుకు మంత్రి కోమటిరెడ్డి లేఖ
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో భూమి ఉందని వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని కోరుతూ కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి లేఖ రాశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న విమానాశ్రయం, కొత్తవి ఏర్పాటు చేయడానికి ఉన్న డిమాండ్ల గురించి అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో తప్ప ఏ జిల్లాలోనూ విమానాశ్రయాలు లేవ ని, కొత్తగా ఎయిర్‌పోర్ట్ మంజూరు చేస్తే నిర్మించేందుకు ఉన్న అవకాశాలను ఆయన వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 999లో విమానాశ్రయం ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని, ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూములూ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ జిల్లా ఇప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం అక్కడ సింగరేణి, కేటీపీఎస్, ఐటీసీ, బీటీపీఎస్, హెవీ వాటర్ ప్లాంట్, ఎన్‌ఎండీసీతోపాటు నవభారత్ వంటి ప్రముఖ కంపెనీలు ఉన్నాయని.. తద్వారా వాణిజ్య, వ్యాపార లావాదేవీలు నానాటికీ పెరుగుతున్నాయని వివరించారు. భద్రాచలం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరాముడి ఆలయం ఉందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి దోహదపడేందుకుగాను గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

పశువుల టీకాల ఉత్పత్తిలోనూ ముందుంటాం

- మనుషుల వ్యాక్సిన్ల తయారీలో ఇప్పటికే మంచి పేరు
- జొయెటిస్ సామర్థ్య కేంద్రం ప్రారంభోత్సవంలో దుద్దిళ్ల



'జోయెటిస్' కేపబిలిటీ సెంటర్ ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యాక్సిన్ల తయారీలో ఇప్పటికే ప్రపంచస్థాయిలో పేరుగాంచిన హైదరాబాద్.. పశువుల టీకాల ఉత్పత్తిలోనూ ముందుంటుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చెప్పారు. పశువుల టీకాలు, ఔషధాలు, పోషకాల తయారీలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీ జోయెటిస్ తన సామర్థ్య కేంద్రాన్ని (క్యాపబిలిటీ సెంటర్)ను రాయదుర్గంలోని సాత్వా నాలెడ్జ్ సిటీలో ఏర్పాటు చేసింది. 40 వేల చదరపు అడుగుల్లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశు వైద్య రంగంలో ప్రపంచ దిగ్గజంగా పేరుగాంచిన జోయెటిస్ ప్రవేశంతో లైఫ్ సైన్సెస్ రంగంలో హైదరాబాద్ కొత్త మైలు రాయిని దాటిందని చెప్పారు. పశువులు, పెంపుడు జంతువుల ఔషధాలు, పోషకాల ఉత్పత్తిలో జోయెటిస్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన కేంద్రంలో బిజినెస్ ఆపరేషన్స్, డేటా మేనేజ్‌మెంట్, పరిశోధన, అభివృద్ధి వంటి కార్యకలాపాలను నిర్వహిస్తుందని శ్రీధర్ బాబు వెల్లడించారు. ఇటీవలి అమెరికా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి, తాను జోయెటిస్ యాజమాన్యంతో చర్చలు జరిపామని తెలిపారు. తమ ఆహ్వానాన్ని మన్నించి అతి తక్కువ సమయంలో వారు ఇక్కడ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. వచ్చే ఏడాది చివరి నాటికి సాఫ్ట్‌వేర్ రంగంలో, పశువైద్య రంగంలో వందలాది మందికి హైదరాబాద్‌లో ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోయెటిస్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ కీత్ సార్బాగ్, జోయెటిస్ ఇండియా సామర్థ్య కేంద్రం వైస్ ప్రెసిడెంట్ అనిల్ రాఘవ్, టీజీఐఐసీ సీఈవో మధుసూదన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్, ఫార్మా డైరెక్టర్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

మానవ వనరుల లభ్యతలో రాష్ట్రం టాప్..

తెలంగాణలో నిపుణులైన మానవ వనరులు అపారంగా ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. మంగళవారం ఆయన సచివాలయంలో అమెరికా కాన్సులేట్ అధికారులతో సమావేశమయ్యారు. ఇక్కడ సాంకేతిక నిపుణులు ఉండడం వల్లే ఐటీ ఎగుమతుల్లో హైదరాబాద్ దేశంలోనే రెండో స్థానంలో ఉందని తెలిపారు. వ్యాపార, పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయని శ్రీధర్ బాబు వివరించారు. నీరు, విద్యుత్తు నిరంతరాయంగా అందించే సామర్థ్యం రాష్ట్రానికి ఉందన్నారు. రైలు, రోడ్డు, విమాన రవాణా కనెక్టివిటీ విస్తృతంగా ఉందని చెప్పారు.

అగ్రిసెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్ ఫలితాల విడుదల

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించిన అగ్రి సెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 ఫలితాలు విడుదలయ్యాయి. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిపాలనా భవనంలో వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రఘురామిరెడ్డి అగ్రి సెట్, అగ్రి ఇంజనీరింగ్ సెట్ ఫలితాలను విడుదల చేశారు. అగ్రి సెట్‌లో మెరిట్ సాధించిన అభ్యర్థుల జాబితాను కూడా విడుదల చేశారు.

ఇంటర్ అడ్మిషన్ల గడువు 15 వరకు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ అడ్మిషన్ల గడువును మరో సారి పొడిగించారు. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకు ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అడ్మిషన్ల గడువు ఈ నెల 10వ తేదీతో ముగిసింది. అయితే.. దీనిని తాజాగా ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు ఈ నిర్ణయం వర్తించనుంది. కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ గడువును పొడిగించినట్టు అధికారులు స్పష్టం చేశారు.



సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టిని కలిసి రూ.5 కోట్ల విరాళం చెక్ అందజేస్తున్న మేఘా ఎండీ కృష్ణారెడ్డి, చిత్రంలో మంత్రి పొన్నం, జగ్గారెడ్డి తదితరులు

సీఎం సహాయ నిధికి 'మేఘా' రూ.5 కోట్ల విరాళం

- లలితా జ్యువెలర్స్, సైయంట్, మైత్రా చెరో రూ.కోటి
- అన్నపూర్ణ స్టూడియోస్ 50 లక్షలు, దిల్ రాజు 25 లక్షలు

హైదరాబాద్, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాల వెల్లువ కొనసాగుతోంది. మంగళవారం పలువురు వ్యాపార, సినీ రంగ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిని కలసి విరాళాలు అందజేశారు. మేఘా సంస్థ (ఎంఈఐఎల్) ఎండీ కృష్ణారెడ్డి రూ.5 కోట్లు, లలితా జ్యువెలర్స్ అధినేత కిరణ్ రూ.కోటి విరాళం ఇచ్చారు. సైయంట్ సంస్థ రూ.కోటి, మైత్రా ఎనర్జీ గ్రూప్-అక్షత్ గ్రీన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.కోటి అందజేశాయి. అన్నపూర్ణ స్టూడియోస్ తరఫున నిర్మాత, నటి యార్లగడ్డ సుప్రియ రూ.50 లక్షలు, సినీ నిర్మాత దిల్ రాజు రూ.25 లక్షల విరాళం ఇచ్చారు. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నందుకు వారికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

మల్లమ్మకు ఇల్లు మంజూరు

ఎనిమిదేళ్లుగా మరుగుదొడ్డిలో నివసిస్తున్న వృద్ధురాలికి సీఎం అండ

- 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
- సీఎం ఆదేశాలతో మల్లమ్మ వద్దకు కలెక్టర్
- ఇంటి నిర్మాణానికి హామీ





మల్లమ్మ నివాసముంటున్న మరుగుదొడ్డి ఇదే; మల్లమ్మకు ఆర్థిక సాయం అందజేస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

పరిగి, సెప్టెంబరు 10 : ఉండడానికి ఇల్లు లేక ఎనిమిదేళ్లుగా మరుగుదొడ్డిలో నివాసముంటున్న వికారాబాద్ జిల్లాకు చెందిన మల్లమ్మ అనే వృద్ధురాలి దీనస్థితిపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రసారమైన కథనానికి సీఎం రేవంత్ స్పందించారు. మల్లమ్మకు తక్షణమే సాయం అందించాలని, ఆమెకు ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు దీంతో మల్లమ్మ వద్దకు వెళ్లిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్.. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలోని చిగురాల్‌పల్లికి చెందిన ఏరోళ్ల మల్లమ్మ భర్త అనంతయ్య అనారోగ్యంతో 20 ఏళ్ల క్రితం మరణించారు. మల్లమ్మ తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేసింది. శిథిలావస్థకు చేరిన ఆమె ఇల్లు భారీ వర్షాల దెబ్బకు పదిహేనేళ్ల క్రితం కూలిపోయింది. అదే స్థానంలో ఇంటి నిర్మాణాన్ని మొదలుపెట్టినా ఆర్థిక ఇబ్బందుల వల్ల పనులు నిలిచిపోయాయి. దీంతో అక్కడే ఓ గుడిసె ఏర్పాటు చేసుకుని నివాసముంది. కొంతకాలానికి ఆ గుడిసె కూలిపోగా, అప్పటికే స్వచ్ఛభారత్ మిషన్‌లో తనకు మంజూరైన మరుగుదొడ్డిలోకి నివాసాన్ని మార్చుకుంది. ఎనిమిదేళ్లుగా అందులోనే జీవనం సాగిస్తోంది. భర్తను కోల్పోయిన ఆమె కుమార్తె తన పిల్లలతో కలిసి మల్లమ్మతోపాటు అదే మరుగుదొడ్డిలో కొన్నాళ్లు నివసించింది. మల్లమ్మ ప్రస్తుతం ఒంటరిగా జీవిస్తోంది. ఆ మరుగుదొడ్డి కూడా ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఇంటి నిర్మాణానికి సాయం చేయాలని మల్లమ్మ నాయకులు, అధికారులను పలుమార్లు కోరినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో మల్లమ్మ పరిస్థితిపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో విషయం సీఎం దృష్టికి వెళ్లగా ఆయన స్పందించారు. సీఎం ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రతీక్‌జైన్ చిగురాల్‌పల్లి వెళ్లారు. మల్లమ్మను కలిసి వృద్ధాశ్రమంలో ఉంటావా? అని ప్రశ్నించగా... ఉంటే ఇక్కడే ఉంటా.. లేదంటే ఇల్లు మంజూరు చేయాలని మల్లమ్మ బదులిచ్చింది. దీంతో ఇంటి నిర్మాణానికి అవసరమైన ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అలాగే, రెవెన్యూ అధికారులు సమకూర్చిన ఆర్థిక సాయాన్ని మల్లమ్మకు కలెక్టర్ అందజేశారు. మరోపక్క, పోలీసుల తరఫున పరిగి ఎస్సై సంతోష్‌కుమార్ కూడా మల్లమ్మకు సాయం అందించారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతికి మల్లమ్మ ధన్యవాదాలు తెలిపారు.

రుణ భారం తగ్గించండి

(మొదటిపేజీ తరువాయి)



16వ ఆర్థిక సంఘం సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, సీఎస్ శాంతికుమారి

చేసింది. మంగళవారం 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అర్వింద్ పనగడియా ఆధ్వర్యంలోని బృందంతో ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులు, వడ్డీ చెల్లింపులు తదితర వివరాలను ఆర్థిక సంఘానికి తెలపడంతో పాటు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. రాష్ట్రాల పన్నుల వాటాను తలసరి ఆదాయం ఆధారంగా కాకుండా జీఎస్‌డీపీ ఆధారంగా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్‌ల)ను రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఆయా రాష్ట్రాలే రూపొందించుకునే అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున చేసిన విజ్ఞప్తుల వివరాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మీడియాకు వివరించారు.

రాష్ట్ర పురోగతిపై ప్రభావం..

డిప్యూటీ సీఎం తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాష్ట్ర అప్పు రూ.6.85 లక్షల కోట్లకు పైగా ఉందని ఆర్థిక సంఘానికి ప్రభుత్వం తెలిపింది. రాష్ట్రంలోని ఉద్యోగుల జీత భత్యాలు, సర్వీసు పెన్షన్లకు ప్రతి నెలా రూ.5 వేల కోట్ల మేర వ్యయం చేస్తుంటే.. అప్పుల అసలు, వడ్డీ చెల్లింపులకు రూ.5,200 కోట్ల వరకు వ్యయం చేయాల్సి వస్తుందని వివరించింది. అప్పట్లో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఆర్ఈసీ)ల నుంచి 11 శాతం, 11.5 శాతం వంటి అత్యధిక వడ్డీ రేట్లతో అప్పులు తెచ్చారని గుర్తు చేసింది. రుణాలు, వడ్డీ చెల్లింపులు ఇప్పుడు సక్రమంగా నిర్వహించకపోతే.. రాష్ట్ర పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో రుణాల సమస్యను పరిష్కరించేందుకు రాష్ట్రానికి తగిన సహాయం, మద్దతు ఇవ్వాలని కోరింది. ఇందుకోసం రుణాలను రీస్ట్రక్చర్ చేసే అవకాశమైనా ఇవ్వాలని, లేదా రాష్ట్రానికి అదనపు ఆర్థిక సహాయమైనా అందించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

తలసరి ఆదాయం ఆధారంగా వాటాతో అన్యాయం

రాష్ట్రాల జనాభా, తలసరి ఆదాయాల ఆధారంగా కాకుండా... రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ఆధారంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను నిర్ధారించాలని ఆర్థిక సంఘాన్ని ప్రభుత్వం కోరింది. తలసరి ఆదాయం, జనాభా ఆధారంగా వాటాను నిర్ధారించడం వల్ల తెలంగాణ వంటి ప్రగతిశీల రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందని ప్రభుత్వం తెలిపింది. జనాభాను నియంత్రిస్తూ జీఎస్‌డీపీని పెంచుకుంటున్న రాష్ట్రాలకు ప్రస్తుత విధానం ప్రతిబంధకంగా మారిందని ఆక్షేపించింది. తెలంగాణ రాష్ట్రంలో మొదటి నుంచి జనాభాను నియంత్రిస్తున్నామని, తద్వారా జనాభా తగ్గిపోయి, తక్కువ వాటా వస్తోందని తెలిపింది. ఎలాంటి జనాభా నియంత్రణ పాటించని ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రం అత్యధిక నిధులు కేటాయిస్తున్నారని, ఈ విధానం సరికాదని ఆక్షేపించింది. ఒక రాష్ట్రంలోని జిల్లాల వారీగా చూసినా... తలసరి ఆదాయంలో భారీ అంతరం ఉందని పేర్కొంది. ఉదాహరణకు తెలంగాణలోని రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల తలసరి ఆదాయం చాలా ఎక్కువగా ఉండగా, వికారాబాద్ వంటి జిల్లాల తలసరి ఆదాయం చాలా తక్కువగా ఉంటుందని గుర్తు చేసింది. ఇలాంటి ఆర్థిక అసమానతల దృష్ట్యా.. తలసరి ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకోవద్దని కోరింది. కేవలం తలసరి ఆదాయంతో రాష్ట్రాల శ్రేయస్సును కొలవడం వల్ల రాష్ట్రంలోని ఆర్థిక అసమానతలు తొలగిపోవని పేర్కొంది. తెలంగాణ, హరియాణా వంటి రాష్ట్రాలు అత్యధిక జీఎస్‌డీపీని సాధిస్తూ స్థూల దేశీయోత్పత్తి(జీడీపీ)'కి ఎక్కువ మొత్తం భాగస్వామ్యం అందిస్తున్నాయని చెప్పింది. దేశంలో తెలంగాణ జనాభా 3 శాతం ఉండగా... జీడీపీకి రాష్ట్రం అందించే జీఎస్‌డీపీ వాటా 5.1 శాతంగా ఉందని ప్రభుత్వం గుర్తు చేసింది.

జీఎస్‌డీపీతో పెట్టుబడులు..

జీఎస్‌డీపీ ఎక్కువగా ఉంటే.. రాష్ట్రాలు పెట్టుబడులను ఆకర్షించవచ్చని, ఉద్యోగాలను సృష్టించవచ్చని, అంతిమంగా జాతీయ ఆర్థిక వ్యవస్థకు దోహదపడవచ్చని ఆర్థిక సంఘానికి ప్రభుత్వం వివరించింది. పైగా ఈ విధానం రాష్ట్రాల మధ్య మరింత పోటీ పెంచుతుందని, సమతుల అభివృద్ధికి బాటలు వేస్తుందని పేర్కొంది. 2027-28 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలనే భారతదేశ లక్ష్యంతో ఇది సరితూగుతుందని విశ్వసిస్తున్నామని తెలిపింది. రైతు భరోసా, వ్యవసాయ రుణాల మాఫీ, ఆహార సబ్సిడీలు వంటి కార్యక్రమాలు బలహీన వర్గాలకు ఆర్థిక స్థిరత్వాన్ని, సామాజిక భద్రతను కలిగిస్తాయని, ఇలాంటి వాటికి 'ఉచితాలు' అని ముద్ర వేసి, పన్నుల వాటా నిర్ధారణ సందర్భంలో పరిగణనలోకి తీసుకోవద్దని కోరింది. వీటిని ప్రజల సంక్షేమానికి అవసరమైన పెట్టుబడులుగా గుర్తించాలని తెలిపింది. పన్నుల వాటాను నిర్ధారించే సందర్భంలో జీఎస్‌డీపీకి 50 శాతం వెయిటేజీ ఇవ్వాలని కోరింది.

రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా సీఎస్ఎస్‌లు

కేంద్ర ప్రాయోజిత పథకాలు (సీఎస్ఎస్‌లు) రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. వీటిని రాష్ట్రాలే రూపొందించుకుని, కేంద్రానికి సిఫారసు చేసేలా వెసులుబాటు కల్పించాలని కోరింది. ఒక్కో రాష్ట్రానికి సంబంధించి భౌగోళిక, ఆర్థిక, సామాజిక అవసరాలు ఒక్కో రకంగా ఉంటాయని, కానీ.. కేంద్ర ప్రభుత్వం రూపొందించే సీఎస్ఎస్‌లు కొన్ని రాష్ట్రాలకు నిష్ప్రయోజనంగా మారుతున్నాయని తెలిపింది. దీంతో అవసరంలేని పథకాల వల్ల కొన్ని రాష్ట్రాలకు నష్టం వాటిల్లుతుందని పేర్కొంది. ఈ సీఎస్ఎస్‌ల కింద విధించే షరతులు కూడా కొన్ని రాష్ట్రాలకు ప్రతిబంధకంగా మారుతున్నాయని చెప్పింది. ప్రస్తుతం సీఎస్ఎస్‌ల కింద కేంద్ర, రాష్ట్రాల వాటా 60:40 శాతాలుగా ఉన్నాయని, ఇదే విధానాన్ని అమలు చేసినా తమకు అభ్యంతరం లేదని, కానీ.. సీఎస్ఎస్‌ల రూపకల్పన బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించాలని కోరింది. దీంతోపాటు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ప్రస్తుతం ఇస్తున్న 41 శాతం వాటాను 50 శాతానికి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. కేంద్ర ప్రభుత్వం రోడ్డు సెస్, ఎడ్యుకేషన్ సెస్ వంటి వాటిని అమలు చేస్తుండడంతో దేశ స్థూల పన్ను ఆదాయం తగ్గిపోతోందని, దీంతో రాష్ట్రాలకు 41 శాతం మేర రావాల్సిన నిధులు... 31 శాతానికి తగ్గిపోయాయని పేర్కొంది. 15వ ఆర్థిక సంఘం సూచించిన 41 శాతం మేర నిధులు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రాల్లో సంక్షేమ కార్యక్రమాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపింది. రాష్ట్రంలో పలురకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని, రాష్ట్రానికి నిధులను పెంచే సందర్భంలో వీటిని పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. రాష్ట్రాలకు పంపిణీ చేసే నిధుల వాటాను 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలనే డిమాండ్‌ను కేంద్రం నెరవేర్చితే... దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎంచుకున్న లక్ష్య సాధనకు తాము సంపూర్ణంగా సహకరిస్తామని పేర్కొంది. తెలంగాణను ఒక ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, దేశాన్ని ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో తమ వంతు బాధ్యతను నెరవేరుస్తామని తెలిపింది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అధికారులు పాల్గొన్నారు.

అవసరాన్ని బట్టి కొత్త బస్సులు కొనండి

- ఆర్టీసీ రుణ భారం.. తగ్గించేందుకు ప్రయత్నించండి
- ఆర్టీసీపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు రంగం సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కొత్త రూట్లు, పెరిగిన అవసరాల మేరకు ఎన్ని బస్సులు అవసరమో గుర్తించాలన్నారు. మంగళవారం ఆయన ఆర్టీసీ పనితీరు, అవసరాలపై తొలిసారి సమీక్ష నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు, దాన్ని మహిళలు వినియోగించుకుంటున్న తీరుపై రేవంత్ ఆరా తీశారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దీనిపై స్పందిస్తూ.. సీఎంకు వివరాలను అందజేశారు. మహాలక్ష్మి అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వివరించారు. ఇప్పటి వరకు 83.42 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని చెప్పారు. దీని వల్ల మహిళా ప్రయాణికులకు రూ.2,840.71 కోట్ల మేర ఆదా అయ్యిందని తెలిపారు. ఆర్టీసీలోని 7,292 బస్సుల్లో మహాలక్ష్మి పథకం వర్తిస్తోందని వెల్లడించారు. పథకం ప్రారంభమైన తర్వాత వివిధ జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు వస్తున్న మహిళల సంఖ్య పెరుగుతోందని చెబుతూ.. అందుకు సంబంధించిన ఫొటోలు, వార్తలతో ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఆర్టీసీకి వివిధ బ్యాంకులు, ఉద్యోగుల భవిష్యత్ నిధి ఖాతా నుంచి వాడుకున్న నిధులు, విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కలిపి రూ.6,322 కోట్ల రుణాలు ఉన్నట్లు వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ బ్యాంకు రుణాలకు చెల్లిస్తున్న వడ్డీ రేటు ఎక్కువగా ఉందని.. దాన్ని తగ్గించే మార్గాలను అన్వేషించాలని సూచించారు. అప్పుల తీరుతెన్నులపై పునఃపరిశీలన చేసి, సంస్థకు క్రమంగా రుణ భారం తగ్గించాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగిందని, ప్రభుత్వం ఈ పథకానికి చెల్లిస్తున్న రీయింబర్స్‌మెంట్ సంస్థ లాభాల్లో భాగమవుతోందని అధికారులు సీఎంకు వివరించారు.

ఉద్యోగుల నారాజ్

సీఎం రేవంత్ మొదటిసారిగా ఆర్టీసీపై సమీక్ష చేపట్టడంతో ఉద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ, యూనియన్ల పునరుద్ధరణ, బాండ్ల డబ్బుల అంశం చర్చకు వస్తాయని ఆశించారు. ఈ సమావేశం తమను నిరాశపరిచిందని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ ఇ.అశ్వత్థామ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ సమావేశంలో చర్చకు స్వీకరించలేదని విమర్శించారు. సుదీర్ఘంగా ఎదురుచూస్తున్న తమ డిమాండ్లకు పరిష్కారం లభించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర నిరాశకు గురయ్యారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలపై ప్రకటన చేయాలనీ, లేని పక్షంలో అన్ని యూనియన్లతో కలిసి ఉమ్మడి పోరాటాలకు కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.



ఐలమ్మ 39వ వర్ధంతి సభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల

కోఠీ మహిళా వర్సిటీకి ఐలమ్మ పేరు

- మహిళా కమిషన్ సభ్యురాలిగా ఆమె మనవరాలు శ్వేత
- ఐలమ్మ 39వ వర్ధంతి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రవీంద్ర భారతి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'గడీలలో గడ్డి మొలవాలి' నినాదం ఇచ్చిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ పేరును కోఠీ మహిళా యూనివర్సిటీకి పెడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఐలమ్మ మనమరాలు శ్వేతను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రశ్నించే గొంతులు, ప్రజా సమస్యలను పరిష్కరించేవారూ తమకు కావాలని వ్యాఖ్యానించారు. రవీంద్ర భారతిలో మంగళవారం నిర్వహించిన చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన ప్రత్యేక నృత్య రూపకాన్ని తిలకించారు. కళాకారులను సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. దొరల చేతుల్లో ఉన్న వేలాది ఎకరాల భూమి పేదలకు చేరాలని ఐలమ్మ పోరాటం చేశారని, ఆమె పోరాట స్ఫూర్తితోనే ఇందిరా గాంధీ భూ సంస్కరణలను తీసుకొచ్చారని తెలిపారు. భూ సంస్కరణలను తీసుకొచ్చిన ఇందిరా గాంధీ, వాటిని అమలు చేసిన పీవీ నరసింహారావు కారణంగానే తెలంగాణలోని లక్షలాది పేదల చేతుల్లోకి భూ యాజమాన్య హక్కు వచ్చిందన్నారు. "ఆనాడు కాంగ్రెస్ పార్టీ భూ హక్కులను ఇస్తే.. ధరణి పేరిట వాటిని లాక్కోవాలని గత ప్రభుత్వం ఆలోచన చేసింది. ధరణి ముసుగులో వాటిని లాక్కోవాలని కుట్ర జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది" అని వివరించారు. చరిత్రలో గొప్ప వ్యక్తుల పేరు కలకాలం నిలిచిపోవాలని, వారి స్ఫూర్తి మరింత ముందుకు సాగిపోవాలనే ఆలోచనతో గడీ కంచెలు బద్దలు కొట్టి ప్రజా భవన్‌కు జ్యోతిరావు పూలే పేరు పెట్టుకున్నామని, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్‌కి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టామని, కోఠి మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టబోతున్నామని ప్రకటించారు. సామాజిక చైతన్యం తీసుకొచ్చి, పేదలకు హక్కులు కల్పించిన వ్యక్తుల పేర్లు మనకెప్పుడూ స్ఫూర్తిగా ఉండాలనే ఈ నిర్ణయమన్నారు. రాష్ట్రంలో ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు.

ఐలమ్మ నృత్య రూపకం

తెలంగాణ ఉద్యమ వీర వనిత చాకలి ఐలమ్మ జీవితం తొలిసారిగా కూచిపూడి నృత్య రూపకం రూపంలో వేదికపైకి వచ్చింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో ప్రముఖ నాట్య గురువు, సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాల బృందం దీనిని ప్రదర్శించింది. ఐలమ్మ పాత్రను పోషించిన అలేఖ్య ప్రేక్షకులను రంజింపజేశారు. ఇటీవల మరణించిన సినీ గేయ రచయిత వడ్డేపల్లి కృష్ణ ఈ నృత్య రూపకాన్ని రచించగా.. వీబీఎస్ మురళి బృందం సంగీతం అందించింది. రజాకర్లు, దేశ్‌ముఖ్‌ల అరాచకాలను ధైర్యంగా ఎదుర్కొన్న తీరు, భూమి నాది, అందులో పండిన పంట నాది, మధ్యలో దొర ఎవ్వడు అంటూ పోరాట బాట పట్టిన ఐలమ్మ జీవితాన్ని నృత్య రూపకంలో ఆవిష్కరించారు. దీనిని సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు తదితరులు వీక్షించారు. అనంతరం అలేఖ్య పుంజాలను సీఎం రేవంత్ ఘనంగా సత్కరించారు.

విలీన గ్రామాల్లో నేటి నుంచి పురపాలన

రంగారెడ్డి అర్బన్/ఘట్‌కేసర్ రూరల్/శామీర్‌పేట, సెప్టెంబరు 10: జీహెచ్ఎంసీ పరిధిని పెంచే క్రమంలో ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల, చేరువగా ఉండే 51 గ్రామాలను సమీప మునిసిపాలిటీల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. ఆ విలీన గ్రామాల్లో బుధవారం నుంచి పురపాలన ప్రారంభం కానుంది. ప్రభుత్వ ఆదేశాలతో మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలోని 51 పంచాయతీల రికార్డులు మునిసిపల్ అధికారుల చేతుల్లోకి వెళ్లాయి. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శుల నుంచి మునిసిపల్ కమిషనర్లు మంగళవారం రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని కాచవానిసింగారం, ప్రతాప్‌సింగారం, కొర్రెముల, వెంకటాపూర్, చౌదరిగూడ గ్రామాలు పోచారం మునిసిపాలిటీలో, అవుషాపూర్, అంకుశాపూర్, మాధారం, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, ఘనాపూర్ గ్రామాలు ఘట్‌కేసర్ మునిసిపాలిటీలో విలీనమయ్యాయి. అలాగే, తూంకుంట మునిసిపాలిటీలో శామీర్‌పేట, బొమ్మరాశిపేట, బాబాగూడ గ్రామాలు విలీనమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 11 గ్రామాలు సమీప మునిసిపాలిటీల్లో విలీనమయ్యాయి. కాగా, మునిసిపల్ కమిషనర్లకు రికార్డులు అప్పగించాలని పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ నుంచి ఇంకా ఆదేశాలు రాలేదని రంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి సురేశ్ మోహన్ తెలిపారు. రికార్డులు అప్పగించేందుకు సర్వం సిద్ధం చేశామని, ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే అప్పగిస్తామని చెప్పారు. కాగా, మునిసిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు సాగుతామని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఏపీలో 'హ్యాపీ'నెస్ట్‌కు ఊపిరి!

- టెండర్లు పిలిచిన సీఆర్‌డీఏ.. రూ.930 కోట్లతో అంచనాలు

విజయవాడ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు తిరిగి ఊపిరి పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్(ఆర్ఎఫ్‌పీ)ను మంగళవారం విడుదల చేసింది. సవరించిన అంచనాలతో రూ.930 కోట్ల వ్యయంతో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు టెండర్లు పిలిచింది. అమరావతి రాజధాని ప్రాంతంలోని నేలపాడులో 14.5 ఎకరాల విస్తీర్ణంలో జీ ప్లస్ 18 అంతస్తులతో మొత్తం 12 టవర్లను నిర్మించనున్నారు. డిజైన్ అండ్ బిల్డ్ విధానంలో 1200 ఫ్లాట్లను నిర్మిస్తారు. గత వైసీపీ ప్రభుత్వం రాజధానిలోని ఇతర ప్రాజెక్టుల తరహాలోనే హ్యాపీనెస్ట్‌కు కూడా పాతర వేసింది.

ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్లు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ, నీటిపారుదలశాఖ, పురపాలకశాఖకు చెందిన ఖాళీ భూముల్లో సోలార్ ప్లాంట్లు పెట్టాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఆయా భూముల్లో సోలార్ ప్లాంట్లు పెట్టడం ద్వారా భూములకు రక్షణతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం చూస్తోంది. అంతేకాకుండా రాష్ట్రంలో కాలుష్యరహిత విద్యుత్‌కు ప్రోత్సాహం అందించాలనే యోచనతో ఉంది. దాంతో ఆయా శాఖలకు లేఖలు రాసి, వివరాలు సేకరించిన అనంతరం భూముల్లో ప్లాంట్లు పెట్టనుంది. దీని కోసం కేంద్ర సహాయం కూడా తీసుకోవాలని ప్రభుత్వం యోచిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం సోలార్ విద్యుత్ ఉత్పాదక సామర్థ్యం 4816.74 మెగావాట్లుగా ఉంది. దీన్ని మరింత పెంచేందుకు ప్రభుత్వ భూముల్లో సోలార్ ప్లాంట్లు, ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయనున్నారు.

నేడు ఢిల్లీకి టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

- ఖర్గే, సోనియా, రాహుల్‌ను కలిసే అవకాశం
- 16న భట్టి, మహేశ్‌గౌడ్‌తో కలిసి ఢిల్లీకి సీఎం రేవంత్



హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బుధవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. అధిష్ఠానం పెద్దలను కలిసి తనను అధ్యక్షుడిగా నియమించినందుకు ధన్యవాదాలు తెలపనున్నారు. దాంతోపాటు ఈ నెల 15న జరగనున్న తన బాధ్యతల స్వీకార కార్యక్రమానికి వారిని ఆహ్వానించనున్నారు. ఈ పర్యటనలో ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీలను కలిసే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇదిలా ఉండగా.. ఈ నెల 16న సీఎం రేవంత్‌రెడ్డి.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా.. టీపీసీసీ నూతన అధ్యక్షునిగా నియమితుడైన మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఇక్కడి ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం పలువురు పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలు కలిసి అభినందించారు. వారిలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయరమణారావు, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. మరోవైపు మహేశ్‌కుమార్‌గౌడ్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లోని మంత్రి దామోదర రాజనర్సింహ క్యాంపు కార్యాలయానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఉన్నారు.

మిజోరాం గవర్నర్ హరిబాబుకు లంగ్స్ ఇన్ఫెక్షన్

- ఐసీయూలో చికిత్స.. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉంది
- స్టార్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌లో వెల్లడి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 10(ఆంధ్రజ్యోతి): మిజోరాం గవర్నర్ హరిబాబు ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు స్టార్ ఆస్పత్రి వైద్యులు ప్రకటించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని తెలిపారు. ఈ మేరకు మంగళవారం హెల్త్ బులెటిన్‌ను విడుదల చేశారు. ఐదు రోజుల పాటు జ్వరంతో బాధపడిన హరిబాబు చికిత్స కోసం సోమవారం ఔటర్ రింగ్ రోడ్ సమీపంలోని స్టార్ ఆస్పత్రిలో చేరారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆయన ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ సోకిందని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి ఐసీయూకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ విక్రమ్ వర్మ, సీనియర్ పల్మనాలజీ, క్రిటికల్ కేర్ మెడిసిన్ డాక్టర్ చందనరెడ్డి పర్యవేక్షణలో వైద్య నిపుణులతో కూడిన బృందం హరిబాబుకు చికిత్స అందిస్తోందని స్టార్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌లో వివరించింది.

జైనూర్ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ విచారణ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆదివాసీ మహిళపై జరిగిన అత్యాచారయత్నం, హత్యాయత్నం ఘటనను జాతీయ మానవహక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసిన సదరు ఘటనపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలకు నోటీసులు జారీ చేసింది. ఎఫ్ఐఆర్ స్థితిగతులు, బాధితురాలి ఆరోగ్యం, ఆమెకు ఇచ్చిన కౌన్సెలింగ్, నష్టపరిహారం వంటి వివరాలను నివేదికలో పొందుపరచాలని ఆదేశించింది. మహిళపై హత్యాయత్నం, మతపరమైన స్థలాలపై దాడి చేయడం, దుకాణాలు తగలబెట్టడం వంటివాటిపై మీడియాలో వచ్చిన కథనాలు నిజమైతే మానవహక్కుల ఉల్లంఘనకు సంబంధించి తీవ్రమైన అంశాన్ని లేవనెత్తుతాయని కమిషన్ అభిప్రాయపడింది.

గిరి గ్రామాల కోసం బైక్ అంబులెన్సులు

ఉట్నూర్, సెప్టెంబరు 10: గిరి గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం బైక్ అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని ఉట్నూర్, ఏటూరు నాగారం, భద్రాచలం, మన్ననూరు ఐటీడీఏలకు 10వంతున 40 బైక్ అంబులెన్సులను మంజూరు చేసింది. ప్రతీ బైక్ అంబులెన్సుకు ఒక ఈఎంటీని నియమించి మారుమూల గ్రామాల ప్రజలకు సత్వర వైద్య సేవలు అందించేలా ఆయా ప్రాంతాల ఐటీడీఏ అధికారులు ప్రణాళికలు చేసుకోవాలని కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఆదేశించారు. బైక్ అంబులెన్సులకు కావాల్సిన ఆక్సిజన్ సిలిండర్లు, అంబు బ్యాగులు, అమరాన్ బ్యాటరీలు, గ్లూకోమీటర్లు, పల్స్ యాక్సీమీటర్లను ఆయా ఐటీడీఏలకు పంపించినట్లు ఆయన తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ బిల్లులపై జమ్మికుంటలో సీఐడీ విచారణ

జమ్మికుంట, సెప్టెంబరు 10: కరీంనగర్ జిల్లాలోని జమ్మికుంట పాత అంబేడ్కర్ చౌరస్తాలో గల సప్తగిరి ఆసుపత్రిలో సీఎంఆర్ఎఫ్ బిల్లుల అక్రమాలపై తెలంగాణ సీఐడీ పోలీసులు మంగళవారం విచారణ చేపట్టారు. ఇదే ఘటనపై ఏడాది క్రితం అధికారులు ఆసుపత్రిలో తనిఖీలు జరిపారు. సప్తగిరి ఆసుపత్రి నుంచి ఒకే ఐడీపై రెండు సీఎంఆర్ఎఫ్ బిల్లులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆసుపత్రిపై కేసు నమోదు చేశారు. గతంలో ఆసుపత్రిలో పనిచేసిన సంతోష్ అనే వ్యక్తి బిల్లులు తయారుచేశాడని ఆసుపత్రి వైద్యుడు వంశీకృష్ణ ఆరోపించిన విషయం తెలిసిందే. సీఐడీ పోలీసులు సదరు వ్యక్తితో పాటు వైద్యుడిని విచారించారు. ఫేక్ బిల్లులు ఎలా వచ్చాయో తనకు తెలియదని, బిల్లులపై ఉన్న సంతకం కూడా తనది కాదని వైద్యుడు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. అసలు ఆ బిల్లుల సంగతే తనకు తెలియదని సంతోష్ పేర్కొన్నట్లు తెలిసింది.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 10: అప్పుల బాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కరీంనగర్ జిల్లా చామనపల్లికి చెందిన చేనేత కార్మికుడు గుండేటి గణేశ్ (38) పని సరిగా లభించకపోవడంతో రూ. మూడు లక్షల అప్పుచేశాడు. ఓ వైపు చేతిలో చిల్లిగవ్వ లేకపోవడం, మరో వైపు అప్పులిచ్చిన వారు తీర్చాలని వేధింపులకు గురి చేస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చే దారి తెలియక ఆత్మహత్య చేసుకుంటున్నానని లేఖ రాసి.. సోమవారం గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు గమనించి వెంటనే అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గణేశ్ మంగళవారం మృతి చెందాడు.

యాదాద్రి థర్మల్‌లో నేడు మహత్తర ఘట్టం

- ప్లాంట్‌లోని ఒక యూనిట్ సింక్రనైజేషన్
- హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి, మంత్రులు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో బుధవారం ముఖ్యమైన ఘట్టం ఆవిష్కృతం కానుంది. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తోన్న ఈ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండో యూనిట్‌ను బుధవారం సింక్రనైజేషన్ చేయనున్నారు. దాదాపు 72 గంటల పాటు విద్యుత్ ఉత్పాదన చేసిన తర్వాత ప్లాంట్ కమిషన్ కానుంది. ఆ తర్వాత గ్రిడ్‌కు ప్లాంట్ నుంచి ఉత్పత్తి చేసిన కరెంట్‌ను అందించనున్నారు. ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పాదన సజావుగా జరుగుతుందని నిర్ధారించుకున్న తర్వాత వాణిజ్య పరంగా ఉత్పత్తి చేయనున్నట్లు(సీవోడీ-కమర్షియల్ ఆపరేషన్ డేట్) ప్రకటించనున్నారు. రాష్ట్రంలో ఒకే చోట 4 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఇక్కడే ఉంది. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొననున్నారు. రెండో యూనిట్ సింక్రనైజేషన్ అనంతరం ప్లాంట్ నిర్మాణంపై సమీక్ష చేయనున్నారు.

నేటి నుంచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బుధవారం నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు జరుగుతాయని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. హైదరాబాద్, ట్యాంక్‌బండ్‌పై ఉన్న మఖ్దూం మొహీనుద్దీన్ విగ్రహానికి బుధవారం నివాళులర్పించిన తర్వాత రావి నారాయణ రెడ్డి అమరవీరుల ట్రస్టు భవన్‌లో జరిగే సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. 17వ తేదీన వినాయక నిమజ్జన ఉత్సవం ఉండడంతో వారోత్సవాల ముగింపు సభ 21న రవీంద్ర భారతిలో నిర్వహిస్తున్నామని ప్రకటించారు.

పీఏసీ చైర్మన్.. ప్రతిపక్ష ఎమ్మెల్యేనే

- ఈ విషయం అరికెపూడి గాంధీ స్వయంగా చెప్పారు
- ఎమ్మెల్యేల అనర్హత అంశం కోర్టు పరిధిలో ఉంది: శ్రీధర్‌బాబు

హైదరాబాద్/మియాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రతిపక్ష ఎమ్మెల్యేనే పీఏసీ చైర్మన్‌ను చేశారని శాసనసభా వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. అసెంబ్లీ నిబంధనలు, సంప్రదాయాలను అనుసరించి స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తాము నమ్ముతున్నామని తెలిపారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనేనని, నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశాననీ అరికెపూడి గాంధీ స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌లో బేధాభిప్రాయాలుంటే, కేసీఆర్‌కు, పీఏసీ చైర్మన్‌కు పొసగకపోతే తామేం చేస్తామని ప్రశ్నించారు. శాసనసభలో బీఆర్ఎస్‌కు ఉన్న సంఖ్యాబలం ప్రకారం ఆ పార్టీ నుంచి ముగ్గురు ఎమ్మెల్యేలకు అవకాశం ఉందని రూల్‌బుక్ స్పష్టం చేస్తోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు వ్యవస్థలను కాలరాసింది, ఫిరాయింపులను ప్రోత్సహించిందీ బీఆర్ఎస్సేనని అన్నారు. ఆ పార్టీ నేతలు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. మంగళవారం సీఎల్పీ మీడియా హాల్లో శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. రాజ్యాంగ స్ఫూర్తి, అసెంబ్లీ నిబంధనలు, సంప్రదాయాలను దృష్టిలో పెట్టుకునే శాసనసభ స్పీకర్, మండలి చైర్మన్ వ్యవహరిస్తారని తెలిపారు. సభాపతిని అవమానించేలా ప్రతిపక్షాలు మాట్లాడటం సరికాదని హితవు పలికారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు పీఏసీ చైర్మన్ పదవిని ఎవరికి ఇచ్చారో, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఆ పార్టీలో ఎలా చేర్చుకున్నారో అందరూ చూశారన్నారు. ఎమ్మెల్యేల అనర్హత అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, దీనిపై తాము స్పందించబోమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఎమ్మెల్యేల అనర్హతపై నాలుగు వారాల్లో ప్రక్రియ మొదలు పెట్టాలని మాత్రమే కోర్టు చెప్పిందని, నిర్ణయం తీసుకొమ్మని కాదని పేర్కొన్నారు. అనర్హత పిటిషన్లపై కాల పరిమితితో నిర్ణయాలు తీసుకోవాలని పదో షెడ్యూల్‌లో ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. చట్టసభలను న్యాయస్థానాలు ఎంతవరకు ఆదేశించవచ్చన్న దానిపై తర్జనభర్జన నడుస్తోందని పేర్కొన్నారు. ప్రజలు కోరుకున్న విధంగా ఉన్న తమ పాలనను చూసి విపక్ష ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరతామంటే తామూ వద్దనబోమని చెప్పారు. ఇక సీపీఐ.. ఇండియా కూటమిలో భాగస్వామి అని, వారు తమతోనే ఉన్నారని తాము భావిస్తున్నట్లు తెలిపారు. బేధాభిప్రాయాలు సృష్టించడానికి బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించబోవన్నారు.

నేను ప్రతిపక్షంలోనే ఉన్నా: అరికెపూడి

'నేను కాంగ్రెస్‌లో చేరలేదు. పతిపక్షంలోనే ఉన్నాను' పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ కమిటీ) చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని వెల్లడించారు. తనకు సీఎం రేవంత్‌రెడ్డి కప్పింది కాంగ్రెస్ కండువ కాదని, ఆలయానికి సంబంధించిన శాలువా అని చెప్పారు. అరికెపూడికి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడంపై బీఆర్ఎస్ అభ్యంతరం వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ విధంగా స్పందించారు. కాగా, పీఏసీ చైర్మన్ గాంధీ మంగళవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

నేరం ఒకరిది.. శిక్ష ఒకరికి!

సైబర్ మోసాలతో సంబంధం లేని చిరువ్యాపారుల ఖాతాలూ ఫ్రీజ్

- నేరగాళ్లు చేసే చెల్లింపులతో వారిపైనా కొరడా
- కేటుగాళ్ల ఖాతాలతో పాటు బాధితుల ఖాతాలు కూడా!
- రికవరీ సొమ్ము ఖాతాదారుల అకౌంట్లో వెయ్యడానికి కొర్రీలు

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల పంజాకు అమాయకులు రూ. వేలు.. లక్షలు పోగొట్టుకుంటుంటే.. అసలు వీరితో ఏమాత్రం సంబంధం లేని కొందరు వింత బాధితులుగా మారుతున్నారు. సైబర్ కేటుగాళ్ల నుంచి వారి బ్యాంకు ఖాతాల్లోకి డబ్బు రావడమే వారి కష్టాలకు కారణమవుతోంది. సాధారణంగా.. సైబర్ కేటుగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకున్న వారు పోలీసులకు ఫిర్యాదు చేయగానే.. దర్యాప్తు అధికారులు చేసే మొదటి పని, ఈ నేరంతో లింకు ఉన్న అన్ని బ్యాంకు ఖాతాలనూ ఫ్రీజ్ చేయడం. అంటే.. సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తంతో షాపింగ్ చేసినా.. కిరాణా దుకాణంలో యూపీఐ చెల్లింపులు చేసినా.. చెల్లింపు యాప్‌ల ద్వారా నగదును వేరొకరికి చెల్లించినా.. ఆ డబ్బు బదిలీ అయిన ఖాతాల యజమానులూ బాధితులుగా మారుతున్నారు. పోలీసులు బ్యాంకర్లను సంప్రదించి, వారి ఖాతాలను ఫ్రీజ్ చేస్తున్నారు. పైగా.. సైబర్ నేరగాడికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సహకరించినవారనే ముద్ర వారిపై పడుతోంది.



కొన్ని ఉదాహరణలు..

హైదరాబాద్‌లో పాల వ్యాపారం చేసే ఒక వ్యక్తి బ్యాంకు ఖాతా ఇటీవలే ఫ్రీజ్ అయ్యింది. ఎందుకని ఆరా తీస్తే.. మరో రాష్ట్రంలో నమోదైన సైబర్ నేరంతో సంబంధాలున్నాయని అక్కడి పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు ఖాతాను ఫ్రీజ్ చేశామని బ్యాంకు అధికారులు సమాధానమిచ్చారు. విషయం ఏదైనా ఉంటే అక్కడి పోలీసులతో మాట్లాడుకోవాలని చెప్పారు. అసలు ఆ నేరానికి, తనకు ఎలాంటి సంబంధమూ లేదని.. ఎవరో తనకు యూపీఐ ద్వారా చెల్లింపులు చేస్తే, వారి నేరానికి తన బ్యాంకు ఖాతాను స్తంభింపజేయడమేంటని ఆ వ్యాపారి వాపోతున్నాడు.

- బంజారాహిల్స్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటిని విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి.. వేర్వేరు ఖాతాల ద్వారా పెద్ద ఎత్తున నగదు బదిలీ చేశాడు. అంతే.. ఆ ఖాతాల్లో ఒకదానికి సైబర్ నేరంతో లింకు ఉండడంతో.. పోలీసులు ఇంటి విక్రేత బ్యాంకు ఖాతాను కూడా స్తంభింపజేశారు. ఇంటిని కొన్న వ్యక్తిని నిలదీస్తే.. "నాకేం తెలియదు" అని తాపీగా చెబుతున్నాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.
- మేడ్చల్‌కు చెందిన కిరణ్‌రెడ్డి అనే యువకుడికి.. పోలీసు కేసు కారణంగా బ్యాంకు ఖాతా ఫ్రీజ్ అయినట్లు బ్యాంకు నుంచి ఎస్సెమ్మెస్ వచ్చింది. ఇదేదో సైబర్ నేరగాళ్లు పంపించారనుకుని ఆ మెసేజ్‌ను పెద్దగా పట్టించుకోలేదు. ఆ తర్వాత నిజంగానే తన ఖాతాలో లావాదేవీలు సాధ్యమవ్వడంలేదని గుర్తించి, బ్యాంకుకు వెళ్లి ఆరా తీశాడు. కరీంనగర్ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా అతడి ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు బ్యాంకు అధికారులు సమాధానం ఇవ్వడంతో అతడు ఆందోళన చెందుతున్నాడు.

చెల్లింపులు చేయలేక..

ఈ తరహా బాధితుల్లో చిరు వ్యాపారులు, చిరుద్యోగులు ఎక్కువగా ఉంటున్నారు. ఈ కోవకు చెందినవారు సాధారణంగా ఒకే బ్యాంకు ఖాతాను కలిగి ఉంటారు. తమ వ్యాపార రుణాల ఈఎంఐలు, వాహన, క్రెడిట్ కార్డు బిల్లులు, ఇతర గృహోపకరణాల వాయిదాల చెల్లింపులు ఆ ఖాతాల ద్వారానే జరుపుతారు. ఖాతా ఫ్రీజ్ అయితే.. లావాదేవీలు జరగక.. వాయిదాలు 'ఓవర్ డ్యూ' కేటగిరీకి వెళ్తూ.. సిబిల్ స్కోరును కోల్పోతున్నారు. భవిష్యత్ రుణాలకు అనర్హులవుతున్నారు. అంతేకాదు.. బ్యాంకు వాయిదాలు చెల్లించలేక ఏజెంట్ల వేధింపులనూ ఎదుర్కొంటున్నారు. చెక్ బౌన్స్ కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. పోలీసులు మాత్రం.. ఇలా వారి ఖాతాలను ఫ్రీజ్ చేయడం వల్లే బాధితులు పోగొట్టుకున్నదాంట్లో కొంతైనా రికవరీ చేయగలుగుతున్నామని చెబుతున్నారు.



బాధితుల ఖాతాలూ ఫ్రీజ్!

హైదరాబాద్‌లోని గచ్చిబౌలికి చెందిన ఒక వ్యక్తి.. ఏదో వస్తువును ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి పెట్టాడు. దాన్ని కొనుగోలు చేస్తానంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాడొకడు.. అతణ్ని మాటలతో మాయ చేసి, ఆ వస్తువును కొనుగోలు చేసినట్లు నటించి, క్యూఆర్ కోడ్‌తో డబ్బులు పంపిస్తున్నట్లు నమ్మించి బాధితుని ఖాతాలోని డబ్బునే కొట్టేశాడు. ఇలా రూ.5 లక్షల దాకా పోగొట్టుకున్న బాధితుడు.. వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఆ తర్వాత సైబరాబాద్ పోలీసులకూ కంప్లయింట్ ఇచ్చాడు. దీంతో పోలీసులు వెంటనే సైబర్ నేరగాడు వినియోగించిన బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయాల్సిందిగా బ్యాంకును ఆదేశించారు. కానీ.. బ్యాంకువారు దాంతోపాటు, బాధితుడి ఖాతానూ స్తంభింపజేశారు. అదేంటని అడిగితే.. పోలీసుల ఆదేశం మేరకే చేసినట్లు చెప్పారు. బాధితుడు పరుగున వెళ్లి.. పోలీసులతోనే చెప్పించినా బ్యాంకు పట్టించుకోలేదు. ఇలా 6 నెలలుగా అటు బ్యాంకుకు.. ఇటు సైబర్ క్రైమ్ స్టేషన్‌కు తిరిగి తిరిగి అతడు విసిగిపోయాడు. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉన్నతాధికారులను కలిసి బ్యాంకుపై ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యాడు. ఇలా అతనొక్కడే కాదు.. సైబర్ నేరగాళ్లవలకు చిక్కినవారు ఎంతో మంది ఉన్నారు.

ఖాతాదారులకు చుక్కలు..

తమ బ్యాంకులో ఖాతా తెరిచిన కస్టమర్లు సైబర్ మోసాల బారినపడకుండా అప్రమత్తం చేయాల్సిన బ్యాంకర్లు.. అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మోసాల బారినపడి డబ్బులు పోగొట్టుకున్న తమ ఖాతాదారులకు అండగా నిలవాల్సింది పోయి.. వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఫేక్ కాల్స్‌ను నమ్మి మోసపోయిన బాధితులు సకాలంలో ఫిర్యాదు చేయగానే వెంటనే రంగంలోకి దిగుతున్న సైబర్ క్రైమ్ పోలీసులు.. నేరగాళ్ల ఖాతాలను ఫ్రీజ్ చేసి, ఎంతో కొంత డబ్బును స్తంభింపజేస్తున్నారు. కేసు దర్యాప్తు చేసి.. ఫ్రీజ్ చేసిన సొమ్మును రికవరీ చేస్తున్నారు. అన్ని ప్రొసీడింగ్స్‌నూ పోలీసులే క్లియర్ చేసి, న్యాయస్థానం నుంచి అనుమతులు తెచ్చి రికవరీ సొమ్మును జమ చేయాల్సిందిగా బ్యాంకులకు ఆదేశాలిస్తున్నారు. బాధితుల కోసం పోలీసులు ఇంత కష్టపడుతున్నా.. కొంతమంది బ్యాంకర్లు మాత్రం రికవరీ చేసిన డబ్బును బాధితుల ఖాతాల్లో జమ చేయడానికి రకరకాల కొర్రీలు పెడుతున్నారని సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. సైబర్ నేరగాళ్లు నకిలీ ఖాతాలు తెరిచేటప్పుడు.. అక్రమ లావాదేవీలు జరిపేటప్పుడు బ్యాంకర్లు ఇంతే కఠినంగా వ్యవహరిస్తే సగానికి పైగా నేరాలు తగ్గిపోతాయని పోలీసులు, బాధితులు అంటున్నారు.

మరో 4 వైద్య కళాశాలలకు గ్రీన్‌సిగ్నల్!

- రెండు రోజుల్లో ఎన్ఎంసీ అనుమతులు

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో నాలుగు కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. పెండింగ్‌లో ఉన్న నాలుగు మెడికల్ కాలేజీల అనుమతుల బాధ్యతను కేంద్ర వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ.. జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ)కే అప్పగించింది. అనుమతులు ఎన్ఎంసీనే ఇస్తుందని ఆ నాలుగు వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లకు కేంద్రం మంగళవారం మెయిల్ పంపింది. దీంతో ఒకటి రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న నాలుగింటికి కూడా అధికారికంగా అనుమతులు రానున్నాయి. మొత్తం 8 కాలేజీల కోసం గత ఏడాది దరఖాస్తు చేయగా, వాటిలో నాలుగింటికి ఆగస్టు 1న అనుమతులు వచ్చాయి. మరో నాలు గు పెండింగ్‌లో ఉండగా త్వరలో ఎన్ఎంసీ అనుమతులు రానున్నాయి. ములుగు, నర్సంపేట, గద్వాల, నారాయణపేట కాలేజీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి వైద్యవిద్య ప్రవేశాలకు ఈ ఏడాది ఆగస్టు 1న ఎన్ఎంసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక యాదాద్రి భువనగిరి, మహేశ్వరం, కుత్బుల్లాపూర్, మెదక్ కాలేజీల అనుమతులను ఎన్ఎంసీ పెండింగ్‌లో పెట్టింది. వీటి ఎల్‌వోపీ కోసం రాష్ట్ర ప్రభుత్వం మరోమారు అప్పీలు చేసింది. రెండుసార్లు హెల్త్ సెక్రటరీ, డీఎంఈ డాక్టర్ వాణి ఢిల్లీకి వెళ్లి ఎన్ఎంసీ అధికారులను కలిశారు. లోటుపాట్లను సవరించుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్లు ఇచ్చింది. అయితే అప్పీల్‌కు వెళ్లిన కాలేజీల అనుమతుల బాధ్యత ఎన్ఎంసీ చేతిలో ఉండదు. కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రినే ఇటువంటి వాటి విషయంలో నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్ర సర్కారు విజ్ఞప్తి, అఫిడవిట్లతో సంతృప్తి చెందిన కేంద్రం వీటి అనుమతులకు వీలు కల్పించింది. కాగా, ఈ ఏడాది జూలై 8న కొత్తగా ఏర్పాటుకానున్న 8 మెడికల్ కాలేజీలకు అనుమతులు ఇవ్వలేమని ఎన్ఎంసీ అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లకు లేఖ రాసింది. నిబంధనల మేరకు ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రుల సూపరింటిండెంట్లు తప్ప.. మిగతా బోధనా వైద్యులెవ్వరూ లేరని ఆ లేఖలో తెలిపింది. ఎన్ఎంసీ నిర్ణయం వైద్యశాఖను షాక్‌కు గురిచేసింది. దీంతో వెంటనే అప్రమత్తమైంది. తమకు మరో అవకాశమివ్వాలని, లోపాలను సరిచేసుకుంటామని కోరింది. ఆ తర్వాత యుద్ధప్రాతిపదికన అధ్యాపకులను నియమించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించి, కొత్త కాలేజీలకు పోస్టు చేసింది. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా కొన్ని కాలేజీలకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లు, ఆస్పత్రుల సూపరింటెండెంట్లను పంపింది. అలాగే పలువురు ఆచార్యులను అక్కడికి బదిలీ చేసింది. ఎన్ఎంసీ వర్చువల్ తనిఖీలు చేసే సమయానికి ఈ చర్యలు తీసుకుంది. దీంతో ఎన్ఎంసీ తొలుత నాలుగు కాలేజీలకు అనుమతులు ఇచ్చింది.

సీఎం రేవంత్‌కు మంత్రి దామోదర ధన్యవాదాలు



రాష్ట్రంలో మరో 4 మెడికల్ కాలేజీలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఒక్కో కాలేజీలో 50 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున మరో 200 సీట్లు అదనంగా వచ్చాయన్నారు. ఈ ఏడాది 8 కాలేజీలకు అనుమతులు రావడంతో 400 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో సర్కారీ మెడికల్ కాలేజీల్లో 3690 ఎంబీబీఎస్ సీట్లుండగా... కొత్తగా వచ్చిన వాటితో ఆ సంఖ్య 4090కు పెరిగిందన్నారు. కాలేజీలకు అనుమతులిచ్చిన కేంద్ర ప్రభుత్వానికి, సకాలంలో అవసరమైన నిధులు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి రాజనర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఎస్.వాణి, అదనపు డీఎంఈ విమలా థామస్, ఇతర ఉన్నతాధికారులను మంత్రి అభినందించారు.

వానాకాలం వైద్య చదువులు!

వైద్య విద్యలో పీజీ పూర్తిచేసినా సర్జరీ అంటే వణుకు

- అనుభవపూర్వకమైన శిక్షణ కొరవడటమే కారణం!
- ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఓపీలపై తప్పుడు కేస్ షీట్లు
- శస్త్రచికిత్సలు చేయకున్నా చేసినట్లు ధ్రువీకరణ పత్రాలు
- ప్రభుత్వ కాలేజీలే నయం.. అక్కడ నేర్చుకునేది ఎక్కువ
- విచ్చలవిడిగా ప్రైవేటు కాలేజీలు.. ప్రమాణాలకు దెబ్బ

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మీ రోజుల్లో చదువులు ఎలా ఉండేవి? అని నిన్నటి తరం పెద్దల్ని అడిగితే.. 'ఆ.. మావన్నీ వానాకాలం చదువులు' అని పెదవి విరుస్తుంటారు! ఇప్పటి మాదిరిగా స్కూలు భవనాలు ఎక్కడివి? చెట్ల కిందే చదువులు. వాన పడిన రోజు పాఠాలు అక్కడికి ఆపేసి పిల్లలను ఇంటికి పంపించేయడమే ఉండేది. అందుకే వానాకాలం నాలుగు నెలల పాటూ మాస్టారు ఏం చెప్పేవారో.. పిల్లలు ఏం వినేవారో అంతా గందరగోళంగా ఉండేది. నేటి వైద్య విద్యార్థుల పరిస్థితి ఈ 'వానాకాలం చదువుల' మాదిరిగానే ఉంది! ఎంబీబీఎస్ పట్టా పుచ్చుకొని బయటకొచ్చిన యువవైద్యులు సాధారణ శస్త్రచికిత్సలూ చేయలేకపోతున్నారు. సర్జికల్ నైఫ్ పట్టుకుంటేనే వారికి చేతులు వణుకుతున్నాయి. వారిలో అనుభవపూర్వక శిక్షణ కొరవడటమే వారిలో ఈ బెరుకుకు కారణం! ప్రధానంగా ఈ రోజుల్లో మెడికోలు ప్రాక్టికల్స్ కంటే థియరీ పైనే ఎక్కువగా ఆధారపడుతున్నారు. పైగా వైద్యవిద్యలో భాగంగా ఓపీలనూ చూడటం లేదు. ఫలితంగా 'ఆచరణాత్మకత' కొరవడుతోంది. ముఖ్యంగా ప్రైవేటు వైద్య కాలేజీలకు చెందిన వారిలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ప్రభుత్వ కాలేజీల్లో చదువుకున్నవారు ఎంతోమెరుగు. అక్కడ రోజూ వందల సంఖ్యలో రోగులొస్తుంటారు. ఫలితంగా అనుభవపూర్వక శిక్షణ ఎంతోకొంత లభిస్తుంది. మునుపు ఎంబీబీఎస్ చేసిన వైద్యులకు గర్భసంచి ఆపరేషన్, ఉండుకం, హైడ్రోసిల్, హెర్నియా, పైల్స్ లాంటి శస్త్రచికిత్సలు మంచినీళ్ల ప్రాయంగా ఉండేవి.

ప్రైవేటుపరంతో వైద్య విద్య వ్యాపారంగా మారింది



ప్రస్తుతం వైద్యవిద్య ప్రైవేటు పరంకావడంతో ఒక వ్యాపారంగా మారిం ది. నాణ్యత గురించి ఆలోచించే పరిస్థితి లేకుండా పోయింది. రోగులకు, మెడికోలకు మేలు జరగాలంటే ప్రభుత్వం ప్రైవేటులోని వైద్యవిద్య నాణ్యతపై కఠినంగా వ్యవహరించాలి. దానిపై మార్గదర్శకాలు రూపొందించాలి. వాటిని ఆ కాలేజీలు పాటిస్తున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలి. అప్పుడు మాత్రమే వైద్యవిద్యలో నాణ్యత ఉంటుంది.

- డాక్టర్. పి. శ్రీనివాస్, మాజీ వైద్యవిద్య సంచాలకులు

ఓపీ.. రోగులు.. సర్జరీలు అంతా మాయ!

పలు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రోజూ కనీసం వందమంది కూడా అవుట్ పేషంట్లు ఉండటం లేదు. సర్జరీలు ఉండట్లేదు. అయినప్పటికీ జాతీయ వైద్య కమిషన్ వెబ్‌సైట్‌కు ఆ కాలేజీలు దొంగ లెక్కలు చూపుతున్నాయి. రోజూ వందల సంఖ్యలో ఓపీ ఉంటున్నట్లు తప్పుడు రిజిస్ట్రేషన్ చూపి, వాటిని అప్‌లోడ్ చేస్తున్నారు. పీజీలు, హౌజ్‌సర్జన్లతో తప్పుడు కేస్‌షీట్లు రాసిస్తున్నారు. చేయని సర్జరీలను కూడా చేసినట్లు చూపుతున్నారు. కొన్ని కాలేజీలకు అసలు రోగులే రావడం లేదు. రోగులను మెడికల్ కాలేజీల యాజమాన్యాలే వాహనాల్లో ఎక్కించుకొని ఆస్పత్రులకు తీసుకొస్తున్నాయి. మరికొన్నిసార్లు ఎన్ఎంసీ బృందాలు తనిఖీలకు వచ్చినప్పుడు నకిలీ రోగులను తీసుకొస్తున్నాయి. ఇటువంటి వైద్య ప్రమాణాలున్నచోట వారు ఏ విధంగా నేర్చుకుంటారు? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అందుకే ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, పీజీలు చేసి బయటకు వచ్చిన వారు మళ్లీ కార్పొరేట్ లేదా ఇతర ఆస్పత్రుల్లో చేరి నెమ్మదిగా నేర్చుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఓ ప్రైవేటు కాలేజీలో గైనకాలజీ చేసిన కొందరు విద్యార్థినులు అప్పటి వైద్య మంత్రిని కలసి తమకు సర్కారు దవాఖానాల్లో కొద్దిరోజుల పాటు పనిజేసే అవకాశం కల్పించాలని, అక్కడ సిజేరియన్లు చేయడాన్ని చూసి నేర్చుకుంటాం అని సదరు మంత్రిని కోరారు. దీన్నిబట్టి.. మెడికోల్లో ప్రమాణాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

రోగితో నేర్చుకునేదే ఎక్కువ

వైద్యవిద్య అంటేనే అనుభవపూర్వకంగా నేర్చుకునేది. పుస్తకాలు చదవడం కంటే రోగులను పరీక్షించడం, వారితో మాట్లాడి.. రోగ లక్షణాలను తెలుసుకోవడం, నిర్ధారించుకోవడం, మందులు రాయడం, గతంలో వారి ఆరోగ్యచరిత్రను తెలుసుకోవడం లాంటివి చేయాలి. అంటే.. రోజులో సుమారు 60-70% సమయాన్ని రోగులతోనే వెచ్చించాలి. అప్పుడే వైద్యవిద్యపై మెడికోలకు పట్టు లభిస్తుంది. అయితే ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఉండటం లేదని ప్రొఫెసర్లు చెబుతున్నారు. గతంలో మెడికోలు బోధనాస్పత్రుల్లో ఎమర్జెన్సీ కేసులను చూసేవారు. రోజూ రెండు, మూడు సర్జరీ కేసుల్లో సహాయకులుగా పాల్గొనేవారు. పీజీ సమయంలోనైతే వెయ్యి సర్జరీల దాకా సహాయకులుగా పనిజేసేవారమని వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. ఇప్పుడా పరిస్థితి లేదని, నేటి తరం మెడికోలు సర్జరీలను కూడా ఆన్‌లైన్ ద్వారా చూసి నేర్చుకునే పరిస్థితి నెలకొందన్నారు. కొన్ని ప్రైవేటు మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రులైతే సాయంత్రం ఐదుగంటలకే తాళాలు వేసుకొని వెళ్లిపోతున్నాయని అంటున్నారు. హైదరాబాద్‌కు దక్షిణాన కూతవేటు దూరంలో ఉన్న ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీలో అయితే కనీసం వందమంది ఓపీ కూడా ఉండటం లేదని, అసలక్కడ సర్జరీలే జరగవని ఓ అధికారి వెల్లడించారు. తెలంగాణలో సర్కారీ మెడికల్ కాలేజీలు పెరగడంతో ప్రైవేటు కాలేజీల అనుబంధ ఆస్పత్రులకు వెళ్లేవారి సంఖ్య భారీగా తగ్గింది. ఉదాహరణకు ఖమ్మంలో సర్కారీ మెడికల్ కాలేజీ రాక ముందే అక్కడ ఓ ప్రైవేటు మెడికల్ కాలేజీకి పెద్దసంఖ్యలో అవుట్ పేషంట్లు వచ్చేవారు. ఇన్ పేషంట్లు కూడా ఉండేవారు. కానీ ప్రభుత్వ కాలేజీ వచ్చిన తర్వాత ఆ ప్రైవేటు కాలేజీలో సగానికిపైగా ఓపీ, ఐపీ పడిపోయింది. కాగా, వైద్యవిద్య కళాశాలల్లో ప్రమాణాలు పడిపోవడానికి జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) తప్పిదం లేకపోలేదు. కనీస మౌలిక సదుపాయాలున్నాయో లేదో భౌతికంగా తనిఖీలు చేయకుండా కేవలం ఆన్‌లైన్ ద్వారానే పరిశీలించి కొత్త ప్రైవేటు మెడికల్ కాలేజీలకు అనుమతులు మంజూరు చేస్తోంది. కాలేజీ పెట్టాక తనిఖీలు కూడా చేయడం లేదు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఒక్క మెడికల్ కాలేజీ గుర్తింపు రద్దు కాలేదంటే ఎన్ఎంసీ పర్యవేక్షణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వైద్యవిద్య నాణ్యతను పర్యవేక్షించకపోవడం మరో ప్రమాదకర అంశం. ప్రైవేటులో కొత్త కాలేజీల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా సహకరిస్తున్నాయి. ఇష్టారాజ్యంగా ఎన్‌వోసీలు ఇస్తున్నాయి. అందుకే పుట్టగొడుగుల్లా ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఏర్పాటుతో వైద్యవిద్య నాణ్యత దారుణంగా దెబ్బతింటోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 11 సెప్టెంబరు 2024

SCHOLARSHIP ALERT

Santoor Scholarship Programme 2024-25

Description: Santoor Scholarship Programme 2024-25 aims to support the undergraduate studies of young women from disadvantaged backgrounds in the states of Andhra Pradesh, Karnataka, Telangana or Chhattisgarh.

Eligibility: Open to young women from underprivileged backgrounds residing in Andhra Pradesh, Karnataka, Telangana, and Chhattisgarh.

Applicants must have:
- passed Class 10 from a local government school.
- passed Class 12 from a government school or junior college in the academic year 2023-24. And
- enrolled in a full-time graduate programme starting in 2024-25.

Note: The full-time graduate course must have a minimum duration of 3 years.
- Students with a strong interest in pursuing higher education in humanities, liberal arts, and sciences, are strongly encouraged to apply.
- Priority will also be given to students from aspirational (backward) districts.

Prizes & Rewards: INR 24,000 per annum
Last Date to Apply: 23-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SWS7

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2024-25 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Dr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech. courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first-year of B.Tech. courses at any of the specified 11 institutions can apply.
- Annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: Scholarship based on the actual fee structure to cover academic expenses, such as tuition fees, hostel fees, food, and related expenses.
Last Date to Apply: 20-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/ASPI2

Kotak Kanya Scholarship

Description: Under the CSR Project on Education & Livelihood of Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for the Kotak Kanya Scholarship 2024-25 from meritorious girl students from low-income families to empower them to pursue higher studies in professional education after Class 12.

Eligibility: Open for meritorious girl students across India.
- Applicants must have scored 75% or more marks or equivalent CGPA in Class 12 board examinations.
- Applicant's annual family income must be less than INR 6,00,000.
- Meritorious girl students who have secured admission to the first year of graduation programs in the academic year 2024-25 in institutes of repute like NIRF/NAAC accredited for professional graduation degrees like Engineering, MBBS, BDS, Integrated LLB (5 Years), B.Sc. Nursing, B. Pharmacy, Integrated BS-MS/BS-Research in ISER, IISC (Bangalore), or other professional courses (Design, Architecture, etc.).

Prizes & Rewards: INR 1.5 lakh* per year
****Disclaimer:*** The renewal of the scholarship every year will be at the sole discretion of the Kotak Education Foundation
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/KKGS3

buddy4study.com



హరిద్వార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తోంది. వీటిని ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్ కోసం ఉద్దేశించారు. ఇవి జాబ్ ఓరియంటెడ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్‌లు. ఎలక్ట్రానిక్స్, ఐటీ విభాగాల్లో స్కిల్స్ మెరుగుపరచుకొనేందుకు దోహదం చేస్తాయి. కోర్సుల వ్యవధి నిర్దేశించిన మేరకు నాలుగు నుంచి పది వారాల వరకు ఉంటుంది. ఆరు వారాల ప్రోగ్రామ్‌లో నాలుగు వారాల ట్రెయినింగ్, రెండు వారాల ప్రాజెక్ట్ వర్క్; పది వారాల ప్రోగ్రామ్‌లో ఎనిమిది వారాల ట్రెయినింగ్, రెండు వారాల ప్రాజెక్ట్ ఉంటాయి. ప్రాజెక్ట్ వర్క్‌కు ఫీజు చెల్లించనవసరం లేదు.
- వెబ్‌సైట్: nielit.gov.in

నీలిట్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

ఆటోక్యాడ్ ఎలక్ట్రికల్: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. అక్టోబరు 8 నుంచి ఆన్‌లైన్ సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం రెండున్నర నుంచి నాలుగు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 7

ఇండస్ట్రియల్ ఆటోమేషన్-పీఎస్‌సీ/స్కాడా: కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు. సెప్టెంబరు 17 నుంచి ఆన్‌లైన్ సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.5,664
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 16

డేటా అనలిటిక్స్-పైథాన్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

మెషిన్ లెర్నింగ్-పైథాన్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. అక్టోబరు 15 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 14

వెబ్ డిజైనింగ్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. అక్టోబరు 22 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి అయిదున్నర వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** 2360
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** అక్టోబరు 21

క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్: ఒక్కో కోర్సు వ్యవధి ఆరు వారాలు. సెప్టెంబరు 24 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం పదకొండున్నర నుంచి ఒంటిగంట వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 23

ఫైనాన్షియల్ అకౌంటింగ్-ట్యాలీ: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి మూడున్నర వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2360
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

సైబర్ సెక్యూరిటీ అండ్ ఎథికల్ హ్యాకింగ్: కోర్సు వ్యవధి నాలుగు వారాలు. సెప్టెంబరు 17 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం రెండున్నర నుంచి నాలుగు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 16

డేటా అనలిటిక్స్-అడ్వాన్స్‌డ్ ఎక్సెల్: కోర్సు వ్యవధి ఆరు వారాలు. నవంబరు 12 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ ఉదయం తొమ్మిదిన్నర నుంచి పదకొండు గంటల వరకు తరగతులు ఉంటాయి.
- **కోర్సు ఫీజు:** రూ.2832
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 11

కోర్స్ ఆన్ కంప్యూటర్ కాన్సెప్ట్స్: కోర్సు వ్యవధి 90 గంటలు. సెప్టెంబరు 30 నుంచి సెషన్స్ ప్రారంభమౌతాయి. ప్రతిరోజూ సాయంత్రం నాలుగున్నర నుంచి ఆరు గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు.
- **కోర్సు ఫీజు:** రూ.4956
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30

లాంగ్ టర్మ్ ప్రోగ్రామ్‌లు
- 'ఓ' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 540 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- 'ఎ' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 1620 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- 'బి' లెవెల్ ప్రోగ్రామ్ వ్యవధి 2520 గంటలు. ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల నుంచి ఆరు గంటల వరకు సెషన్స్ ఉంటాయి.
- **రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 15
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి

నిమ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు

హైదరాబాద్-పంజాగుట్టలోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)- నెఫ్రాలజీ విభాగంలో నిర్వహిస్తున్న 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ ప్రోగ్రామ్'లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించింది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సీట్లు ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(నర్సింగ్/సైకాలజీ/లైఫ్ సైన్సెస్/డయాలసిస్ టెక్నాలజీ)/ఎంబీబీఎస్/ఎండీ-హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ఎంట్రెన్స్ టెస్ట్: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో బేసిక్ కాన్సెప్ట్స్, అడ్వాన్స్‌డ్ మిసిలేనియస్ టాపిక్స్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, హార్ట్ అండ్ లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ అంశాల నుంచి ఒక్కోదానిలో పది మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 50. పరీక్ష సమయం గంట. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, హైదరాబాద్- 500082
- **వెబ్‌సైట్:** www.nims.edu.in





(నిన్నటి దిక్సూచి తరువాయి)

6జీ సాంకేతికత దిశగా భారత్ ప్రయత్నాలు

2030 నాటికి భారతదేశంలో 6జీ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడానికి 2023లో ఒక 'విజన్ డాక్యుమెంట్'ను విడుదల చేసి, పరిశోధన, కార్యాచరణ నిమిత్తం 'భారత్ 6జీ మిషన్'ను రెండు దశల కార్యక్రమంగా అమలులోకి తెచ్చారు.

1) భారత్ 6జీ విజన్: 6జీ టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్‌ను ముందువరుసలో నిలబెట్టడం; 6జీ టెక్నాలజీపరమైన సాంకేతిక సమస్యల పరిష్కారం, ఈ టెక్నాలజీ ప్రముఖ సరఫరాదారుగా భారత్‌ను తీర్చిదిద్దడం, మేధోసంపత్తిపరంగా, అధిక నాణ్యతపరంగా భారత్ 6జీ రంగంలో విశేష కృషి జరపడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యాలు. వీటి సాధనకు 6జీ విజన్ ఆరు ప్రధాన మూల స్తంభాలను నిర్దేశించింది. వాటిలో ఒక్కోదానికి ఒక్కో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది.

6జీ విజన్‌లోని '6' మూలస్తంభాలు
1. బహుళ ప్లాట్‌ఫాం నెక్స్ట్ జనరేషన్ నెట్‌వర్క్‌లు.
2. మల్టీ-డిసిప్లినరీ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్
3. 6జీ స్పెక్ట్రమ్ గుర్తింపు
4. 6జీ పరికరాలు, వ్యవస్థలు
5. అంతర్జాతీయ ప్రమాణాల సాధన
6. పరిశోధన, అభివృద్ధి నిధులు

2) భారత్ 6జీ మిషన్: 2030 నాటికి భారత్‌లో 6జీ సేవలు ప్రవేశపెట్టేవిధంగా రెండు దశల్లో ఈ మిషన్‌ను అమలుచేయనున్నారు.

తొలిదశ(2023-2025): ఈ మిషన్ తొలిదశ రెండు సంవత్సరాల్లో వినూత్న ఆలోచనలు, సవాళ్లతో కూడిన విధానాలు, ఆలోచనలు, విధానాల ఆచరణాత్మకతను పరీక్షించడం వంటి ప్రయోగదశ నడుస్తుంది.

మలిదశ(2025-2030): ఈ దశలో, తొలిదశలో గుర్తించిన ఆలోచనలు, విధానాలకు మేధోసంపత్తి హక్కుల కల్పనకు, ప్రోటోటైప్‌ల రూపకల్పనకు, టెస్ట్‌బెడ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వ మద్దతు లభిస్తుంది. విజయవంతమైన విధానాల అమలు, వాటి వాణిజ్యీకరణతో 6జీ సాంకేతికత జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో అమలులోకి వస్తుంది.
- ఈ రెండు దశల భారత్ 6జీ మిషన్ అమలు పర్యవేక్షణ, ప్రామాణీకరణ, గుర్తింపు వంటి విధుల నిమిత్తం ఒక అపెక్స్ కౌన్సిల్ సైతం ఏర్పాటైంది.

3) భారత్ 6జీ కూటమి: వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మక టెలికాం దౌత్యాన్ని కమ్యూనికేషన్స్ మంత్రిత్వశాఖ పట్టాలకెక్కించింది. దీనిలో భాగంగా బీ6జీఏ ఏర్పాటైంది. ఈ బీ6జీఏ పరిశోధన, సాంకేతిక బదిలీ సహకారం కోసం అంతర్జాతీయంగా పలు ఒప్పందాలు కుదుర్చుకుని దేశీయంగా 6జీ పరిశోధన, అభివృద్ధి వేగవంతం అవడానికి సహకరిస్తుంది.
- బీ6జీఏలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు, విద్యాసంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రమాణాల గుర్తింపు సంస్థలు వంటివి భాగస్వాములుగా/ సభ్యులుగా ఉంటాయి. బీ6జీఏ యూరప్‌కు చెందిన 6జీ స్మార్ట్ నెట్‌వర్క్స్ అండ్ సర్వీసెస్ ఇండస్ట్రీ అసోసియేషన్(6జీ-ఐఏ)తోనూ, ఫిన్‌లాండ్‌కు చెందిన ఔలు యూనివర్సిటీ 6జీ ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌తోనూ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది.
- అంతేకాక 2023లో జరిగిన జీ-20 సదస్సు సందర్భంగా 6జీ రంగంలో అత్యున్నతస్థాయి పరిశోధనలు నిర్వహించడానికి అమెరికా-భారత్ మధ్య ఒప్పందం కుదిరింది.
- అదేవిధంగా భారత్ ఇప్పటికే 6జీ రంగంలో అంతర్జాతీయంగా గుర్తింపు లభించిన 127 కంటే ఎక్కువ పేటెంట్లను కలిగి ఉంది.

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

6జీ టెక్నాలజీ - అంతర్జాతీయ కృషి

6జీ టెక్నాలజీ అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. దక్షిణ కొరియా తన 6జీ నెట్‌వర్క్ కె-నెట్‌వర్క్‌ను 2028 నాటికి ప్రారంభించేందుకు సమాయత్తమవుతోంది. యురోపియన్ యూనియన్ హెక్సాఎక్స్ పేరుతో చేపట్టిన 6జీ నెట్‌వర్క్ పరిశోధన కార్యక్రమం ఈ ఏడాది ముగియనుంది. జపాన్ ఇంటిగ్రేటెడ్ ఆప్టికల్, వైర్‌లెస్ నెట్‌వర్క్ ఫోరమ్ 6జీ నెట్‌వర్క్ కోసం విజన్ 2030ని కలిగి ఉంది. అదేవిధంగా భారత్, చైనాలు తమ తమ 6జీ నెట్‌వర్క్‌ల కోసం 2030ని మైలురాయిగా నిర్ణయించుకున్నాయి.

'6జీ' అభివృద్ధి చేయడంలో సవాళ్లు

1. భారత్, ఇతర అనేక దేశాల్లో 5జీ నెట్‌వర్క్ ఇంతవరకూ పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. పైగా దానికి మించిన వేగం గల 6జీని ప్రవేశపెట్టాలంటే సంబంధిత అవస్థాపన సౌకర్యాల పరంగా విశేష పెట్టుబడులు, వ్యవస్థల్లో మార్పులు భారీఎత్తున అవసరమవుతాయి.

2. వేగంతోపాటు వచ్చే భద్రత, ఇతర అంశాల పరమైన సమస్యల అంచనా, పరిష్కార యంత్రాంగ ఏర్పాటు కూడా అంతసులువుగా సాధ్యమయ్యే అంశాలు కావు. భారీఎత్తున అంతర్జాతీయ కృషి జరపాల్సి ఉంటుంది.

3. ప్రస్తుతం వినియోగదారుల వద్ద గల హ్యాండ్‌సెట్‌లు, ఇతరత్రా పరికరాలన్నింటినీ 6జీ కెపబిలిటీ(అనువర్తన) కోసం మార్చాల్సి ఉంటుంది. ఇది ఆర్థికంగా వినియోగదారులకు భారం అవుతుంది.

అయితే సమస్యలు ఉన్నప్పటికీ అభివృద్ధిని ఆ కారణాలు చూపి అడ్డుకోజాలం. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కాకపోతే దాని దుష్ప్రభావాలను నివారించే సమాయత్తత కోసం ముందుగానే కృషి చేయాల్సి ఉంటుంది. కావాలంటే కృత్రిమమేధలో విశృంఖల అభివృద్ధిని నిలువరించేందుకు దాని వేగాన్ని తగ్గించే ప్రయత్నాలు జరిపినవిధంగా 6జీ దుష్ప్రభావాలను నివారించడానికి కూడా ఒక అంతర్జాతీయ అవగాహనతో ముందుకు వెళ్లవచ్చు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్


లిటిల్స్

చావు తెచ్చిన మామిడి పండ్లు



తెనాలి రామలింగ కవి ఒక రోజు కృష్ణ దేవరాయల కొలువుకు వెళుతూ ఉండగా భటుడు ఒకరు బంగారు పళ్లెం నిండా మామిడిపండ్లను వాటితో పాటు ఒక లేఖను లోపలికి తీసుకెళ్లడం చూసాడు. ఆ మామిడిపండ్ల తియ్యని వాసనకు తెనాలి రామలింగ కవికి నోరు ఊరింది. ఆ పండ్లలో ఒక పండైనా తింటే బాగుండు అనుకున్నాడు. రాజుగారికి ఆ పండ్లు అందగానే ఒక పండును తీసి కొంచెం కొరికాడు. అది చూసిన రాజు గారు 'నీకెంత ధైర్యం? నా కోసమని పొరుగు దేశపు రాజు కానుకగా పంపిన పండ్లను, అది కూడా నా అనుమతి లేకుండా తింటావా? నీ తల తీయిస్తాను' అని కోపంగా అన్నాడు. వెంటనే రామలింగ కవి గట్టిగా ఇలా అరవసాగాడు' ఇవేమి పండ్లురా బాబోయ్; ఒక్కపండు కొంచెం తిన్నందుకే నాకు చావు మూడింది. ఇక మొత్తం పండ్లు తిన్న మహారాజు గారికి ఏ గతి పట్టనుందో' అని కేకలు వేసాడు. ఆ చేష్టలకు నవ్వుకున్న రాయలు కవికి వేసిన శిక్షను రద్దు చేయడమే కాకుండా అతనికి కొన్ని మామిడి పండ్లను కూడా ఇచ్చి పంపాడు. తన చమత్కారంతో పండ్లను సాధించిన విధానం చూసి సభలో అందరూ రాజుగారితో పాటే వికటకవి తెలివికి నవ్వుకున్నారు.

10 తేడాలను కనిపెట్టండి



సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 406

8	4				6			9
2				3				
		3				4		2
		7			5		6	
5								7
	3		2			5		
6		2				8		
				1				3
3			7				2	4

సుడోకు - 405 సమాధానం

2	7	4	1	6	3	5	9	8
5	9	3	8	7	4	1	2	6
8	1	6	5	2	9	3	4	7
7	3	5	6	9	8	4	1	2
1	4	8	2	3	5	6	7	9
6	2	9	7	4	1	8	5	3
3	5	2	9	1	6	7	8	4
4	8	7	3	5	2	9	6	1
9	6	1	4	8	7	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.